సోమవారం 17-11-2025

'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 236

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సొంత గడ్డపై ఘోర పరాభవం

తొలి టెస్టులో భారత్‌పై 30 పరుగుల తేడాతో నెగ్గిన దక్షిణాఫ్రికా - 12లో

పసిడికి డబ్బులు కాస్తాయ్

వాడకంలో లేని బంగారంపై రాబడికి ఎన్నో పెట్టుబడి సాధనాలు - 13లో

మూడు బుల్లెట్ల మిస్టరీ!

ఢిల్లీ పేలుడు కేసులో దర్యాప్తు ముమ్మరమైంది. ఘటనా స్థలానికి సమీపంలో 3 తూటాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

వివరాలు 6లో ▸

రాజ్‌భవన్‌లో ఆయుధాలు!

బెంగాల్ రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆనంద బోస్ ఆయుధాలు నిల్వ చేశారంటూ టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు.

వివరాలు 6లో ▸

2028లో చంద్రయాన్-4

2028లో చంద్రయాన్-4 ప్రయోగం నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ ప్రకటించారు.

వివరాలు 6లో ▸

చెప్పుతో కొట్టబోయారు!

తనను డర్టీ కిడ్నీ అంటూ దూషించారని.. చెప్పుతో కొట్టబోయారని పుట్టింటిపై ఆర్జేడీ చీఫ్ లాలు కుమార్తె రోహిణి ఆరోపించారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

రేపు శ్రీవారి ఫిబ్రవరి దర్శన కోటా విడుదల

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల(సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ)కు సంబంధించిన ఫిబ్రవరి కోటాను మంగళవారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

వివరాలు 5లో ▸

సర్కారు వైద్య వ్యవస్థ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

నెల్లూరు జిల్లా సీతారామపురంలో గుండెపోటు వచ్చిన వ్యక్తిని 24/7 పీహెచ్‌సీకి తరలించగా.. వైద్యులిద్దరూ విధుల్లో లేరు. ఉదయగిరికి తీసుకెళ్దామంటే.. 108 వాహనం అందుబాటులో లేదు. 108ను పచ్చ రంగులు వేయించేందుకు విజయవాడకు తరలించారు. దీంతో వైద్యం అందక అతను ప్రాణాలు కోల్పోయాడు.

వివరాలు 14లో ▸

'ఐఎన్ఐ'లో పల్నాడు అమ్మాయి సత్తా

పీజీ మెడికల్ కోర్సులకు సంబంధించిన ఐఎన్ఐ సెట్–2025లో పల్నాడు జిల్లాకు చెందిన డాక్టర్ బారెడ్డి శ్రీసాయి త్రిషారెడ్డి ఆలిండియా 7వ ర్యాంకు, దక్షిణాదిలో ఫస్ట్ ర్యాంకు సాధించింది.

వివరాలు 5లో ▸

ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపులో గందరగోళం

ఎంబీబీఎస్ 2025–26 మూడో విడత సీట్ల కేటాయింపులో తీవ్ర గందరగోళం నెలకొందని 'ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ' మండిపడింది. మెరిట్ విద్యార్థులకు కూడా సీట్లు దక్కలేదని.. కేటాయింపులో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొంది.

వివరాలు 14లో ▸

మహిళా సాధికారత దిశగా

దేశం పురోగమనం

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్

అన్ని రంగాల్లోనూ గొప్పగా రాణిస్తున్న మహిళలు

- న్యాయ వ్యవస్థలోకి కూడా వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరుగుదల
- ఇది దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ పురోగతికి నిదర్శనం.. హక్కులపై అవగాహన ఉన్నప్పుడే న్యాయం సాధ్యం
- మన రాజ్యాంగం వల్లే అణగారిన వర్గాల వారికి ఉన్నత అవకాశాలు.. ఇందుకు ప్రస్తుత రాష్ట్రపతి, నేనే ప్రత్యక్ష ఉదాహరణ
- మన రాజ్యాంగం స్థిర రాజ్యాంగం కాదు.. పరిస్థితులకు అనుగుణంగా మార్పు
- ఒక వ్యవస్థ మరో వ్యవస్థలో ఏ రకంగానూ జోక్యం చేసుకోకూడదు
- ఒకవేళ జోక్యం చేసుకుంటే ప్రజాస్వామ్యం పేకమేడలా కూలిపోతుంది
- న్యాయ, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం ఎంతో అవసరం
- దీనిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మనందరం కట్టుబడి ఉండాలి

"భారత రాజ్యాంగాన్ని అంబేడ్కర్ ఓ స్థిర పత్రంలా చూడలేదు. దేశంలో పరిస్థితులు, సమాజ మార్పులకు అనుగుణంగా మారుతూ ఉండాలని ఆకాంక్షించారు. అందులో భాగంగానే మన రాజ్యాంగానికి సవరణలు చేస్తూ వస్తున్నాం. దేశ పౌరుల హక్కులకు విఘాతం కలిగినప్పుడు కోర్టులను ఆశ్రయించే అవకాశం ఇచ్చింది మన రాజ్యాంగమే. ఈ నేపథ్యంలో న్యాయ, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మనందరం కట్టుబడి ఉండాలి."

\- సీజేఐ జస్టిస్ గవాయ్

సాక్షి, అమరావతి: సమానత్వం, మహిళా సాధికారత దిశగా దేశం పురోగమిస్తోందని, అన్ని రంగాల్లో మహిళలు గొప్పగా రాణిస్తున్నారని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ అన్నారు. న్యాయ వ్యవస్థలోకి వచ్చే మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, కింది స్థాయి న్యాయ వ్యవస్థలో మహిళా న్యాయాధికారుల సంఖ్య 60–70% ఉండటం సమానత్వానికి, మహిళా సాధికారతకు నిదర్శనమన్నారు. ఇది దేశ ప్రగతికి శుభ సూచకమని.. దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ పురోగతిని సైతం సూచిస్తోందని ఆయన తెలిపారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం

మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్రం దూసుకెళ్తున్నది

అప్పుల్లోనే..

సీఎం చంద్రబాబుపై వైఎస్ జగన్ ధ్వజం

తీవ్ర ఆందోళనకరంగా ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి

- 2025-26 తొలి ఆరు నెలల్లో రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం వృద్ధి 7.03 శాతమే
- గతేడాదితో పోల్చితే ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో జీఎస్టీ, అమ్మకపు పన్ను ఆదాయాల వృద్ధి 2.85 శాతమే
- 2023-24 నుంచి 2025-26 మొదటి 6 నెలల్లో రాష్ట్ర సొంత పన్ను ఆదాయాల వార్షిక వృద్ధి రేటుతో పోల్చితే... ప్రస్తుత ఆర్థిక ఏడాది మొదటి ఆరు నెలల్లో వృద్ధి 2.75 శాతమే
- అయినా సరే రాష్ట్రం అద్భుతమైన వృద్ధి సాధిస్తోందంటూ ప్రజలను నమ్మించడానికి బాబు ప్రయత్నిస్తున్నారు
- గత రెండేళ్లలో మూలధన వ్యయం వార్షిక వృద్ధి రేటు 16 శాతం తగ్గింది
- 2025-26లో రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం వృద్ధి 3.47 శాతమే
- కానీ.. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది తొలి త్రైమాసికంలో జీఎస్‌డీపీ వృద్ధి 10.50% అధికంగా ఉన్నట్లు ప్రకటించారు

2 లో

- ఇది పూర్తిగా అవాస్తవం..
- 2019-24 మధ్య రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం వార్షిక వృద్ధి రేటు 9.87 శాతం
- అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్నుల ఆదాయం రూ.58,031 కోట్ల నుంచి రూ.92,922 కోట్లకు పెరిగింది
- ఆ ఐదేళ్లలో రాష్ట్ర జీఎస్‌డీపీ వార్షిక సగటు వృద్ధి రేటు 10.23 శాతం
- గత ఐదేళ్లతో పోల్చితే.. చంద్రబాబు పాలనలో జీఎస్‌డీపీ, పన్ను ఆదాయాల వృద్ధి చాలా తక్కువ
- మరి రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందని బాబు ఎలా చెబుతారు?
- కాగ్ గణాంకాలను ఉటంకిస్తూ.. రాష్ట్ర ఆర్థిక నిర్వహణలో చంద్రబాబు సర్కార్ వైఫల్యాలను కడిగిపారేసిన వైఎస్ జగన్



VOLTSUN LABS PRIVATE LIMITED having CIN U35100DL2025PTC453668 is 2 months & 25 days old Private company incorporated with MCA on 22nd August, 2025. VOLTSUN LABS PRIVATE LIMITED is listed in the class of Private company and classified as Non-govt company. This company is registered at Registrar of Companies(ROC), RoC-Delhi with an Authorized Share Capital of ₹10,00,000 and paid-up capital is ₹10,00,000

The company has 2 directors/key management personal KAMLESH KUMAR JAIN, PRADEEP KUMAR GOYAL. VOLTSUN LABS PVT LTD company registration number is 453668 and its Corporate identification Number(CIN) provided from MCA is U35100DL2025PTC453668

As per MCA records VOLTSUN LABS PRIVATE LIMITED is involved in activities such as

VOLTSUN LABS PVT LTD's registered office address is F-2/7, Okhla Indl Area, Phase - I, Okhla Industrial Area Phase-I, South Delhi, New Delhi, Delhi, India, 110020. Find other contact information for VOLTSUN LABS PRIVATE LIMITED such as contact number, email, website, gst details and more below

ఢిల్లీలో రూ.10 లక్షల మూలధనంతో ఆగస్టు 22న వోల్ట్‌సన్ కంపెనీ ఏర్పాటు చేసినట్లు తెలుపుతున్న ఆర్‌వోసీ

వోల్ట్‌సన్.. మరో ఉర్సా

3 లో

కేవలం రూ.10 లక్షల మూలధనంతో 2 నెలల క్రితమే ఢిల్లీలో పుట్టిన కంపెనీ

రూ.1,504 కోట్ల పెట్టుబడులట.. ఏకంగా రూ.1,037.86 కోట్ల రాయితీలట..

పెట్టుబడిలో ఏకంగా 69 శాతం రాయితీలు

ఇది కాకుండా ఎకరా రూ.60 లక్షలతో నాయుడుపేట సెజ్‌లో 37 ఎకరాలు

ఎలాంటి అనుభవం లేకపోయినా సోలార్ ప్యానల్ తయారీ యూనిట్

కోట్ల విలువైన భూమితో పాటు భారీ ప్రోత్సాహకాలపై అధికార వర్గాల్లో విస్తృత చర్చ

22 మంది బాలికలకు అస్వస్థత

వాంతులు, విరేచనాలు, జ్వరం బారిన పడిన అల్లూరి జిల్లా రాజేంద్రపాలెం 'ఆశ్రమ' విద్యార్థినులు

రాజేంద్రపాలెం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న గిరిజన విద్యార్థినులు

- కేజీహెచ్‌లో ఇద్దరు బాలికలకు చికిత్స.. మిగిలిన వారికి రాజేంద్రపాలెం పీహెచ్‌సీలో..
- కలుషిత ఆహారమే కారణం!
- ఆందోళన కలిగిస్తున్న వరుస ఘటనలు.. గతనెలలో కురుపాం స్కూల్లో ఇద్దరు బాలికల మృతి
- 120 మందికిపైగా అస్వస్థత
- అయినా చలనం లేని చంద్రబాబు సర్కారు

3 లో

మంత్రి పదవులకు ఫార్ములా..

- ప్రతి ఆరుగురు ఎమ్మెల్యేలకు ఒక మంత్రి పదవి
- బిహార్‌లో ఎన్డీయే పక్షాల మధ్య అంగీకారం
- బీజేపీకి 14 మంత్రి పదవులు దక్కే అవకాశం
- ఈ నెల 19 లేదా 20న నూతన సీఎం ప్రమాణ స్వీకారం

6 లో

నేటి గుడ్డు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹84

ఫారం దగ్గర లైవ్ బర్డ్	115 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	206 కిలో
రిటైల్ లైవ్ బర్డ్	142 కిలో	స్కిన్ లెస్	234 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ఇదండీ సంగతి



హిందూపురం వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

హిందూపురంలో పోలీసుల ఓవరాక్షన్

- టీడీపీ గూండాల దాడిలో ధ్వంసమైన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని పరిశీలించేందుకు వెళ్తున్న పార్టీ నేతల్ని అడ్డుకున్న పోలీసులు
- పెనుకొండ వద్ద వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి అడ్డగింత
- హిందూపురం వస్తున్న ఉషశ్రీ, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మక్బుల్‌ను అడ్డుకున్న పోలీసులు
- ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, అనంతపురంలో నేతల హౌస్ అరెస్టులు
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ అనంతపురంలో హౌస్ అరెస్టు
- పలువురు నేతలపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదు

5 లో

ఆ మాటలు దారుణం..

దుర్మార్గం

- స్టీల్ ప్లాంట్ కార్మికులు పని చేయకపోవడం మీరు చూశారా?
- చంద్రబాబు వ్యాఖ్యలపై ఉద్యోగ, కార్మిక నాయకుల ఆగ్రహం
- విశాఖ ఉక్కుపై ఎన్నికలకు ముందు ఏం చెప్పారు.. ఏం చేశారు?
- విశాఖ ఉక్కు ఉద్యోగి సగటు ప్రొడక్టివిటీ 785 టన్నులు.. సెయిల్‌లో అది 625 టన్నులే
- 3.4 నుంచి 7.3 మిలియన్ టన్నులకు మేం పని చేయకుండానే ఉత్పత్తి పెరిగిందా?

3 లో

శ్రీకాళహస్తిలో ఆక్రమణకు గురైన దళితుల భూమి

దళితుల భూములపై

'పచ్చ' గద్దలు

శ్రీకాళహస్తి ఎంఎం వాడలో టీడీపీ నేతల కుతంత్రం

రూ.154 కోట్ల విలువైన 3 ఎకరాలు కొట్టేసేందుకు పక్కా స్కెచ్.. రికార్డులు తారుమారు.. సబ్‌డివిజన్ల పేరుతో కుట్ర

నకిలీ పేర్లతో రిజిస్ట్రేషన్లకు సన్నాహాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: శ్రీకాళహస్తి పట్టణంలోని ఎంఎం వాడలో ఉన్న దళిత భూములపై టీడీపీ నేతలు గద్దల్లా వాలిపోయారు. సుమారు రూ.154 కోట్ల విలువ చేసే భూమిని కొట్టేసేందుకు పక్కా స్కెచ్ వేశారు. ఈ క్రమంలో ముందుగా రికార్డులను తారుమారు చేశారు. సబ్‌డివిజన్ల పేరుతో కుట్రలు పన్నారు. కొందరిని బెదిరిస్తూ.. నకిలీ వ్యక్తులను తెరపైకి తీసుకొచ్చారు. ఆక్రమిత భూమికి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు

మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

రూ.1,000 కోట్ల కేంద్ర నిధులను జమ చేయండి

సర్పంచుల సంక్షేమ సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గ్రామీణ స్థానిక సంస్థల కోసం రాష్ట్రానికి కేంద్రం విడుదల చేసిన రూ.1000 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే ఆయా గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌ల ఖాతాల్లో జమ చేయాలని సర్పంచుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.కృష్ణమోహన్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవ తీసుకుని ఈ నిధులను వెంటనే స్థానిక సంస్థల ఖాతాల్లో జమయ్యే విధంగా చూడాలని కోరారు. అలాగే, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఒకటైన సర్పంచుల గౌరవ వేతనం పెంపుని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అనుకోకుండా తాకితే ఆమె ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినట్లు కాదు

- ఘర్షణ సమయంలో పరిణామంపై హైకోర్టు తీర్పు

సాక్షి, అమరావతి: ఒక గొడవ లేదా ఘర్షణ సమయంలో అనుకోకుండా ఎవరైనా మహిళను తాకడం లేదా ఆమెను తోసేయడం ఆ మహిళ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేందుకు చేసిన చర్యగా పరిగణించడానికి వీల్లేదని హైకోర్టు తేల్చి చెప్పింది. అలాంటి వాటికి ఐపీసీ సెక్షన్ 354 వర్తించదని స్పష్టం చేసింది. అలాగే నేరంలో నిందితుని ప్రమేయంపై న్యాయస్థానానికి చిన్న సందేహం, అనుమానం ఉన్నా కూడా అలాంటి పరిస్థితుల్లో ఆ నిందితుడిని దోషిగా తేల్చడానికి వీల్లేదంది. ఒక క్రిమినల్ కేసు విచారణలో అనుమానం ఎంత తీవ్రమైనదైనప్పటికీ, దానిని సాక్ష్యంగా పరిగణించడానికి వీల్లేదంది. ప్రాసిక్యూషన్ తన కేసును బలమైన, విశ్వసించదగ్గ ఆధారాలతో నిరూపించాలంది. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వాధికారిని అడ్డుకోవడం, మహిళ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయాలన్న ఉద్దేశంతో ఆమెను తాకడం, తోసివేయడం వంటి ఆరోపణల కింద ప్రకాశం జిల్లా, నాగులుప్పాలపాడు పోలీసులు నమోదు చేసిన కేసులో నలుగురు యువకులను నిర్దోషులుగా ప్రకటిస్తూ, న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు తీర్పు వెలువరించారు. వారిని నిర్దోషులుగా ప్రకటిస్తూ ఒంగోలు అదనపు సహాయ సెషన్స్ జడ్జి కోర్టు 2006లో ఇచ్చిన తీర్పును సమర్థించారు. సెషన్స్ కోర్టు తీర్పును సవాలు చేస్తూ పోలీసులు దాఖలు చేసిన అప్పీల్‌ను తోసిపుచ్చారు.

దేశాభివృద్ధిలో గిరిజనుల ముఖ్య భాగస్వామ్యం

ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీ

బిర్సా ముండా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీ

సాక్షి, పాడేరు: దేశాభివృద్ధిలో గిరిజన సమాజాన్ని ఎన్‌డీఏ ప్రభుత్వం ముఖ్య భాగస్వామ్యం చేసిందని, ఆదివాసీ మహిళ ముర్ముకు రాష్ట్రపతిగా అవకాశం కల్పించడం చరిత్రాత్మకమని ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీ అన్నారు. పాడేరులో వనవాసీ కళ్యాణ ఆశ్రమం ఆదివారం నిర్వహించిన భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి, జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చింతలవీధి జంక్షన్‌లో ఏర్పాటు చేసిన భగవాన్ బిర్సా ముండా విగ్రహన్ని ఒడిశా సీఎం ఆవిష్కరించారు. అనంతరం పాడేరు జూనియర్ కళాశాల మైదానంలో జన జాతీయ గౌరవ్ దివస్‌కు జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిజనులను ఉద్దేశించి తెలుగులో కొంతసేపు మాట్లాడారు. మోదకొండమ్మ తల్లి అడవి బిడ్డలకు రక్ష, గిరిజనులందరికీ కృతజ్ఞతలు అంటూ తెలుగులో చెప్పడంతో గిరిజనులంతా సంతోషించారు. బిర్సా ముండా గిరిజనుల పక్షాన పోరాడిన స్వాతంత్య్ర పోరాట యోధుడు మాత్రమే కాదని, గొప్ప ఆధ్యాత్మిక వేత్త అని వ్యాఖ్యానించారు. యువత బిర్సాను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్, మంత్రులు సత్యకుమార్ యాదవ్, గుమ్మడి సంధ్యారాణి, ఆదివాసీలు పాల్గొన్నారు.

ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాలో ఆదివారం జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. ఐజీ సుందర్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. సుక్మా జిల్లా బెజ్జి–చింతగుఫ పరిధి తుమల్పాడ్ అడవుల్లో ఆదివారం ఉదయం డీఆర్జీ బలగాలు కూంబింగ్ చేస్తుండగా ఎదురుపడిన మావోయిస్టులు.. పోలీసులపైకి కాల్పులు జరిపారు. పోలీసు బలగాలు సైతం ఎదురు కాల్పులకు దిగగా, ఇద్దరు మహిళలతో సహా ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. మృతులను మాద్వి దేవా (జన్‌మిలిషీయా కమాండర్, కుంట ఏరియా కమిటీ సభ్యురాలు), పొడియం గంగి (కుంట ఏరియా కమిటీ సీఎన్ఎం కమాండర్), సోడి గంగి (కిష్టారం ఏరియా కమిటీ సభ్యుడు)గా గుర్తించారు.

రాష్ట్రం దూసుకెళ్తున్నది అప్పుల్లోనే

తీవ్ర ఆందోళనకరంగా ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి | సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ధ్వజం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. తాము అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తామంటూ టీడీపీ, జనసేన నేతలు చెప్పిన దానికి విరుద్ధంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఉందని స్పష్టం చేశారు. ఈ మేరకు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికల్లోని గణాంకాలను ఉటంకిస్తూ, ఆర్థిక నిర్వహణలో చంద్రబాబు సర్కార్ ఘోరంగా విఫలమైందంటూ కడిగిపారేశారు. రాష్ట్రం దూసుకుపోతున్నది కేవలం అప్పులు చేయడంలోనేనని పేర్కొన్నారు. కొసరంత ఆదాయం.. ఇసుమంత మూలధన వ్యయం.. కొండలా పెరిగిపోతున్న రుణభారం..! ఇదీ చంద్రబాబు విజన్..! అంటూ తన 'ఎక్స్' ఖాతాలో వైఎస్ జగన్ ఆదివారం పోస్టు చేశారు. అందులో ఆయన ఏమన్నారంటే...

రాష్ట్ర విభజన నాటి నుంచి అప్పులు ఇలా...



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అప్పు రూ.3,32,671 కోట్లు మాత్రమేనని స్పష్టం చేసిన కాగ్ నివేదిక ఇది.. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అప్పుల్లో 62శాతం అంటే రూ.2,06,959 కోట్ల అప్పును చంద్రబాబు ప్రభుత్వం 17 నెలల్లోనే చేసింది

వార్షిక వృద్ధి రేటు ఇదీ..



2023-24 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలలతో పోలిస్తే 2025-26 మొదటి ఆరు నెలల్లో సేల్స్ ట్యాక్స్, స్టేట్ నాన్ రెవెన్యూ ట్యాక్స్, కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు, గ్రాంట్లు తగ్గిపోయినట్లు స్పష్టం చేసిన కాగ్ నివేదిక ఇది.. అదేవిధంగా రాష్ట్రంలో మూలధన వ్యయం కూడా భారీగా తగ్గిందని తేల్చిన కాగ్

ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి ఆరు నెలల్లో ఇదీ పరిస్థితి..



2025-26 ఆర్థిక సంవత్సరంలో తొలి ఆరు నెలల్లో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిని వివరించిన కాగ్ నివేదిక ఇది..

2019-24 మధ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక వృద్ధి వివరాలు..



2019-24 మధ్య ఐదేళ్లలో రాష్ట్ర పన్నుల ఆదాయం వార్షిక వృద్ధి రేటు(సీఏజీఆర్) 9.87 శాతం, రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటు 10.23శాతం నమోదైనట్లు ప్రకటించిన కాగ్

- 2025–26 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలలకు సంబంధించి కాగ్ విడుదల చేసిన గణాంకాలను పరిశీలిస్తే.. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాల వృద్ధి అత్యంత నిరాశజనకంగా ఉందన్నది స్పష్టమవుతోంది. తాము అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తామంటూ టీడీపీ, జనసేన నేతలు చెప్పినదానికి విరుద్ధంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఉంది.
- ఆర్థిక రంగంలో టీడీపీ కూటమి ప్రభుత్వ పనితీరును ఒక్కసారి పరిశీలిస్తే.. వారి ఘోర వైఫల్యాలు కళ్లకు కట్టినట్లు కనిపిస్తాయి. 2025–26 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్ను ఆదాయాల వృద్ధి కేవలం 7.03 శాతం మాత్రమే. 2025–26లోనైనా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కోలుకుంటుందని చాలా మంది ఆశించారు. కానీ.. కాగ్ విడుదల చేసిన గణాంకాలను పరిశీలిస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందన్నది స్పష్టం అవుతోంది. గత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలలతో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో వస్తు, సేవల పన్ను(జీఎస్టీ), అమ్మకపు పన్ను (సేల్స్ ట్యాక్స్) ఆదాయాల వృద్ధి కేవలం 2.85 శాతం మాత్రమే.
- 2023–24 నుంచి 2025–26 వరకూ రెండు ఆర్థిక సంవత్సరాల్లో మొదటి ఆరు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్ను ఆదాయాల వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్)తో పోల్చితే... ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరునెలల్లో రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్నుల ఆదాయాల వృద్ధి కేవలం 2.75 శాతం మాత్రమే ఉన్నప్పటికీ రాష్ట్రం అద్భుతమైన ఆర్థిక వృద్ధి సాధిస్తోందంటూ ప్రజలను నమ్మించడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం 2024–25లో జీఎస్‌డీపీ (రాష్ట్ర స్థూల ఉత్పత్తి) వృద్ధి 12.02 శాతం సాధించామని.. 2025–26లో 17.1 శాతం వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ప్రకటించింది. కానీ.. ఫలితాలు అత్యంత దారుణంగా ఉన్నాయన్నది కాగ్ విడుదల చేసిన గణాంకాలే తేల్చి చెబుతున్నాయి. ఈ స్థాయిలో జీఎస్‌డీపీ వృద్ధి సాధించాలంటే రెండేళ్ల కాలంలో భారీ ఎత్తున పెట్టుబడులు, నిధులు వ్యయం చేయాలి. అప్పుడు జీఎస్‌డీపీలో సీఏజీఆర్ 14.53 శాతం అవుతుంది. దీని ఫలితంగా రెండేళ్లలో సంబంధిత పన్ను ఆదాయాల వార్షిక వృద్ధి 12–15 శాతంగా ఉంటుంది. కానీ, వాస్తవం ఏమిటంటే.. రెండేళ్లలో పన్ను ఆదాయాల వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్) కేవలం 2.75 శాతం మాత్రమే. అంచనాలు ఆ స్థాయిలో ఉంటే.. వాస్తవ పరిస్థితి మాత్రం దారుణంగా ఉంది. గత రెండేళ్లలో మూలధన వ్యయం వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్) 16 శాతం తగ్గడం అత్యంత ఆందోళనకరం.
- 2025–26 తొలి త్రైమాసికంలో రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం వృద్ధి కేవలం 3.47 శాతం మాత్రమే. గత సంవత్సరంతో పోల్చితే ఈ సంవత్సరం తొలి త్రైమాసికంలో జీఎస్టీ, అమ్మకపు పన్ను ఆదాయాలు బాగా తగ్గాయి. కానీ.. చంద్రబాబునాయుడు మాత్రం గతేడాది పోల్చితే.. 2025–26 తొలి త్రైమాసికంలో జీఎస్‌డీపీ వృద్ధి 10.50 శాతం అధికంగా ఉందని ప్రకటించారు. ఇది పూర్తిగా అవాస్తవం.
- గత ఐదేళ్లలో 2019–24 మధ్య ఆంధ్రప్రదేశ్ సొంత పన్నుల ఆదాయం వార్షిక వృద్ధి రేటు 9.87 శాతం. రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్నుల ఆదాయం రూ.58,031 కోట్ల నుంచి రూ.92,922 కోట్లకు పెరిగింది. ఆ ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీ వార్షిక వృద్ధి రేటు 10.23 శాతంగా ఉంది. గత ఐదేళ్లలో జీఎస్‌డీపీ వృద్ధి, పన్ను ఆదాయాల వృద్ధితో పోల్చితే టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలో జీఎస్‌డీపీ, పన్ను ఆదాయాల వృద్ధి తక్కువగా ఉందన్నది స్పష్టమవుతోంది. అయినప్పటికీ రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందని చంద్రబాబు ఎలా చెప్పగలరు?
- రాష్ట్రం దూసుకుపోతున్నట్లు కనిపించే ఏకైక అంశం అప్పుల విషయంలోనే. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ ఏకంగా రూ.2,06,959 కోట్లు అప్పులు చేశారు (వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అప్పులో.. టీడీపీ కూటమి సర్కారు 17 నెలల్లోనే 62 శాతం అప్పు చేసింది).

ప్రసంగిస్తున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్. వేదికపై సీఎం చంద్రబాబు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ తదితరులు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌లను సన్మానించిన న్యాయవాద సంఘాల ప్రతినిధులు

మహిళా సాధికారత దిశగా దేశం పురోగమనం

▶ మొదటి పేజీ తరువాయి

ఆదివారం మంగళగిరిలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ గవాయ్ ప్రధానోపన్యాసం చేశారు. ప్రజలకు తమ హక్కులపై అవగాహన ఉన్నప్పుడే వాటిని పొందడం సాధ్యమవుతుందని చెప్పారు. ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే పౌరులు న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించే గొప్ప అవకాశాన్ని రాజ్యాంగం కల్పించిందన్నారు. రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభకు అప్పగించే సమయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడిన మాటలు ప్రతి న్యాయ విద్యార్థికి కంఠోపాఠం కావాలని తెలిపారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని ఓ స్థిర పత్రంలా చూడలేదని.. పరిస్థితులు, సమాజ మార్పులకు అనుగుణంగా మారుతూ ఉండాలని ఆకాంక్షించారన్నారు. అందులో భాగంగానే మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మన భారత రాజ్యాంగానికి సవరణలు చేస్తూ వస్తున్నామని, అంబేడ్కర్ సైతం ఇదే ఆశించారని తెలిపారు.

మన రాజ్యాంగం వల్లే అణగారిన వర్గాలకు అవకాశాలు

రాజ్యాంగంలో పేర్కొన్న వ్యవస్థలు ఒక దాంట్లో ఒకటి జోక్యం చేసుకోరాదని, ఒకవేళ జోక్యం చేసుకుంటే ప్రజాస్వామ్యం పేక మేడలా కూలిపోతుందని జస్టిస్ గవాయ్ తెలిపారు. మన రాజ్యాంగం వల్లే ఈ దేశంలో అణగారిన వర్గాల వారు ఉన్నత స్థానాల్లో కొనసాగుతున్నారన్నారు. ఇందుకు ప్రస్తుత రాష్ట్రపతి, తానే ప్రత్యక్ష ఉదాహరణ అని స్పష్టం చేశారు. గతంలో కేఆర్ నారాయణన్, రామ్‌నాథ్ కోవింద్‌లు రాష్ట్రపతులుగా పనిచేశారని, ఎస్సీ అయిన బాలయోగి లోక్‌సభ స్పీకర్‌గా పని చేశారన్నారు. ఓ ఛాయ్‌వాలా కూడా ఈ దేశ ప్రధాని కాగలిగారంటే అందుకు రాజ్యాంగమే కారణమని ప్రస్తుత ప్రధాన మంత్రి చెప్పారని గుర్తు చేశారు. మొదట దేశమే ముఖ్యమని, దేశ గతి కన్నా ఏదీ, ఎవరూ ముఖ్యం కాదని అంబేడ్కర్ చాలా స్పష్టంగా చెప్పారన్నారు. తాను పుట్టిన అమరావతి (మహారాష్ట్రలో ఉంది) నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి రావడం యాధృచ్ఛికమన్నారు. తాను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయినప్పుడు మొదట అమరావతికే వెళ్లానని, ఇప్పుడు పదవీ విరమణ చేస్తున్న వేళ మళ్లీ అమరావతికే వచ్చానని చెప్పారు.

సమానత్వం కాగితాలకు పరిమితం కారాదు

పరిష్కారాలు చూపకుండా హక్కులు కల్పించినంత మాత్రాన ఎలాంటి ప్రయోజనం ఉండదని అంబేడ్కర్ గట్టిగా వాదించారని జస్టిస్ గవాయ్ తెలిపారు. హక్కులకు విఘాతం కలిగినప్పుడు పౌరులు కోర్టులను ఆశ్రయించే అవకాశం అలానే వచ్చిందన్నారు. ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణకే రాజ్యాంగ సవరణలు చేస్తూ వస్తున్నామని చెప్పారు. సమానత్వమే అన్నింటి కన్నా సర్వోత్కృష్టమైనదన్నారు. సమానత్వం కేవలం కాగితాలకే పరిమితం కారాదన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఐఏఎస్‌లతోపాటు ఇతర ఉన్నతాధికారుల పిల్లలకు మంచి విద్యను అభ్యసించే అవకాశం ఉంటుందని, అదే ఓ పేద రైతు బిడ్డకు ఆ అవకాశం ఉండదని చెప్పారు. అందుకే తాను రిజర్వేషన్ల కల్పనలో క్రిమిలేయర్‌ను ప్రామాణికంగా చేసుకోవాలని ఎస్సీ ఉప వర్గీకరణ తీర్పులో స్పష్టంగా చెప్పానని గుర్తు చేశారు. హక్కులు, మహిళా సాధికారిత కోసం జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే ఎంతో పాటుపడ్డారన్నారు. జ్యోతిరావు పూలేను అంబేడ్కర్ తన గురువుగా భావించారని తెలిపారు. న్యాయ, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం ఎంతో అవసరమని, ఇప్పుడు దేశం ఆ దిశగా పయనిస్తోందని చెప్పారు. దీనిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మనందరం కట్టుబడి ఉండాలని, ఇందుకు అందరం ప్రతిజ్ఞ చేయాలన్నారు. ప్రజాస్వామ్యం మరింత గొప్ప స్థాయికి చేరాలంటే మరిన్ని చర్యలు చేపట్టాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

సాధించిన మైలు రాళ్లు ఎంతో గర్వ కారణం

హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ, దశాబ్దాల కాలంగా పలు రంగాల్లో మనం ఎన్నో మైలు రాళ్లు సాధించామని, ఇది మనకు ఎంతో గర్వకారణమని చెప్పారు. మన రాజ్యాంగం మన దేశాన్ని కొత్తగా ఆవిష్కరించిందన్నారు. దేశ ఐక్యత, సార్వభౌమత్వానికి రాజ్యాంగం ప్రతీక అన్నారు. అణగారిన వర్గాలకు, మైనారిటీలు, వెనుకబడిన తరగతులకు రాజ్యాంగం ఎన్నో రక్షణలను కల్పించిందని చెప్పారు. ప్రతి పౌరుడు రాజ్యాంగాన్ని గౌరవించడమే కాకుండా, దాన్ని సదా పరిరక్షిస్తుండాలని తెలిపారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, జస్టిస్ గవాయ్ ఎంతో గొప్ప మానవతావాది అన్నారు. సమానత్వాన్ని మాటల్లోనే కాకుండా చేతల్లో కూడా చూపించే వ్యక్తి అని తెలిపారు. ఆయన ఇచ్చిన పలు తీర్పులు చిరస్థాయిగా నిలచిపోతాయన్నారు. మన ప్రజాస్వామ్య వ్యవస్థకు శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థ, మీడియా అనేవి నాలుగు మూల స్తంభాలని.. వీటి వల్లే మన దేశం ఉత్తమమైన ప్రజాస్వామ్య దేశంగా నిలబడిందని చెప్పారు. అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కలిగినీడి చిదంబరం కూడా మాట్లాడారు.

జస్టిస్ గవాయ్‌కి ఘన సన్మానం

కార్యక్రమంలో చివరగా జస్టిస్ గవాయ్‌ని హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యవర్గం ఘనంగా సన్మానించింది. వేంకటేశ్వరస్వామి జ్ఞాపికలు బహూకరించింది. రాష్ట్ర న్యాయాధికారుల సంఘం కూడా ఆయన్ను సత్కరించి, గౌతమ బుద్ధుని జ్ఞాపికను అందించింది. విజయవాడ, గుంటూరు న్యాయవాదుల సంఘాల ప్రతినిధులు కూడా సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు. బార్ కౌన్సిల్ సభ్యుడు బీవీ కృష్ణారెడ్డి, హైకోర్టు న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు కేవీ రఘువీర్‌లు జస్టిస్ గవాయ్‌ని గజ మాలతో సన్మానించారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి చేజర్ల సుబోధ్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదులు, హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి చేజర్ల సుబోధ్, అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) ఇవన సాంబశివ ప్రతాప్, అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పసల పొన్నారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) మెండ లక్ష్మీనారాయణ, పలువురు సీనియర్ న్యాయవాదులు, జిల్లా జడ్జీలు, న్యాయాధికారులు, న్యాయవాదులు, ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్‌లో సీజేఐ బీఆర్ గవాయ్‌కి ఘన వీడ్కోలు

విమానాశ్రయం (గన్నవరం): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌కు ఆదివారం గన్నవరం విమానాశ్రయంలో ఘన వీడ్కోలు పలికారు. మంగళగిరి పర్యటన పూర్తిచేసుకున్న ఆయన మధ్యాహ్నం రోడ్డుమార్గంలో ఇక్కడికి చేరుకున్నారు. అనంతరం ప్రత్యేక విమానంలో న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. విమానాశ్రయంలో ఆయనకు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, ప్రొటోకాల్ డైరెక్టర్ మోహన్ రావు వీడ్కోలు పలికారు.

'సర్వేపల్లి'లో కోటి సంతకాలు సక్సెస్

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై గడువుకు ముందే లక్ష్యసాధన
- భారీ బైక్ ర్యాలీ నిర్వహించిన పార్టీ శ్రేణులు
- హాజరైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

విరువూరులో పూర్తి సంతకాలతో కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ నేతలు

పొదలకూరు: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ఉవ్వెత్తున వ్యతిరేకత ఎగిసిపడింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల ఉద్యమం సర్వేపల్లిలో ఆదివారంతో పూర్తయింది. ఈ నియోజకవర్గంలో 60 వేల సంతకాల సేకరణను చేపట్టాలని పార్టీ అధిష్టానం లక్ష్యంగా నిర్ణయించింది. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ లక్ష్యాన్ని ముందుగానే పూర్తిచేయడంతో ప్రైవేటీకరణపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు అద్దంపట్టింది. ఈ నెల 22 నాటికి సంతకాల సేకరణ పూర్తిచేయాల్సి ఉండగా, 16వ తేదీకే కాకాణి పూర్తిచేయించి ముగింపు సభను పొదలకూరు మండలం విరువూరులో ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలనను ఖండిస్తూ సర్వేపల్లిలో పెద్దఎత్తున నిర్వహించిన ఉద్యమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని సంతకాలను పెట్టారు. బిడ్డల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కోటి సంతకాల సేకరణలో భాగస్వామ్యులయ్యారు. పేదలకు ప్రభుత్వ వైద్యం దూరం అవుతుందని చాటి చెబుతూ కాకాణి గోవర్ధన్‌రెడ్డితో పాటు ఆయన కుమార్తె, పార్టీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత నియోజకవర్గంలో పర్యటించి సంతకాల సేకరణ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

ఆ మాటలు దారుణం.. దుర్మార్గం

స్టీల్ ప్లాంట్ కార్మికులు పని చేయక పోవడం మీరు చూశారా?

చంద్రబాబు వ్యాఖ్యలపై ఉద్యోగ, కార్మిక, వామపక్ష నేతల మండిపాటు

- విశాఖ ఉక్కుపై ఎన్నికలకు ముందు ఏం చెప్పారు.. ఏం చేశారు?
- విశాఖ ఉక్కు ఉద్యోగి సగటు ప్రొడక్టివిటీ 785 టన్నులు.. సెయిల్‌లో అది 625 టన్నులే
- మేం పని చేస్తున్నామనడానికి ఈ గణాంకాలే నిదర్శనం
- 3.4 నుంచి 7.3 మిలియన్ టన్నులకు మేం పని చేయకుండానే ఉత్పత్తి పెరిగిందా?

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రుల హక్కు అయిన విశాఖ ఉక్కును కాపాడే బాధ్యతను భుజస్కం దాలపైకి ఎత్తుకొని.. కేంద్రంతో పోరాడాల్సిన ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి.. ఉద్యోగులు పని చేయడం లేదనడం దారుణం, దుర్మార్గం అని ఉద్యోగ, కార్మిక, వామపక్ష నేతలు మండిపడుతు న్నారు. పని చేయకుండా ఎలా జీతాలివ్వాలని, తెల్ల ఏనుగులా మారారని విశాఖ ఉక్కు కార్మికులపై సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యల పట్ల సర్వత్రా నిరసన వ్యక్తం చేస్తున్నారు. సీఎం బాధ్యత లేకుండా అలా ఎలా మాట్లాడారని... ఇది బాబు నిర్వాకమే అని ఆదివారం కార్మిక వర్గాల్లో విస్తృతంగా చర్చ జరిగింది. సీఎం చేసిన వ్యాఖ్యలను స్టీల్ ప్లాంట్ జేఏసీ, వామపక్షాల నేతలు తిప్పి కొడుతూ వాస్తవా లు వివరించారు. 'చంద్రబాబు ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన సమయంలో గంగవరం పోర్టులో స్ట్రైక్ జరిగింది. ఆ సమయంలోనే ప్రొడక్టివిటీ 29 శాతానికి పడిపోయింది. సమ్మె ముగిసిన తర్వాత.. మళ్లీ రా మెటీరియల్ రావడంతో ఉత్పత్తి పెరగడం మొదలైంది. ఇప్పుడు 70 శాతానికి చేరుకుంది. ఇం దులో చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న చొరవ ఏదీ లేదు. స్టీల్ ప్లాంట్ ఈ దుస్థితిలో ఉండటానికి గల కారణాలను వారింకా ఇలా వివరించారు.

అన్‌సీజన్‌లో ఫర్నేస్‌లు ఎందుకు ప్రారంభించారు?

'ఉత్పత్తి చెయ్యడంలో ఉద్యోగులు విఫలమయ్యార నడం సరికాదు. గతేడాది సింగిల్ ఫర్నేస్ మాత్రమే అందుబాటులో ఉంది. రెండు ఫర్నేస్‌లు షట్‌డౌన్ చేశారు. సింగిల్ ఫర్నేస్ లక్ష్యానికి అనుగుణంగా అప్పుడే 90 శాతం ఉత్పత్తి సాధించింది. సాధార ణంగా వర్షాకాలం అన్ సీజన్ ఉంటుంది. ఇది ప్లాం ట్ ప్రారంభించినప్పటి నుంచి జరిగింది. కానీ.. ఈ సారి విచిత్రంగా జూన్ నెలలోనే షట్‌డౌన్‌లో ఉన్న రెండో ఫర్నేస్‌ని ప్రారంభించారు. రా మెటీరియల్ హ్యాండ్లింగ్ పాయింట్‌లో వర్షాకాలంలో ఇబ్బందు లు వస్తాయి. ఎక్విప్‌మెంట్ ఆపరేటింగ్‌కు ఇబ్బం దులు ఎదురవుతాయి. అప్పట్లో 4 వేల మంది కార్మికుల్ని తొలగించారు. వర్షాకాలంలో మార్కెట్ లేదు. ఈ కారణంగా ఉత్పత్తి తగ్గుముఖం పట్టిందే తప్ప.. ఉద్యోగులు పని చేయక పోవడం వల్ల కాద న్న విషయం బాబు తెలుసుకోవాలి.

ఉద్యోగి ప్రొడక్టివిటీ ఎంతో తెలుసా?

ప్రతి స్టీల్ ప్లాంట్‌లోనూ ప్రొడక్టివిటీకి ఒక కొలబద్ద ఉంటుందన్న విషయం సీఎంగా చంద్రబాబు తెలుసు కోవాలి. ఒక ఉద్యోగి సంవత్సరానికి సగటున ఎన్ని టన్నులు ప్రొడ్యూస్ చేశారన్నదానితో ప్రొడక్టివిటీని అంచనా వేస్తుంటారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగి సగటు ప్రొడక్టివిటీ 785 టన్నులుగా ఉంది. సెయిల్‌లో 625 టన్నులు మాత్రమే. ఈ లెక్కన ఎవరు పని చేస్తు న్నారు.. ఎవరు పని చెయ్యడం లేదో ఇప్పుడు చెప్పం డి చంద్రబాబూ. ప్రతిసారీ జీతాలివ్వాలంటే ఎలా.. అని చంద్రబాబు మాట్లాడటం సరికాదు. ఇప్పటికీ.. ప్లాంట్‌లో పని చేసిన వారికి జీతాలు, పెన్షన్లు మూడున్నర నెలలు పెండింగ్‌లో పెట్టారు. 800 మంది వితంతువుల పెన్షన్లు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. వీరి నుంచి రూ.200 కోట్లు డిపాజిట్లు తీసుకున్నా.. పెన్షన్లు మాత్రం ఇవ్వలేకపోతున్నారెందుకు? ఎంతసేపూ రూ.12 వేల కోట్ల ప్యాకేజీ ఇచ్చామని చెబుతున్నారే.. అసలీ ప్యాకేజీ డబ్బులు ఎక్కడికి వెళ్లాయో తెలుసా? ఇచ్చిన ప్యాకేజీ మొత్తం బ్యాంకుల రుణాల చెల్లింపు లకే సరిపోయాయి. ఐదేళ్ల నుంచి ప్రమోషన్లు లేవు. ఈడీలు 15 మంది ఉండాల్సి ఉండగా.. ఒక్కరూ లే రు. ఇన్ని లోపాలు పెట్టుకొని.. ఈ లోపాలన్నీ ఉద్యో గులవే అన్నట్లుగా చంద్రబాబు మాట్లాడటం టాపిక్‌ను డైవర్షన్ కోసమే' అని మండిపడ్డారు.

ప్యాకేజీలో పెట్టిన ఆంక్షలు తెలీదా?

విశాఖ ఉక్కు కోసం రూ.12 వేల కోట్ల నిధులు సమకూర్చారని చంద్రబాబు మాట్లాడా రు. ఈ నిధులు జీఎస్టీకి, బ్యాంకు అప్పులు, ఇతర అప్పులు తీర్చ డానికి మాత్రమే. ఉద్యోగులు, కార్మికులు తొలగింపునకు, సంస్థ ఉత్పత్తికి, ముడి సరకుకు, యంత్రాల మరమ్మతులకు, కొత్త యంత్రాలు, స్పేర్ పార్ట్స్ కొనుగోలుకు, ఉద్యోగుల జీత భత్యాలకు చెల్లించరాదని ఆంక్షలు పెట్టిన సంగతి సీఎంకి తెలియదా?

– జగ్గునాయుడు, స్టీల్ ప్లాంట్ అఖిల పక్ష కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్

మీ ద్రోహాన్ని కప్పిపుచ్చుకునేందుకే..

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం కూడబలుక్కొని నష్టాల్లోకి నెడుతున్నాయి. ఈ ద్రోహాన్ని కప్పి పుచ్చుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్టీల్ ప్లాంట్ కార్మికులపై అభాం డాలు వేశారు. కార్మికులు పని చేయకపోతే గవర్నమెంట్ ఎక్కడ నుండి డబ్బులు తెస్తుందని



సీఎం మాట్లడటం సరికాదు. స్టీల్ ప్లాంట్ కార్మికులు, ఉద్యోగులు పని చేయకపోతే ప్లాంట్ 3.4 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం నుంచి 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యానికి ఎలా పెరిగింది?

– సీహెచ్ నర్సింగరావు, స్టీల్ ప్లాంట్ జేఏసీ చైర్మన్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా...

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

బాలరాజు (ఫైల్)

ఒర్వకల్లు: పంటల సాగుకు చేసిన అప్పులను తీర్చలేక యువ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కర్నూలు జిల్లా ఒర్వకల్లు మండలం నన్నూరులో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన కట్లా బాలరాజు(35)కు వివాహమై ముగ్గురు పిల్లలున్నారు. తనకున్న ఎకరా పొలంతో పాటు మరికొంత పొలం కౌలుకు తీసుకొని పంటలు సాగు చేశాడు. పెట్టుబడికి రూ.6 లక్షల వరకు అప్పు చేశాడు. అధిక వర్షాలతో పంట చేతికి రాకపోవడంతో అప్పులు తీర్చే మార్గం లేక ఆదివారం ఇంట్లో ఉరివేసుకున్నాడు. మృతుని తండ్రి వెన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'ఇండియా బ్లాక్ బలమైన శక్తిగా మారాలి'

సాక్షి, అమరావతి: బిహార్‌లో ఎన్డీయే గెలుపు ఇండియా బ్లాక్ పార్టీలకు నిరాశ కలిగించిందని, ఆ ఎన్నికల నుంచి ఇండియా బ్లాక్ లోపాలను బేరీజు వేసుకోవాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో మాట్లాడారు. కలిసొచ్చే అన్ని పార్టీలను కలుపుకొని ఇండియా బ్లాక్ బలమైన శక్తిగా మారాలన్నారు. అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారని, విశాఖ స్టీల్‌ప్లాంట్ కూడా ప్రైవేటీకరణ అయ్యేలా ఉందన్నారు.

'కార్మికులను నిందించడం చంద్రబాబుకు తగదు'

సాక్షి, అమరావతి: విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం పోరాడుతున్న కార్మికులను సీఎం చంద్రబాబు మద్దతు ఇవ్వకపోగా వారిని నిందించడం అన్యాయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. విజయవాడలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అవసరమైతే కార్మికులపై పీడీ యాక్ట్ ఉయోగిస్తామన్న చంద్రబాబు హెచ్చరికలు ఆయన ఆందోళన ప్రభుత్వ విధానాలు, గనులు లేకపోవడం, ఇతర పాలనాపరమైన కారణాల వల్ల స్టీల్‌ప్లాంట్‌కు నష్టాలు వస్తున్నాయని, ఆ నెపాన్ని కార్మికులపై నెట్టడం దారుణమన్నారు.

నా కుమారుడు ఇలాంటి పని చేస్తాడనుకోలేదు

అప్పారావు

ఆరిలోవ: తన కుమారుడు ఇమంది రవి (ఐబొమ్మ రవి) ఇలాంటి పని చేస్తాడని అనుకోలేదని తండ్రి ఇమంది చిన అప్పారావు అన్నారు. నగరంలోని ఆరిలోవ ప్రాంతం పెదగదిలిలో నివాసముంటున్న అప్పారావు ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఐబొమ్మ, బప్పం, ఇరాదే పేర్లతో వెబ్‌సైట్లు నిర్వహించి సినిమాలను పైరసీ చేసిన ఇమంది రవి హైదరాబాద్‌లో శనివారం సైబర్ క్రైం పోలీసులకు చిక్కిన విషయం తెలిసిందే. ఆయన విశాఖ వాసి. తండ్రి అప్పారావు బీఎస్ఎన్ఎల్‌లో లైన్‌మేన్‌గా పనిచేసి రిటైరయ్యారు. భార్యతో విడిపోయి కొన్నేళ్లుగా ఒంటరిగా ఉంటున్నారు. అతని కుమారుడు రవి నగరంలో డిగ్రీ వరకు చదువుకున్నాడని, రవి విశాఖ నుంచి 15 ఏళ్ల క్రితం హైదరాబాద్ వెళ్లాడని అప్పారావు చెప్పారు. అక్కడ ఓ ముస్లిం యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నట్టు తెలిపారు. వారికి ఓ పాప పుట్టాక ఆమె నుంచి విడిపోయాడన్నారు. అప్పుడప్పుడు విశాఖ వచ్చేవాడని, తనతో ఎక్కువగా మాట్లాడేవాడు కాదన్నారు. రవి చేసిన పని చాలా తప్పని, తప్పు చేసిన వారిని పోలీసులు శిక్షించాల్సిందేనని పేర్కొన్నారు. తాను ఒంటరిగా ఉంటున్నానని, రవి చేసిన పనులతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తనకు వచ్చే పింఛనుతో బతుకుతున్నానని, ఇంతవరకు కొడుకు డబ్బులు ఇవ్వలేదని తెలిపారు.

వోల్ట్‌సన్.. మరో ఉర్సా

2 నెలల క్రితం పుట్టిన కంపెనీ.. పెట్టుబడిలో ఏకంగా 69% సర్కార్ రాయితీ



GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Industries & Commerce Department - Proposal of M/s Voltsun Labs Private Limited for establishment of Solar Cell and Module Manufacturing in MP SEZ Naidupeta, Tirupati Dist. with an investment of ₹1,743 Crore and employment generation potential for 415 persons - Extending certain special package of incentives - Orders - Issued.

INDUSTRIES & COMMERCE (P&I) DEPARTMENT

G.O.MS.No. 222 — Dated: 15-11-2025
Read the following:

1. Proposal of M/s. Voltsun Labs Private Limited
2. Minutes of the 16th State Investment Promotion Committee meeting held on 04.11.2025.
3. Minutes of the 12th State Investment Promotion Board meeting held on 07.11.2025.

ORDER:

In the reference 1st read above, M/s. Voltsun Labs Private Limited have proposed for allotment of 40 acres of land at concessional price and tailor-made incentives for establishment of Solar Cell and Module Manufacturing in MP SEZ Naidupeta, Tirupati Dist. with an investment of ₹1,743 Crore and employment generation potential for 415 persons. The details of the project, with the request for allotment of lands is given below:

Type of Unit	Greenfield Solar Cell and Module Manufacturing Facility		
	Phase-I	Phase-II (Expansion)	Total
Production Capacity	1.0 GW cell + 1.0 GW module	1.0 GW cell + 1.0 GW module	2.0 GW cell + 2.0 GW module
Investment (INR Cr.)	931	812	1,743
Employment (Direct)	234	181	415
Location and land requirement	40 Acres in Naidupeta MP SEZ at a subsidized rate of INR 60 lakhs/acre		
DCP	December-2027	October-2029	

ఎకరం రూ.60 లక్షల చొప్పున వోల్ట్‌సన్ కంపెనీకి 37 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు



3. Government, after careful consideration of the decision of the State Investment Promotion Board, hereby approve the proposal of M/s. Voltsun Labs Private Limited for establishment of Greenfield Integrated Solar Manufacturing Facility for TOPC on Monocrystalline Solar Cell and Bifacial Solar Module, with an investment of INR 1,743 Crore and employment generation potential for 415 persons and grant the following tailor made incentives to the project, as given below:-

a. Allotment of 37 Ac land at MPSEZ-Naidupeta, at a concessional rate of INR 60 Lakh/ acre.
b. Facilitation of the external infrastructure such as provision of 3 MLD water supply (1.5 MLD each phase), provision of 40 MW connected power load (20 MW each phase) and for a captive solar power plant.
c. Grant of following tailor-made incentives, up to 69% of Fixed Capital Investment, contingent upon completion of Fixed Capital Investment of INR 1,504 Cr by October 2029, under 'AP Industrial Development Policy (4.0) 2024-29'

i. Investment subsidy at 30% of Fixed Capital Investment (INR 1,504 Cr.), limited to INR 451.20 Crore, to be disbursed in 10 years from DCP.
ii. Power tariff reimbursement of INR 1/unit for 10 years from DCP, limited to INR 262.8 Crore.
iii. 100% exemption of electricity duty on energy consumption of the plant for 10 years from DCP, limited to INR 262.8 Crore
iv. 50% subsidy on water charges for industrial water demand of 3 MLD for 10 years from DCP, limited to INR 59.4 Crore.
v. 100% reimbursement of stamp duty, registration fee, transfer duty on purchase of land for industrial use, limited to INR 1.66 Crore.

4. The Special Chief Secretary/Principal Secretary/Secretary of the concerned departments such as Energy Department, Water Resources Department, Industry and Commerce (CIP), Revenue (Land, Registration and Stamps), Finance Department and other departments concerned are requested to take further necessary action accordingly, duly instructing their HODs and PSUs under them for expeditious grounding and implementation of the project.

5. The Vice Chairman & Managing Directing, Andhra Pradesh Industrial Infrastructure Corporation Limited, Mangalagiri and the Director of Industries, Andhra Pradesh shall take further necessary action accordingly in coordination with the line Departments.

మొత్తం పెట్టుబడిలో 69 శాతం రాయితీల రూపంలో వోల్ట్‌సన్‌కు తిరిగి ఇస్తున్నట్లు జారీ చేసిన జీవో

సాక్షి, అమరావతి: కేవలం 10 లక్షల మూలధనంతో రెండు నెలల క్రితం ఢిల్లీలో ఏర్పాటైన కంపెనీ.. రూ.1,504 కోట్ల పెట్టుబడులట.. ఏకంగా ఈ కంపెనీకి ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు అక్షరాల రూ.1,037.86 కోట్లు. నమ్మశక్యంగా లేదా.. ఇలాంటి కంపెనీకి వందల కోట్ల రూపాయల విలువైన భూమిని కారు చౌకగా కట్టబెట్టడమే కాకుండా పెట్టుబడి విలువలో ఏకంగా 69% రాయితీల రూపంలో తిరిగి వెనక్కు ఇస్తూ చంద్రబాబు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. వోల్ట్‌సన్ ల్యాబ్ ప్రైవేటు లిమిటెడ్‌కు నెల్లూరు జిల్లా నాయుడుపేట ఎంపీసెజ్ (మల్టీ ప్రోడక్ట్ స్పెషల్ ఎకనమిక్ జోన్)లో ఎకరం రూ.60 లక్షల చొప్పున 37 ఎకరాలు కేటాయించింది. చెన్నై జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ ప్రాంతంలో ఎకరం ధర రూ.5 కోట్లకు పైనే పలుకుతోంది. అలాంటిది సోలార్ ప్యానల్స్ తయారీలో ఎటువంటి అనుభవం లేని వోల్ట్‌సన్ ల్యాబ్ రూ.1,743 కోట్లతో 2 గిగావాట్ల సోలార్ సెల్స్, 2 గిగావాట్ల మాడ్యుల్స్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సమర్పించింది. ఆ వెంటనే ప్రభుత్వం ఆగమేఘాల మీద ఎస్ఐపీసీ (సెక్యూరిటీస్ ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ కార్పొరేషన్), ఎస్ఐపీబీ (స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్), మంత్రివర్గంతో ఆమోదింపచేసి భూ కేటాయింపులు చేసింది. మొత్తం పెట్టుబడి ప్రతిపాదనలో రూ.1,504 కోట్లు ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌గా నిర్ణయించి, ఇందులో 69 శాతం రాయితీల రూపంలో తిరిగి ఇవ్వనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ కింద రూ.451.20 కోట్లు, యూనిట్‌కు రూపాయి చొప్పున విద్యుత్ సబ్సిడీ కింద రూ.262.8 కోట్లు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ 100 శాతం మినహాయింపు కింద రూ.262.8 కోట్లు, వాటర్ చార్జెస్ సబ్సిడీ కింద రూ.59.4 కోట్లు, స్టాంప్ డ్యూటీ రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపులు కింద రూ.1.66 కోట్లు.. మొత్తం రూ.1,037.86 కోట్ల రాయితీ ఇచ్చింది. ఇది కాకుండా క్యాపిటివ్ సోలార్ యూనిట్, 3 ఎంఎల్‌డీ వాటర్ సప్లై వంటి మౌలిక వసతులు కల్పించనున్నట్లు పేర్కొంది.

రెండు నెలల క్రితం పుట్టిన కంపెనీ

వోల్ట్‌సన్ ల్యాబ్‌కు సోలార్ ప్యానల్స్ తయారీలో ఎటువంటి అనుభవం లేదు. వాస్తవంగా ఈ కంపెనీ ప్రమోటర్లకు ఎయిర్ కండీషనింగ్ వ్యాపారంలో మాత్రమే అనుభవం ఉంది. ఆగస్టు 22న కమలేష్ కుమార్ జైన్, ప్రదీప్ కుమార్ జైన్‌లు డైరెక్టర్లుగా ఢిల్లీ కేంద్రంగా రూ.10 లక్షల మూల ధనంతో వోల్ట్‌సన్ ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేశారు. ఇందులో కమలేష్ కుమార్ పీహెచ్‌డీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఐడీబీఐ రీసైకిలింగ్ ఆపరేషన్స్ ప్రైవేటు లిమిటెడ్‌లో డైరెక్టర్. ప్రదీప్‌కుమార్ గోయల్ వైట్ పీక్ రిఫ్రిజరేషన్, అంజ్ ట్రేడర్స్, స్నోపీక్ ఎంటర్ ప్రైజెస్, ఆక్రోబేవ్ (తెలంగాణ), డీజే అగ్రి ఇండస్ట్రీస్‌లో డైరెక్టర్. వీరిద్దరికీ సోలార్ ప్యానల్స్ తయారీలో ఎటువంటి అనుభవం లేకపోయినా, ఏకంగా రూ.వందల కోట్ల విలువైన భూమిని కారుచౌకగా కేటాయించడంతోపాటు, పెట్టుబడిలో 70 శాతం వరకు తిరిగి ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయడం పట్ల అధికార వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. కంపెనీ ఏర్పాటైన రెండు నెలల్లోనే ఇంతగా రాయితీలిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయంటే దీని వెనుక ఏదో బలమైన శక్తి ఉందని చర్చించుకుంటున్నారు.

గత ప్రభుత్వ ఒప్పందాలకే

మళ్లీ నిశ్చయతాంబూలాలు

- తండ్రీకొడుకులిద్దరూ తబలా కొట్టుకోవడానికి రూ.వందల కోట్ల ఖర్చు
- వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఏవైతే ఒప్పందాలు కుదుర్చుకున్నామో.. వాటికే సీఐఐ సదస్సులో చంద్రబాబు మళ్లీ నిశ్చయతాంబూలాలు మార్చుకుంటున్నారని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వంలో జరిగిన జీఐఎస్ సదస్సులో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయని చెప్పారు. కానీ సీఐఐ సదస్సులో చంద్రబాబు కాకి లెక్కలు చెబుతున్నారన్నారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఏబీసీ పవర్, ఎకరన్ ఎనర్జీతో ఒప్పందాలు కుదుర్చుకుని, మళ్లీ ఇప్పుడు కొత్తగా ఒప్పందాలు చేసుకోవడమేంటన్నారు. రెన్యూ సంస్థ 2022 ఏడాదిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒప్పందం కుదుర్చుకుంటే ఇప్పుడు ఆ సంస్థతో మళ్లీ ఒప్పందం చేసుకున్నారన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో ఆదివారం మాట్లాడారు.

గత ప్రభుత్వంలో తరలివచ్చిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు

విశాఖలో గత ప్రభుత్వంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో అప్పటి సీఎం వైఎస్ జగన్‌తోపాటు ప్రముఖ పారిశ్రామిక వేత్తలైన ముఖేష్ అంబానీ, అదానీ, దాల్మియా నవీన్ జిందాల్, ఒబెరిస్ సంజయ్ బంగర్, భజంక, వీవీఆర్ మోహన్ రెడ్డి లాంటి వారు కుర్చుంటే.. సీఐఐ సదస్సులో చంద్రబాబుతోపాటు రాష్ట్ర మంత్రులే కుర్చొన్నారంటూ ఎద్దేవా చేశారు. సీఐఐ సదస్సు పేరిట తండ్రీ కొడుకులు తబలా కొట్టుకోవడానికే రూ.100 కోట్లు ఖర్చుచేశారని మండిపడ్డారు. 2014–19 మధ్య సీఎం చంద్రబాబు రూ.19 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పడమే కాకుండా వాటి ద్వారా 40 లక్షల మందికి పైగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించినట్లు చెప్పారని, అప్పటి చంద్రబాబు ఒప్పందాల్లో కేవలం రూ.36 వేల కోట్లు పెట్టుబడులు మాత్రమే వచ్చాయని, అంటే ఒప్పందాల్లో 2 శాతం మాత్రమే అమలుయ్యాయని అమర్‌నాథ్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు పారిశ్రామిక వేత్తలను బెదిరించి సీఐఐ సదస్సులో అబద్ధాలు చెప్పించే యత్నం చేశారన్నారు. లులు చైర్మన్ చంద్రబాబు ఆస్థాన విద్వాంసుడని, చంద్రబాబు ఏ సదస్సు నిర్వహించినా లులు అధినేత కనిపిస్తారని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో వచ్చిన ఇనార్బిట్ మాల్ ఇప్పుడు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కాపాడతానంటూ ఊదరగొట్టి గద్దెనెక్కిన చంద్రబాబు ఇప్పుడు వెన్నుపోటు పొడుస్తున్నారని దుయ్యబట్టారు.

అల్లూరి జిల్లాలో 22 మంది

బాలికలకు అస్వస్థత

వాంతులు, విరేచనాలు, జ్వరం బారిన పడిన 'ఆశ్రమ' విద్యార్థినులు

కొయ్యూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ప్రమాదఘంటికలు మోగుతున్నా.. చంద్రబాబు ప్రభుత్వానికి పట్టడం లేదు. ఇప్పటికే గతనెలలో పార్వతీపురం జిల్లా కురుపాం ఆశ్రమ పాఠశాలలో అస్వస్థతకు గురై ఇద్దరు బాలికలు మరణించారు. 120 మంది అస్వస్థతకు గురయ్యారు. అయినా ప్రభుత్వంలో మార్పు రాలేదు. ఆశ్రమ పాఠశాలల్లో వసతులు మెరుగు పరచడం లేదు. ఫలితంగా తాజాగా అల్లూరి జిల్లా రాజేంద్రపాలెం బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన 22 మంది బాలికలు అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఇద్దరు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారు రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. శనివారం రాత్రి 8వ తరగతి విద్యార్థులు కీర్తి ప్రసన్న, హాసినిలకు తొలుత జ్వరంతోపాటు విరేచనాలు కావడంతో నర్సీపట్నానికి తరలించారు. అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించారు. ఆదివారం ఉదయం నుంచి పాఠశాలకు చెందిన మరో 20 మంది బాలికలు అస్వస్థతకు గురయ్యారు. వారంతా తీవ్ర జ్వరంతోపాటు రక్త విరేచనాలతో బాధపడ్డారు. ఇంత మంది బాలికలు ఒక్కసారే అనారోగ్యానికి గురికావడంతో కలెక్టర్ దినేష్ కుమార్ వైద్యం అందించాలని ఆదేశాలిచ్చారు. దీంతో రాజేంద్రపాలెం పీహెచ్‌సీలో వైద్యురాలు స్నేహలతరెడ్డి చికిత్స అందిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం గుమ్మడికాయ కూర, రాత్రి బంగాళదుంపల కూరతో బాలికలు భోజనం తిన్నారు. అస్వస్థతకు కారణాలు ఏమిటన్నది పూర్తిగా తెలియడం లేదు. ఆదివారం అనారోగ్యంతో భారవి,శ్రీవల్లి, గంగాభవాని, హాసిని, ప్రసన్న, పద్మ, అచ్యుత, నాలుగో తరగతికి చెందిన సునీత, హేమ, దివ్య, బంగారం, నాగమణి, రాజేశ్వరి, వి.పూజ, ఆమని, డి.లలిత, జి.మీనాక్షి భారత, కృష్ణవేణి పీహెచ్‌సీలో చేరారు. వీరిలో 15 మందికి విరేచనాలయ్యాయి. మిగిలిన వారికి జ్వరం రావడంతో చికిత్స చేస్తున్నారు. బాలికల ఆశ్రమ పాఠశాలలో 300 మంది విద్యార్థులున్నారు. ఒకవేళ ఆహారం కలుషితమైతే వీలైనంత ఎక్కువ మందికి వ్యాపించే అవకాశం ఉంది. వైద్యులు స్నేహలతరెడ్డి మాట్లాడుతూ కలుషిత నీటి వల్ల అనారోగ్యంపాలై ఉండవచ్చన్నారు.

పీహెచ్‌సీలో చాలని బెడ్లు

రాజేంద్రపాలెం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న చిన్నారులకు బెడ్లు చాలలేదు. దీంతో ఒక్కో బెడ్‌పై ఇద్దరు బాలికలకు చికిత్స అందిస్తున్నారు. ఒక బెడ్‌పై మాత్రం ముగ్గురు బాలికలను పడుకోబెట్టి చికిత్స చేస్తున్నారు.

రాజేంద్రపాలెం పీహెచ్‌సీలో ఒకే బెడ్‌పై ముగ్గురు బాలికలకు చికిత్స

రాజకీయాల్లోకి ఎప్పుడు వచ్చేది

తర్వాత ప్రకటిస్తా

- ఇకపై అందరికీ అందుబాటులో ఉంటా
- వంగవీటి మోహన రంగా కుమార్తె ఆశా కిరణ్

వంగవీటి ఆశాకిరణ్

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా కుమార్తె వంగవీటి ఆశాకిరణ్ రాజకీయ రంగ ప్రవేశానికి సర్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. తాను ప్రజా జీవితంలోకి వస్తున్నానని ఆమె చేసిన ప్రకటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఆదివారం పాలకొల్లులో కార్తీక వన సమారాధనలో పాల్గొనేందుకు పయనమైన ఆమె.. తొలుత వంగవీటి మోహన రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తాను ఈ రోజు నుంచే ప్రజా జీవితం ప్రారంభిస్తున్నానని ప్రకటించారు. 'ఇకపై అందరికీ అందుబాటులో ఉంటా. ఎవరికైనా కష్టం వచ్చినా, నష్టం వచ్చినా అండగా ఉంటా' అని స్పష్టం చేశారు. కుటుంబ బాధ్యతల నేపథ్యంలో కొంత కాలంగా ప్రజా జీవితానికి దూరంగా ఉన్నానని, రాధా రంగా మిత్ర మండలితో కొంత గ్యాప్ ఏర్పడిందని చెప్పారు. ఆ గ్యాప్‌ను భర్తీ చేసేందుకు తాను ప్రజా జీవితంలోకి వస్తున్నానని తెలిపారు. తన అన్న వంగవీటి రాధాకృష్ణతో తనకెలాంటి విభేదాలు లేవని, ఇద్దరిదీ రంగా ఆశయ సాధనే లక్ష్యమన్నారు. ఇకపై రాధా రంగా మిత్ర మండలి, రంగా ఫ్యాన్స్‌తో కలుస్తానని, అన్ని అంశాలు చర్చిస్తానన్నారు. పబ్లిక్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటానని తెలిపారు. రాజకీయ అరంగేట్రంపై తర్వాత స్పందిస్తానని చెప్పారు. ప్రస్తుతం రాజకీయాల కోసం రాలేదని, సందర్భం వచ్చినప్పుడు అందరి సమక్షంలో తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని తెలిపారు. అనంతరం ఆమె రాధా రంగా మిత్ర మండలితో కలిసి కార్తీక వన సమారాధనలో పాల్గొనేందుకు పాలకొల్లు బయలుదేరి వెళ్లారు.

చంద్రబాబు ఆంధ్రుల ద్రోహి అని మళ్లీ రుజువు చేసుకున్నారు

- విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తమ లక్ష్యమని చంద్రబాబు తేల్చేశారు
- ఆంధ్రుల హక్కుపై ఆయన వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నాం
- మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర, మాజీ మంత్రి అప్పలరాజు

సాక్షి, విశాఖపట్నం: స్టీల్‌ప్లాంట్‌పైన, ఉద్యోగులపైన నోటికొచ్చినట్లు మాట్లాడిన చంద్రబాబు.. ఆంధ్రుల ద్రోహి అని మరోసారి రుజువు చేసుకున్నారని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చెప్పారు. విశాఖ ఉక్కుపై చంద్రబాబు వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తూ వారు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా, నాటి సీఎం వైఎస్ జగన్ అడ్డుకున్నారని తెలిపారు. అప్పుడు విపక్షంలో ఉన్న చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ఇష్టానుసారంగా మాట్లాడారని పేర్కొన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక నిస్సిగ్గుగా, నిర్లజ్జగా యూటర్న్ తీసుకున్నారని ఎద్దేవా చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నామంటూ ఒక వైపు ప్రజలను మభ్యపెడుతూ, మరోవైపు ఆ దిశలో కేంద్రం చర్యలను పూర్తిగా సమర్థిస్తుండటం సిగ్గుచేటని పేర్కొన్నారు.

కేంద్రంతో కలిసి విశాఖ ఉక్కును ఉరితీస్తున్నారు

అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలను మోసం చేసినట్లే విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులను కూడా చంద్రబాబు దారుణంగా వంచించారని పేర్కొన్నారు. అదే విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కొన్నాళ్ల కిందట కేంద్రం ప్యాకేజీ ఇస్తే, అది తమ ఘనత అన్నట్లు విపరీతంగా ప్రచారం చేసుకున్నారని గుర్తుచేశారు. కేంద్రం ఆ నిధులు ఇచ్చింది స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ సజావుగా సాగేందుకే అనిపిస్తోందని తెలిపారు. చంద్రబాబు తన సిద్ధాంతమైన ప్రైవేటీకరణకే మొగ్గు చూపుతూ.. నిస్సిగ్గుగా రాష్ట్ర ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కూటమి వైఖరితో 20 వేల మంది ఉద్యోగులకు అన్యాయం చేయడం దుర్మార్గమన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్.. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను బలంగా వ్యతిరేకించినందునే కేంద్రం ఐదేళ్లలో ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయిందన్న విషయం ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు.

ఓటమి, వైఫల్యం కూడా కొన్నిసార్లు విజయానికి అవసరమైన మెట్లే అవుతాయి.
– లాలా లజపతి రాయ్

సాక్షి
సోమవారం, 17 నవంబర్ 2025

మాయమైపోతున్న మనిషి

మనిషి నడక చిత్రంగా ఉంటుంది. అతను ముందుకు వెడుతున్నాననుకుంటాడు, కానీ అతనికి తెలియకుండానే అడుగులు వెనక్కి పడుతూ ఉంటాయి. అది తెలుసుకునే లోపల జరగాల్సిన నష్టం జరిగిపోతూ ఉంటుంది. ఉదాహరణకే చూడండి: మనిషి పుడుతూనే మనిషి కాలేదు. ఇతర జంతుజాలంలానే తనూ పుట్టాడు; తనలాంటివాళ్ళతో గుంపు కట్టాకే మనిషయ్యాడు, పదిమందిలో ఒకడిగా ఉంటేనే తనకూ, పదిమందికీ కూడా భద్రత అని తెలుసుకున్నాడు. గణంగా మారాడు, సమాజంగా ఎదిగాడు, రాజ్యంగా అవతరించాడు, సామ్రాజ్యంగా విస్తరించాడు. మళ్ళీ తనే దేశంగా మారే క్రమంలో సరిహద్దులు గీసుకుని సాటి మనుషుల్ని దూరం పెట్టే తిరోగమనమూ చిత్తగించాడు.

మనిషి హోమోసేపియన్స్ పేరిట ఆధునిక మానవుడిగా అవతరించే నాటికే ఈ భూగోళం సువిశాలం. భూమ్మీద మానవ జనాభా లక్షల సంఖ్యకు చేరడానికి కూడా చాలా కాలం పట్టిందని శాస్త్రవేత్తలు అంటారు. మనుషుల గుంపుల మధ్య అనంతమైన దూరం ఉండేది. ఆ దూరాన్ని తరించడానికి కాలాన్ని జయించవలసివచ్చేది. ఆయుర్దాయం ముప్పై, నలభయ్యేళ్ళను మించేది కాదు కనుక, అందుకొక జీవితకాలం కూడా చాలేది కాదు. గణాల మధ్య అల్లుకున్న బంధుత్వాలు, ప్రేమలు, స్నేహాలు దూరాల్ని చెరిపి మనుషులను మానసికంగా దగ్గర చేసేవి. పసిఫిక్ మహాసముద్రంలోని ట్రోబ్రియాండ్ దీవిజనం నౌకల మీద వెళ్ళి వెయ్యి మైళ్ళదూరంలో ఉన్న గణబంధువుల్ని కలిసి వాళ్ళకు కానుకలు ఇచ్చి రావడాన్ని ఒక పవిత్రమైన యజ్ఞంలా ఎలా జరిపేవారో ప్రముఖ మానవ శాస్త్రవేత్త బోనిస్లా మలినోవ్స్కీ రాస్తాడు. విచిత్రంగా, వాటికి 'కులయాత్ర'లని పేరు.

తరగని దూరాలు ఉన్నప్పుడు మానసికంగా మమతలు పెంచుకుంటూ దగ్గరగా ఉన్న మనుషులు, దూరాలు మాయమై భౌతికంగా దగ్గరగా ఉన్నా కూడా దూరమయ్యే స్థితికి చేరుకున్నారు. మహానగరాలు, పట్టణాలలో బహుళ అంతస్తుల గృహ సముదాయాల్లో ఏళ్ల తరబడిగా కలసి ఉంటున్నా ఒకరికొకరు తెలియని పరిస్థితికి వచ్చారు. తమ ఉమ్మడి భద్రత కోసం, తమను కలిపి ఉంచడం కోసం తమే సృష్టించుకున్న వ్యవస్థలే తమను విడదీసేవయ్యాయి. బ్రిటిష్ ఏలుబడిలో న్యాయస్థానాల ఏర్పాటు జరిగిన తర్వాత చిన్నాచితకా వివాదాలపై కూడా కోర్టుకు వెళ్ళడం ఎలా వేలంవెర్రిగా మారిందో, చివరికది కుటుంబ సభ్యుల్లోకి కూడా పాకి ఉమ్మడి కుటుంబ వ్యవస్థను ఎలా ఛిద్రం చేసిందో ఆ కాలపు ఉదంతాలు కళ్ళకు కట్టిస్తాయి. ఓ కుటుంబంలో ఆస్తి తగాదా పుట్టి ఏకంగా తల్లీ, కొడుకులే కోర్టు కెక్కారట. వాయిదాకు పొరుగూరు వెళ్లవలసి వచ్చినప్పుడు ఇద్దరూ కలిసే వెళ్ళేవారట. ఒకే సత్రంలో దిగేవారట. కొడుకు బయట ఎక్కడా భోజనం చేయడు కనుక తల్లే వండిపెట్టేదట! రాను రాను, శాస్త్రసాంకేతిక విజ్ఞానాల చేతిలో మనుషులు మరబొమ్మలయ్యారు. బంధుత్వాలూ, స్నేహాలూ ముఖాముఖీ అభివ్యక్తికి దూరమై మొబైల్ తెరకు పరిమితయ్యే పలకరింపులవుతున్నాయి.

సాహిత్య రంగానికే వస్తే, 'పాట' దశను దాటి 'రాత' దశకు చేరడాన్ని పురోగమనంగా చెప్పుకోవడం పరిపాటి అయింది. కానీ నిజానికి పాటే కాదు, ఆట కూడా సమూహ చింతన నుంచి, సమష్టి చైతన్యం నుంచి పుడితే; రాత వైయక్తిక స్పందన నుంచి పుట్టింది. సమూహం నుంచి విడివడి మనిషి ఒంటరి అయ్యే ఆ పరిణామాన్ని పురోగమనమనాలో, తిరోగమనమనాలో తేల్చుకోలేక పోవడమే మానవ జీవనంలోని మహా వైచిత్రులలో ఒకానొకటి.

'మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడూ/మచ్చుకైనా లేడు చూడూ' అనే పాట కొద్ది రోజులుగా తెలుగునాట వాడవాడలా వినిపిస్తూ, గుండె గుండెనూ తట్టిలేపడం చూశాం. తనే నిలువెత్తు పాటగా మారి, జనంలోకి వెళ్ళి, మనిషి మనిషిలో మోగి హఠాత్తుగా మన మధ్య నుంచి మాయమైన మనకాలపు పాటల గంధర్వుడు అందెశ్రీ కట్టిన పాట అది. 'ఆత్మీయ బంధాల ప్రేమ సంబంధాల దిగజారుతున్నడోయమ్మా... అవసరాలకు మనిషి సృష్టించిన రూపాయి చుట్టూ తిరుగుతున్నడమ్మా... కదిలె విశ్వం తనా కనుసన్నలో నడువా, కనుబొమ్మ లెగరేసి కాలగమనం లోన' మనిషి మాయమైపోతున్నడమ్మా అని హెచ్చరిస్తున్న ఆ పాట నిజానికి సందేశ పరంగా మానవ జాతీయ గీతాలలో ఒకటి కాదగినదీ, విశ్వవేదిక మీద వినిపించవలసినదీ.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తిక మాసం, **తిథి:** బ.త్రయోదశి పూర్తి (24 గంటలు), **నక్షత్రం:** చిత్త 5.26 వరకు(తెల్లవారితే మంగళవారం), తదుపరి స్వాతి, **వర్జ్యం:** ప.12.05 నుండి 1.49 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.06 నుండి 12.51 వరకు, తదుపరి ప.2.21 నుండి 3.06 వరకు, **అమృత ఘడియలు:** రా.10.36 నుండి 12.21 వరకు.

సూర్యోదయం: 6.09
సూర్యాస్తమయం: 5.21
రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు

సోషల్ టాక్

తక్షణమే లేకున్నా..!

ఎల్లప్పుడూ యథాతథ స్థితిని ప్రశ్నించండి. మార్పు కోసం ప్రయత్నించండి. కెరీర్‌లో, జీవితంలో, ఎక్కడైనా గానీ ప్రశ్నించటం అంటే మనం మెరుగుపడటం, మన చుట్టూ ఉన్న వాటిని మెరుగుపరచటం. తక్షణ ఫలితాలు లేకున్నా, సంకల్పానికి కట్టుబడి ఉండండి.

– సంజయ్ మల్హోత్రా, ఆర్బీఐ గవర్నర్

వాదన వద్దు

అభివృద్ధి అంటే నిరంతరం నేర్చుకుంటూ ఉండటం. నాకు తెలిసిన విషయమే అయినా, "నీకిది తెలియదు" అని ఎవరైనా నాతో అన్నప్పుడు, నాకు తెలిసిన ఆ విషయంలో... తెలియంది ఏముందా అని నేను వెతకటం మొదలు పెడతాను తప్ప, వాదనలోకి వెళ్లను.

– శ్రీహర్ష మాజేటీ, 'స్విగ్గీ' సహ–వ్యవస్థాపకుడు

బహుమతులు

రిస్క్ తీసుకోవటానికి భయపడకండి. ఎందుకంటే, అతి పెద్ద బహుమతులు ఉంటాయి. మధ్యలో ఆగకండి. ఎందుకంటే, మరుక్షణం మరొకరు మీ స్థానాన్ని ఆక్రమించుకోవటానికి సిద్ధంగా ఉంటారు. ఎప్పుడూ సంతృప్తి చెందకండి. ఎందుకంటే, మీరు అక్కడితో ఆగిపోతారు.

– లాండో నోరిస్, బ్రిటిష్ రేస్ కార్ డ్రైవర్

అది మామూలే!

కొన్నిసార్లు ఇక ఆగిపోవాలని అనిపిస్తుంది. నాకూ అలాగే క్రికెట్‌ను విడిచి పెట్టే సమయం వచ్చినట్లుగా అనిపించింది. 'నేను ఆడలేను' అని కూడా అనేశాను. అప్పుడు నా కుటుంబం, నా స్నేహితులు అండగా నిలిచారు. నన్ను ముందుకు నడిపించారు.

– రిచా ఘోష్, వరల్డ్ కప్ విన్నింగ్ క్రికెటర్

ఊహించొద్దు!

వివాహంతో ముడివడి ఉన్న బాధ్యతల గురించి భయపడ వద్దు. మీరు వివాహం చేసుకునే వ్యక్తి తన బాధ్యతను తనే తీసుకోవచ్చేమో కదా! మీ భాగస్వామికి నమ్మకంగా ఉండండి. వారిని గౌరవించండి. ప్రేమించండి. ఇవన్నీ ఉన్న చోట ఏదీ మీకు బాధ్యతగా అనిపించదు.

– హర్ష్ లింబాచియా, స్క్రీన్ రైటర్

జీవిత సత్యం

చదరంగంలో అదృష్టం అనేదేమీ ఉండదు. మీరు మంచి ఎత్తుగడలు వేయటం ద్వారానే మీ అదృష్టాన్ని సృష్టించుకుంటారు. చదరంగం మనకు నేర్పే ఇంకొక జీవిత సత్యం ఏమిటంటే, పరిమిత సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవటానికి మనం త్వరపడతాం.

– మాగ్నస్ కార్ల్‌సెన్, చెస్ దిగ్గజం

మళ్లీ అణ్వాయుధ పోటీ?

సందర్భం



సి. ఉదయ్ భాస్కర్

అణ్వాయుధాల పరీక్షలను తక్షణం పునరుద్ధరించవలసిందిగా రక్షణ (ఇప్పుడు 'యుద్ధ విభాగం'గా పిలుస్తున్నారు) శాఖను ఆదేశించినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అక్టోబర్ 29న ప్రకటించారు. ఇది ప్రపంచ అణు సుస్థిరత, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక నియమావళులపై అక్షరాలా బాంబు వేయడమే!

అమెరికా 1992 సెప్టెంబర్ తర్వాత, పూర్తి విస్ఫోటనాత్మక అణు పరీక్షను నిర్వహించలేదు. అయితే, 1998లో భారత్ అణు పరీక్షలను జరిపితే, ఆ వెంటనే పాకిస్తాన్ కూడా నిర్వహించింది. ఒక అణ్వాయుధాన్ని విస్ఫోటనం చెందించి చూడటం కడసారిగా 2017లో జరిగింది. భూగర్భంలో ఉత్తర కొరియా ఆ పరీక్షను నిర్వహించింది. అప్పటి నుంచి, అణు పాటవ పరీక్షలపై మారటోరియం అమలులో ఉంది. ఇప్పటివరకు అది ఉల్లంఘనకు గురి కాలేదు. ''చాలా ఏళ్ళ క్రితం మేం దాన్ని నిలుపు చేశాం. కానీ, ఇతరులు పరీక్షలు చేస్తూండటంతో, మేం కూడా చేయడం సముచితమని నాకనిపించింది'' అని ట్రంప్ అన్నారు. రష్యా పేరును ట్రంప్ ప్రస్తావించకపోయినా ఆయన దాన్ని దృష్టిలో పెట్టుకునే ఆ మాటలన్నారన్నది స్పష్టం.

రష్యా పుట్టిస్తున్న దడ

ట్రంప్ ప్రకటనకు 10 రోజుల ముందు, మాస్కో అణ్వాయుధాలను మోసుకెళ్ళగల రెండు అధునాతన ప్రయోగ వ్యవస్థలను పరీక్షించింది. బురైవెస్నిక్ (ఆకాశం నుంచి జారిపడే) క్రూజ్ క్షిపణిని... అక్టోబర్ 21న, అసాధారణ పొసైడాన్ జలగర్భ టార్పెడోను... అక్టోబర్ 28న పరీక్షించింది. అయితే, ఈ రెండూ అణ్వాయుధాలను మోసుకెళ్ళగల వాహకాలు మాత్రమే. వాటిని పరీక్షించడం అణు విస్ఫోట పరీక్షలతో సమానం కాదు. సాంకేతికంగా, అవి ప్రస్తుత ఆయుధ నియంత్రణ చట్రంలోకి రావు. ప్రయోగ వాహకాలను పరీక్షించాంగానీ, అణ్వాయుధాలను కాదని రష్యా పునరుద్ఘాటించింది.

కానీ అణ్వాయుధాలను కూడా పొదువుకుంటే, బురైవెస్నిక్, పొసైడాన్ ప్రాణాంతక ఆయుధాలుగా పరిణమిస్తాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అవి రష్యా వద్ద ఉన్నంతవరకూ దాని జోలికి వెళ్ళే సాహసం ఎవరూ చేయలేరు. రాడార్ దృష్టిలో పడకుండా బురైవెస్నిక్ 15 గంటల్లో 14,000 కిలోమీటర్ల దూరం పయనించినట్లు అక్టోబర్ 21 పరీక్షలో తేలింది. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునేందుకు అవసరమైన చోట మాత్రమే అది భూవాతావరణంలోకి ప్రవేశించగలదు. ప్రస్తుతమున్న క్షిపణి రక్షణ వ్యవస్థలు దాన్ని పసిగట్టలేవు. అదే అమెరికా ఆందోళనకు కారణం.

◆ సంయమనం, చర్చలు అవసరమైన సమయంలో అణు పాటవ పరీక్షలను అమెరికా పునరుద్ధరించడం మళ్లీ ప్రపంచ అస్థిరతకు తలుపులు తెరవడమే అవుతుంది.

ఇక పొసైడాన్... మానవ రహిత జలాంతర్గత అణ్వాయుధ వాహకం. ఇది 10,000 కిలోమీటర్ల దూరం పయనించగలదు. గరిష్ఠంగా గంటకు 100 నాట్ల (185 కిలోమీటర్ల) వేగాన్ని అందుకోగలదు. నీటిలో 1,000 మీటర్ల లోతు నుంచి సునాయాసంగా పని చేయగలదు. ఇది ఇప్పుడున్న జలాంతర్గామి నిరోధక రణతంత్ర సామర్థ్యాలకు అందనిది. అణ్వాయుధాన్ని కూడా తగిలించుకున్న పొసైడాన్‌ను యుద్ధంలో ప్రయోగిస్తే, అది భూగర్భ శిలా ఫలకాలను కదిలించే విధంగా అణుధార్మిక సునామీని రేకెత్తించగలదు. భూగోళానికి, మానవాళికి ఇది చూపించగల ప్రళయం మాటలకు అందనిది.

'ఐరన్ డోమ్'తో మారిన పరిస్థితి

ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో 1972లో అమెరికా, ఒకప్పటి సోవియట్ యూనియన్‌లు బాలిస్టిక్ నిరోధక క్షిపణుల ఒడంబడిక (ఏబీఎం)కు వచ్చాయి. పరస్పరం ఆయుధాలను ప్రయోగించుకుంటే ఇద్దరమూ నాశనం కావడం ఖాయం అనే అవగాహన (మ్యాడ్)ను అది కల్పించింది. విధ్వంసాన్ని ఆధారం చేసుకున్న మనుగడ అనే ఆ సిద్ధాంతం అసంబద్ధమైనదిగా కనిపిస్తుంది. ఏబీఎం ఆనాటి పరిస్థితులను బట్టి కుదుర్చుకున్న సంక్లిష్టమైన, సాంకేతిక–వ్యూహాత్మక ఒడంబడిక. పోగుపడుతున్న సామూహిక విధ్వంసక ఆయుధాల (డబ్ల్యు.ఎం.డి.)తో రెండు అగ్ర రాజ్యాల మధ్య అభద్రత నెలకొన్న నేపథ్యంలో కుదుర్చుకున్నది.

అయితే, 2001 సెప్టెంబర్ 11 (9/11) పరిణామాల నేపథ్యంలో, అమెరికా 2002 జూన్‌లో, ఏకపక్షంగా ఆ ఒడంబడిక నుంచి ఉపసంహరించుకుంది. వైశాల్యం కుంచించుకుపోయి, ఆత్మవిశ్వాసం సన్నగిల్లిన పరిస్థితిలోనున్న రష్యాలో అది అభద్రత బీజాలను నాటింది. పొసైడాన్ 2015లో పురుడు పోసుకోవడం పుతిన్ కన్నుల్లో కాంతి రేఖను నింపింది. కడచిన దశాబ్దంలో అది వైఫల్యాలను చూసింది. సైంటిస్టులు ప్రమాదాల్లో హతులయ్యారు. కానీ, కార్యక్రమం కొన సాగింది. అక్టోబర్ 21న విజయవంతమైంది.

ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత, చేసిన ప్రకటన బహుశా పుతిన్‌ను ఈ పరీక్షకు పురిగొల్పి ఉండవచ్చు. 'అమెరికాకు ఐరన్ డోమ్ ఏర్పాటు' శీర్షికతోనున్న కార్యనిర్వాహక ఉత్తర్వుపై 2025 జనవరి 27న ట్రంప్ సంతకం చేశారు. ఇప్పుడా డోమ్‌కు 'గోల్డెన్ డోమ్' అని పేరు పెట్టారు. అది అమెరికా ప్రధాన భూభాగానికి అంతటికీ గొడుగులా పనిచేస్తుందనీ, బహుశా 2045 నాటికి పూర్తి కాగల ఈ కార్యక్రమానికి దాదాపు 3.6 ట్రిలియన్ డాలర్లు ఖర్చవుతాయనీ అంచనా. ఇందుకు సంబంధించి ఎలాన్ మస్క్ కంపెనీ 'స్పేస్ ఎక్స్'కు మొదటి విడత చెల్లింపులు ఇప్పటికే పూర్తయ్యాయి. ఇది అమెరికా మాజీ అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ 'స్టార్ వార్స్' కార్యక్రమాన్నీ, ప్రచ్ఛన్న యుద్ధం అంతాన్నీ గుర్తుకు తెస్తోంది. ఈ కార్యక్రమాలు దీర్ఘకాలంలో అమెరికా, రష్యా రెండింటినీ దివాళా తీయిస్తాయా?

నిరాయుధీకరణే దారి

పాకిస్తాన్‌తో సహా ఇతర దేశాలు రహస్యంగా అణు పాటవ పరీక్షలు నిర్వహిస్తున్నాయని ట్రంప్ చెబుతున్నారు. అధునాతన అణ్వాయుధాలు డోమ్‌లో భాగం కావాలంటున్నారు. దానికి కొనసాగింపుగా, అమెరికా అణు పరీక్షలను పునరుద్ధరిస్తుందని అన్నారు. ''సంయమనం, చర్చలు అవసరమైన సమయంలో అణు పాటవ పరీక్షలను పునరుద్ధరించడం అస్థిరతకు ద్వారాలు తెరుస్తుంది. మూడు దశాబ్దాలుగా అణ్వాయుధ పోటీని నిరోధిస్తూ వస్తున్న అంతర్జాతీయ ఏకాభిప్రాయాన్ని బీటలు వారుస్తుంది'' అని ఆసియా–పసిఫిక్ లీడర్‌షిప్ నెట్‌వర్క్ (ఏపీఎల్ఎన్) అనే ప్రాంతీయ బృందం ఒక ప్రకటనలో హెచ్చరించింది. ఆ ప్రకటనపై సంతకం చేసిన వారిలో ఈ వ్యాసకర్త కూడా ఉన్నారు. ట్రంప్ అణు సంయమనాన్ని పాటిస్తారో, లేక పరీక్షల నిషేధ 'రెడ్ లైన్'ను ఉల్లంఘిస్తారో చూడవలసి ఉంది. అంతర్జాతీయంగా అణు సంయమనం, నిరాయుధీకరణకు ఎల్లప్పుడూ పోరాడే భారత్ తన గొంతును తప్పనిసరిగా వినిపించవలసి ఉంది.

వ్యాసకర్త 'సొసైటీ ఫర్ పాలసీ స్టడీస్' డైరెక్టర్

అమరుడా... అందెశ్రీ!

నివాళి



బి.ఎస్. రాములు

అందెశ్రీ సహజ కవి, ప్రజాకవి. కాళిదాసుది మేఘ సందేశం, అందెశ్రీది నది సందేశం. 'నది నడిచి పోతున్నది, నావనైనను రమ్మన్నది' అంటూ దేశ దేశాలను సందర్శించి ప్రపంచ నదులెన్నో చూసి పరవశించాడు. కవిత్వం కోసం ప్రపంచంలోని నదుల వెంట నడిచిన కవి ప్రపంచంలో అందెశ్రీ ఒక్కడే! అత్యంత పేదరికం నుండి ఆశు కవిగా, ప్రకృతి కవిగా పరిణతి చెందాడు.

అందెశ్రీది వాక్శుద్ధి గల కవిత్వం. ఆయన పలికింది సత్యమై కూర్చుంటుంది. అలనాటి పోతులూరి వీరబ్రహ్మం గురించి విన్నాము. పోతులూరి సమాజానికి తిరుగుబాటు నేర్పాడు. రాజులను మార్చాడో లేదో తెలియదు గానీ అందెశ్రీ ప్రభుత్వాలను మార్చుతాను అన్నాడు. 'వాడెంత' అన్నవాడిని కుర్చీ నుండి దించే దాక హృదయంలో అగ్నిగుండమై రగిలాడు. అదే 'నిప్పుల వాగు' పాటల, కవితల సంకలనం. అది ఆరేండ్ల కృషి. ఆనాడు అవమానించబడిన చాణక్యుడు నంద రాజ్యాన్ని కూల్చి మౌర్య చంద్రగుప్తునికి పట్టాభిషేకం చేసినట్లు... నేటి చాణక్యుడిగా నిలిచి, 'ఇంటర్వ్యూ నువ్వు చెయ్యాలి. నేను జవాబులు చెప్పాలి' అని భవిష్యత్ తెలిసిన అందెశ్రీ... రేవంత్‌రెడ్డిని ఇంటర్వ్యూ చేయమన్నాడు.

'ఆ చదువు రానివాడు నాలుగు నుడుగులు నేర్వగానే ఇంత పొగరా!' అని అనుకున్న వారు ఉన్నారు. అతడు అందరినీ ప్రేమించాడు. అతడికి కులం లేదు, ధనం లేదు. అందెశ్రీలో ఎంత పొగరున్నదో, ఎంత విద్వత్తున్నదో అంత వినయ సంపన్నుడు. అది ఆయన గురువుగా గౌరవించే శ్రీరాం సర్‌కు తెలుసు. నాకు తెలుసు.



అందెశ్రీ (1961-2025)

ఆయన వాక్శుద్ధిని గమనించిన సంస్కృత పండితులూ, వయోవృద్ధులూ ఆయనకు తలలు వంచి నమస్కరించారు. అందెశ్రీని ఒక్క మాటలో చెప్పాలంటే... ఆధునిక ఋషి. 1995లో 'ప్రవహించే పాట: ఆంధ్రప్రదేశ్ దళిత పాటలు' అనే పాటల పుస్తకం కోసం... అన్ని ప్రాంతాల నుండి వందలాది కవుల పాటలను సేకరిస్తున్న కాలంలో అందెశ్రీ వెలువరించిన రెండు పాటల పుస్తకాలు అందించాడు. అవి అన్నీ ప్రకృతి, పల్లె జీవితం, మానవీయత గురించిన పాటలు.

1992లో ప్రారంభించిన 'దరకమే' ఐక్యవేదికలో చేరలేదు. పాట కవుల వేదిక, అలాగే 'కథకుల వేదిక' ప్రత్యేకంగా ఉండాలని అనుకున్న ప్రకారం... గూడ అంజయ్య పాట కవుల వేదికను ప్రారంభించాడు. అందెశ్రీ దానితో కలిసి కొన్ని పాటలు రాశాడు. ఆ పాట కవుల వేదికే 'తెలంగాణ ధూం ధాం'కు బీజం వేసింది. కామారెడ్డి సభతో తన రూపం తీసుకుంది. పాట కవులు, కళాకారులు తప్ప ఎవరూ వేదికపై ఉండరాదనే నియమంతో 'తెలంగాణ ధూం ధాం' బయల్దేరింది. పాట కవుల వేదికను 'తెలంగాణ ధూం ధాం'గా మలచడంలో అందెశ్రీది కీలక పాత్ర. మారోజు వీరన్న కృషి అంతర్లీనంగా ఉండింది. ఇప్పుడు స్పష్టంగా చెప్తున్నాను 'తెలంగాణ ధూం ధాం' నిర్మాత అందెశ్రీనే అని! ఈ విషయాన్ని 'నడుస్తున్న చరిత్ర తెలంగాణ' సిరీస్ 2వ పుస్తకంలోనే ఇరవై యేళ్ళ క్రితం నమోదు చేశాను. 'రసమయి' బాలకిషన్ కళాకారుడిగా తెలంగాణ ధూం ధాంకు ఐకాన్‌గా నిలిస్తే దాని రూపురేఖలను తీర్చిదిద్ది సాహిత్యాన్ని అందించినది అందెశ్రీ. అంతడుపుల నాగరాజు కళాబంధం దాన్ని రసమయం చేసింది.

అందెశ్రీ బడిలో చదవలేకపోయాడు. లోకమే విశ్వవిద్యాలయంగా చదివినవాడు. అతడు పశువులను కాశాడు. సుతారి పని చేశాడు. నిజామాబాద్‌లో శృంగేరీ పీఠానికి చెందిన శంకర్ మహరాజ్ గురూజీ ఆయనకు జ్ఞానబోధ చేశాడు. బిరుదురాజు రామరాజు కన్నబిడ్డగా చూసుకున్నాడు. బాసర వాక్కులమ్మ స్ఫూర్తితో ఎదిగాడు. తెలంగాణ రాష్ట్ర గీతం రాసిన కవిగా నిలిచాడు.

వర్తమానంలో సాహిత్యం మీద బతికిన మహాకవి అందెశ్రీ. ఏ నిర్మాణంలో ఇమడలేనని చెప్పి స్వతంత్రుడుగా జీవించిన కవి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అతడి పాడె మోసి ముందుకు నడిచాడు. అమరుడైనాక కూడ ఆయన కోరుకున్నట్టు 'పద్మ భూషణ్', 'పద్మవిభూషణ్' తప్పక వరిస్తాయి. అమరుడా... అందెశ్రీ! నీకు జోహార్లు.

వ్యాసకర్త తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ చైర్మన్

విద్యార్థులకు ఒత్తిడి తగ్గేనా?

విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి కారణంగా అనేక మానసిక సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్, వృత్తి విద్యా కోర్సులలో ప్రవేశించడానికి కోచింగ్ తీసుకునే విద్యార్థులకు అవసరమైన మేరకు మానసిక ఆరోగ్య రక్షణ దొరకడం లేదు. కఠినమైన పరీక్షలలో ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యం భయానికి దోహదం చేస్తుంది. ఈ పరిస్థితి కొన్నిసార్లు తీవ్ర పరిణామాలకు దారి తీస్తోంది. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని కాపాడటం తల్లితండ్రుల బాధ్యత మాత్రమే కాదు, నేటి విద్యా వ్యవస్థ అనివార్యత కూడా.

విద్యా సంస్థలు విద్యార్థులకు మానసిక ఆరోగ్య సహాయ సేవలు, ఒత్తిడి నివారణ కార్యక్రమాలను అందించడం అవసరం. ఒక చరిత్రాత్మక తీర్పులో భారత సుప్రీంకోర్టు 'సుఖ్‌దేవ్ సాహా వర్సెస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం' కేసు (2025 జూలై 25)లో విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవన హక్కులో అంతర్భాగంగా ప్రకటించింది. ఈ తీర్పునకు 17 ఏళ్ళ 'నీట్' అభ్యర్థి విషాద మరణం కారణం. తీర్పును అనుసరించి భారత దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, శిక్షణ కేంద్రాలు, రెసిడెన్షియల్ అకాడమీలు, హాస్టళ్ళు సమగ్ర మానసిక ఆరోగ్య రక్షణ చర్యలను తప్పనిసరిగా అమలు చేయాలి.



సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఎస్.రవీంద్ర భట్ అధ్యక్షతన ఒక జాతీయ టాస్క్‌ఫోర్స్‌ను గౌరవనీయ సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది. విద్యార్థుల మానసిక ఆరోగ్య సమస్యలపై చర్చించటం, విద్యార్థుల ఆత్మహత్యలను తగ్గించడానికి నివారణ చర్యలను సూచించడం, దేశవ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థలలో మానసిక ఆరోగ్య సహాయ వ్యవస్థలను బలోపేతం చేయడం ఈ టాస్క్‌ఫోర్స్ ముఖ్య ఉద్దేశం. ఈ నేపథ్యంలో యూజీసీ అన్ని ఉన్నత విద్యా సంస్థల్లో మానసిక ఆరోగ్య సహాయం తప్పనిసరి చేసింది. కళాశాలలు అర్హత కలిగిన కౌన్సిలర్లను నియమించుకోవాలి. సురక్షిత మౌలిక వసతులు కల్పించాలి.

వాస్తవిక అకాడమిక్ లక్ష్యాలనే విద్యార్థులకు విధించాలి. అతిగా ఆంక్షలతో కూడిన అవాస్తవమైన లక్ష్యాలు విధించకూడదని కళాశాలలను యూజీసీ ఆదేశించింది. విద్యార్థులకు నిరంతర సహాయాన్ని అందించే స్పష్టమైన వ్యవస్థలను ఏర్పాటు చేస్తూ, భరోసా కలిగిన వాతావరణాన్ని ఏర్పర్చే దిశగా మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ మార్గదర్శకాలను అన్ని శ్రేణుల్లో ఉన్న విద్యా సంస్థల్లో బాధ్యతాయుతంగా, నిబద్ధంగా అమలు జరపాలి.

– డా॥ కత్తి సృజన
అసిస్టెంట్ ప్రొఫెసర్, పాండిచ్చేరి విశ్వవిద్యాలయం, పుదుచ్చేరి

భారత్‌లో గ్రాడ్యుయేట్లు తక్కువే!

డేటా పాయింట్

ప్రపంచ దేశాల్లో 25–64 ఏళ్ల లోపువారిలో కాలేజీ లేదా యూనివర్సిటీ డిగ్రీ ఉన్నవాళ్లు అత్యధిక శాతం కెనడాలో ఉన్నారు. 'ఓఈసీడీ' విడుదల చేసిన 'ఎడ్యుకేషన్ ఎట్ ఎ గ్లాన్స్ 2025' నివేదికలో 45 దేశాల్లో భారత్ ఈ విషయంలో అట్టడుగు నుంచి మూడో స్థానంలో ఉంది.



మనసంతా మాధవుడే!

జ్యోతిర్మయం

శిశుపాలుడు మాటలు సరిగా రాని శిశుప్రాయం నుంచి కూడా (కలభాషణాత్ ఆరభ్య) శ్రీకృష్ణుడిని దూషిస్తూనే ఉండేవాడని భాగవతం చెప్తుంది. అలాంటివాడు చివరికి శ్రీకృష్ణుడి చక్రానికి బలి కావటం ఆశ్చర్యం కాదు. కానీ చక్రం దెబ్బకు తల తెగిపోగానే, అతగాడు శ్రీకృష్ణుడిలో లీనమై పోవటం అందరికీ అబ్బురం కలిగించింది. అతడికి అంత సులభంగా భగవత్సాయుజ్యం లభించటానికి కారణమేమిటి అని అక్కడున్న యుధిష్ఠిరుడు, అక్కడే ఉన్న నారద మహర్షిని అడిగాడు.

నారదుడు చాలా విశేషాలు చెప్పాడు:'శ్రీకృష్ణుడు శిశుపాలుడిని చంపలేదు. మరణం శిశుపాలుడనే నామరూపాలు గల అశాశ్వతమైన పాంచభౌతిక దేహానికి! దేహ'ధారి'కి చావులేదు. తనను చిన్నప్పటి నుంచీ తిడుతూ వస్తున్నాడన్న కోపంతో, అందుకు ప్రతీకారంగా శిశుపాలుడిని శ్రీకృష్ణుడు చంపలేదు. ఆయన పరమాత్మ. ఎవరి కర్మ ఫలాలు వాళ్ళకు అందించే వ్యవస్థకు అధ్యక్షుడు మాత్రమే. దూషణ భూషణల వల్ల ఆయనకు కోపం, అనుగ్రహం కలగవు. ఆయనకు వైరమూ, స్నేహమూ, రాగమూ, ద్వేషమూ అన్నీ సమానమే. నిజానికి, కారణం ఏదయినా, దానివల్ల సర్వాన్నీ మరచి, వాసుదేవుడే సర్వమని ఆయనను గట్టిగా మనసులో నిలిపే వారికి ఆయన సాయుజ్యం లభిస్తుంది. **కేన అపి ఉపాయేన, మనః కృష్ణే నివేశయేత్.**

ఆయనపట్ల అత్యంతమైన కామంతో, భయంతో, ద్వేషంతో, స్నేహంతో, భక్తితో ఆయనను చేరిన వారున్నారు. భక్తి, స్నేహాల కంటే భయ ద్వేషాలే ఎక్కువ తీవ్రంగా, త్వరగా తత్పరతను కలిగిస్తాయి. శిశుపాలుడు బాల్యం నుంచి తన ద్వేషం వల్ల, ఎప్పుడూ దాదాపు కృష్ణుడి మీదే తదేక ధ్యాస ఉంచుతూ వచ్చాడు. భగవత్ ద్వేషమయమైన దుర్భర జీవితం గడిపాడు. ఆ ఒక్క పాపం పండగానే, భగవత్ సాయుజ్యం పొందాడు.' కానీ ఈ వైర మార్గం కష్టమైనది. అతి తీవ్ర ప్రకృతులు గల శిశుపాలుడూ, హిరణ్యాకశిపుడూ లాంటి శాపగ్రస్తులకు పనిచేసింది. సామాన్యులకు భగవంతుడి పట్ల భక్తి తత్పరతే క్షేమదాయకమైన సులభ మార్గం.

– ఎం. మారుతి శాస్త్రి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రాకతో ప్రయోజనాలే కాదు.. అదే స్థాయిలో నష్టమూ జరుగుతోంది. ఏఐ సాంకేతికతతో రూపొందిన లక్షలాది డీప్‌ఫేక్ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రపంచవ్యాప్తంగా చక్కర్లు కొడుతున్నాయి. వాటిలో పలు కంపెనీలను ప్రమోట్ చేస్తున్నట్లుగా సెలబ్రిటీల డీప్‌ఫేక్ వీడియోలు సైతం ఉన్నాయి. దీంతో ఏది నిజమైనదో, ఏది కాదో అంతుబట్టడంలేదు. నిజమైన వీడియోలను పోలిన ఈ మోసపూరిత కంటెంట్ ఆన్‌లైన్ స్కామ్‌గా మారడం ఆందోళన కలిగిస్తోంది.

సాక్షి, స్పెషల్ డెస్క్

స్టారా.. ఫ్రాడ్‌స్టరా...

- సామాజిక మాధ్యమాల్లో లక్షలాది వీడియోల చక్కర్లు
- అత్యధికంగా షారుఖ్, అలియా భట్, మస్క్ వీడియోలు
- వాటితో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు

మోసగాళ్ల మాయ..

సామాజిక మాధ్యమాల్లో అనేక వైరల్ వీడియోలలో పలు బ్రాండ్స్‌ను ప్రమోట్ చేస్తూ సెలబ్రిటీలు కనిపిస్తున్నారు. ఈ వీడియోలు చూడడానికి నిజమైనవిగా కనిపిస్తున్నాయి. ఏఐ టెక్నాలజీని ఉపయోగించి ఇటువంటి డీప్‌ఫేక్ వీడియోలను మోసగాళ్లు రూపొందిస్తున్నారు. అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీ కంపెనీ మ్యాకఫీ 2025 సంవత్సరానికిగాను 'మోస్ట్ డేంజరస్ సెలబ్రిటీ: డీప్‌ఫేక్ డిసెప్షన్ లిస్ట్'విడుదల చేసింది. భారత్‌లో డీప్‌ఫేక్ సెలబ్రిటీ వీడియోల్లో అత్యధికంగా షారుఖ్ ఖాన్ దర్శనమిస్తున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో సినీనటి అలియా భట్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఉన్నారు. 2025 ఆగస్టులో ఆన్‌లైన్‌లో నిర్వహించిన మ్యాకఫీ సర్వేలో ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జర్మనీ, భారత్, జపాన్, యూకే, యూఎస్‌కు చెందిన వేలాది మంది వినియోగదారులు పాలుపంచుకున్నారు.

డీప్ లెర్నింగ్ టెక్నిక్స్‌తో..

ఏఐని ఉపయోగించి ప్రత్యేకంగా డీప్ లెర్నింగ్ టెక్నిక్స్‌తో సృష్టించిన వీడియో, ఇమేజ్, ఆడియోను డీప్‌ఫేక్ అంటారు. నిజమైన వ్యక్తి ఎప్పుడూ చేయని పనిని చేస్తున్నట్లు లేదా చెబుతున్నట్లు చూపించడానికి.. వాస్తవికత ఉట్టిపడేలా కంప్యూటర్ సాయంతో, ఇప్పటికే ఉన్న వీడియోలు, ఫొటోలు, ఆడియోలను అనుకూలంగా మార్చుకుని నకిలీ కంటెంట్ తయారు చేయడమే ఈ డీప్‌ఫేక్ ప్రత్యేకత. తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడం, మోసం వంటి తప్పుడు ప్రయోజనాల కోసం డీప్‌ఫేక్‌లను ఉపయోగిస్తున్నారు. నకిలీ ఎండార్స్‌మెంట్స్, ఫాలోవర్లను పెంచుకోవడానికి బహుమతులను ఇవ్వడం వంటివి ప్రోత్సహించడానికి, ప్రజలను మోసపూరిత వెబ్‌సైట్స్, ఫిషింగ్ లింక్స్ లేదా హానికరమైన డౌన్‌లోడ్స్ వైపు మళ్లించడానికి డీప్‌ఫేక్‌లలో సెలబ్రిటీల పేర్లను సైబర్ నేరస్తులు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

సగటున రూ. 34,500 నష్టం..

సైబర్ నేరస్తులు అంతర్జాతీయ ప్రముఖుల నుంచి భారత్‌కు చెందిన ప్రసిద్ధ వ్యక్తుల వరకు వారి అనుమతి లేకుండా, వారి వీడియోలు, పేర్లను ఉపయోగించి ప్రజలను మోసగిస్తున్నారని మ్యాకఫీ వివరించింది. సర్వేలో పాల్గొన్న వారిలో 90% మంది భారతీయులు సామాజిక మాధ్యమాల్లో నకిలీ లేదా ఏఐతో రూపొందిన సెలబ్రిటీ ప్రకటనల వీడియోలకు బలయ్యారని నివేదిక వెల్లడించింది. ఫలితంగా ఒక్కో బాధితుడికి సగటున రూ. 34,500 నష్టం వాటిల్లిందని తెలిపింది. ఇన్‌ఫ్లుయెన్సర్స్, ఆన్‌లైన్ ప్రముఖులున్న డీప్‌ఫేక్ కంటెంట్‌ను 60% మంది భారతీయులు వీక్షించారు. మోసపూరిత కంటెంట్ వేగంగా వ్యాప్తి చెందుతోందనడానికి ఈ గణాంకాలు నిదర్శనమని మ్యాకఫీ తెలిపింది.

మూడు సెకన్ల ప్రసంగంతో..

సెలబ్రిటీల వీడియోలు, చిత్రాలు, స్వరాన్ని వారి అనుమతి లేకుండా ఉపయోగిస్తూ డీప్‌ఫేక్ వీడియోలతో సామాన్యులను మోసం చేస్తున్నారని నివేదిక పేర్కొంది. మూడు సెకన్ల ప్రసంగం ఉంటే చాలు.. స్కామర్లు ఇప్పుడు నమ్మశక్యం కాని విధంగా డీప్‌ఫేక్‌లను రూపొందిస్తున్నారని మ్యాకఫీ వెల్లడించింది. ఇటువంటి డీప్‌ఫేక్ కంటెంట్‌లో చర్మ సంరక్షణ వస్తువులకు సంబంధించిన వీడియోలు 42% ఉన్నాయి. బహుమతులు 41%, క్రిప్టోకరెన్సీ లేదా ట్రేడింగ్ స్కీమ్స్ వీడియోలు 40% ఉన్నాయి.

వేగంగా వ్యాప్తి..

'డీప్‌ఫేక్‌లు సైబర్ నేరస్తుల మోసపూరిత విధానాలను మార్చాయి. ఒకప్పుడు డిజిటల్ ఉపకరణం, కంప్యూటర్, నెట్‌వర్క్‌లోకి మోసపూరితంగా సైబర్ నేరగాళ్లు చొరబడి (హ్యాక్) అధీనంలోకి తీసుకునేవాళ్లు. ఇప్పుడు మానవ నమ్మకాన్ని హ్యాక్ చేస్తున్నారు. టెక్నాలజీ ఇప్పుడు మనం ఆరాధించే వ్యక్తుల స్వరాలు, ముఖాలు, ప్రవర్తనలను సులభంగా అనుకరించగలదు. సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్ కంటెంట్ దేశంలో ప్రతిరోజూ లక్షలాది మందికి దర్శనమిస్తుండటంతో ఇటువంటి నకిలీలు తక్షణమే వ్యాప్తి చెందుతాయి'అని మ్యాకఫీ నివేదిక వివరించింది. భారత్‌లోని సెలబ్రిటీ సంస్కృతి, కోట్లాదిగా ఉన్న ఆన్‌లైన్ యూజర్లు వెరసి ఈ ముప్పును మరింత పెంచుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది.

అత్యధిక డీప్‌ఫేక్ వీడియోలపరంగా భారత్‌లో టాప్–10 సెలబ్రిటీలు

1 షారుఖ్ ఖాన్

2 అలియా భట్

3 ఎలాన్ మస్క్

4 ప్రియాంక చోప్రా

5 క్రిస్టియానో రొనాల్డో

6 మిస్టర్ బీస్ట్

7 లియోనెల్ మెస్సీ

8 టేలర్ స్విఫ్ట్

9 కిమ్ కర్దాషియన్

10 బీటీఎస్ బృందం

క్లుప్తంగా...

రేపు శ్రీవారి ఫిబ్రవరి దర్శన కోటా విడుదల

తిరుమల: 2026 ఫిబ్రవరికి సంబంధించి వివిధ దర్శనాల, గదుల కోటా వివరాలను టీటీడీ ప్రకటించింది. తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల (సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ)కు సంబంధించిన ఫిబ్రవరి కోటాను ఈనెల 18 ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం నవంబర్ 20న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. 20వ తేదీ నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు సొమ్ము చెల్లించిన వారికి టికెట్లు మంజూరవుతాయి. 21న ఆర్జిత సేవా టికెట్లు, వర్చువల్ సేవలు, దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను విడుదల చేస్తుంది. 24న అంగప్రదక్షిణ టోకెన్లు, శ్రీవాణి దర్శన టికెట్ల కోటాను విడుదల చేస్తారు. ఇక వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. 25న ప్రత్యేక దర్శన టికెట్ల కోటా, అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిల్లో గదుల కోటాను కూడా విడుదల చేస్తారు. https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టీటీడీ కోరింది.

నూతన వధూవరులకు గవర్నర్ ఆశీర్వాదం

బాపట్ల: బాపట్ల టీడీపీ ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కుమారుడి వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆదివారం పాల్గొన్నారు. బాపట్ల మండలం పాండురంగాపురంలోని గోల్డెన్ సాండ్స్ ఫైవ్ స్టార్‌లో ఏర్పాటుచేసిన రిసెప్షన్‌కు ఆయన హాజరయ్యారు. నూతన వధూవరులు రాకేష్ వర్మ, రూప నాగదేవికలను ఆశీర్వదించారు. తొలుత హోటల్‌కు చేరుకున్న గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్, జాయింట్ కలెక్టర్ భావన స్వాగతం పలికారు.

సత్యదేవుని సన్నిధి కిటకిట

అన్నవరం: లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో కాకినాడ జిల్లాలోని అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయం కిటకిటలాడింది. రికార్డు స్థాయిలో ఆదివారం 1.10 లక్షల మంది భక్తులు సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. శనివారం రాత్రి నుంచే భక్తులు రత్నగిరికి చేరుకోవడం ప్రారంభించారు. అప్పటి నుంచి ఆదివారం సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. రికార్డు స్థాయిలో 10,523 సత్యదేవుని వ్రతాలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.1.10 కోట్ల ఆదాయం వచ్చింది. ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం కూడా సత్యదేవుని ఆలయాన్ని లక్ష మందికి పైగా భక్తులు దర్శించుకోగా దేవస్థానానికి రూ.1.20 కోట్ల ఆదాయం లభించింది. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో నేడు కూడా రత్నగిరికి భారీ స్థాయిలో భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

ముక్కంటిని దర్శించుకున్న జస్టిస్ సూర్యకాంత్

తిరుపతి జిల్లాలోని జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్న జస్టిస్ సూర్యకాంత్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ చైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఈవో బాపిరెడ్డి వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు జస్టిస్ సూర్యకాంత్ తిరుమల శ్రీవారిని కూడా దర్శించుకున్నారు. – శ్రీకాళహస్తి

దుర్గమ్మ సేవలో జస్టిస్ హరినాథ్

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ ఆదివారం దర్శించుకున్నారు. జస్టిస్ హరినాథ్ దంపతులకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు ఆశీర్వదించగా, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. – ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ)

శ్రీవారిని దర్శించుకున్న కంచి మఠం పీఠాధిపతి

తిరుమల: శ్రీవారిని కంచి మఠం పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, పోటు పేష్కార్ మునిరత్నం స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న కంచి మఠం పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి

దళితుల భూములపై 'పచ్చ' గద్దలు

▶ మొదటి పేజీ తరువాయి

ముహూర్తం ఖరారు చేశారు. ఈ భూ దందాపై అధికార పార్టీలోని మరోవర్గం గుర్రుమంటోంది. టీడీపీ అధినేత, ఆయన తనయుడి దృష్టికి ఈ కబ్జా వ్యవహారం చేరవేసేందుకు సన్నద్ధమవుతోంది.

పకడ్బందీ ప్రణాళిక

శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయ సమీపంలోని ఎంఎంవాడలో దళితులకు చెందిన 3 ఎకరాల భూమి ధర ప్రస్తుతం రూ.154 కోట్ల వరకు పలుకుతోంది. దీనిపై ఇటీవల టీడీపీ నేతల కన్ను పడింది. ప్రధానంగా ఇద్దరు బడా నేతలు ఈ భూమిని అప్పనంగా దోచుకునేందుకు రంగం సిద్ధం చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని.. దళితుల భూములను లాక్కొనేందుకు పకడ్బందీ ప్రణాళిక వేశారు. కొన్నాళ్లు వివాదంలో ఉన్న ఈ భూమి చివరకు దళితులకు దక్కింది. దీంతో ఆ భూమిని దిగమింగేందుకు పచ్చ బడా నేతలు కుట్రలు మొదలు పెట్టారు.

పెత్తందారుడి చేతిలో చితికి..

ఒకప్పుడు ఎంఎం వాడలో దళితులకు 7.5 ఎకరాల వరకు భూమి ఉండేది. 1965లో ఆ భూమిని ఓ పెత్తందారుడు మోసం చేసి కాజేశాడు. సంతకాలు తీసుకుని లాగేసుకున్నాడు. క్రమం క్రమంగా ఆ భూములను విక్రయించుకుంటూ వచ్చాడు. తీరా ఆ భూమికి సంబంధించిన దళిత కుటుంబీకులు కోర్టును ఆశ్రయించారు. ఆపై కోర్టు నుంచి వారికి క్లియరెన్స్ వచ్చింది. అందులో 3 ఎకరాలు దళితులకు దక్కింది. దళితులకు కోర్టు తీర్పు ప్రకారం వచ్చిన మూడు ఎకరాల విలువ సుమారు రూ.154 కోట్లని తెలిసి పచ్చగద్దలు వాలిపోయాయి. అందులో ఇద్దరు బడా నేతలు చేతులు కలిపి ఎలాగైనా ఆ భూమిని ఆక్రమించేందుకు కంకణం కట్టుకున్నారు. ఇది తెలిసి అడ్డొచ్చిన దళితులపై దౌర్జన్యాలకు పాల్పడ్డారు. బెదిరింపులకు గురిచేశారు.

అధికార బలంతో..

అధికారబలంతో దళితుల స్థానంలో కొందరు నకిలీలను తీసుకొచ్చారు. వారిని అడ్డుగా పెట్టుకుని ఆ భూమిని కొట్టేసేందుకు సన్నద్ధమయ్యారు. ముందుగా రెవెన్యూ సిబ్బందిని తమ అధికార బలంతో వశపరుచుకున్నారు. రికార్డులను తారుమారు చేశారు. ఆపై భూమిని జేసీబీలతో చదును చేసి సబ్ డివిజన్లు చేయించారు. సర్వే రాళ్లు కూడా పాతేశారు. నేడు (సోమవారం) రిజిస్ట్రేషన్ చేసేందుకు ముహూర్తం పెట్టుకున్నట్లు తెలిసింది.

మరోవర్గం మండిపాటు

భూ దందాపై టీడీపీలోని మరో వర్గం మండిపడుతోంది. ఆ ఇద్దరు నేతలు చేస్తున్న దందాను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లేందుకు యత్నిస్తోంది. సోమవారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైతే ఈ విషయాన్ని వెంటనే అధినేతకు చేరవేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో బాధితులకు అండగా నిలబడి, ఖచ్చితంగా న్యాయం చేస్తామని మరో వర్గంవారు హామీ ఇచ్చినట్లు కొందరు దళితులు చెబుతున్నారు. అలాగే మీడియా ద్వారా మొత్తం వ్యవహారాన్ని బహిర్గతం చేయాలని పావులు కదుపుతున్నట్లు తెలిసింది.

కాసులు కుమ్మరించి..

ఈ దందాలో కొందరు రెవెన్యూ అధికారులు, నకిలీ వ్యక్తులకు సదరు బడా నేతలు కాసులు కుమ్మరించారు. పలు ఆఫర్లతోపాటు గిఫ్టులు కూడా అందించారు. దాదాపు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ముట్టినట్లు సమాచారం. అయితే ఈ దందాపై మళ్లీ కొందరు దళితులు కోర్టును ఆశ్రయించేందుకు అడుగులు వేస్తున్నారు. మానవహక్కుల కమిషన్ కూడా ఫిర్యాదు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది.

సతీష్‌కుమార్ మరణంపై రెండోసారి సీన్ రీకన్‌స్ట్రక్షన్

తాడిపత్రి టౌన్: టీటీడీ మాజీ ఏవీఎస్‌వో, గుంతకల్లు రైల్వే ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్ మృతి ఘటనపై ఆదివారం అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం కోమలి సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద ఏఎస్పీ రోహిత్ కుమార్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగించారు. ఇందులో భాగంగా గుత్తి నుంచి తాడిపత్రి వైపు వస్తున్న రైల్లోంచి మనిషి బొమ్మలను బయటకు వేస్తూ సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. ఇందులో భాగంగా మూడు మనిషి బొమ్మలను రైల్లో కూర్చుని పడినట్టు, నిల్చొని పడినట్టు, వెనుక నుంచి తోస్తే పడినట్టు సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. బొమ్మలు నేలపై ఎంత దూరంలో పడ్డాయి వంటి కొలతలు తీశారు. డ్రోన్ కెమెరాలతో వీడియోలు రికార్డ్ చేశారు. ఇదే ఘటనపై శనివారం ఒకసారి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసిన విషయం విదితమే.

రైల్లో నుంచి మనిషి బొమ్మను విసిరేస్తూ సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తున్న దృశ్యం

ఐఎన్ఐ సెట్‌లో పల్నాడు అమ్మాయి సత్తా

ఆలిండియా 7వ ర్యాంకు పొందిన డాక్టర్ శ్రీసాయి త్రిషారెడ్డి

సాక్షి, నరసరావుపేట: పీజీ మెడికల్ కోర్సులకు ఎంతో ప్రతిష్టాత్మకమైన ఐఎన్ఐ సెట్–2025లో పల్నాడు జిల్లాకు చెందిన డాక్టర్ బారెడ్డి శ్రీసాయి త్రిషారెడ్డి ఆలిండియా 7వ ర్యాంకు సాధించింది. ఎంతో పోటీ ఉండే ఈ ఐఎన్ఐ సెట్‌లో (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్–కంబైన్డ్ ఎంట్రన్స్ టెస్ట్) తొలి ప్రయత్నంలోనే త్రిషారెడ్డి ఆలిండియాలో 7వ ర్యాంకుతోపాటు దక్షిణాదిలో మొదటి ర్యాంకు పొందింది. తమ కుమార్తె సాధించిన ఈ ఘనతపై ఆమె తల్లిదండ్రులు బారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, అనంత లక్ష్మిలు ఎంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. వీరి స్వస్థలం గురజాల మండలం తేలుకుట్ల కాగా వ్యాపారరీత్యా ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారు. త్రిషా ఐదేళ్ల క్రితం నీట్ యూజీ ఎంట్రన్స్‌లో ఆలిండియా 14వ ర్యాంకు సాధించి ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేసింది. ఇక ఎయిమ్స్ న్యూఢిల్లీ నిర్వహించిన జనవరి సెషన్ ఐఎన్ఐ సెట్‌లో దేశంలోని వివిధ ఎయిమ్స్‌లతోపాటు కొన్ని ప్రతిష్టాత్మక సంస్థలలో మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రవేశాల కోసం ఈనెల 9న పరీక్షలు జరిగాయి. ఈ ఫలితాలను శనివారం రాత్రి ఎయిమ్స్ అధికార వర్గాలు విడుదల చేశాయి. చిన్న వయస్సులోనే అత్యంత ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ఫలితాలను సాధించిన సాయి త్రిషారెడ్డికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

ఎక్కడున్నావమ్మా!?

- గుడి నుంచి తిరిగొస్తూ నాలుగు రోజులైనా ఇంటికి రాని తల్లి
- గుండె సంబంధిత వ్యాధితో ఇటీవలే తండ్రి మృతి
- ఫిర్యాదు చేసినా విచారించడం లేదంటున్న బంధువులు
- గుంటూరు జిల్లా తాడేపల్లిలో అమ్మ కోసం చిన్నారుల రోదన

భాగ్యలక్ష్మి (ఫైల్), తల్లి కోసం ఎదురుచూస్తున్న చిన్నారులు

తాడేపల్లి రూరల్ : గుండె సంబంధిత వ్యాధితో తండ్రి ఇటీవలే మృతిచెందాడు.. మరోవైపు నిద్ర కోసం ఆలయానికి వెళ్లిన తల్లి తిరిగొస్తూ ఇంటికి చేరలేదు.. దీంతో చిన్నారులు అనాథలుగా మిగిలారు. తల్లి కోసం రోదిస్తున్న చిన్నారులను ఆపడం ఎవరి తరం కావడంలేదు. చిన్నారుల తల్లి కనిపించడంలేదంటూ బంధువులు మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా స్పందనలేదు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలివీ.. ప్రకాశం జిల్లా నుంచి వలస వచ్చి తాడేపల్లి కేఎల్‌రావు కాలనీలో నివాసముంటున్న గంజిగుంట్ల శ్రీను (34)కి ప్రకాశం జిల్లా అట్లవారిపల్లికి చెందిన భాగ్యలక్ష్మితో 2016లో వివాహమైంది. అప్పటి నుంచి వారు కేఎల్ రావు కాలనీలో ఉంటున్నారు. వీరికి కుమారుడు (8), కుమార్తె (6) ఉన్నారు. గతనెల 19న శ్రీను గుండె సంబంధిత వ్యాధితో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో.. శివాలయంలో నిద్ర చేసేందుకు మొన్న బుధవారం భాగ్యలక్ష్మి, శ్రీను తల్లి అంకమ్మ పెదకాకాని శివాలయానికి వెళ్లారు. నిద్ర అనంతరం గురువారం ఉదయం అత్తాకోడళ్లు ఇద్దరూ కలసి మంగళగిరి వరకు వచ్చారు. అత్త, కోడలు ఇద్దరూ కలిసి ఒకేసారి ఇంటికి వెళ్లకూడదన్న సెంటిమెంట్‌తో ముందుగా అంకమ్మ ఇంటికి వచ్చింది. కోడలు ఎంతసేపటికీ రాకపోవడంతో ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో బంధువులు మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే, పోలీసులు ఎలాంటి విచారణ చేయకుండా వదిలివేశారని వారు ఆరోపిస్తున్నారు. నాలుగు రోజులవుతున్నా భాగ్యలక్ష్మి ఆచూకీ లభించకపోవడంతో ఆ చిన్నారులతో పాటు కుటుంబ సభ్యులూ ఆందోళన చెందుతున్నారు.

హిందూపురంలో పోలీసుల ఓవరాక్షన్

ధ్వంసమైన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని పరిశీలించేందుకు వెళ్తున్న నేతల్ని అడ్డుకున్న పోలీసులు

సాక్షి, పుట్టపర్తి/కదిరి: హిందూపురంలో మరోసారి టెన్షన్ వాతావరణం నెలకొంది. శనివారం హిందూపురంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై టీడీపీ గూండాలు దాడికి తెగబడిన నేపథ్యంలో ఘటనా స్థలాన్ని పరిశీలించేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన నాయకులు ఆదివారం హిందూపురం బయలుదేరారు. అయితే, వారందరినీ పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుని నిర్బంధంలో ఉంచారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ సతీష్‌రెడ్డిని కదిరిలో అడ్డుకుని హిందూపురం వెళ్లకుండా ఆంక్షలు విధించారు. పెనుకొండ నుంచి హిందూపురం బయలుదేరిన మాజీ మంత్రి, పార్టీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌ను హిందూపురం రానివ్వలేదు. పెనుకొండలోనే అడ్డుకోవడంతో ఆమె అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. హిందూపురం చేరుకున్న పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తదితరులను స్థానిక ఇందిరమ్మ కాలనీ వద్ద అడ్డుకున్నారు. తమ పార్టీ కార్యాలయాన్ని సందర్శించేందుకు ఎందుకు అనుమతించరంటూ పార్టీ నేతలు పోలీసులపై తిరగబడ్డారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో వారిని అక్కడి నుంచి పెనుకొండకు తరలించారు. మరోవైపు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను అనంతపురంలోనే హౌస్ అరెస్టు చేశారు. పుట్టపర్తి నుంచి వెళ్లకూడదని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి నోటీసులు ఇచ్చారు. ధర్మవరం నుంచి హిందూపురం వెళ్లరాదని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ఇంటి వద్దనే అడ్డుకున్న పోలీసులు ఆంక్షలు విధించారు. కదిరి నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్‌ను లేపాక్షి మండలం చోళసముద్రం టోల్‌ప్లాజా వద్ద అడ్డుకుని.. బలవంతంగా లేపాక్షి పోలీసు స్టేషన్‌కు తరలించారు. వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ నేత వేణురెడ్డిని పట్టణంలో గృహ నిర్బంధం చేశారు. ర్యాలీలు, నిరసనలు చేయకూడదని షరతులు విధించారు. ఆయన పోలీసుల తీరుపై మండిపడటంతో చివరకు బయటకు వదిలారు.

ధ్వంసం చేసిన ఫర్నిచర్‌ను పరిశీలిస్తున్న పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు రమేష్‌రెడ్డి

అక్రమంగా ఎస్సీ, ఎస్టీ కేసులు

వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక భర్త, పార్టీ నేత వేణురెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద పోలీసులు అక్రమ కేసు నమోదు చేశారు. రామప్ప అనే ఎస్సీ కులానికి చెందిన వ్యక్తితో హిందూపురం వన్ టౌన్ స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదు చేయించి కేసు నమోదు చేయించారు. ఆయనతో పాటుగా పార్టీ బూత్ కమిటీల జిల్లా అధ్యక్షుడు వాల్మీకి లోకేష్, దివాకర్, వసీమ్, నవీన్, మనోజ్, ఇర్ఫాన్‌లపైనా కేసులు నమోదయ్యాయి.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజలను పక్కదోవ పట్టించేందుకే టీడీపీ గూండాలు హిందూపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై దాడికి తెగబడ్డారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ సతీష్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆయనను పోలీసులు కదిరిలో అడ్డుకుని పార్టీ నేత పూల శ్రీనివాసరెడ్డి గృహానికి తీసుకెళ్లి హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సతీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని రాజ్యాంగేతర శక్తులు పాలిస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన తెలిపే హక్కు ప్రజలకు ఉందని.. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం కారణంగా ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని ధ్వజమెత్తారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రోద్బలంతోనే ఆయన పీఏల ఆదేశాల మేరకు టీడీపీ గూండాలు వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ధ్వంసం చేశారని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంటరీ పరిశీలకుడు రమేష్‌రెడ్డి అన్నారు. హిందూపురం సమన్వయకర్త టీఎన్ దీపిక, మడకశిర సమన్వయకర్త ఈర లక్కప్ప, మాజీ ఎంపీ తలారి రంగయ్యతో కలిసి ఆదివారం హిందూపురంలో టీడీపీ గూండాల దాడిలో ధ్వంసమైన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని పరిశీలించారు.

మూడు బుల్లెట్ల మిస్టరీ!

ఎర్రకోట వద్ద పేలుడు ప్రదేశంలో స్వాధీనం

- ఒకటి కార్ట్రిడ్జ్.. మరో రెండు లైవ్ బుల్లెట్లు
- లభ్యం కాని తుపాకీ
- ఎలా వచ్చాయన్న దానిపై దర్యాప్తు

ఘటనాస్థలంలో దొరికిన బుల్లెట్

న్యూఢిల్లీ: ఢిల్లీ కారు బాంబు పేలుడు కేసులో అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఎర్రకోట వద్ద ఘటనా స్థలానికి సమీపంలోనే మూడు తుపాకీ తూటాలను స్వాధీనం చేసుకున్నారు. అవి ఎక్కడి నుంచి వచ్చాయన్నదానిపై దర్యాప్తు మొదలైంది. ఇందులో ఒకటి తూటా తొడుగు(కార్ట్రిడ్జ్) కాగా, మరో రెండు లైవ్ బుల్లెట్లు అని అధికారులు చెప్పారు. ఇవి 9ఎంఎం తూటాలు. సైనిక దళాలు లేదా స్పెషలైజ్డ్ యూనిట్లు లేదా ప్రత్యేక అనుమతి కలిగిన వ్యక్తులు మాత్రమే వీటిని ఉపయోగించేందుకు జారీ చేస్తుంటారు. ఈ నెల 10వ తేదీన ఎర్రకోట వద్ద కారు బాంబు పేలుడు తర్వాత పెద్ద ఎత్తున భద్రతా బలగాలను మోహరించారు. ఈ తూటాలు భద్రతా సిబ్బందికి సంబంధించినవేనా? అని తనిఖీ చేయగా, అలాంటిదేమీ లేదని తేలింది. బాంబు పేలుడుకు ఉపయోగించిన ఐ20 కారు పక్కనే ఈ తూటాలు లభించాయి. కానీ, అక్కడ తుపాకీ కనిపించలేదు. మొత్తానికి బుల్లెట్ల మిస్టరీని ఛేదించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

విదేశాల నుంచి రూ.20 లక్షలు!

పేలుడు ఎలా జరిగిందో గుర్తించడానికి సీన్ రీకన్స్ట్రక్షన్‌కు సిద్ధమవుతున్నారు. నిందితుడు ఉమర్ నబీ హరియాణాలోని ఫరీదాబాద్ నుంచి బయలుదేరాడు. నూహ్ పట్టణంలో తలదాచుకున్నాడు. తర్వాత ఢిల్లీకి చేరుకొని ఒక చోట టీ తాగాడు. ఎర్రకోట వద్ద కారు బాంబు పేలుడుకు పాల్పడి, తాను కూడా మరణించాడు. ఈ మొత్తం మార్గంలో సీన్ రీకన్స్ట్రక్షన్ చేయబోతున్నారు. అతడు ఎవరెవరిని కలిశాడు? అతడిని ఎవరు అనుసరించారు? ఎవరు సహకరించారు? అనేది గుర్తించబోతున్నారు. ఈ కేసులో కొత్త కోణాలు బయటకు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. నిందితులైన ముజమ్మిల్, షహీన్‌లు హవాలా మార్గంలో డబ్బులు స్వీకరించినట్లు తెలుస్తోంది. విదేశాల్లో ఉన్న హ్యాండర్ల నుంచి వారికి రూ.20 లక్షలు అందినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఆ సొమ్ముతో మొత్తం ముగ్గురు నిందితులు పేలుడు పదార్థాలు సమకూర్చుకున్నట్లు అంచనా వేస్తున్నారు. బాంబును తయారు చేయడానికి ట్రైఅసిటోన్ ట్రైపెరాక్సైడ్(టీఏటీపీ) ఉపయోగించినట్లు నిపుణులు అనుమానిస్తున్నారు. అది చాలా అస్థిరమైనది, సున్నితమైనది. కాస్త వేడి తగిలినా, రాపిడికి గురైనా వెంటనే పేలిపోతుంది. మరోవైపు అల్-ఫలా యూనివర్సిటీలో ఆధారాల కోసం అన్వేషణ కొనసాగుతూనే ఉంది. అరెస్టయిన డాక్టర్లతో సంబంధాలున్నవారిని ప్రశ్నిస్తున్నారు. ఉమర్, ముజమ్మిల్, షహీన్‌తో సన్నిహిత సంబంధాలున్న పలువురు వ్యక్తులు యూనివర్సిటీ క్యాంపస్ నుంచి హఠాత్తుగా కనిపించకుండాపోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.

మరో నిందితుడు అమీర్ రషీద్ అలీ అరెస్టు

ఢిల్లీలో పేలుడు సూసైడ్ బాంబర్ ఉమర్ నబీతో కలిసి కుట్ర పన్నినట్లు అనుమానిస్తున్న అమీర్ రషీద్ అలీని ఎన్ఐఆర్ అధికారులు ఢిల్లీలో అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో ఇదొక కీలక మలుపు అని చెబుతున్నారు. అమీర్ రషీద్ అలీ స్వస్థలం కశ్మీర్. అతడిపైన ఇప్పటికే కేసు నమోదయ్యింది. పేలుడుకు ఉపయోగించిన ఐ20 కారును కొనుగోలు చేయడానికి అతడు సహకరించినట్లు సమాచారం. ఆ కారు అమీర్ రషీద్ అలీ పేరిటే రిజిస్టర్ అయ్యింది. అతడిని ప్రశ్నిస్తే మరింత కీలక సమాచారం బయటకు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. మరోవైపు ఐ20 కారులో పేలుడు పదార్థాలు అమర్చి ఎర్రకోట వద్ద పేల్చేసినట్లు ఎన్ఐఏ సిబ్బంది అధికారికంగా ధ్రువీకరించారు.

హరియాణా మహిళా డాక్టర్ విచారణ

ఢిల్లీ పేలుడు కేసులో హరియాణాలోని రోహతక్‌కు చెందిన మహిళా డాక్టర్ ప్రియాంక శర్మను పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. ముష్కరులతో సంబంధాల గురించి ఆరా తీశారు. ఆమె ప్రస్తుతం దక్షిణ జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో పనిచేస్తున్నారు. ప్రశ్నించిన అనంతరం ప్రియాంక శర్మను విడిచిపెట్టారు. ఆమె ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫోరెన్సిక్ పరీక్ష కోసం పంపించబోతున్నారు. డాక్టర్ అదీల్ అరెస్టు తర్వాత ప్రియాంక శర్మ పేరు తెరపైకి వచ్చింది. అదీల్ కాల్ రికార్డుల్లో ఆమె ప్రస్తావన కూడా ఉంది.

జమ్మూకశ్మీర్‌లో కొత్త నియామకాలు

ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్‌లో కొత్త నియామకాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు అధికారులు గుర్తించారు. గతం ఎలాంటి నేర చరిత్ర గానీ, వేర్పాటువాదులతో సంబంధాలు గానీ లేని యువకులను చేర్చుకుంటున్నారని చెప్పారు. ఇప్పటిదాకా అనుసరించిన వ్యూహానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. భద్రతా దళాల నిఘాకు చిక్కకుండా ఈ ఎత్తుగడ వేశారని వెల్లడించారు. వైట్‌కాలర్ టెర్రర్ నెట్‌వర్క్ కొత్త వ్యూహం అనుసరిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఢిల్లీ పేలుడు కేసులో నిందితులైన డాక్టర్ అదీల్ రాథర్, డాక్టర్ ముజఫర్ రాథర్, డాక్టర్ ముజమ్మిల్‌కు గతంలో నేర చరిత్ర లేదు. దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో వారు పాల్గొనలేదు. అలాంటివారినే ఉగ్రవాదులు ఎంపిక చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

సూసైడ్ బాంబర్ కోసం ఏడాదిగా గాలింపు!

ఢిల్లీలో పేలుడుకు కుట్ర చాలా కాలంనుంచే సాగింది. తమకు అవసరమైన సూసైడ్ బాంబర్ కోసం ముష్కరులు ఏడాది కాలంపాటు అన్వేషించారు. చివరకు వారికి డాక్టర్ ఉమర్ నబీ దొరికాడు. వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ ఆదేశాలను పాటించాడు. ఢిల్లీలో కారు బాంబు పేల్చేశాడు. దర్యాప్తులో అధికారులు ఈ విషయాలను గుర్తించారు.

డర్టీ కిడ్నీ అంటూ దూషించారు.. చెప్పుతో కొట్టబోయారు

- పుట్టింటిపై రోహిణీ ఆచార్య మళ్లీ తీవ్ర ఆరోపణలు
- లాలూ ఇంటి నుంచి వెళ్లిపోయిన మరో ముగ్గురు కుమార్తెలు

పట్నా: రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ)చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబంలో కలహాలు మరింతగా రచ్చకెక్కాయి. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం ఎదురైన నేపథ్యంలో లాలూ కుమార్తె రోహిణీ ఆచార్య శనివారం పుట్టింటితో తెగదెంపులు చేసుకుంటున్నట్లు, రాజకీయాల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించడం తెల్సిందే. మహాగఠ్ బంధన్ సీఎం అభ్యర్థి కూడా అయిన తేజస్వీ యాదవ్ సన్నిహితులు సంజయ్ యాదవ్, రమీజ్‌లే తన నిర్ణయానికి కారణమని ఆమె ఆరోపించారు.

రోహిణీ ఆచార్య

ఆదివారం ఆమె మరోసారి సామాజిక మాధ్యమ వేదికగా తనకు ఎదురైన చేదు అనుభవాలను ఏకరువు పెట్టారు. పుట్టింట్లో తనను నానాదుర్భాషలాడారని, ఇంట్లోంచి బయటకు నెట్టివేయడంతోపాటు చెప్పుతో కొట్టేందుకు ప్రయత్నించారని రోహిణీ ఆచార్య సంచలన ఆరోపణలు చేశారు. 'నిన్న ఒక సోదరి, ఒక వివాహిత, ఒక తల్లికి అవమానం జరిగింది. నానా దుర్భాషలాడారు. మురికిదాన్నంటూ తిట్టారు. చెప్పుతో కొట్టేందుకు ప్రయత్నించారు. ఆత్మగౌరవం విష యంలో రాజీప డబోను'అని ఆమె తెలిపారు. గత్యంతరం లేని పరిస్థితుల్లోనే తల్లిదండ్రులను, తోబుట్టువులను వదిలేసి బయటకు వచ్చేశా. పుట్టింటి నుంచి నన్ను వాళ్లు దూరం చేశారు. నన్ను అనాథను చేశారు'అంటూ ఆమె ఉద్విగ్నంతో పోస్ట్ చేశారు. 'నాన్న లాలూకు కిడ్నీ ఇవ్వాలని చెప్పారు. ఇచ్చాను. అయితే, బదులుగా నేను కోట్లాది రూపాయలు డబ్బులతోపాటు, లోక్‌సభ టికెట్ తీసుకున్నట్లు ప్రచారం చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తన లాంటి కుమార్తె, సోదరి మరెవరికీ ఉండరని, తాను నడిచిన బాటలో మరెవరూ నడవలేరని రోహిణి పేర్కొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ..'నాకు కుటుంబమంటూ లేదు. తేజస్వీ యాదవ్, సంజయ్ యాదవ్, రమీజ్‌ల గురించి మీరడగొచ్చు. వాళ్లే నన్ను నా కుటుంబం నుంచి వేరు చేశారు. వాళ్లు బాధ్యతలు స్వీకరించేందుకు ఇష్టపడటం లేదు. బిహార్‌లోఅంత ఘోరమైన ఫలితాలు రావడానికి కారణమెవరని దేశ ప్రజలే అడుగుతున్నారు. అందుకు కారణం సంజయ్ యాదవ్, రమీజ్ అంటూ పేర్లు వెల్లడించడంతో వాళ్లు నన్ను అవమానించారు, దూషించారు. పుట్టింటి నుంచి వెళ్లగొట్టారు'అని ఆమె ఆరోపించారు.

లాలూ, రబ్డీ దేవీలతో కుమార్తెలు రాజ్యలక్ష్మి, రాగిణి, చందా

ఆమె బాటలో మరో ముగ్గురు

రోహిణీ ఆచార్య సంచలన ప్రకటన, నిర్ణయం నేపథ్యంలో ఆదివారం లాలూ కుటుంబంలో విభేదాలు మరింతగా ముదిరినట్లు సమాచారం. లాలు కుమార్తెలు రాజ్యలక్ష్మి, రాగిణి, చందా అనే వారు కూడా పట్నాలోని నివాసాన్ని వీడి తమ పిల్లలతో కలిసి ఢిల్లీకి వెళ్లిపోయారు. రెండు రోజులుగా కుటుంబంలో జరుగుతున్న పరిణామాలతో వారు కలత చెందినట్లు చెబుతున్నారు. కాగా, ఈ పరిణామాలపై లాలూ కుటుంబం స్పందించలేదు. ఈ వివాదమంతా తేజస్వీయాదవ్ కేంద్రంగానే ఉన్నట్లు చెబుతున్నారు. అయితే, ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి ఆయన బహిరంగంగా కనిపించడం లేదు. దీంతో, లాలూ దంపతులతోపాటు ఆ ఇంట్లో మిసా భారతి మాత్రమే ఉన్నట్లు సమాచారం.

నా గుండె బద్దలైంది: తేజ్ ప్రతాప్

రోహిణీ ఆచార్య ఆరోపణల నేపథ్యంలో మరో నాటకీయ పరిణామం చోటు చేసుకుంది. పార్టీతోపాటు కుటుంబం నుంచి బహిష్కరణకు గురైన రోహిణి సోదరుడు తేజ్ ప్రతాప్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. తన సొంత పార్టీ జనశక్తి జనతాదళ్ సోషల్ మీడియా అకౌంట్‌లో ఆయన..'నా గుండె ముక్కలైంది. నాపై ఎన్ని దాడులు జరిగినా ఓర్చుకున్నా. కానీ, నా సోదరికి జరిగిన అవమానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. సోదరి రోహిణికి జరిగిన అన్యాయానికి తగు రీతిలో బదులు తీర్చుకుంటానన్నారు. 'నాన్నా, మీరు సరేనని ఒక్క మాట అంటే చాలు.. బిహార్ ప్రజలు ఈ కుట్ర దారులను పాతిపెడతారు. ఇది ఒక కుమార్తె మర్యాదకు, బిహార్ ప్రజల ఆత్మ గౌరవానికి సంబంధించిన విషయం'అని తేజ్ ప్రతాప్ వ్యాఖ్యానించారు. లాలూ, రబ్డీ దేవి దంపతులకు ఏడుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాష్ట్రంలోని రాజకీయ ప్రముఖుల్లో అతిపెద్ద కుటుంబం లాలూదే.

ఆదివారం సూరత్‌లో బుల్లెట్ రైలు నిర్మాణ ఇంజనీర్లతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

మీ అనుభవాలు నమోదు చేయండి

బుల్లెట్ రైలు ఇంజనీర్లకు ప్రధాని మోదీ సూచన

న్యూఢిల్లీ: ముంబై–అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టుపై పని చేస్తున్న ఇంజనీర్లతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. ఈ పనిలో ఎదురవుతున్న అనుభవాలను నమోదు చేయాలని సూచించారు. తద్వారా భవిష్యత్తులో చేపట్టే ఇలాంటి ప్రాజెక్టులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఇంజనీర్ల అనుభవాలు ముమ్మందు ప్రాజెక్టుల ప్రణాళిక, అమలుకు ఎంతగానో తోడ్పడుతాయని చెప్పారు. ప్రధాని మోదీ శనివారం సొంత రాష్ట్రం గుజరాత్‌లో పర్యటించారు. సూరత్‌లో ముంబై–అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్వే(ఎంఏహెచ్ఎస్ఆర్) ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీర్లతో మాట్లాడారు. 'బ్లూ బుక్' తరహాలో అనుభవాలను రికార్డు చేయాలని చెప్పారు. రాబోయే రోజుల్లో మరిన్ని బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు సాకారం కావాలంటే ముంబై–అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు ప్రాజెక్టుపై పనిచేస్తున్న ఇంజనీర్ల సహకారం అవసరమని ఉద్ఘాటించారు.

మంత్రి పదవులకు 'ఫార్ములా'

- ప్రతి ఆరుగురు ఎమ్మెల్యేలకు చొప్పున ఒక మంత్రి పదవి
- బిహార్‌లో ఎన్డీయే పక్షాల మధ్య అంగీకారం
- బీజేపీకి 14 మంత్రి పదవులు దక్కే అవకాశం
- ఈ నెల 19 లేదా 20న నూతన సీఎం ప్రమాణ స్వీకారం

పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం సొంతం చేసుకున్న జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్డీయే) మరోసారి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతోంది. నూతన మంత్రివర్గం కూర్పుపై బీజేపీ, జేడీ(యూ)తోపాటు కూటమి పక్షాల మధ్య తొలి దశ చర్చలు ఇప్పటికే ముగిశాయి. మంత్రి పదవుల పంపకంపై ఒక అవగాహనకు వచ్చినట్లు సమాచారం. ఈ మేరకు ఒక ఫార్ములాపై అంగీకారం కుదిరినట్లు తెలుస్తోంది. ప్రతి ఆరుగురు ఎమ్మెల్యేలకు ఒక మంత్రి పదవి చొప్పున తీసుకోవడమే ఈ ఫార్ములా సారాంశం. ఈ లెక్కన ఎన్నికల్లో బీజేపీ 89 సీట్లు సాధించింది కాబట్టి ఫార్ములా ప్రకారం ఆ పార్టీకి 14 మంత్రి పదవులు లభిస్తాయి. జనతాదళ్(యునైటెడ్)కు సైతం ఇదే సూత్రానికి అనుగుణంగా మంత్రి పదవులు కేటాయిస్తారు. ఎలాంటి గందరగోళానికి, వివాదానికి తావు లేకుండా మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయాలని ఎన్డీయే పక్షాలు నిర్ణయానికి వచ్చాయి. ఎవరెవరికి ఏయే శాఖలు కేటాయించాలన్న దానిపై మరోసారి చర్చించబోతున్నారు

ఢిల్లీలో నేడు కీలక సమావేశం

జేడీ(యూ) జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సంజయ్‌కుమార్ ఝా ఢిల్లీలో బీజేపీ పెద్దలతో చర్చలు పూర్తి చేసుకొని ఆదివారం పట్నాకు తిరిగివచ్చారు. ఆయన సోమవారం ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను కలుసుకోబోతున్నారు. జేడీ (యూ) శాసనసభాపక్ష సమావేశం ఏర్పాటుపై చర్చిస్తారు. సోమవారమే ఈ సమావేశం జరుగనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అసెంబ్లీలో ఎన్డీయే పక్ష నాయకుడిని ఎన్నుకొనే ప్రక్రియను ఈ నెల 18వ తేదీలోగా పూర్తిగా చేయాలని నిర్ణయానికొచ్చారు. ఎన్డీయేలోని చిన్న పార్టీలు కూడా మంత్రి పదవులు ఆశిస్తున్నాయి. హిందుస్తానీ అవామీ మోర్చా నాయకుడు జితన్‌రామ్ మాంఝీ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతోపాటు బీజేపీ పెద్దలతో సమావేశం కాబోతున్నారు. రాష్ట్రీయ లోక్‌మోర్చా అధ్యక్షుడు ఉపేంద్ర కుశ్వాహా ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నారు. లోక్‌జనశక్తి పార్టీ(రామ్‌విలాస్) అధినేత చిరాగ్ పాశ్వాన్ సైతం బీజేపీ అధిష్టానంతో చర్చలకు సిద్ధమయ్యారు. మంత్రి పదవుల పంపకం విషయంలో ఎన్డీయే పక్షాల మధ్య కీలక భేటీ సోమవారం జరగనున్నట్లు సమాచారం.

నేడు బిహార్ కేబినెట్ భేటీ

బిహార్ 18వ అసెంబ్లీ ఎన్నికల తుది ఫలితాలను ఎన్నికల సంఘం బిహార్ గవర్నర్ రాజేంద్ర అర్లేకర్‌కు సమర్పించింది. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ వేగం పుంజుకుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎత్తివేస్తూ నోటిఫికేషన్ జారీ చేయబోతున్నారు. మరోవైపు ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వరలో సోమవారం కేబినెట్ సమావేశం జరుగనుంది. ప్రస్తుత 17వ శాసనసభను రద్దు చేస్తూ తీర్మానాన్ని ఆమోదిస్తారు. అనంతరం రాజ్‌భవన్‌కు చేరుకొని ముఖ్యమంత్రి పదవికి రాజీనామా సమర్పిస్తారు. ఆ తర్వాత కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఎన్డీయే ప్రకటిస్తుంది. తమను ఆహ్వానించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేస్తుంది.

తదుపరి ముఖ్యమంత్రి నితీశ్ కుమారే?

బిహార్ నూతన సీఎంతోపాటు మంత్రివర్గం ప్రమాణ స్వీకారం కోసం పట్నాలోని గాంధీ మైదాన్‌లో ఏర్పాట్లు మొదలయ్యాయి. ఈ నెల 19 లేదా 20వ తేదీన ప్రమాణ స్వీకారం ఉంటుందని ఎన్డీయే వర్గాలు వెల్లడించాయి. మోదీ షెడ్యూల్‌ను బట్టి తేదీని ఖరారు చేస్తామని తెలిపాయి. బిహార్ సర్కార్ ప్రమాణ స్వీకారానికి మోదీపాటు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యే అవకాశం ఉంది. తదుపరి ముఖ్యమంత్రి నితీశ్ ప్రమాణ స్వీకారం చేస్తారని జేడీ(యూ) నేతలు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు కొత్త సీఎం ఎవరన్నదానిపై ఊహాగానాలకు ఇంకా తెరపడలేదు. నితీశ్ కుమార్‌కు మరోసారి అవకాశం ఇస్తారా? లేక బీజేపీ నాయకుడే సీఎం అవుతారా? అనేది అతి త్వరలో తేలిపోనుంది.

18 మంది మంత్రుల ప్రమాణం?

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్‌లో ముఖ్యమంత్రితోపాటు 18 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేస్తారని ప్రచారం సాగుతోంది. ఉప ముఖ్యమంత్రి పదవి రేసులో మొత్తం నాలుగు పేర్లు వినిపిస్తున్నాయి. బీజేపీ నుంచి సామ్రాట్ చౌదరికి మరోసారి అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అదే పార్టీ నుంచి రాంకృపాల్ యాదవ్, మంగళ్ పాండే కూడా రేసులో ఉన్నారు. లోక్ జనశక్తి(రామ్‌విలాస్), రాష్ట్రీయ లోక్‌మోర్చా కూడా బిహార్ కేబినెట్‌లో చేరబోతున్నాయి. ఈసారి మంత్రివర్గంలో 30 నుంచి 32 మంది ఉండవచ్చని తెలుస్తోంది. జేడీ(యూ), బీజేపీల నుంచి సమాన సంఖ్యలో మంత్రులు కానున్నారు. చిరాగ్ పాశ్వాన్ పార్టీకి మూడు మంత్రి పదవులు, జితన్‌రామ్ మాంఝీ, ఉపేంద్ర కుశ్వాహా పార్టీల నుంచి ఒక్కొక్కరికి చోటుదక్కే అవకాశం ఉంది. మొత్తం 36 మంది మంత్రులు ఉండవచ్చు.

2028లో చంద్రయాన్-4 మిషన్

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏడు కీలక ప్రయోగాలు
- 2035 నాటికి 'ఇండియన్ స్పేస్ స్టేషన్' సిద్ధం
- 2040 నాటికి చంద్రుడిపైకి భారత వ్యోమగాములు
- ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వెల్లడి

కోల్‌కతా: కీలకమైన ప్రయోగాలకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) సిద్ధమవుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏడు ప్రయోగాలు చేపట్టనుంది. ఇందుకోసం శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరోవైపు భారతదేశ తొలి మానవ సహిత అంతరిక్ష యాత్రను 2027లో చేపట్టబోతున్నట్లు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ ప్రకటించారు. ఆయన తాజాగా ఓ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో మన దేశం మరింత ముందుకు దూసుకెళ్లడమే లక్ష్యంగా అంతరిక్ష ప్రయోగాలకు రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఏడు ప్రయోగాలు చేయనున్నట్లు వెల్లడించారు. ఇందులో వాణిజ్య కమ్యూనికేషన్ శాటిలైట్, బహుళ పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ కార్యక్రమాలు ఉన్నాయని స్పష్టంచేశారు. పూర్తిగా దేశీయంగానే మన పరిశ్రమలు తయారు చేసిన తొలి పీఎస్ఎల్వీ రాకెట్‌ను నింగిలోకి పంపింబోతున్నామని, ఇదొక మైలురాయి కాబోతోందని చెప్పారు.

జపాన్‌తో కలిసి లూపెక్స్ ప్రోగ్రామ్

ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్–4 మిషన్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలియజేసిందని వి.నారాయణన్ తెలియజేశారు. మన అంతరిక్ష యాత్రలో ఇదొక కీలక ప్రయోగం అవుతుందన్నారు. 2028లో చంద్రయాన్–4 ప్రయోగం నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు చెప్పారు. అలాగే జపాన్‌కు చెందిన ఏరోస్పేస్ ఎక్స్‌ప్లొరేషన్ ఏజెన్సీతో కలిసి లూపెక్స్(లూనార్ పోలార్ ఎక్స్‌ప్లొరేషన్) ప్రోగ్రామ్ నిర్వహించనున్నామని వివరించారు. భవిష్యత్తు డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రాకెట్ల తయారీని మూడు రెట్లు పెంచబోతున్నామని తెలిపారు. అందుకోసం కార్యాచరణ మొదలైందని అన్నారు.

2027లో మానవ సహిత యాత్ర

సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించుకొనే దిశగా ముందడుగు వేస్తున్నామని పేర్కొన్నారు. 2035 నాటికి అంతరిక్షంలో 'ఇండియన్ స్పేస్ స్టేషన్' సిద్ధమవుతుందని ధీమా వ్యక్తంచేశారు. ఇందులో మొత్తం ఐదు మాడ్యూల్స్ ఉంటాయని, తొలి మాడ్యూల్‌ను 2028 నాటికి కక్ష్యలోకి ప్రవేశపెట్టబోతున్నామని చెప్పారు. మానవ సహిత అంతరిక్ష యాత్రను 2027లో చేపట్టే అవకాశం ఉందన్నారు. భారత వ్యోమగాములను చంద్రుడి ఉపరితలంపైకి పంపించి, క్షేమంగా వెనక్కి తీసుకొచ్చే ప్రయోగాన్ని 2040 నాటికి చేపట్టాలంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తమకు సూచించారని ఇస్రో అధినేత స్పష్టంచేశారు. గ్లోబల్ స్పేస్ ఎకానమీలో భారత్ వాటా ప్రస్తుతం 2 శాతంగా ఉందన్నారు. 2030 నాటికి దీన్ని 8 శాతానికి చేర్చడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. భారత అంతరిక్ష ప్రయోగాల్లో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం నానాటికీ పెరుగుతోందన్నారు. ప్రస్తుతం 450కిపైగా పరిశ్రమలు, 330 స్టార్టప్ కంపెనీలు ఇందులో పాలు పంచుకుంటున్నాయని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో ఇది మరింత పెరుగుతుందన్నారు.

ఏమిటీ చంద్రయాన్-4?

చందమామపై ప్రయోగాలకు ఉద్దేశించినదే చంద్రయాన్–4. చంద్రుడిపైకి అంతరిక్ష నౌకను పంపించి, అక్కడ మట్టి, రాళ్ల లాంటి నమూనాలను సేకరించి, భూమిపైకి తీసుకురావడమే చంద్రయాన్–4 లక్ష్యం. ప్రస్తుతం ఇలాంటి సామర్థ్యం కేవలం అమెరికా, రష్యా, చైనాలకు మాత్రమే ఉంది. భారత్ కూడా సఫలమైతే ఈ విషయంలో నాలుగో దేశంగా నిలుస్తుంది. ఇక లూపెక్స్ ప్రయోగ లక్ష్యం ఏమిటంటే చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద మంచు రూపంలో ఉన్న నీటిని అధ్యయనం చేస్తారు. మరోవైపు చంద్రుడిపైకి వ్యోమగాములను పంపించాలని ఇస్రో లక్ష్యంగా పెట్టుకోగా, అమెరికా సైతం ఇదే పనిలో నిమగ్నమైంది. అర్టిమిస్ పేరిట కార్యాచరణ ప్రారంభించింది. చైనా సైతం 2030 నాటికి తమ వ్యోమగాములను చంద్రుడిపైకి పంపిస్తామని చెబుతోంది.

బెంగాల్ రాజ్‌భవన్‌లో ఆయుధాలు

- టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ సంచలన ఆరోపణ
- న్యాయపరంగా ముందుకెళ్తా: గవర్నర్ ఆనంద బోస్

గవర్నర్ ఆనంద బోస్

ఎంపీ కల్యాణ్ బెనర్జీ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆనంద బోస్, సీఎం మమతా బెనర్జీ ప్రభుత్వం మధ్య విభేదాలు మరింత ముదిరాయి. రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆనంద బోస్ ఆయుధాలు, మందుగుండు సామగ్రిని నిల్వ చేశారని, బీజేపీ నేరగాళ్లకు ఆశ్రయం కల్పిస్తున్నారని టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడమే ఇందుకు కారణం. ఎన్నికల ప్రక్రియను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) చేపట్టడం ఎంతో అవసరమని గవర్నర్ ఆనందబోస్ శనివారం పేర్కొన్నారు. దీనివల్ల ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం తిరిగి నెలకొంటుందన్నారు. ఆ వెంటనే ఎంపీ బెనర్జీ గవర్నర్‌పై దాడికి దిగారు. బీజేపీ నేరగాళ్లకు రాజ్‌భవన్‌లో ఆశ్రయం కల్పిస్తున్న గవర్నర్, వారికి బాంబులు, తుపాకులు సమకూర్చుతున్నారని ఆరోపణలు చేశారు. ఆయన ఆ పనిని వెంటనే ఆపేయాలని కోరారు. ఎంపీ బెనర్జీ ఆరోపణలపై న్యాయపరంగా ముందుకెళ్లేందుకు గల అవకాశాలను గవర్నర్ ఆనందబోస్ పరిశీలిస్తున్నారని రాజ్‌భవన్ అధికారి ఒకరు ఆదివారం తెలిపారు. 'రాజ్‌భవన్ ఉదయం 5 గంటల నుంచి తెరిచే ఉంటాయి. బెనర్జీ వచ్చి తన ఆరోపణల మేరకు ఆధారాలుంటే పరిశీలించుకోవచ్చు. పౌరసంఘాల ప్రతినిధులు, జర్నలిస్టులు కూడా రావచ్చు. ఆరోపణలను రుజువు చేయడంలో విఫలమైతే న్యాయపరంగా ఎంపీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదు? ఎంపీ ఆరోపణలపై దర్యాప్తు చేపట్టాల్సిందిగా లోక్‌సభ స్పీకర్‌కు కూడా లేఖ రాస్తాం'అని ఆ అధికారి చెప్పారు. భారతీయ న్యాయ సంహితలోని 151, 152, 353 సెక్షన్ల ప్రకారం ఎంపీ చర్యలు శిక్షార్హమైనవని ఆయన చెప్పారు. దీనిపై మళ్లీ ఎంపీ బెనర్జీ స్పందించారు. గవర్నర్ న్యాయపరంగా చర్యలు తీసుకుంటే తానేమీ చూస్తూ కూర్చోనన్నారు.

సాక్షి
గుంటూరు
సోమవారం । 17 । నవంబర్ । 2025

పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వేయి క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 8 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుత నిల్వ 42.6213 టీఎంసీలు.

రాతి నిర్మాణానికి విరాళం

నరసరావుపేట ఈస్ట్: వీరాంజనేయ సహిత శ్రీయోగానంద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ రాతి నిర్మాణానికి వేముల శ్రీనివాసరావు దంపతులు రూ.1,00,116 విరాళంగా ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యభగవానుడి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం సూర్యోపాసన సేవ జరిపించారు.

మాటల్లో 'భూమ్'.. నమ్మితే ఢాం..!

రాజధాని గ్రామాల్లో అనధికారిక వెంచర్లు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. ఆదిలోనే తొలగించాల్సిన అధికారులు అందినకాడికి దండుకుని చోద్యం చూస్తున్నారు. ఈ ప్రాంతంలో 30 ఏళ్ల క్రితం వేసిన కొన్ని వెంచర్లకు సైతం నేటికీ అనుమతులు రాలేదు. ఇటీవల కాలంలో రాజధాని ఏర్పాటు ప్రకటనలతో వెంచర్లు ఎక్కువగా వెలిశాయి. దళారుల మాయమాటలకు కొనుగోలుదారులు తీవ్రంగా నష్టపోతున్నారు.

- 30 ఏళ్ల క్రితం వేసిన వాటికి ఇప్పటికీ అనుమతులు శూన్యం
- అనుమతి ఉన్న ప్లాట్లు కొనాలని ఏపీ సీఆర్‌డీఏ ప్రకటన
- కమీషన్ల కోసం కొనుగోలుదారులను మోసగిస్తున్న దళారులు
- ఓ పక్క వ్యాపారాలు పడిపోయినా అధిక ధరలకు విక్రయిస్తూ దగా
- విలువ లేని ప్లాట్లనూ సామాన్యులకు అంటగడుతూ మోసం
- ప్లాట్లు తీసుకున్నాక తీవ్రంగా నష్టపోతున్న కొనుగోలుదారులు

లాంలో అనధికారిక వెంచరును తొలగింపజేస్తున్న సీఆర్‌డీఏ అధికారులు (ఫైల్)

కోర్టులో ఉన్న తాడికొండ అడ్డరోడ్డులోని భూమిలో నిర్మించిన కల్యాణ మండపం

తాడికొండ: నిబంధనలు పాటించకుండా అరకొర వసతులతో వెంచర్లు వేసిన నిర్వాహకులు అమ్ముకొని సొమ్ము చేసుకొని వెళ్లిపోతున్నారు. దళారులు కమీషన్ల రూపంలో అందిన కాడికి లాగేస్తున్నారు. ఇప్పుడు అనుమతి ఉన్న ప్లాట్లను మాత్రమే కొనాలంటూ ఏపీ సీఆర్‌డీఏ ప్రకటన జారీ చేసి వెంచర్లను తొలగించి, ఆయా ప్రాంతాల్లో బోర్డులు పెట్టేస్తోంది. కమీషన్‌ల కోసం కొనుగోలుదారులను మోసం చేస్తున్న బ్రోకర్లు మాత్రం నిజం బయటకు రాకుండా అవే ప్లాట్లను అమాయకులకు అంటగడుతూ వారి జీవితాలతో ఆటలాడుకుంటున్నారు. ఓ పక్క రియల్ భూమ్ పడిపోయినా గజానికి అధిక ధరలు చెప్పి అంటగడుతూ నిలువునా ముంచేస్తున్నారు. ప్రస్తుతం కొనుగోలుదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొనుగోలుకు వచ్చిన వారికి అనుమతుల గురించి తెలియజేయకుండా ఆకాశంలో చుక్కలు చూపిస్తూ అదిగో రాజధాని.. ఇదిగో ప్రతిష్టాత్మక వర్సిటీకి కూతవేటు దూరం, ఇటువైపు అంతర్జాతీయ విమానాశ్రయం వస్తుంది.. అటు వైపు ఔటర్ రింగ్ రోడ్డు వేస్తారు, ఇక్కడ హైవే... అక్కడ పెద్ద రైల్వే స్టేషన్ అంటూ అంటగట్టేస్తున్నారు. అయితే ప్లాట్లు కొనుగోలు చేసిన తరువాత అసలు నిజం వెలుగుచూస్తోంది. కొనుగోలుదారులు తాము పూర్తిగా మోసపోయామని తెలుసుకొని ఆవేదన చెందుతున్నారు.

ముఖ్యంగా ఈ ప్రాంతాల్లో...

రాజధాని సమీప మండలాలైన తాడికొండ, కంతేరు, అమరావతి, పెదకూరపాడు తదితర ప్రాంతాల్లో ఈ తంతు కొనసాగుతోంది. రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న కంతేరు, కొప్పురావూరు, పొన్నెకల్లు, పాములపాడు, రావెల, నిడుముక్కల, లాం, పెదపరిమి పలు గ్రామాల్లో ఇబ్బడి ముబ్బడిగా రియల్ ఎస్టేట్ వెంచర్లు ఉన్నాయి. ఇక్కడ 30 ఏళ్ల కిందట వేసిన వెంచర్లకు సైతం నేటికీ ఎలాంటి అనుమతులు రాలేదు. తాడికొండ అడ్డరోడ్డు సెంటర్‌లో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కోర్టులో ఉన్న వివాదాస్పదమైన భూమిలో తనకు కనీసం పాసు పుస్తకం కూడా రాకుండానే ఏకంగా పెద్ద కల్యాణ మండపం, షాపింగ్ కాంప్లెక్స్, రెస్ట్ రూమ్‌లు, వేదిక, గార్డెన్ వంటివి నిర్మించేశాడు. అద్దెలకు ఇచ్చుకుంటున్నా అధికారులు అటు చూడటం లేదు. అప్పుడప్పుడూ సదరు వ్యాపారిని కొందరు అధికారులు కలుస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

అధికారుల నిర్లక్ష్యం

మరోవైపు అనుమతులు లేని ప్లాట్లు కొనుగోలు చేస్తే నష్టం తప్పదంటున్న అధికారులు వాటిని కట్టడి చేసేందుకు తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగా కనిపిస్తున్నాయి. గుర్తించడంలో పోరబాటో లేక సీఆర్‌డీఏ అధికారులతో కలిసి స్థానికంగా ఉన్న రెవెన్యూ, పంచాయతీ అధికారులు పనిచేయకపోవడమో తెలియడం లేదు. అనుమతులు లేకుండా కొనుగోలు చేసిన ప్లాట్లను చట్టబద్ధం చేసుకోవాలంటే గజానికి ప్రభుత్వ ధర ప్రకారం ఎల్‌ఆర్‌ఎస్ చెల్లిస్తేనే ప్లాట్‌కు కనీస వసతులు కల్పిస్తామని సీఆర్‌డీఏ నిబంధన విధించింది. దీంతో కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విక్రయదారులపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు

అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

తాడికొండ: తాడికొండ చెరువు కట్టపై అక్రమ నిర్మాణాలను ఆదివారం అధికారులు తొలగించారు. 200 మందికిపైగా పోలీసులను మోహరించి, ఉదయం 6 గంటల నుంచే తొలగింపు ప్రారంభించారు. ముందుగా హిందువుల భజన మందిరం పేరిట నిర్మిస్తున్న కట్టడాన్ని తొలగించారు. ఎదురుగా నిర్మాణం ప్రారంభించిన మసీదు కట్టడాన్ని తొలగించారు. చెరువు అక్రమణలపై కోర్టులో కేసు నడుస్తున్నందున నాలుగు సంవత్సరాలుగా తాత్కాలికంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న మసీదు నిర్మాణాన్ని తొలగించకుండా వదిలేశారు. అనంతరం సదరు ఆక్రమణ ప్రాంతానికి ఫెన్సింగ్ వేయించి, రక్షణ కట్టుదిట్టం చేశారు. గ్రామంలో పోలీసు పికెట్ కొనసాగుతోంది, కొద్ది రోజులపాటు బందోబస్తు ఉంటుందని సీఐ కె.వాసు తెలిపారు. తుళ్ళూరు డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మెహర్ కుమార్, ఆర్ఐ హనుమంతరావు, పలువురు సీఐలు, ఎస్ఐలు, ఈవోఆర్డీ రమణయ్య, కార్యదర్శి రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

అక్రమ నిర్మాణాల వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించడంతోపాటు అధికారులపై దురుసుగా ప్రవర్తించినందుకు ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రెహమాన్ ఫిర్యాదు మేరకు షేక్ జఫ్రుద్దీన్, సయ్యద్ ఖాజావలి, మహబూబ్ జానీ, షేక్ జానీ, షేక్ మాభు సుభానీలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మల్లేశ్వరస్వామి సేవలో న్యాయమూర్తులు

పెదకాకాని: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మల్లేశ్వర స్వామిని దర్శించుకునేందుకు గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి జి.స్రవంతి, చిలకలూరిపేట కోర్టు న్యాయమూర్తి ఐ.స్వాతి దంపతులు విచ్చేశారు. ఆదివారం పెదకాకాని శివాలయానికి వచ్చిన అతిథులకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని వారు దర్శించుకుని పూజలు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం అతిథులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వివిధ శాఖల అధికారులు తదితరులు దర్శించుకున్న వారిలో ఉన్నారు. స్వామివారి శేషవస్త్రంతో ఘనంగా వారిని సత్కరించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఆయా శాఖల అధికారులు శివాలయానికి చేరుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 5,422 క్యూసెక్కులు



దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్ నుంచి 5,422 క్యూసెక్కులు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగుల నీటి మట్టం స్థిరంగా ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవల్‌కి 276, బ్యాంక్ కెనాల్ 1,304, తూర్పు కాలువకు 184, పశ్చిమ కాలువకు 52, నిజాంపట్నం కాలువకు 159, కొమ్మూరు కాలువకు 2,780 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

గవర్నర్‌కు ఘనస్వాగతం

బాపట్ల: బాపట్ల మండలం పాండురంగపురంలో ఆదివారం జరిగే ఓ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. ఎస్పీ ఉమామహేశ్వర్, జాయింట్ కలెక్టర్ భావన, బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ, బాపట్ల ఆర్డీఓ పి.గ్లోరియా, డీఎస్పీ రామాంజనేయులు, బాపట్ల, చీరాల తహసీల్దార్లు షేక్ సలీమ, గోపికృష్ణ తదితరులు కూడా స్వాగతం పలికారు.

సైక్లింగ్‌తో ఎంతో మేలు

మంగళగిరి టౌన్: ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కడం వల్ల ఫిట్‌నెస్ సాధించడంతోపాటు ఆరోగ్యానికి మేలు కలుగుతుందని ఏపీ బెటాలియన్స్ ఐజీ బి.రాజకుమారి పేర్కొన్నారు. మంగళగిరి నగర పరిధిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్‌లో ఆదివారం క్విట్ ఇండియా ఫిట్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. అనంతరం సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ బెటాలియన్ నుంచి ప్రారంభమై చినకాకాని ఎన్ఆర్ఐ జంక్షన్ వరకు వెళ్లి, తిరిగి బెటాలియన్‌కు చేరుకుంది. రాజకుమారి మాట్లాడుతూ సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిత్యం అరగంట సైక్లింగ్ చేయాలని సూచించారు. బెటాలియన్ కమాండెంట్ నగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గోకుల క్షేత్రంలో లక్ష దీపోత్సవం

తాడేపల్లిరూరల్: హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనుకొండలో ఉన్న హరేకృష్ణ గోకుల క్షేత్రంలో ఆదివారం లక్ష దీపోత్సవం కార్యక్రమం ఏర్పాటైంది. తులసి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు 30 లక్షల హరి నామాలకు జపించారు. నృత్య రూపంలో కృష్ణ లీలను ప్రదర్శించగా, భక్తులు తిలకించారు. మూమెంట్ అధ్యక్షుడు వంశీధర దాస మాట్లాడుతూ సంధ్యాహారతి, సంకీర్తన, ప్రవచనం, కార్తిక మాస దీపోత్సవ ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. లక్ష దీపోత్సవ కార్యక్రమం 20వ తేదీ వరకు నిర్వహించనున్నామని, భక్తులు విజయవంతం చేయాలన్నారు. హరేకృష్ణ గోకుల క్షేత్రం ప్రతినిధులు విలాస దాస, రఘునందన దాస తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం ఆదివారం 586.60 అడుగులకు చేరింది. ఇది మొత్తం 303.4310 టీఎంసీలకు సమానం. కుడి కాలువకు 10 వేల క్యూసెక్కులు వదులుతున్నారు.

దుర్గమ్మకు విరాళాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆదివారం పలువురు భక్తులు విరాళాలను సమర్పించారు. తెలంగాణలోని సూర్యాపేటకు చెందిన వనమ అక్షయ్‌కుమార్ కుటుంబం ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,00,116, హైదరాబాద్ రాజేంద్రనగర్‌కు చెందిన పట్టపు భగవత్ ప్రసాద్, చంద్రావతిల పేరిట అన్నదానానికి రూ. 1,00,116 విరాళాన్ని అందజేశారు. అలాగే శ్రీకాకుళంకు చెందిన ఎం. ప్రభాకర్ దంపతులు జోషియా జయశ్రీ, జోశ్రీక జయశ్రీల పేరిట నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళాన్ని అందించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను బహూకరించారు.

భక్తులతో కళకళలాడుతున్న ఆలయం

మనసారా.. శివనామస్మరణ

- భక్తులతో కిటకిటలాడిన కాకాని శివాలయం
- కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేసిన భక్తులు
- ఒక్కరోజులో వివిధ రూపాల్లో ఆలయ ఆదాయం రూ.8.50 లక్షలు

పూజలు అందుకుంటున్న మూల విరాట్, బంగారు కవచ అలంకరణలో భ్రమరాంబ

పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం కార్తిక మాసాన్ని పురస్కరించుని హరోం హర నామస్మరణతో మార్మోగింది. పెదకాకాని శివాలయంలో తెల్లవారుజామున సుప్రభాతసేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కార్తిక మాసం 4వ ఆదివారం వేకువజామున భక్తులు యజ్ఞాల బావి వద్ద స్నానాలు చేసి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ప్రాంగణం కళకళలాడింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున చేరుకున్న భక్తులు ప్రాంగణంలో కార్తిక దీపాలు వెలిగించారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ మేరకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. యజ్ఞాల బావి నీటితో పొంగళ్లు పొంగించిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. స్వామివారి దర్శనం సకాలంలో జరిగేలా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు పాలు, మజ్జిగ, తాగునీరు అందించారు. అంతరాలయ దర్శనాలు, అభిషేకాలు, ఏకవారాభిషేక పూజలు, అన్నప్రాశనలు, నామకరణలు, రాహుకేతు పూజలు అధికసంఖ్యలో జరిగాయి. ప్రభలతో ఆలయానికి చేరుకున్న భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఒక్కరోజులో స్వామి వారికి వివిధ సేవా కార్యక్రమాల ద్వారా రూ.8,50,000 ఆదాయం లభించినట్లు డీసీ తెలిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదాలు అందించామని పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో ఇద్దరు చోరులు

నరసరావుపేట టౌన్: తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠా ఎట్టకేలకు పోలీసులకు చిక్కింది. పల్నాడు జిల్లా నరసరావు పేట టౌన్ పరిధి ప్రకాష్‌నగర్‌కు చెందిన గడిపుడి సుబ్బారావు, భారతీదేవి దంపతులు వారం కిందట బంధువుల ఇంటికి వెళ్లి వచ్చారు. ఈలోగా గృహంలోని 560 గ్రాముల బంగారం, రూ.25 వేల నగదు చోరీకి గురైంది. నిందితుల కోసం వన్‌టౌన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సంఘటన జరిగిన గృహానికి సమీపంలో సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై అనుమానస్పదంగా సంచరిస్తూ ఉండటాన్ని గుర్తించారు. అందులో రామిరెడ్డిపేటకు చెందిన యువకుడు ఒకరు కాగా, మాచర్లకు చెందిన మరొకరిని గుర్తించారు. వారిద్దరిని ఆదివారం డీఎస్పీ హనుమంతరావు ఆధ్వర్యంలో సీఐ ఫిరోజ్ అదుపులోకి తీసుకున్నారు.

ఐదు దొంగతనాలు చేసినట్లు గుర్తింపు..

అనుమానితులను తమదైన శైలిలో విచారించటంతో ప్రకాష్‌నగర్‌లో జరిగిన చోరీతోపాటు మరో నాలుగు దొంగతనాలు చేసినట్లు అంగీకరించినట్లు పోలీస్ వర్గాల ద్వారా తెలియవచ్చింది. నరసరావుపేట టూటౌన్ పరిధిలో ఒకటి, నరసరావుపేట రూరల్ పరిధిలో మరొకటి, వినుకొండ, పిడుగురాళ్లలో రెండు తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడినట్లు తెలియవచ్చింది. దీంతో వారి నుంచి దొంగిలించిన సొత్తును కొంత మేర ఇప్పటికే స్వాధీనం చేసుకోగా, మిగిలిన బంగారం రికవరీ కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. దర్యాప్తు కొనసాగుతోందని తెలిసింది.

ఫ్లై ఓవర్ నిర్మాణంలో లోపించిన ప్రణాళిక

- ఆర్ అండ్ బీ, కార్పొరేషన్ అధికారుల బెదిరింపులు
- హైకోర్టును ఆశ్రయించిన వ్యాపారులు
- క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక సమర్పించాలని హైకోర్టు ఆదేశం
- నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించిన అడ్వకేట్ కమిషనర్ ఆనంద్‌కుమార్
- అధికారుల తప్పిదాలను ఆయన దృష్టికి తీసుకెళ్లిన జేఏసీ నేతలు, వ్యాపారులు

శంకర్ విలాస్ ఫ్లైఓవర్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అడ్వకేట్ కమిషనర్ ఆనంద్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: శంకర్ విలాస్ వద్ద ఫ్లైఓవర్ పునర్నిర్మాణంలో నిబంధనలు గాలికొదిలేసిన అధికార యంత్రాంగం తీరుపై దాఖలు చేసిన పిటిషన్లపై క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేసేందుకు హైకోర్టు నియమించిన అడ్వకేట్ కమిషనర్ ఎం.ఆనంద్‌కుమార్ ఆదివారం గుంటూరులో పర్యటించారు. శంకర్ విలాస్ ఫ్లైఓవర్ కూల్చివేత మొదలు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితోపాటు ఆర్ అండ్ బీ, నగర పాలక సంస్థ యంత్రాంగాలు ఎవరిష్టం వచ్చినట్లు వారు నిర్మాణ ప్లాన్‌ను మార్చివేసి, సర్వీసు రోడ్లు లేకుండా చేయడంతోపాటు దుకాణాలను కోల్పోతున్న వ్యాపారులకు చెల్లించాల్సిన నష్టపరిహారంపై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు, వ్యాపారులు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. శంకర్ విలాస్ ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా గుంటూరు నగరంలో ఏర్పడిన తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించి, న్యాయం చేయాలని దాఖలైన పిటిషన్ల విచారణకు ముందుగా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని హైకోర్టు నియమించిన అడ్వకేట్ కమిషనర్ ఎం.ఆనంద్‌కుమార్ అరండల్‌పేట, బ్రాడీపేట, ఏసీ కళాశాల వైపు ఫ్లైఓవర్ నిర్మాణ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ నిర్మాణం కారణంగా దుకాణాలు కోల్పోతున్న వ్యాపారులతో నేరుగా మాట్లాడారు. శంకర్ విలాస్ ఫ్లైఓవర్ సాధన జేఏసీ కన్వీనర్ ఎల్.భారవి, వ్యాపారుల సంఘ ప్రతినిధులు కమల్‌కాంత్, బొల్లంకొండ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ఈచంపాటి వెంకట కృష్ణమాచారి క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, అధికారుల నిర్లక్ష్య వైఖరిని కళ్లకు కట్టినట్లుగా ఆయనకు చూపించారు.

అడ్వకేట్ కమిషనర్ అధ్యయనం చేసిన అంశాలు

- ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా అరండల్‌పేట, బ్రాడీపేట రెండు వైపులా బ్రిడ్జి దిగువన సర్వీసు రోడ్డు లేకుండా చేస్తున్నారని, ఫలితంగా పాఠశాలలు, ఆస్పత్రులకు వెళ్లే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని పిటిషనర్ల ఫిర్యాదులపై అడ్వకేట్ కమిషనర్ పరిశీలన చేశారు. ఆర్ అండ్ బీ, కార్పొరేషన్ అధికారులతో సర్వీసు రోడ్డు కొలతలు వేయించారు. సర్వీసు రోడ్డు నిర్మాణం కారణంగా ఇరువైపులా దుకాణాల తొలగింపునకు చేసిన మార్కింగ్ పరిశీలించారు.
- దశాబ్దాల తరబడి వ్యాపారం చేసుకుంటున్న తమ దుకాణాలను పూర్తిగా తొలగిస్తామంటున్నారని ఆనంద్‌కుమార్ దృష్టికి తెచ్చారు. నిర్మాణంపై ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ ఆనంద్‌కుమార్ ఎదుటే వ్యాపారస్తులు అధికారుల తీరుపై మండిపడ్డారు.
- అరండల్‌పేట వైపు రైల్వేస్టేషన్ నుంచి బ్రాడీపేట ఒకటో లైనుకు వెళ్లేందుకు అవకాశం లేకుండా ప్లాన్‌లో చూపించిన అధికారులు బ్రిడ్జి దిగువున ఉన్న నగర పాలక సంస్థ స్థలంలోని సర్వీసు రోడ్డును రైల్వేశాఖకు చెందినదిగా చూపడంపై కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణమాచారి అభ్యంతరం వ్యక్తం చేశారు. శంకర్‌విలాస్ ఫ్లైఓవర్ దిగువన ఉన్న రోడ్డు మార్గం ద్వారా గుజ్జనగుండ్ల నుంచి రైల్వేస్టేషన్‌కు నేరుగా చేరుకునే వీలుందని, సంబంధిత రహదారిని నూతన ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా మూసివేస్తామని అధికారులు చెప్పడం సరికాదన్నారు. రైల్వేస్టేషన్ నుంచి బ్రాడీపేటకు వచ్చి, వెళ్లేందుకు వీలుగా రెండు సర్వీసు రోడ్లు కచ్చితంగా ఉండాల్సిందేనని వారు స్పష్టం చేశారు.
- నాలుగు నెలల కిందట హడావుడిగా ఫ్లైఓవర్ కూల్చివేత పనులను చేపట్టిన అధికారులు రైల్వేశాఖ స్థలంలో ఉన్న బ్రిడ్జి కూల్చివేతకు అసలు రైల్వేశాఖ నుంచి అనుమతులు తెచ్చుకోకపోవడం, జీజీహెచ్ వైపు రైల్వేశాఖ స్థలాన్ని కార్పొరేషన్‌కు ఇచ్చే విషయంలోనూ అనుమతులు లేని విషయాలను జేఏసీ ప్రతినిధులు ఆనంద్‌కుమార్ దృష్టికి తెచ్చారు.

ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో నిబంధనలకు తిలోదకాలు



శంకర్‌విలాస్ ఫ్లైఓవర్ కూల్చివేత, నిర్మాణ పనుల్లో అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. భవిష్యత్తు ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో పెట్టుకోవాల్సిన అధికారులు సమస్యను మరింత జటిలం చేస్తున్నారు. కోర్టుకు వెళ్లిన వారిపై టౌన్ ప్లానింగ్ అధికారులు బెదిరింపులకు దిగుతున్నారు. గుంటూరు నగరంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించి, ప్రజల ఇబ్బందులను తొలగించే విధంగా ఫ్లైఓవర్ నిర్మాణాన్ని చేపట్టాలి. బ్రిడ్జి నిర్మాణానికి రైల్వేశాఖ నుంచి అనుమతి రాకముందే హడావుడిగా వినియోగంలో ఉన్న బ్రిడ్జి కూల్చివేసిన కారణంగా నాలుగు నెలలుగా ప్రజలు నరకం చూస్తున్నారు. నూతన ఫ్లైఓవర్ నిర్మాణానికి పిల్లర్లు రోడ్డుకు అడ్డంగా ఉంటున్నాయి. ఫ్లైఓవర్ నిర్మాణం తరువాత బ్రాడీపేట ఒకటో లైనులోకి వెళ్లే అవకాశం లేకుండా చేస్తున్నారు. ఫ్లైఓవర్ ప్లాన్‌ను బహిరంగ పర్చాలని కోరితే ప్రజాప్రతినిధులకే తెలియకుండా రహస్యంగా ఉంచుతున్నారు. పైస్థాయిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు ఏకపక్షంగా ముందుకు వెళ్తున్న కారణంగా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

– ఈచంపాటి వెంకటకృష్ణమాచారి, కార్పొరేటర్

క్లుప్తంగా

ఎస్సీ హాస్టల్ వద్ద తల్లిదండ్రుల ఆందోళన

నెహ్రూనగర్: బీఆర్ స్టేడియం వద్ద ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్ వద్ద ఓ విద్యార్థిని తల్లిదండ్రులు ఆదివారం ఆందోళనకు దిగారు. హాస్టల్‌లో ఉండే ఓ విద్యార్థినిని మరో విద్యార్థిని పరుష పదజాలంతో దూషిస్తోంది. బట్టలు ఆరేసుకుంటే వాటిని కింద పడేస్తోంది. ప్రతిసారి ఆట పట్టిస్తున్న విషయాన్ని ఆదివారం హాస్టల్ సందర్శనార్థం వచ్చిన తల్లిదండ్రులకు ఆ విద్యార్థిని చెప్పింది. దీంతో వారు హాస్టల్ వార్డెన్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో ఇంత జరుగుతుంటే ఏం చేస్తున్నారంటూ వారిపై మండిపడ్డారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే సహించేది లేదని హెచ్చరించారు. దీంతో వివాదం సద్దుమణిగింది. దీనిపై వార్డెన్ శేషుకుమారిని వివరణ కోరగా చిన్న పిల్లల మధ్య గొడవ అని లైట్‌గా సమాధానం చెప్పుకుంటూ దాట వేశారు.

స్పోర్ట్స్ సొసైటీ వైస్ చైర్మన్‌గా రుస్తుంబాబు

నగరంపాలెం: కన్నెగంటి హనుమంతు స్పోర్ట్స్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్‌గా షేక్ రుస్తుంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఏటుకూరురోడ్డులో జిల్లా వైస్ చైర్మన్ షేక్ రుస్తుంబాబుకు సొసైటీ రాష్ట్ర చైర్మన్, విశ్రాంత ఎస్పీ చెన్నమశెట్టి చక్రపాణి, సొసైటీ గౌరవ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీనివాసరావులు నియామక పత్రాన్ని అందించారు. రుస్తుంబాబు మాట్లాడుతూ సొసైటీ ద్వారా ప్రతిభావంతులైన పేద క్రీడాకారులకు అండగా ఉంటామని అన్నారు. గుంటూరు నగరంలోని బీఆర్ స్టేడియాన్ని అభివృద్ధి చేసి, క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర వైస్ చైర్మన్ కార్యదర్శి తిరుమలశెట్టి నాగరాజు, చెమట సురేష్, జిల్లా చైర్మన్ మండల శ్రీనివాసరావు, సభ్యులు నాగం అంకమ్మ పాల్గొన్నారు.

తల్లి మందలించిందని విద్యార్థి ఆత్మహత్య

తెనాలి రూరల్: తల్లి మందలించిందని ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ నాజరుపేటకు చెందిన పవన్‌తేజ(24) ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. స్నేహితులతో కలసి శనివారం పార్టీకి వెళ్లి రాత్రికి రావడంతో తల్లి మందలించింది. మనస్తాపానికి గురై అర్ధరాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటికి చెల్లి తమనించి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పవన్‌తేజను వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. వన్‌టౌన్ పోలీసులు ఆదివారం ఉదయం సమాచారం అందుకుని మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

మల్లేశ్వరస్వామి సన్నిధిలో సహస్ర లింగార్చన

భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలైన్లు

భక్తజన సందోహం

ఇంద్రకీలాద్రిపై సర్వదర్శనానికి రెండు గంటలు
కార్తిక మాసం ఆఖరి ఆదివారం నేపథ్యంలో అంతరాలయ, వీఐపీ దర్శనాలు రద్దు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం ఆఖరి ఆదివారం ఇంద్రకీలాద్రిపై భక్తజన సందోహం కనిపించింది. ఆదివారం తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. రద్దీ నేపథ్యంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు అంతరాలయ దర్శనాన్ని రద్దు చేశారు. వీఐపీ సిఫార్సులపై వచ్చే వారికి సైతం రూ. 300 టికెట్‌పై బంగారు వాకిలి దర్శనం కల్పించారు. శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్లకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొన్నారు. నూతన వధూవరులు పెళ్లి బట్టలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సర్వ దర్శనానికి రెండు గంటలకు పైగా సమయం పట్టింది.

ఆరో అంతస్తులో అమ్మవారి ఉత్సవమూర్తి

అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

ఓం టర్నింగ్‌కు చేరిన భక్తుల క్యూ

కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తుల రాక కనిపించింది. పలు అసోసియేషన్లు, స్నేహ బృందాలు, సంఘాలు విజయవాడ పరిసరాల్లో కార్తిక వన సమారాధనాలు ఏర్పాటు చేశాయి. వారు తొలుత అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. కొండ దిగువన కనకదుర్గనగర్, సీతమ్మ వారి పాదాలతో పాటు హెడ్ వాటర్ వర్క్సు వద్ద కార్లు, ఇతర వాహనాలతో బారులు తీరి కనిపించాయి. మధ్యాహ్నం 12 గంటలకు ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వరకు భక్తులు క్యూ కనిపించింది. మహామండపంలో 5వ అంతస్తు వరకు రద్దీ ఏర్పడటంతో దర్శనం త్వరత్వరగా అయ్యేలా అధికారులు క్యూలైన్లను ముందుకు నడిపించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఆ తర్వాత అంతరాలయ దర్శనానికి అనుమతించారు.

మల్లేశ్వరుడికి త్రికాల అర్చనలు విశేష పూజలు

ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామికి త్రికాల అర్చనలు, అభిషేకాలతో పాటు సాయంత్రం సహస్ర లింగార్చన జరిగింది. స్వామివారికి సాయంత్రం మహా నివేదన అనంతరం పంచహారతుల సేవ, సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవలను ఆలయ అర్చకులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిపించారు. సహస్ర లింగార్చనలో ఆలయ ఈవో శీనానాయక్ ప్రత్యేక పూజలు చేశారు.

రంగస్థల కళాకారులకు అండగా సంఘం

- ఆడపిల్ల పెళ్లికి రూ.11 వేల సాయం
- మృతుల అంత్యక్రియలకు రూ.6 వేలు
- సర్వసభ్య సమావేశంలో తీర్మానం

ఐడీ కార్డులను అందజేస్తున్న సాయిమాధవ్ బుర్రా

తెనాలి: కళాకారుల కుటుంబాల్లో ఆడపిల్ల పెళ్లికి సంఘం తరపున రూ.10 వేలు ఆడబిడ్డ కట్నం అందజేయటానికి పట్టణ రంగస్థల కళాకారుల సంఘం తీర్మానించింది. కళాకారుడు చనిపోతే అంత్యక్రియల మొత్తాన్ని రూ.3 వేలకు పెంచి ఇవ్వనున్నారు. సంఘ సభ్యులు ప్రకటించిన విరాళాలతో కలిపి ఆయా మొత్తాలను రూ.11 వేలు, రూ.6 వేలు చొప్పున ఇవ్వనున్నారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం సర్వసభ్య సమావేశం, కార్తిక వన సమారాధన ఆదివారం స్థానిక బీసీ కాలనీలోని సంఘ భవనంలో నిర్వహించారు. సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. డాక్టర్ సాయిమాధవ్ బుర్రా మాట్లాడుతూ కళాకారుల స్థాయిని పెంచేలా సంఘం పనిచేయాలన్నదే తమ ఆశయమన్నారు. కళాకారులు స్వాభిమానం కోల్పోయేలా చేయరాదని, ఏ కార్యక్రమమైనా సంఘం నిర్వహణతోనే జరగాలని చెప్పారు. హరికథా భాగవతారిణి విద్యావతి సంఘానికి రూ.5,116 విరాళం ప్రకటించారు. కళాకారుల అంత్యక్రియల ఖర్చు కింద సంఘం ప్రకటించిన రూ.3 వేలకు తోడుగా మరో రూ.2 వేలు ఇస్తానని వెల్లడించారు. కొలకలూరు కళాకారుడు వెంకటేశ్వర్లు ఆడబిడ్డ కట్నానికి, అంత్యక్రియల ఖర్చులకు వెయ్యేసి రూపాయలను ఇవ్వనున్నట్టు ప్రకటించారు. సంఘం తరపున కార్పస్ ఫండ్‌ను ఏర్పాటుచేసి దానిపై వచ్చే వడ్డీతో కార్యకలాపాలను నిర్వహిస్తామని, సంఘ భవనం సుందరీకరణ చేపట్టాలనేది మరో ప్రణాళికగా సాయిమాధవ్ వెల్లడించారు. గౌరవాధ్యక్షుడు ఆరాధ్యుల కోటేశ్వరరావు రూ.5 వేల విరాళాన్ని సంఘానికి అందజేశారు. ప్రధాన కార్యదర్శి ఆరాధ్యుల ఆదినారాయణ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టగా, కోశాధికారి మేరిగె రామలింగేశ్వరరావు జమాఖర్చులను తెలియజేశారు. కార్యనిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు, కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి మధుకర్, కొండపి శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం కళాకారుల కార్తిక వనసమారాధన సందడిగా జరిగింది.

పాఠశాలలను బలహీన పరుస్తున్న సంస్కరణలు

- ప్రభుత్వ నిర్ణయాలతో పడిపోయిన విద్యార్థుల ప్రవేశాలు
- ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు

మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణలు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం మినహా, బలహీన పర్చే విధంగా ఉండరాదని ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు అన్నారు. కలెక్టరేట్ వద్ద ఉన్న రెవెన్యూ భవన్‌లో ఆదివారం ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాండురంగ వరప్రసాదరావు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం, సంస్కరణలు పాఠశాల వ్యవస్థను కుంగదీస్తున్నాయని, తొమ్మిది రకాల పాఠశాలల ఏర్పాటు విద్యార్థులకు మేలు చేయడం లేదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంస్కరణలు చేపట్టే ముందుగా స్థానిక చరిత్ర, భౌగోళిక పరిస్థితులు, స్థానిక పంటలు శాస్త్రీయంగా పాఠ్యపుస్తకాల్లో సిలబస్‌గా ప్రవేశపెట్టాలని, ఇక్కడ పండని పంటలు పాఠ్యాంశాలుగా పెట్టడం సరైనది కాదన్నారు. సంస్కరణలు మొత్తం బహుళజాతి సంస్థల అభివృద్ధికి పాటుపడటం మినహా, ప్రజలకు కాదన్నారు. ఈ దశలో ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి పాఠశాలలను బలోపేతం చేయాలని, తద్వారా పేద ప్రజల బిడ్డలకు న్యాయం చేయాలన్నారు. సంఘ రాష్ట్ర కార్యదర్శులు సయ్యద్ చాంద్ బాషా, మక్కెన శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ చర్యలతో 4,600 పాఠశాలల్లో ఒక్క అడ్మిషన్ లేదని, 12వేలు పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయని తెలిపారు. ఎన్నికలకు ముందు తెలుగు మాధ్యమం లేకపోవడం అన్యాయమని అన్న నేతలు అధికారంలోకి వచ్చాక తెలుగు భాష అంటే తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారన్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం తక్షణమే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలుగు మాధ్యమం పునరుద్ధరించాలన్నారు. గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలన్నారు. సమావేశంలో ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు, సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈవీ రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, ఉపాధ్యాయవాణి సంపాదకుడు వై.నేతాజీ, జిల్లా ఉపాధ్యక్షులు పి.జనార్ధనరావు, పి.పార్వతి, పి.లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శులు జి.దాస్, సత్యనారాయణమూర్తి, జి.శివరామకృష్ణ, మండల శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నిందితుడు అరెస్ట్

రూ.4.65 లక్షలు నగదు, 16 గ్రాముల బంగారం రికవరీ

చోరీ కేసులో వివరాలను వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ నాగభూషణం

చీరాల: చోరీ కేసులో నిందితుడిని టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి నగదు, బంగారాన్ని రికవరీ చేశారు. ఆదివారం మీడియా సమావేశంలో టూటౌన్ సీఐ బి.నాగభూషణం వివరాలను వెల్లడించారు. పేరాలలోని ముట్టేవారివీధికి చెందిన గుండు నరసింహారావు చీరాల కూరగాయల మార్కెట్ వద్ద హోల్‌సేల్ ఫ్రూట్స్ షాపును నిర్వహిస్తున్నారు. ఈ నెల 8న తెల్లవారుజామున 3.45 గంటలకు ఫ్రూట్ షాపునకు భార్యాభర్తలు వెళ్లారు. ఉదయం 7 గంటలకు ఆ ఇంటిలో పని చేసే మనిషి వచ్చి చూడగా తలుపులు తీసి ఉండడంతో ఆమె నరసింహారావుకు ఫోన్ చేసింది. వారు ఇంటికి వచ్చి చూడగా బీరువా తెరచుకుని ఉంది. అందులో ఉన్న రూ.6 లక్షలు, లాకెట్ ఉన్న నల్లపూసల బంగారు గొలుసు కనిపించకపోవడంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు డీఎస్పీ ఎండీ మోయిన్ సూచనలతో టూటౌన్ సీఐ బి.నాగభూషణం, ఎస్సై ఎం.వెంకటేశ్వర్లు, సబ్ డివిజనల్ క్రైమ్ బృందం దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ క్రమంలో చీరాల–బాపట్ల ఎన్‌హెచ్ 216లో బాపట్ల వెళ్లే దారిలో హాయ్ రెస్టారెంట్ నుంచి హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ వద్ద చోరీ కేసులో నిందితుడు, విజయవాడకు చెందిన గుదే హరీష్‌కుమార్‌ను ఆదివారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు వద్ద నుంచి రూ.4.65 లక్షల నగదు, 16 గ్రాముల లాకెట్ గల నల్లపూసల బంగారు చైన్ స్వాధీనం చేసుకున్నారు.

ఎండీఎం డ్రగ్స్ పట్టివేత

పట్నంబజార్: గుంటూరు నగరంలో రక్తసరఫరా చేస్తున్న వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు గుంటూరు పొన్నూరు రోడ్డులో ఎండీఎం మత్తు పదార్థాలను కలిగి ఉన్న ఆరుగురు వ్యక్తులను పాత గుంటూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సుమారు 17 గ్రాముల ఎండీఎంను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారి ఎక్కడి నుంచి డ్రగ్స్ తీసుకువచ్చారు అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

నరసరావుపేటరూరల్: ఏపీ పంచాయతీరాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నరసరావుపేటలోని పీఆర్‌ఐ డివిజన్ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా పెదకూరపాడు డివిజన్ డీఈఈ వైవీ రమేష్ బాబు, ఉపాధ్యక్షుడిగా గురజాల ఏఈఈ ఎల్.శ్రీనివాస్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా పిడుగురాళ్ల ఏఈఈ జి.శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా వినుకొండ సబ్ డివిజన్ ఏఈఈ ఎం.వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నరసరావుపేట పీఆర్‌ఐ డివిజన్ ఈఈ ఎం.వసుంధరలను ఎన్నుకున్నారు. నూతన కమిటీ మూడు సంవత్సరాలపాటు సేవలు అందిస్తుందని ఎన్నికల అధికారి శేషప్పయ్య తెలిపారు. నూతన కార్యవర్గాన్ని అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక

దాచేపల్లి: రాష్ట్రస్థాయి జూడో పోటీలకు సీనియర్ క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా జూడో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శులు కొప్పుల నరసింహారావు, కొప్పుల పార్వతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నరసరావుపేటలో జిల్లాస్థాయి సీనియర్ జూడో జట్టు ఎంపిక ప్రక్రియ జరిగిందని, 60 కేజీల విభాగంలో సిహెచ్ కోరేనాలు, 66 కేజీల విభాగంలో కె.డివైన్స్, 73 కేజీల విభాగంలో పి.మలికార్జునరావు, 81 కేజీల విభాగంలో షేక్ మహబూబ్ మస్తాన్‌వలి, 90 కేజీల విభాగంలో పి.శ్రావణ్‌కుమార్, 100 కేజీల విభాగంలో ఎ.ఆనంద్ సృజన్‌కేరీ, ఎం.సతన్, ఉమెన్స్ విభాగంలో 48 కేజీల విభాగంలో మన్నవ అక్షర, 57 కేజీల విభాగంలో కొప్పుల నవ్యశ్రీ, 63 కేజీల విభాగంలో పసుపులేటి లహరి ప్రతిభ కనబర్చి ఎంపికయ్యారని వారు చెప్పారు. కాకినాడలో ఈ నెల 22, 23 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని వెల్లడించారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

అంబేడ్కర్ మనవడు డాక్టర్ భీమ్ రావ్ యశ్వంత్ అంబేడ్కర్

మాల సంఘీయుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ భీమ్ రావ్ యశ్వంత్ అంబేడ్కర్

విజయపురిసౌత్: రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనవడు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డా.భీమ్ రావ్ యశ్వంత్ అంబేడ్కర్ అన్నారు. స్థానిక మాల మహానాడు అధ్యక్షుడు బొబ్బిలి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విజయపురిసౌత్‌లో ఆదివారం నిర్వహించిన మాల సంఘీయుల ఆత్మీయ సమావేశానికి డా.భీమ్ రావ్ యశ్వంత్ అంబేడ్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక జింఖానా గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన మాలల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలలందరూ ఆర్థికంగా ఎదగాలన్నారు. దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలలో ఆర్‌పీఐ శాఖలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ రాష్ట్రాలలో అంబేడ్కరిజం ఉధృతంగా ఉందన్నారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలలో కూడా ఆర్‌పీఐ శాఖలు ఉన్నాయన్నారు. అప్పట్లో దళిత వర్గాల కోసం అంబేడ్కర్ సమతా సైనిక్‌దళ్‌ను ఏర్పాటు చేశారన్నారు. అంబేడ్కర్ ఏర్పాటు చేసిన ఈ పార్టీలో యువత చేరాలని పిలుపునిచ్చారు. లౌకిక దేశాన్ని బీజేపీ మతతత్వ దేశంగా మారుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఆర్ఎస్, ఆర్పీఐ ఏపీ అధ్యక్షులు ఉప్పులేటి దేవిశ్రీ ప్రసాద్, ఆర్పీఐ ఏపీ–తెలంగాణ పరిశీలకుడు మేజర్ చంద్రకాంత్, జగదీష్, సుదర్శన్, దాసి మల్లికార్జున, ఎన్.కోటయ్యా, మునెయ్య, కాంట్రాక్టర్ లక్షయ్య, రాగిడి రవీంద్ర, బండ్లమూడి స్టాలిన్, పురాణం శ్రీను, పిల్లి రాజబాబు, పత్తి రామచంద్రారావు, విశ్రాంత ఉద్యోగులు, పలు గ్రామాల మాల సంఘీయులు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి

సత్తెనపల్లి: గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన పట్టణంలోని ఎస్వీఆర్ వైన్స్ వద్ద ఆదివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 60 సంవత్సరాల వయసు కలిగిన వృద్ధురాలు ఎస్వీఆర్ వైన్స్ వద్ద మృతి చెంది ఉందన్నారు. మృతదేహాన్ని పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాల మార్చురీ గదిలో పెట్టామన్నారు. ఆమె వివరాలు తెలిసినవారు పట్టణ సీఐ నరహరి నాగమల్లేశ్వరరావు (ఫోన్ నంబరు 9440796230)ను సంప్రదించాలన్నారు.

దేశవ్యాప్తంగా మతోన్మాద, కార్పొరేట్ రాజకీయాలు

- పీడీఎఫ్ మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం
- ఘనంగా గుంటూరు జిల్లా ఆవాజ్ 3వ మహాసభ

మాట్లాడుతున్న పీడీఎఫ్ మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

లక్ష్మీపురం: దేశవ్యాప్తంగా మతోన్మాద, కార్పొరేట్ రాజకీయాలు నడుస్తున్న తరుణంలో దేశ సమైక్యత కోసం సమగ్రత కోసం ఆవాజ్ నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందని పీడీఎఫ్ మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. పాతగుంటూరు నగరంలోని ఆవాజ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం 3వ జిల్లా మహాసభలు నిర్వహించారు. సభలకు ఆవాజ్ జిల్లా అధ్యక్షులు మహబూబ్ సుభాని అధ్యక్షత వహించారు. తొలుత ఆవాజ్ సీనియర్ నాయకులు ఎండీ అక్బర్ పతాకావిష్కరణ చేశారు. మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ మైనారిటీలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారన్నారు. వారికి విద్య, అభివృద్ధి కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రముఖ కవి కరిముల్లా మాట్లాడుతూ మతోన్మాదానికి వ్యతిరేకంగా మైనారిటీలు లౌకికవాదులతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అంబేద్కరిస్ట్ అశోక్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం మత స్వేచ్ఛ ఇచ్చిందని పేర్కొన్నారు. ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిస్టీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. దీని కోసం ఆవాజ్ పోరాడుతుందని పేర్కొన్నారు. మహాసభలో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు కే నళినీకాంత్, కేవీపీఎస్ నాయకులు నవీన్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శి ఎస్కే బాషా కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టగా మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా మహబూబ్ సుభాని, ఎస్కే బాషా తిరిగి ఎన్నికయ్యారు.

బీసీల సమగ్ర కులగణన జరపాలి

ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్

మాట్లాడుతున్న జిల్లా ప్రధానకార్యదర్శి బాపట్ల రవికుమార్

బాపట్ల: స్థానిక సంస్థల ఎన్నికలకు బీసీల జనాభా దామాషా మేరకు చట్టబద్ధ రిజర్వేషన్లు అమలయ్యేలా, రాష్ట్ర ప్రభుత్వం ముందుగా డెడికేటెడ్ కమిషన్ ద్వారా సమగ్ర కుల గణన జరిపించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ పేర్కొన్నారు. సూర్యలంక రోడ్డులోని ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య స్వగృహంలో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పై అంశంపై సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు బీసీ జన గణన– వర్గీకరణలు జరపకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లకూడదని హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. వెంటనే కుల గణన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య మాట్లాడుతూ బీసీల జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు అమలు జరిపి, సామాజిక న్యాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీసీ నాయకులు జీవీఎల్ మోహన్ గౌడ్, కంకణాల రాంబాబు, యు.శ్రీను, దాసు, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ జిల్లా జట్టు ఎంపిక

అచ్చంపేట: రాష్ట్రస్థాయిలో జరిగే రెజ్లింగ్(కుస్తీ) పోటీలకు పల్నాడు జిల్లా నుంచి సీనియర్ పురుషుల, సీనియర్ మహిళల జట్లను స్థానిక ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఆదివారం ఎంపిక చేసినట్లు పల్నాడు జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి గుడిపూడి భూషణం తెలిపారు. సీనియర్ పురుషుల జట్టుకు కె.శివనాగరాజు(గుళ్లపల్లి), టి.రోహిత్ (అత్తలూరు), ఎన్.శ్రీకర్(గోరంట్ల), టి.మరియబాబు(దొడ్లేరు), బి.విజయబాబు(కాజ), వై.వంశీ(ఇనుమెట్ల), ఎం.అఖిల్(పిడుగురాళ్ల), వై.మారుతీకుమార్(అచ్చంపేట), ఎం.సూర్యకాంత్(అచ్చంపేట) వై.మల్లికార్జున(లోయపల్లి), పి.చంటి(బాలేమర్రు), ఎన్.విజయకుమార్(వేల్పూరు), కె.భరత్‌కుమార్(రావిపాడు), కె.ప్రభాకర్(ఓబులేసుపల్లి) తదితరులు ఎంపికయ్యారు. మహిళల సీనియర్ విభాగంలో ఎన్.స్నేహస్వరూప(అంగలకుదురు), జి.నితీష(రెంటపాళ్ల) తదితరులు ఎంపికైయ్యారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబరు 2, 3వ తేదీల్లో చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని గుడిపూడి భూషణం తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్: 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

TOURS & TRAVELS

■ ఇండియన్ రైల్వేస్ –శబరిమల మరియు అరుణాచలానికి ప్రత్యేక రైలు, 10.12.25 న ప్రారంభం. రూ. 8,500 – 2SL, 3AC, 2AC, 1AC కలవు. వివరాలకు 93550 21516 www.tourtimes.in

WANTED

■ గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు 10th Pass, 35సం॥వయస్సు పైబడిన వారు, గృహిణులు కావలెను. 9989909698

■ గుంటూరు సిటీలోని సత్యదయ అసోసియేట్స్ నందు జాబ్ చేయుటకు మండలాల వారీగా స్త్రీ/ పు కావలెను. 9912059165

■ గుంటూరు పరిసర ప్రాంతాల్లో ప్రముఖ పురుగు మందుల కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 15000+3000. సం॥ 9121469383

■ గుంటూరు సిటీలో తెలుగు ఇంగ్లీషు టైపు ఫాస్ట్ గా చేయగలిగిన లేడీ టైపిస్ట్ కావలెను. 9666933337.

■ గుంటూరు కొత్తపేటలోని హాస్పటల్ నందు ANM, GNM M/F Work అనుభవం ఉన్న నర్సింగ్ స్టాఫ్, నర్సింగ్ ఇన్‌చార్జ్ Female కావలెను. 7997777108

■ Wanted Accounts Executive to work a reputed company at Guntur. Mini. 2 to 3 year experience in tally. Cont: 91333 99257

■ Wanted MBA Marketing / Business Development / supply chain management to work a reputed company at Guntur. mini 2 years experience. Contact: 91333 99257

■ పెదకాకానిలో వికలాంగుల ఆశ్రమంలో పనిచేయుటకు 10th ఇంటర్ చదివిన యువతి యువకులు & వంటవారు కావలెను. 95500 29851

■ త్రివేణీహోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి భోజనం జీ: 18K-20K . Ph: 9640400073, 9160900024

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక

క్లుప్తంగా

నేడు వన సమారాధన

తాడేపల్లి రూరల్: కార్తిక వన సమారాధనను కీర్తిశేషులు కళ్లం రత్తారెడ్డి, తులసమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కళ్లం రత్తారెడ్డి, తులసమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ కల్యాణ మండపం రోడ్డులోని ఆశ్రమం పక్కన ఉదయం 10 గంటలకు కార్తిక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామని.. మధ్యాహ్నం 12 గంటలకు విందు ఏర్పాటు చేస్తున్నామని.. ప్రతి ఒక్కరూ వన సమారాధనకు ఆహ్వానితులే అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

భజన బృందాలకు సత్కారం

మంగళగిరి టౌన్: మంగళగిరి శ్రీ గంగాభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో కార్తికమాసాన్ని పురస్కరించుకుని శివ భక్తబృందం ఆధ్వర్యంలో జరిగిన శివనామ అర్ధ ఏకాహం భజనలో పాల్గొన్న భజన బృందాలను ఆదివారం శివ భక్తబృందం ఘనంగా సన్మానించారు. భజనలో పాల్గొన్న బృందాల ప్రతినిధులకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో గోపి, ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బోగి కోటేశ్వరరావు, పురోహితులు శ్యామసుందర శాస్త్రి, శివ భక్తబృందం ప్రతినిధులు నాగమయ్య, శివప్రసాద్, గోపాలకృష్ణ, గోవిందు పాల్గొన్నారు.

కార్మెల్ కొండపై విశ్వాసుల సందడి

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై గల కార్మెల్‌మాతను ఆదివారం పలు ప్రాంతాల నుంచి వచ్చిన విశ్వాసులు దర్శించుకున్నారు. కొండను ఎక్కి తలనీలాలు సమర్పించారు. కార్మెల్‌మాత వద్ద కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ దిగువ భాగంలో ఉన్న మరియమాత వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. అధిక సంఖ్యలో విశ్వాసులు రావడంతో కొండపై సందడి వాతావరణం నెలకొంది.

వడ్డమానులో ఆలయ శంకుస్థాపన

తాడికొండ: తుళ్లూరు మండలం వడ్డమాను గ్రామంలో శ్రీ విజయ దుర్గాభవానీ నూతన దేవాలయ శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు గోపాల చారి స్వామి వారితో విశిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించగా వేదపండితులు హోమాలు, అభిషేకాలు జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

దుగ్గిరాల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. సేకరించిన వివరాల ప్రకారం.. పేరుకలపూడి ఎస్సీ కాలనీలో ఓ పూరిల్లు శనివారం అర్ధరాత్రి పూర్తిగా దగ్ధమైంది. బాధితురాలైన శృంగారంపాటి లక్ష్మీ తన కుమార్తె, ఇద్దరు మనువళ్లతో పూరింట్లో జీవనం సాగిస్తుంది. అర్ధరాత్రి విద్యుత్ మీటరు నుంచి మంటలు రావడంతో బాధితులు పెద్దగా అరుస్తూ బయటకు వచ్చారు. తాటాకు ఇల్లు కావడంతో పూర్తిగా నేలమట్టం అయ్యింది. సుమారుగా రూ.75 వేలు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. కట్టు బట్టలు మాత్రమే మిగిలాయని.. తమను ఆదుకోవాలంటూ కన్నీటిపర్యంతం చెందారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తెనాలి రూరల్: పట్టణ బుర్రిపాలెం రోడ్డులో ఆదివారం ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్ బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. జామియా మసీదు మౌజన్ అస్లాం టూ వీలర్‌పై వెళుతుండగా బుర్రిపాలెం రోడ్డులోని పశు వైద్యశాల సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో అస్లాంకు తీవ్ర గాయాలు కాగా ఎదురుగా బైక్‌పై వచ్చిన మరో యువకుడు కూడా గాయపడ్డాడు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

- వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు
- కోటి సంతకాల సేకరణకు విశేష స్పందన
- డైమండ్ బాబును కలిసిన రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి, నాయకులు

డైమండ్ బాబుకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న అబ్దుల్ రసూల్, నాయకులు

తాడికొండ: రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శిగా నియమితులైన గండికోట అబ్దుల్ రసూలు ఆదివారం వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు (డైమండ్)ను మర్యాదపూర్వకంగా కలిశారు. మండల పార్టీ అధ్యక్షులు తాళ్లూరి వంశీకృష్ణతో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. తమపై నమ్మకంతో పార్టీ పదవి ఇచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వనమా ఈ సందర్భంగా నాయకులను కోరారు.

ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ..

మంగళగిరి టౌన్: ప్రైవేటీకరణ పేరుతో పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడం తగదని మంగళగిరి మండల వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. మంగళగిరి మండల పరిధి ఆత్మకూరులో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గ్రామ అధ్యక్షులు కొల్లి శ్యామ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆత్మకూరు సెంటర్ నుంచి గ్రామ పరిధిలోని కొత్తపేటలో గడప గడపకూ తిరిగి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. చంద్రబాబు సర్కార్ దోచుకోవడానికే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ చేస్తోందని విమర్శించారు. పేద విద్యార్థులకు వైద్యవిద్య దూరం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కోటి సంతకాల సేకరణకు క్షేత్రస్థాయి నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు విజయ్ కుమార్, సాంబశివరావు, కిషోర్‌రెడ్డి, ప్రేమ్‌చంద్, సుధారాణి, నీలిమ, ఏసుబాబు, కోటేశ్వరరావు, చిన్న, శ్రీకాంత్, టి.బుజ్జిబాబు, జె.బుజ్జిబాబు, యేసుబాబు, బాలకృష్ణ, ప్రభుదాస్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

17వ వార్డు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు

ఆత్మకూరులో సంతకాల సేకరణలో పాల్గొన్న పార్టీ నాయకులు

తాడేపల్లి రూరల్: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఇంటింటా సంతకాల సేకరణ చేపట్టారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధి 17వ వార్డులో మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు, పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి ఆదేశాల మేరకు 17వ వార్డు అధ్యక్షులు ఈటె శాంతారావు వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానిక యువకులను కలుపుకొని ప్రభుత్వం పేద ప్రజలకు చేస్తున్న నష్టాన్ని వివరిస్తూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో తొట్టెంపూడి వికాస్, బల్లారి నాగరాజు, యర్రమల్లెల సంతోష్, అరుణ్ కుమార్, కూడలి విజయ్, అజయ్, తొట్టెంపూడి విశాల్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో ఈనెల 23, 24వ తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. బ్రహ్మానందపురంలో మహాసభ ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు బాబుప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఈ మహాసభలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు వేముల దుర్గారావు, స్టీవెన్, సాంబయ్య, నాగేశ్వరరావు, సూర్యప్రకాష్, దుర్గాభవానీ, రమాదేవి, నవనీతం, హిమాంబి, మల్లేశ్వరి, గురవయ్య, బాష, సుభానీ, ఆశీర్వాదం, సుబ్బారావు, శారద పాల్గొన్నారు.

ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

సామూహిక సత్యనారాయణ వ్రతం నేడు

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణంలో కొలువైయున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి దేవస్థానంలో ఉదయం 9 గంటలకు వ్రతాలు నిర్వహిస్తున్నామని.. ఎటువంటి రుసుము లేదని.. ఆసక్తి గల వారు వ్రతంలో పాల్గొనవలసినదిగా ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆక్వా డెవిల్స్‌లో డాక్టర్ రాజ్‌కుమార్ వర్ధంతి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధి ఉండవల్లి–అమరావతి కరకట్ట వెంబడి గల ఆక్వా డెవిల్స్‌లో మెంబర్‌గా, డాక్టర్‌గా సేవా భావంతో పనిచేస్తున్న డాక్టర్ ఆకుల రాజ్‌కుమార్ ప్రథమ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆక్వా డెవిల్స్ నిర్వాహకులు మాట్లాడుతూ.. రాజ్‌కుమార్ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఎంతో మందికి సహాయ సహకారాలు అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆకుల శ్రీనివాస్‌కుమార్, ఆక్వా డెవిల్స్ సభ్యులు బోడేపూడి కోటేశ్వరరావు, వెలగపూడి వెంకటేశ్వరరావు, పంచవటి వెంకటేశ్వరరావు, ప్రసాద్ బాబు, రాంబాబు, గఫూర్, ఉమా మహేశ్వరరెడ్డి, అల్లంపూర్ణ, రెడ్డిపల్లిసురేష్, క్రాంతికుమార్, హుమాయూన్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ఫిరంగిపురం కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్తమ్మ

తాడికొండ: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని తాడికొండ గ్రంథాలయాధికారులు కె.చిన్నప్ప రెడ్డి, ఎ.నాగమల్లేశ్వరి అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు చింతల భాస్కరరావు రంగారావు, బాబురావు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: కవులు సమాజానికి దిక్సూచీలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్తమ్మ అన్నారు. మండల కేంద్రంలోని గాలిబాలి శాఖగ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వి.సుబ్బరత్తమ్మ పాల్గొని మాట్లాడారు. ముందుగా గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణంల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఐవీ దుర్గారెడ్డి, గౌరవ అతిథి అలీగర్ ముస్లిం యూనివర్సిటీ (ఉత్తరప్రదేశ్) రిటైర్డ్ ప్రొఫెసర్ షేక్ మస్తాన్, కొండవీటి రచయితల సంఘం అధ్యక్షుడు మహ్మద్ రఫీ, సాహిత్యరత్న యనమాల సుందర్, ఎం.జోసఫ్, వి.శౌరీలు, పర్చూరి కృష్ణభార్గవి, టి.గోవిందయ్య, ఆలా వెళాంగిణిరాజు, షేక్ బాబుమస్తాన్, వెంకటరెడ్డి, షేక్ ఖాజావలి, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం తాడేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి షేక్ నాగూర్ బాషా మాట్లాడుతూ.. మూడో రోజు కార్యక్రమంలో భాగంగా సీనియర్స్ విభాగంలో విద్యార్థులకు 'నేటి రాజకీయాలు.. విద్యార్థులపై ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించామని తెలిపారు. ముఖ్యఅతిథిగా శ్రీభగవాన్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు కానూరి శ్రీనివాసరావు విచ్చేసి విద్యార్థులకు పలు సూచనలు చేశారని పేర్కొన్నారు.

తాడికొండలో నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారులు, గ్రామస్తులు

విద్యార్థులకు సూచనలు చేస్తున్న కానూరి శ్రీనివాసరావు

తిరుపతికి బస్సు సర్వీస్ ప్రారంభం

మంగళగిరి టౌన్: మంగళగిరి నుంచి తిరుపతికి బస్ సర్వీస్‌ను ప్రారంభించినట్లు డిపో మేనేజర్ ఆర్.పిచ్చయ్య తెలిపారు. మంగళగిరి బస్టాండ్ నుంచి సూపర్ లగ్జరీ సర్వీస్‌ను శనివారం రాత్రి ప్రారంభించారు. డీఎం పిచ్చయ్య, సిబ్బంది, ప్రయాణికులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి లాంఛనంగా సర్వీస్‌ను ప్రారంభించారు.



విఘ్నేశ్వరుడి ఆలయంలో అన్నసమారాధన

తెనాలి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపాన బాలాజీరావుపేటలో గల శ్రీ సిద్ధి విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకొని చెరుకూరి రమేష్ బాబు మిత్ర బృందం ఆదివారం అన్న సంతర్పణ నిర్వహించింది. ముఖ్య అతిథులుగా త్రీటౌన్ సీఐ సాంబశివరావు, టీడీపీ నాయకుడు రావి కృష్ణమోహన్ హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు. సిద్ధి విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. రమేష్‌బాబు సేవలను అభినందించారు. ఆలయం వద్ద గత పన్నెండేళ్లుగా కార్తిక మాసంలో అన్నదానాన్ని చేస్తున్నట్టు రమేష్‌బాబు చెప్పారు. ఆలయ అర్చకులు మల్లికార్జునరావు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. స్వామికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మొవ్వ పున్నయ్య, లక్ష్మీనారాయణ గురుస్వామి, చిలక మేస్త్రి, దొండపాటి కోటేశ్వరరావుస్వామి తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

తెనాలి: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక గుంటూరు కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పినపాడులో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం నిర్వహించారు. దైవజ్ఞానం ప్రకారం కులాలు అహేతుకం అని, మతాలు నిషిద్ధం అని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానాన్ని తెలియజేస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కర్మ యోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలనే ముఖ్య ఉద్దేశంతో భగవద్గీత ప్రచారం చేస్తున్నామని చెప్పారు. మన శరీరంలో దేవుడు మూడు ఆత్మలుగా విభజింపబడి ఉన్నాడని జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతం అని వివరించారు. భగవద్గీతలో కర్మ యోగం, బ్రహ్మ యోగం, భక్తి యోగం అనేవి దైవధర్మాలు అని, వాటి ప్రకారం నడుచుకుంటే కర్మ నుంచి బయట పడేసి మనిషికి ముక్తినిస్తాయని వివరించారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి –ఇందూ జ్ఞాన వేదిక జిల్లా కమిటీ అధ్యక్షుడు, సభ్యులు రౌతు శ్రీనివాసరావు, టీవీ కృష్ణారావు, బి.శివలింగం నాయక్, జె.హరిబాబు, ఫణిదరం శివ, పట్టాభి శ్రీను, మౌనిక, షేక్ దిల్షాద్, జి.విద్య, ఎ.శ్రీలక్ష్మి, వి.మహాలక్ష్మి పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

తెనాలి రూరల్: పట్టణంలోని రౌడీషీటర్లకు త్రీ టౌన్ సీఐ ఎస్. సాంబశివరావు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. అందరూ సత్ప్రవర్తనతో మెలగాలని, అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులు అందరిపై నిఘా ఉంటుందని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)

Office mail : sakshigntadvt@gmail.com

'పొరుగువారి హక్కులు' పోస్టర్ ఆవిష్కరణ

మంగళగిరి టౌన్: జమాఅతె ఇస్లామీ హింద్ (జేఐహెచ్) ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన పొరుగువారి హక్కుల కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆదివారం మంగళగిరి నగరంలోని జేఐహెచ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఐహెచ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్దుల్ రషీద్ మాట్లాడుతూ.. ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, ఐక్యత, స్నేహపూర్వక సంబంధాలు పెంపొందాలంటే ప్రతి వ్యక్తి తన ఇరుగు పొరుగు వారితో సత్సంబంధాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. దేశ ప్రజల మధ్య సామరస్యపూర్వక వాతావరణం కలుగజేయడమే ఈ ఉద్యమ ముఖ్య ఉద్దేశ్యమని తెలియజేశారు. కార్యక్రమంలో జేఐహెచ్ మంగళగిరి శాఖ అధ్యక్షులు అబ్దుల్ అజీమ్, ఉద్యమ కన్వీనర్ అహమ్మద్ హుస్సేన్ షరీఫ్, నిజాముద్దీన్, యూసఫ్, కరిముల్లా, అల్లాబక్షు, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేఐహెచ్ ప్రతినిధులు

రాజధానిలో బీసీలకు భూములు కేటాయించాలి

మంగళగిరి టౌన్: రాజధానిలోని బీసీ అన్ని సామాజిక వర్గాలకు భూములు కేటాయించి ఆత్మగౌరవ భవనాలను నిర్మించి ఇవ్వాలని భారత చైతన్య యువజన పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. మంగళగిరి నగరపరిధి హేపీ రిసార్ట్స్‌లో ఆదివారం నిర్వహించిన యాదవ కార్తిక వన సమారాధనలో ఆయన పాల్గొన్నారు. బీసీలకు జరుగుతున్న తీవ్ర అన్యాయాలు, ప్రభుత్వాల ధ్వంద్వ వైఖరిపై తన గళాన్ని వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజధానిపై స్పష్టత ఇవ్వకుండా పెట్టుబడుల పేరుతో మాయాజాలం సృష్టిస్తూ ప్రజల భవిష్యత్తు, రాష్ట్రానికి వెన్నుముక అయిన బీసీల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పలువురు యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామచంద్ర యాదవ్

కార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలి

దీక్షా శిబిరంలో కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్య పట్ల ప్రభుత్వం అలసత్వం విడనాడి కార్మికుల సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు బాబుప్రసాద్ అన్నారు. కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, కార్మిక నాయకులు స్టీవెన్, సాంబశివరావు, సుభానీలతో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించి మద్దతు తెలియజేశారు. కార్మికులకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం పరిష్కరించకపోవడం దారుణమని బాబుప్రసాద్ అన్నారు. తుపాకుల నాగేశ్వరరావు, హగ్గయ్య, బాషా, యహోషువా, డి.నాగేశ్వరరావు, దుర్గారావు, కృష్ణ, ఖాసిం, గురవయ్య, ఇస్మాయిల్, వై.సాంబశివరావు, సూర్యప్రకాష్ పాల్గొన్నారు. దీక్షలో వేముల రోజా, లక్ష్మీ, రమణమ్మ, శారద, నవనీతమ్మలు కూర్చున్నారు.

అఖిల భారత మహా సభలను జయప్రదం చేయాలి

తాడికొండ: విశాఖపట్నంలో జరిగే అఖిల భారత మహా సభలను జయప్రదం చేయాలని రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎం.రవి పిలుపునిచ్చారు. రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మికుల విస్తృత సమావేశం తుళ్లూరు లోని సీఐటీయూ కార్యాలయం వద్ద సంఘం అధ్యక్షురాలు సీహెచ్ సుశీల అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఐక్య పోరాటం నినాదంతో అన్ని సమరశీల పోరాటాల్లో అగ్రభాగాన నిలుస్తున్నటువంటి సీఐటీయూ అఖిల భారత 18వ మహా సభలు డిసెంబరు 31వ తేదీ నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్నాయన్నారు. సీఐటీయూ రాజధాని డివిజన్ కన్వీనర్ ఎం.భాగ్యరాజు మాట్లాడుతూ.. రాజధాని పారిశుద్ధ్య కార్మికులు సంఘటితంగా ఉండి సంఘం ఆధ్వర్యంలో పోరాడడం వల్ల పలు సమస్యలను పరిష్కరించుకోగలిగారని వివరించారు. సమావేశంలో సంఘం కార్యదర్శి కుంభ గోపిరాజు, సంగం నాయకులు లేళ్ల సుఖవేణి, ఎన్.వీర్లంకమ్మ, అరుణ, అనురాధ, జ్యోతి, విజయకుమార్, ఎన్.కోటేశ్వరరావు, ముత్యాలు, పాములు, సామ్రాజ్యం, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాతున్న రవి

భక్తిశ్రద్ధలతో బ్రాహ్మణ వన సమారాధన

తాడేపల్లి రూరల్: ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి గల గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో ఆదివారం బ్రాహ్మణ వ్యాపారుల కార్తిక వనసమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, ఏపీ ప్లానింగ్ బోర్డ్ మాజీ చైర్మన్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మల్లాది విష్ణువర్ధన్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కార్తిక వనసమారాధన సందర్భంగా సాంప్రదాయ బద్ధంగా కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మల్లాది బ్రాహ్మణులతో కలిసి విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కమిటీ సభ్యులు మల్లాది విష్ణును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం పెద్దలు లక్ష్మీపతి, శర్వాణి మూర్తి, చల్లా సుధాకర్, పరిమిగిరి, బుర్రా ఫణి, తోనేపూడి శ్రీనివాసరావు, చాంద్, సుధాకర్ పాల్గొన్నారు.

మల్లాది విష్ణును సత్కరిస్తున్న బ్రాహ్మణ సంఘం పెద్దలు



సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో
ఉచితంగా 'ఇండియన్ పాలిటీ' స్టడీ మెటీరియల్..!
యూపీఎస్సీ, టీజీపీఎస్సీ, ఏపీపీఎస్సీ, ఎస్సై, కానిస్టేబుల్ తదితర ఉద్యోగ పరీక్షల్లో అత్యంత కీలకమైన సబ్జెక్టు ఇండియన్ పాలిటీ. దాని పూర్తి అప్‌డేటెడ్ సిలబస్ ఇప్పుడు సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో చాప్టర్ల వారీగా అందుబాటులో ఉంది. ఈ విలువైన స్టడీ మెటీరియల్‌ను అభ్యర్థులు ఉచితంగా పొందేందుకు sakshieducation.com చూడొచ్చు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఈ స్టడీ మెటీరియల్‌ను నేరుగా చదువుకోవచ్చు.

ఏఐ అవకాశమే.. అప్రమత్తత అవసరం



నైపుణ్యాల పెంపు కోసం ఏఐపై దృష్టి పెట్టాలి
లెర్నింగ్ స్థాయిలో అతిగా ఆధారపడొద్దు
బీఎంఎల్ ముంజాల్ యూనివర్సిటీ ప్రొ-ఛాన్స్‌లర్, ఎడ్‌టెక్ సంస్థ హీరోవైర్డ్ ఫౌండర్ అక్షయ్ ముంజాల్

'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో నైపుణ్యాలు కొత్త అవకాశాలను అందిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ అకడమిక్ లెర్నింగ్ స్థాయి నుంచే ఏఐ టూల్స్‌పై ఆధారపడితే స్వీయ నైపుణ్యాలు మరుగున పడే ప్రమాదం ఉంది. దీన్ని యువత, ఉద్యోగార్థులు గమనించాలి' అంటున్నారు.. ప్రముఖ టూవీలర్స్ సంస్థ హీరోమోటోకార్ప్ నెలకొల్పిన బీఎంఎల్ ముంజాల్ యూనివర్సిటీ ప్రొ-ఛాన్స్‌లర్, ఆ సంస్థ ఆధ్వర్యంలోనే నెలకొల్పిన ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ హీరోవైర్డ్ వ్యవస్థాపకులు అక్షయ్ ముంజాల్. అమెరికాలో ఎంబీఏ పూర్తి చేసిన ఆయన.. తమ హీరోమోటోకార్ప్ ద్వారా విద్యార్థులకు లెర్నింగ్ సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో హీరోవైర్డ్ సంస్థను నెలకొల్పారు. అదే విధంగా బీఎంఎల్ ముంజాల్ యూనివర్సిటీ నిర్వహణ బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం అంతా డిజిటల్‌మయం అవుతున్న పరిస్థితుల్లో విద్యార్థులు, ఉద్యోగార్థులు అనుసరించాల్సిన వ్యూహాలపై అక్షయ్ ముంజాల్‌తో ఇంటర్వ్యూ..

విద్యార్థులు, ఉద్యోగార్థులు ఆన్‌లైన్ లెర్నింగ్ కోణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు?

రోజు రోజుకీ కొత్త టెక్నాలజీలు, కొత్త నైపుణ్యాల ఆవశ్యకత పెరుగుతోంది. వీటిని అందిపుచ్చుకోవడానికి ఆన్‌లైన్ మాధ్యమాలు ప్రధాన మార్గంగా నిలిచాయి. అయితే వీటిని ఎంచుకునే సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్న ప్లాట్‌ఫామ్ విశ్వసనీయత, భాగస్వామ్య ఒప్పందాలు, ఆ కోర్సుల్లో ఉన్న మాడ్యూల్స్ వంటి వాటిని క్షుణ్నంగా పరిశీలించాలి. అవి తమ అకడమిక్ కోర్సులకు, అవసరమైన జాబ్ స్కిల్స్‌కు అనుగుణంగా ఉన్నాయని భావిస్తేనే వాటి వైపు అడుగులు వేయాలి. ఎడ్‌టెక్ సంస్థలు అందించే కోర్సులకు సర్టిఫికేషన్ సదుపాయం ఉండేలా చూసుకోవాలి. సర్టిఫికేషన్ లేకుండా కోర్సు పూర్తి చేస్తే.. ఉద్యోగ ప్రయత్నాల్లో దాన్ని గుర్తించేలా చేయడం కష్టమవుతుంది. ఇప్పుడు పలు సాఫ్ట్‌వేర్ సంస్థలు ఎడ్‌టెక్ సంస్థల భాగస్వామ్యంతో సర్టిఫికేషన్ కోర్సులు అందిస్తున్నాయి. వీటిని పూర్తి చేసుకునేలా కృషి చేస్తే ప్రయోజనం ఉంటుంది.

ఎడ్‌టెక్‌లో ఉపాధి ఎలా ఉండనుంది?

గత అయిదేళ్లుగా ముఖ్యంగా కోవిడ్ తర్వాత దేశంలో ఎడ్‌టెక్ రంగం శరవేగంగా వృద్ధి చెందుతోంది. కోవిడ్ సమయంలో అనివార్యంగా మారిన ఎడ్‌టెక్, ఆన్‌లైన్ లెర్నింగ్ విధానాలు.. ఇప్పుడు సర్వ సాధారణంగా మారాయి. కె-12 స్థాయిలోనే ఆన్‌లైన్ లెర్నింగ్ టూల్స్ అందుబాటులోకి రావడమే ఇందుకు నిదర్శనం. ఒకప్పుడు పోటీ పరీక్షల కోసం కోచింగ్ కేంద్రాలకు వెళ్లే వారు ఇప్పుడు ఎడ్‌టెక్, ఇతర ఆన్‌లైన్ లెర్నింగ్ మాధ్యమాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఇవి విస్తరిస్తున్నాయి. ఫలితంగా ఈ విభాగంలోనూ కొలువులు అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా ఫెసిలిటేటర్స్, ట్యూటర్స్ వంటి కోర్ ప్రొఫైల్స్‌తోపాటు.. బ్యాక్ ఎండ్‌లో అవసరమైన ప్రోగ్రామర్స్, సాఫ్ట్‌వేర్ సర్వీస్ ఇంజనీర్ వంటి ప్రొఫైల్స్‌లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. దేశంలో భారీ నుంచి చిన్న తరహా వరకు దాదాపు 20 వేల ఎడ్‌టెక్ సంస్థలు ఉన్నాయి. వీటిలో ఒక్కోదాంట్లో సగటున ఐదుగురికి ఉపాధి లభిస్తుందనుకుంటే.. మొత్తం అవకాశాలు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చు.

అక్షయ్ ముంజాల్

జాబ్ రెడీ స్కిల్స్ విషయంలో యువత దృక్పథంపై మీ అభిప్రాయం?

ఈ విషయంలో యువతలో గణనీయ మార్పు కనిపిస్తోంది. ఈ ఏడాది ప్రారంభంలో మేం నిర్వహించిన సర్వే ప్రకారం- దాదాపు 82 శాతం మంది యువత జాబ్ రెడీ స్కిల్స్ పెంచుకోవాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఇదే వారిలో మార్పునకు నిదర్శనం. జాబ్ మార్కెట్‌లో సంప్రదాయ డిగ్రీలకంటే ప్రాక్టికల్ స్కిల్స్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఉందనే అంశాన్ని వారు గుర్తించారు. అదే విధంగా 65 శాతం మంది తమ డిగ్రీలు.. తాము కోరుకుంటున్న ఉద్యోగ విధులకు ఉపయోగపడడం లేదని పేర్కొన్నారు. దీంతో వారు జాబ్ రెడీ స్కిల్స్ పెంచుకోవడంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.

ఉద్యోగ సాధనలో ఏఐ నైపుణ్యాలు పెంచుకోవడానికి ఏం చేయాలి?

ఉద్యోగ సాధనలో నిర్దిష్టంగా ఒక ప్రొఫైల్‌లో కొలువు దీరాలంటే.. ఏఐ నైపుణ్యాలు ఆవశ్యకంగా మారుతున్న మాట వాస్తవం. కాబట్టి ఉద్యోగార్థులు ముఖ్యంగా ఐటీ జాబ్ సీకర్స్.. తాము అడుగు పెట్టాలనుకుంటున్న విభాగం, తమ అకడమిక్ అర్హతలను బట్టి ఎలాంటి టూల్స్ వినియోగిస్తున్నారు? వాటిని నేర్చుకోవడానికి అందుబాటులో ఉన్న మార్గాలేంటి? వంటి వాటిని అన్వేషించి.. సరైన వేదికను ఎంచుకోవాలి. అదే విధంగా ప్రోగ్రామింగ్, కోడింగ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. మిగతా రంగాలకు చెందిన అభ్యర్థులు ఆయా విభాగాల్లో ఏఐ టూల్స్ అప్లికేషన్స్ విధానాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

ఉద్యోగార్థులు జాబ్ మార్కెట్‌లో ముందంజలో నిలవడానికి మీరిచ్చే సలహా?

ఎలాంటి ఉద్యోగంలో ముందంజలో నిలవాలన్నా.. నిరంతరం తమ స్కిల్స్‌ను పెంచుకునేలా కృషి చేయడమే ఎంతో ముఖ్యం. ప్రతి ఒక్కరు అప్ స్కిల్లింగ్‌పై దృష్టి పెట్టాలి. తాము క్లాస్‌రూమ్‌లో నేర్చుకున్న అంశాలకు మరింత అడ్వాన్స్‌డ్ నైపుణ్యాలు పొందేలా అప్‌స్కిల్లింగ్ మార్గాలపై దృష్టి పెట్టాలి. ప్రాక్టికల్ లెర్నింగ్ ఉపయోగంగా ఉంటుంది. ఇంటర్న్‌షిప్స్, ప్రాజెక్ట్ వర్క్స్ వంటి వాటిని కచ్చితంగా పూర్తి చేసేలా వ్యవహరించాలి. ఫలితంగా వాస్తవ పరిస్థితులపై అవగాహనతోపాటు లేటెస్ట్ నైపుణ్యాలతో ముందంజలో నిలిచే అవకాశం ఉంటుంది.

ఏఐ టూల్స్ వల్ల విద్యార్థులు, ఉద్యోగార్థులపై ఎలాంటి ప్రభావం పడుతుంది?

ఇటీవల కాలంలో అన్ని రంగాల్లో ఏఐ టూల్స్ ఆధారంగా కార్యకలాపాలు జరుగుతున్నాయి. దీంతో ఉద్యోగ సాధనలో ఏఐ టూల్స్ నైపుణ్యాలు పెంచుకోవాల్సిన ఆవశ్యకత పెరిగింది. రెజ్యూమే రైటింగ్ నుంచి ఇంటర్వ్యూలో విజయం వరకు ఏఐ ప్రమేయం కనిపిస్తోంది. కాబట్టి తమకు ఏ టూల్స్‌లో నైపుణ్యం అవసరమో స్పష్టత ఏర్పరచుకోవాలి. ఇందుకోసం నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవాలి.

అకడమిక్స్‌లో ఏఐ ప్రాధాన్యతపై మీ అభిప్రాయం?

అకడమిక్ స్థాయిలోనే ఏఐ టూల్స్ వినియోగం వల్ల విద్యార్థుల్లోని సహజ నైపుణ్యాలు మరుగున పడే ప్రమాదం ఉంది. విద్యార్థులు, ఉద్యోగార్థులు స్వీయ ఆలోచన శక్తికి పని పెట్టకుండా.. తక్షణ సమాచారం వైపు అడుగులు వేస్తున్నారు. దీంతో ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, క్రియేటివ్ థింకింగ్ నైపుణ్యాలు లోపించే ఆస్కారముంది. అకడమిక్ లెర్నర్స్ అయినా.. ఉద్యోగార్థులైనా.. ఏఐ టూల్స్‌ను ఒక అంశానికి సంబంధించి సమాచార సేకరణకు మాత్రమే వినియోగించాలి. ఆ సమాచారం ఆధారంగా స్వీయ అధ్యయనం చేయాలి. అప్పుడు విస్తృత అవగాహన ఏర్పడడమే కాకుండా.. అప్లికేషన్ అప్రోచ్ సామర్థ్యాలు పెరుగుతాయి.

Q&A

ప్రైవేటు పైలెట్ ఆఫీసర్ కోర్స్ చేయాలి అని అనుకుంటున్నాను. ఎలా ప్రిపేర్ అవ్వాలి? ఏం చదవాలి? ఎక్కడ సంప్రదించాలి? తెలియజేయగలరు. - వినయ్

విమానయాన రంగం పట్ల ఆసక్తి ఉన్నవారికి ఆకాశమే హద్దు. చాలా మంది విద్యార్థులు పైలట్ కావాలని కలలు కంటారు. అయితే మొదటి దశలో ప్రైవేట్ పైలట్ లైసెన్స్ (పీపీఎల్) పొందడం ఎంతో ముఖ్యం. ఇది విమానయాన కెరీర్‌లో తొలి మెట్టుగా చెప్పుకోవచ్చు. ఇది ఒక నాన్- కమర్షియల్ లైసెన్స్. దీని ద్వారా వ్యక్తిగత ప్రయాణాలు లేదా ఫ్లయింగ్ క్లబ్ విమానాలను నడపవచ్చు. అయితే దీని ద్వారా ప్రయాణికులను వాణిజ్య ప్రయోజనాల కోసం తరలించడం సాధ్యం కాదు. పీపీఎల్ సాధారణంగా కమర్షియల్ పైలట్ లైసెన్స్ వైపు తీసుకెళ్లే మొదటి మెట్టు.

వయసు: కనీసం 17 సంవత్సరాలు ఉండాలి.
విద్యార్హత: ఇంటర్మీడియెట్ (10+2)లో ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ తప్పనిసరి.
వైద్య అర్హత: డీజీసీఏ క్లాస్ 2 మెడికల్ సర్టిఫికెట్ ఉండాలి. (ఇది శారీరక, మానసిక ఆరోగ్య ప్రమాణాల నిర్ధారణ కోసం ఉంటుంది.)
భాషా ప్రావీణ్యం: ఇంగ్లీష్‌లో చదవడం, మాట్లాడడం, రాయడం రావాలి.
ఎక్కడ చదవాలి: పీపీఎల్ పొందడానికి డీజీసీఏ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) ఆమోదించిన ఫ్లయింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరాలి.

భారతదేశంలోని ప్రసిద్ధ ఫ్లయింగ్ అకాడమీలు ఇవి:
1. ఇందిరా గాంధీ రాష్ట్రీయ ఉరాన్ అకాడమీ (ఐజీఆర్‌యూఏ) – రాయ్‌బరేలి, ఉత్తర ప్రదేశ్
2. రాజీవ్ గాంధీ ఏవియేషన్ అకాడమీ – హైదరాబాద్, తెలంగాణ
3. బాంబే ఫ్లయింగ్ క్లబ్ – ముంబై, మహారాష్ట్ర
4. ఓరియంట్ ఫ్లైట్ స్కూల్ – పాండిచ్చేరి
5. చైమ్స్ ఏవియేషన్ అకాడమీ – ధనా, మధ్యప్రదేశ్
6. అహ్మదాబాద్ ఏవియేషన్ అండ్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ – గుజరాత్
7. మధ్యప్రదేశ్ ఫ్లయింగ్ క్లబ్ – ఇండోర్ / భోపాల్

ట్రైనింగ్ దశలు
1. డీజీసీఏ క్లాస్ 2 మెడికల్ టెస్ట్
2. డీజీసీఏ ఆమోదించబడిన ఫ్లయింగ్ స్కూల్ అడ్మిషన్
3. గ్రౌండ్ స్కూల్ శిక్షణ – థియరీ సబ్జెక్టులు
4. ఫ్లయింగ్ ప్రాక్టీస్ – సింగిల్ ఇంజిన్ ఎయిర్‌క్రాఫ్ట్ పై 40 గంటలు
5. డీజీసీఏ రాత పరీక్షలు – ఫ్లైట్ టెస్ట్
6. ప్రైవేట్ పైలట్ లైసెన్స్ జారీ

పీపీఎల్ తర్వాత ఏమి చేయాలి?
పీపీఎల్ పూర్తయ్యాక అభ్యర్థి స్వంత విమానం లేదా ప్రైవేట్ ఫ్లయింగ్ క్లబ్ విమానాలను నడపవచ్చు. తర్వాతి దశలో సీపీఎల్(కమర్షియల్ పైలట్ లైసెన్స్) కోర్సు చేయడం ద్వారా ఎయిర్‌లైన్ పైలట్ గా కెరీర్ ప్రారంభించవచ్చు. అలాగే ఏరో క్లబ్స్, చార్టర్ ఫ్లైట్స్ వంటి అవకాశాలు కూడా ఉన్నాయి.

- మేజర్ శ్రీనివాస్, సబ్జెక్టు నిపుణులు

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన ఈ-మెయిల్
sakshieducation@gmail.com

జాబ్ స్కిల్స్

ఇంటర్వ్యూలో విజయం వరించేలా..

పరిశ్రమ, రంగం, కంపెనీలు, జాబ్ రోల్ ఎలాంటిదైనా... కొన్ని ప్రశ్నలు మాత్రం తప్పనిసరిగా ఎదురవుతాయి.. ఇవే అభ్యర్థి ఎంపికను నిర్దేశిస్తాయి. ఇంటర్వ్యూలో సాధారణంగా అడిగే ప్రశ్నలు, వాటిని అడగటానికి కారణాలు, ఆ ప్రశ్నలకు సమాధానాలు చెప్పడమెలాగో తెలుసుకుందాం..

ఏ సంస్థలో ఉద్యోగం సాధించాలన్నా.. ఇంటర్వ్యూలో ప్రతిభ చూపడం తప్పనిసరి. ఎంపిక ప్రక్రియలో ఎన్ని రౌండ్‌లు ఉన్నా.. అంతిమంగా ఇంటర్వ్యూ ద్వారానే తుది ఎంపిక జరుగుతుంది. ఇంటర్వ్యూలో అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెబితే సరిపోతుందని చాలామంది భావిస్తారు. కాని వాస్తవానికి ఇంటర్వ్యూ అనేది ప్రశ్నలు–సమాధానాల కంటే చాలా విస్తృతమైందని గుర్తించాలి.

మీ గురించి చెప్పండి?..: ఇంటర్వ్యూ చేసే బోర్డు అభ్యర్థి వ్యక్తిగత, వృత్తిగత, విద్యా నేపథ్యం గురించి తెలుసుకునేందుకు ఈ ప్రశ్న అడుగుతారు. దీనికి చెప్పే సమాధానాన్ని బట్టి ప్రస్తుత జాబ్ రోల్‌కు అభ్యర్థుల నేపథ్యం, అనుభవం ఎలా సరిపోతాయో అంచనా వేస్తారు. కాబట్టి అభ్యర్థి తన విద్యా నేపథ్యం, నైపుణ్యాలు, అనుభవం గురించి క్లుప్తంగా వివరించాలి. ఇంటర్వ్యూయర్ వద్ద రెజ్యూమె ఉంటుంది. వాటిలోని అంశాలనే వల్లేవేయడం కాకుండా.. కొత్త విషయాలు ఏమైనా ఉంటే చెప్పే ప్రయత్నం చేయాలి. అవి ఉద్యోగానికి అనుగుణంగా ఉండాలి. ఉదాహరణకు సైంటిస్ట్ జాబ్ రోల్ కోసం ఇంటర్వ్యూకు హాజరవుతుంటే.. పీహెచ్‌డీ డ్రాప్‌అవుట్ అయిన విషయం చెప్పొచ్చు. తద్వారా సదరు జాబ్ రోల్‌కు సరైన వ్యక్తి అని సమర్థంగా చెప్పగలగాలి. ఆసక్తులు, వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే వివరాలు చెప్పొచ్చు. దీనివల్ల తమ అభ్యర్థిత్వంపై ఇంటర్వ్యూ బోర్డులో సానుకూల అభిప్రాయం కలుగుతుంది.

ఈ కంపెనీలో ఎందుకు చేరాలనుకుంటున్నారు?..: అభ్యర్థికి సంస్థ ఉత్పత్తులు, సేవలు, చరిత్ర, పని సంస్కృతి గురించి అవగాహన ఉందో లేదో తెలుసుకునేందుకు ఇంటర్వ్యూలో ఈ ప్రశ్న అడుగుతారు. కాబట్టి ఇంటర్వ్యూకు వెళ్లేముందు కంపెనీ అధికారిక వెబ్‌సైట్, ఇతర మార్గాల ద్వారా సంస్థ గురించి అవగాహన పెంచుకోవాలి. తమ నేపథ్యం, అనుభవం, నైపుణ్యాలు.. కంపెనీ ఉత్పత్తులు, సేవలకు అనుగుణంగా ఉన్నట్లు వివరించాలి.

మీ భవిష్యత్ లక్ష్యాలు ఏమిటి?..: అభ్యర్థి కంపెనీలో దీర్ఘకాలం కొనసాగుతాడా, సదరు జాబ్ రోల్ పట్ల అతనికున్న నిబద్ధత ఏపాటిదో అంచనా వేసేందుకు ఈ ప్రశ్న అడుగుతారు. అంతేకాకుండా ఈ ప్రశ్న అభ్యర్థుల కెరీర్ లక్ష్యాలు, వాటిని చేరుకునేందుకు వారు ఎంచుకున్న మార్గాన్ని తెలుసుకునేందుకు వీలు కల్పిస్తుంది. కాబట్టి తమ కెరీర్ లక్ష్యాలు.. కంపెనీ ఆశయాలకు ఎలా అనుగుణంగా ఉన్నాయో వివరించాలి. తద్వారా తాను సంస్థతో దీర్ఘకాలిక ప్రయాణాన్ని కోరుకుంటున్నట్లు పరోక్షంగా తెలిపినట్లు అవుతుంది!!

మీరు ఒత్తిడిని ఎలా అధిగమిస్తారు?..: క్లిష్టమైన పరిస్థితులు ఎదురైనప్పుడు సవాళ్లను ఎలా ఎదుర్కొంటారు, ఒత్తిళ్లను తట్టుకుంటూ పనిచేసుకుపోయే నేర్పు ఉందా లేదా తెలుసుకునేందుకు ఇలాంటి ప్రశ్నలు అడుగుతారు. ఇలాంటి ప్రశ్నకు సమాధానం చెప్పేటప్పుడు గతంలో మీకు వ్యక్తిగత, వృత్తిగత జీవితంలో ఎదురైన సవాళ్లు, వాటిని మీరు ఎదుర్కొన్న తీరును వివరించొచ్చు. సమస్యలను పరిష్కరించడంలో మీరు ఏదైనా ఫార్ములాను అనుసరిస్తుంటే.. దాన్ని వెల్లడించి ఇంటర్వ్యూయర్‌ను ఆకట్టుకునే ప్రయత్నం చేయవచ్చు.

బలాలు, బలహీనతల గురించి వివరించండి?..: అభ్యర్థి వ్యక్తిత్వం గురించి లోతుగా తెలుసుకునేందుకు ఉద్దేశించిన ప్రశ్న ఇది. ఇంటర్వ్యూలో బలాలు, బలహీనతల గురించి చెప్పేటప్పుడు చాలా అప్రమత్తంగా ఉండాలి. బలాలు, బలహీనతలు జాబ్ రోల్‌కు ప్రతికూలంగా మారకుండా చూసుకోవాలి. బలాల గురించి చెప్పేటప్పుడు మీ టెక్నికల్ స్కిల్స్, సహనం, సమస్య పరిష్కార నైపుణ్యాలు కంపెనీకి అసెట్‌గా ఎలా మారతాయో వివరించాలి. బలహీనతల గురించి చెప్పేటప్పుడు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. నిర్ణయం తీసుకునే ముందు గణాంక సహిత సమాచారం కోసం అన్వేషిస్తానని, దానివల్ల కొంత ఆలస్యమయ్యే ఆస్కారం ఉంటుందని.. అదే తన బలహీనతని చెప్పొచ్చు. ఎలాంటి బలహీనతలు లేవని చెప్పి మెప్పించడం కూడా కష్టమే. కాబట్టి జాబ్ రోల్‌కు పెద్దగా నష్టం చేకూర్చని, అధిగమించేందుకు అవకాశమున్న బలహీనతలను చెప్పడం మేలు.

మీరు ఏమైనా ప్రశ్నలు అడుగుతారా?..: సాధారణంగా ఈ ప్రశ్న ఇంటర్వ్యూ చివర్లో అడుగుతారు. మొత్తం ఇంటర్వ్యూ ప్రక్రియలో ఇది చాలా ముఖ్యమైన ప్రశ్నగా గుర్తించాలి. కంపెనీలో సదరు ఉద్యోగం పట్ల అభ్యర్థికి నిజంగా ఆసక్తి ఉందో లేదో తెలుసుకునేందుకు ఈ ప్రశ్న అడుగుతారు. కాబట్టి జాబ్ రోల్ గురించి, కంపెనీలో పని గురించి, వేతనం, కెరీర్ గ్రోత్.. ఇలా ఎలాంటి సందేహం ఉన్నా అడిగి నివృత్తి చేసుకునే ప్రయత్నం చేయాలి. సంస్థలో విజయం సాధించేందుకు అనుసరించాల్సిన మార్గామేంటి? కంపెనీ దేన్ని సక్సెస్‌గా భావిస్తుంది, దేని ఫెల్యూర్‌గా పరిగణిస్తోందో అడిగి తెలుసుకోవాలి. తద్వారా ఇంటర్వ్యూలో తమ నిబద్ధతను, అంకితభావాన్ని ప్రదర్శించి సానుకూల అభిప్రాయం కలిగించొచ్చు!!

ఉద్యోగ సమాచారం

సెయిల్‌లో 124 మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎస్ఏఐఎల్) వివిధ విభాగాల్లో మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 124.
- **విభాగాల వారీగా ఖాళీలు:** కెమికల్–05, సివిల్–14, కంప్యూటర్–04, ఎలక్ట్రికల్–44, ఇన్‌స్ట్రుమెంటేషన్–07, మెకానికల్–30, మెటలర్జీ–20.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 65 శాతం మార్కులతో డిగ్రీ(కెమికల్, సివిల్, కంప్యూటర్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్, మెటలర్జీ), పీజీలో ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 05.12.2025 నాటికి 28 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.50,000 నుంచి రూ.1,60,000. సంవత్సరం తర్వాత నెలకు రూ.60,000 నుంచి రూ.1,80,000.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 15.11.2025.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.12.2025.
- **పరీక్ష తేది:** 2026 జనవరి/ఫిబ్రవరి.
- **వెబ్‌సైట్:** https://sailcareers.com

పీజీఐఎంఈఆర్, చండీగఢ్‌లో 13 పోస్టులు

చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(పీజీఐఎంఈఆర్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 13.
- **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్1(మెడికల్/నాన్ మెడికల్)–12, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్2–01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్, బీఎస్సీ, ఎంబీబీఎస్ /బీడీఎస్, బీటెక్, ఎమ్మెస్సీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్–1కు రూ.56,000 నుంచి రూ.67,000, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్–2కు రూ.20,000.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.11.2025.
- **వెబ్‌సైట్:** https://pgimer.edu.in

బీవీసీఎఫ్‌ఎల్, అస్సాంలో 16 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

అస్సాంలోని బ్రహ్మపుత్ర వ్యాలీ ఫెర్టిలైజర్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీవీఎఫ్‌సీఎల్).. ఒప్పంద ప్రాతిపదికన మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 16.
- **పోస్టుల వివరాలు:** ప్రొడక్షన్–07, మెకానికల్–04, ఇన్‌స్ట్రుమెంటేషన్–02, సివిల్–01, హెచ్‌ఆర్–అడ్మిన్–01, ఫైనాన్స్–01.
- **అర్హత:** సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి బీఈ/బీటెక్/పీజీ/పీడీఎం/ఎంబీఏ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- **వయసు:** 01.11.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 10.11.2025.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.12.2025.
- **వెబ్‌సైట్:** https://bvfcl.com

ఎంఎస్‌టీసీలో 37 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

మెటల్ స్క్రాప్ ట్రేడ్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎంఎస్‌టీసీ).. మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 37.
- **పోస్టుల వివరాలు:** జనరల్ క్యాడర్–14, ఫైనాన్స్ కేడర్–23.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీకాం, బీఎస్సీ, బీటెక్, ఎల్ఎల్‌బీ, సీఏ, ఎల్ఎల్ఎం, ఎంకాం, ఎంఎస్సీ, ఎంబీఏ, పీజీడీఎం, ఎంసీఏలో ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 28 ఏళ్ల లోపు ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.50,000 నుంచి రూ.1,60,000.
- **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 15.11.2025.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.11.2025.
- **వెబ్‌సైట్:** https://mstcindia.co.in

దేశంలో తొలి లగ్జరీ క్రూయిజ్‌లైనర్ 'కార్డీలియా క్రూయిజెస్'లో సీ జర్నీ ఎలా ఉంటుంది? అందులో వింతలు విశేషాలేంటి? నేచర్ లవర్స్‌ను రా రమ్మని ఊరిస్తున్న లక్షదీవుల కథేంటో తెలుసుకోవాలనుందా? అబ్బురపరిచే పగడపు దీవుల్లో అలా ఈత కొట్టొద్దాం పదండి. లెట్స్‌క్రూయిజ్!!

లక్షదీవులపై ప్రత్యేక కథనం సాక్షి ట్రావెల్ ఈపేపర్‌లో..

సన్నిధి

మంచిమాట

మనసు

జీవిత రథ సారథి

ప్రతి మనిషి జీవిత ప్రయాణంలో ఎదురయ్యే అతి పెద్ద సవాలు బయట ప్రపంచంతో కాదు, తన అంతరంగంలోనే ఉంది. మనం అనుక్షణం తీసుకునే వేల కొలది నిర్ణయాలు, మన స్పందనల పరంపర... ఇవన్నీ మన భావోద్వేగాల ప్రవాహంలోనే జన్మిస్తాయి. జీవితమనే రథానికి మనసు రథసారథి. ఆ రథం ఎటు వెళ్ళాలో మనసు నిర్ణయిస్తుంది. అయితే, ఆ మనసును నడిపించాల్సిన పరమసారథ్యం కేవలం మన స్వీయ నియంత్రణలోనే ఉంది. భావోద్వేగాలనే గుర్రాలను అదుపులో ఉంచుకుంటేనే మన జీవిత ప్రయాణం సవ్యంగా, నిర్దేశిత గమ్యం వైపు సాగుతుంది. ఒకవేళ ఈ పగ్గాలు వదిలేస్తే, అవి మనల్ని అదుపుతప్పి, పదేపదే నిరాశ, దుఃఖం అనే లోయల్లో పడేస్తాయి. మనసు మన అధీనంలో లేకపోతే, జీవితం ఒక నిరంతర పోరాటంలా మారి, శాశ్వత ఆనందాన్ని దూరం చేస్తుంది. మన అంతర్గత ప్రశాంతతకు ఇదే పునాది.

సాధారణంగా మన భావోద్వేగాలు సముద్రంలో ఉప్పొంగే శక్తిమంతమైన అలల మాదిరిగా ఉంటాయి. కోపం, దుఃఖం, భయం, అసూయ వంటివి మనల్ని క్షణాల్లో ఉక్కిరిబిక్కిరి చేసి, అనాలోచిత నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి. కానీ, సనాతన ధర్మం బోధించినట్టుగా, మనం కేవలం మన భావోద్వేగాలకు బానిసలం కాదు; వాటిని శాసించగలిగే అపారమైన శక్తి కేంద్రం మనలోనే దాగి ఉంది. మనసును నిగ్రహించుకోవడానికి కర్మ, జ్ఞాన, భక్తి మార్గాలు అత్యంత సులువైన, అద్భుతమైన మార్గాలుగా పనిచేస్తాయి.

కర్మ మార్గం–ఫలితాల ఆశ లేకుండా, కేవలం ఉన్నత లక్ష్యాల కోసం నిస్వార్థ నిబద్ధతతో మన కర్తవ్యాన్ని నిర్వహించాలని నిర్దేశిస్తుంది. చివరగా, భక్తి మార్గం–జీవితానికి అంతిమ లక్ష్యం ఆత్మ సాక్షాత్కారమే అని నిశ్చయంగా నమ్మి, విశ్వశక్తిలో లీనమవడమే. ఈ త్రికరణ శుద్ధి కలయిక మనసుకు తిరుగులేని స్థైర్యాన్ని, అఖండమైన అంతర్గత బలాన్ని ప్రసాదిస్తుంది.

నిజమైన ఆత్మనిగ్రహం ద్వారానే మనం అంతరంగ శాంతికి శాశ్వత వారధిని నిర్మించగలం. ఈ వారధిని నిర్మించిన మహనీయుల జీవితాలు మనకు శాశ్వత ప్రేరణ. ఉదాహరణకు, సింహాసనం కళ్లముందే కరిగిపోయినప్పుడు, శ్రీరాముడు ఉవ్వెత్తున ఎగిసిన కోపాగ్నిని కేవలం అణచివేయలేదు. ఆయన వ్యక్తిగత ఆశను, ఆవేశాన్ని త్యజించి, ధర్మానికి శిరసు వంచారు. ఇది కేవలం తండ్రి మాటకు గౌరవం కాదు, బాహ్య పరిస్థితులకు అతీతంగా తన అంతర్గత ప్రశాంతతను తానే నిర్ణయించుకునే అత్యున్నత వివేకం. అలాగే, మహాభారతంలో ధర్మరాజు, అపారమైన దుఃఖం, రాజ్య నష్టం మధ్య కూడా, తన స్థైర్యాన్ని పోగొట్టుకోకుండా, క్షమతో... వివేకంతో వ్యవహరించారు. ఈ ఉదాహరణలు కేవలం కథలు కావు; భావోద్వేగాలపై పట్టు సాధిస్తే, విధి రాతను సైతం తన జీవితపు ఉన్నత గమ్యానికి అనుగుణంగా మలచుకోవచ్చని నిరూపించాయి.

గుర్తుంచుకోండి: మన జీవితమనే ఈ అద్భుతమైన ప్రయాణంలో, మన గమ్యాన్ని నిర్దేశించే తిరుగులేని సారథులం మనమే. ఇక ఆలస్యం చేయక, ప్రతి క్షణాన్ని వివేకంతో, ప్రేమతో నింపి, మన హృదయం కోరుకునే ప్రశాంతమైన, అద్భుతమైన భవిష్యత్తును మన చేతులతో నిర్మించుకుందాం.

మన అంతర్గత ప్రపంచంలో కలిగే ప్రతి ఆలోచనా అలజడి, ప్రతి ప్రతిస్పందన ఒక కర్మగానే పరిగణించబడుతుంది. ఈ కర్మల ప్రభావాన్ని తగ్గించడానికి, జ్ఞాన యోగం మనకు నిష్పాక్షిక పరిశీలన అనే వివేకాన్ని అందిస్తుంది. అంటే, కళ్ళ ముందు జరిగే నాటకాన్ని చూస్తున్నట్లుగా, మన ఆలోచనలను, భావోద్వేగాలను తటస్థంగా, నిశితంగా గమనించడం. ఈ దృష్టి వివేకానికి పదునైన కత్తిలా పనిచేసి, ప్రతిచర్యలకు బదులుగా, ప్రశాంతమైన, సరైన ఎంపికను ఎంచుకునే స్వేచ్ఛనిస్తుంది.

భావోద్వేగాలను నియంత్రించగలగడమే నిజమైన, నిస్సందేహమైన శక్తి. ఎందుకంటే, అది మనల్ని బాహ్య పరిస్థితుల బందీగా కాకుండా, మన స్వీయ మనసుకి నిజమైన అధిపతిగా నిలబెడుతుంది. అశాంతి, ఆందోళనల నుంచి సంపూర్ణ విముక్తి పొందడానికి, మనసును మనకు అత్యంత విశ్వసనీయ స్నేహితుడిగా మలచుకోవాలి. యోగా, ధ్యానం, ఆత్మపరిశీలన వంటి సాధనల ద్వారా మనం ఈ లక్ష్యాన్ని సులభంగా చేరుకోగలం.

– కె. భాస్కర్ గుప్తా (వ్యక్తిత్వ వికాస నిపుణులు)

ఆత్మీయం

కనీస ధర్మం



అరివీరభయంకరంగా జరిగిన రామరావణ యుద్ధం ముగిసింది. మహాబలవంతుడైన రావణుడు యుద్ధంలో రాముడి చేతిలో హతుడయ్యాడు. ధర్మమూర్తి అయిన రాముడు రావణుడి అధర్మవర్తనకు కోపించి, అతనిపై యుద్ధం చేశాడు కానీ, రామునికి అతనిపై ప్రత్యేకమైన ద్వేషం, పగ లేవు. అందువల్ల రావణుని సంహరించిన తర్వాత రామునికి అతనిపై అపారమైన జాలి, దయ కలిగాయి. ఎందుకంటే ఇప్పుడు రావణునికి చితిపేర్చి, ఆ చితికి నిప్పంటించడానికి కూడా ఎవరూ మిగలలేదు. రావణుని కుమారులు, సోదరులు, మనుమలు, బంధువులు, సేనానులు, సైన్యం.... ఒకరేమిటి స్త్రీలు తప్ప రావణుని బలగమంతా తుడిచిపెట్టుకుపోయింది. చివరకు మిగిలిందల్లా విభీషణుడొక్కడే. విభీషణునికి అన్నగారంటే భయం, భక్తి, ద్వేషం, ప్రేమ అన్నీ ఉన్నాయి. అయినప్పటికీ, ఆయనకు అంత్యక్రియలు జరిపించడం మాత్రం ఎందుకనో ఇష్టం లేకపోయింది. బహుశ రాముడు ఏమైనా అనుకుంటాడేమో అనే శంక వల్ల కావచ్చు, తాను చెప్పిన మాటను అన్నగారు పెడచెవిన పెట్టి, చివరికిలా శత్రువు చేతిలో కుప్పకూలిపోయాయే అనే కోపం వల్ల కావచ్చు. అలాగని ఆయన శరీరాన్ని అలా యుద్ధభూమిలో వదిలేసి వెళ్లడానికి మనస్కరించడం లేదు. దూరంగా ఉండి ఇదంతా గమనిస్తూనే ఉన్నాడు రామచంద్రుడు. విభీషణుని వద్దకు వచ్చాడు. భుజంపై చేయివేశాడు. విభీషణుని చేతులను తన చేతిలోకి తీసుకుని, ఆప్యాయంగా నొక్కుతూ, ''ఎవరిపైన అయినా ద్వేషం, పగ పెంచుకుంటే, అది వారు మరణించేంత వరకే ఉండాలి. మరణించిన తర్వాత కూడా వారిపైన ద్వేషం చూపడం మంచిది కాదు. శాస్త్రప్రకారం మరణించిన వారు దాయాదులు అయితే, వారి అంత్యక్రియలకు వెళ్లకపోవడం, కర్మకాండలలో పాలుపంచుకోకపోవడం, వారి కర్మభోజనం చేయకపోవడం అధర్మం. అంతే కాదు, మరణించిన వారిపై బురద జల్లడం, వారిని విమర్శించడం, వారి ప్రతిష్ఠకు భంగం వాటిల్లేలా మాట్లాడటం కూడా అధర్మమే. నీ సోదరుడైన రావణుడు మరణించాడు కాబట్టి అతనిపై నీకే కాదు, నాకు కూడా ఇప్పుడు ఎటువంటి ద్వేషభావమూ ఉండకూడదు. ఆ మరణంతో అతనిపై ఉన్న పగ, ప్రతీకారం, ద్వేషభావం కూడా నశించినట్లే భావించు'' అంటూ హితవు పలికాడు.

ఆ మాటలు విన్న తర్వాత విభీషణుడు శాస్త్రోక్తంగా తన అన్నకు అంత్యక్రియలు జరిపించేందుకు సిద్ధపడ్డాడు. రాముడు అన్నివిషయాలలోనూ తోడుగా ఉండి, విభీషణుని చేత ఉత్తరక్రియలన్నీ జరిపించాడు. అంతకుమునుపు వాలి మరణానంతరం కూడా ఇదేవిధమైన సూత్రాన్ని సుగ్రీవుడికి బోధించి, అంగదుడి చేత వాలికి ఉత్తరక్రియలు జరిపించి, అనంతరం సుగ్రీవుని చేతనే అంగదునికి కిష్కింధానగరానికి యువరాజుగా పట్టాభిషిక్తుని చేయించాడు రాముడు. మరణించిన వారికి కర్మకాండలు జరిపించి, తెలిసిన వారినందరినీ కర్మ భోజనానికి పిలవడం, వారంతా వచ్చి ఆ భోజనాలు చేసి వెళ్లడం వల్ల మృతుల ఆత్మకు శాంతి చేకూరుతుందని శాస్త్రం చెబుతోంది. కొందరు వివిధ రకాల కారణాలతో... సాకులతో మృతి చెందిన బంధుమిత్రులను చివరి చూపు చూసేందుకు వెళ్లడానికి కూడా ఇష్టపడరు. మరికొందరు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించడానికి కూడా వెళ్లరు. అది మహా అపరాధం. మరణంతో వారితో ఉన్న శత్రుత్వం సమసిపోతుంది. కష్టంలో ఉన్న వారిని పరామర్శించడం పుణ్యకార్యమే కానీ ధర్మ విరుద్ధమైనది కాదు.

– డి.వి.ఆర్.

తాత్త్వికథ

ఓడిన వాడే విజేత

ఒక రాజ్యంలో విశ్వశాంతిని ఆకాంక్షించే శాంతి ప్రేమికుల సదస్సు జరుగుతోంది. అందులో భాగంగా యుద్ధాలు ఎందుకు జరుగుతాయి, ఎలాంటి నష్టాలు జరుగుతాయి అన్న విషయం మీద చర్చ నడిచింది.

ఎటు చూసినా యుద్ధం వల్ల నష్టం నష్టాలు తప్పవని, అవి జరగకుండా చూడాలని తీర్మానం చేశారు.

ఆ సదస్సును నిర్వహించిన రాజు కార్యక్రమం విజయవంతంగా పూర్తి అయినందులకు ఆనందపడ్డాడు. సేవకులకు, సదస్సుకు హాజరైన వారికి మంచి బహుమతులు అందజేశాడు.

రాజ భవనానికి వెళ్ళి రాణితో ఆ విషయాన్ని చెప్పి మరింత సంతోషపడ్డాడు.

ఆమె నవ్వుతూ ''మీరు రాజుల మధ్య జరిగే యుద్ధం గురించి చర్చించి ఉంటారు. ఆ యుద్ధంలో ఒకరు గెలుస్తారు, ఒకరు ఓడుతారు. గెలిచినవారు లాభపడతారు, ఓడిన వారు నష్టపోతారు. అయితే నాకు తెలిసిన ఒక యుద్ధంలో నష్టపోయినవాడే విజేత'' అని చెప్పింది.

ఆశ్చర్యపోయిన రాజు ''అదెలా సాధ్యం, విజేత అయినవాడు లాభపడతాడు కానీ నష్టపోవడం జరుగదు'' అని కరాఖండిగా చెప్పాడు. 'ఆలోచించి చూడండి' అని రాజును వినమ్రంగా కోరింది.

ఆరోజంతా రాజుకు నిద్ర లేదు. ఎంత ఆలోచించినా సమాధానం దొరకలేదు. సదస్సుకు హాజరైన ప్రముఖులను పిలిపించి అడిగాడు. అలా జరిగే అవకాశమే లేదని వారు తీసి పారేశారు.

ఇదంతా చూసిన రాజు తల్లి నవ్వుతూ ''ఆ యుద్ధం పేరు అహంకారం. ఆ యుద్ధంలో ఓడినవాడు ఎప్పుడూ గెలిచి తీరుతాడు. మనిషికి అహంకారం వస్తే విచక్షణా గుణం కోల్పోతాడు. తనే గొప్ప అనే భావనలో ఉండిపోతాడు. అందుకు ఏమైనా చేస్తాడు, ఎంత దూరమైనా పోతాడు. ఆ అహంకార యుద్ధంలో ఎదుటి వ్యక్తి ఓడినా అతడే విజేత. ఎందుకంటే గెలిచిన వ్యక్తి విజయం తాత్కాలికం. అహంకారం వీడితే కానీ అది తాత్కాలికం అని అహంకారి గుర్తించలేడు'' అని వివరించింది.

'నిజమే... అహంకారం, వినాశ హేతువని పెద్దలు చెప్పారు. అహంకారి తన మాటలతో, చేష్టలతో తనూ దహింపబడతాడు, ఎదుటివారినీ దహిస్తాడు' అని రాజు అవగాహన చేసుకున్నాడు. తెలివైన ప్రశ్న వేసినందుకు రాణిని అభినందించాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సాక్షి సినిమా

నా నిర్ణయం సరైనదే

– దీపికా పదుకోన్

''నేనో బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత మా అమ్మగారిపై మరింత గౌరవం పెరిగింది. వృత్తి జీవితాన్ని, పిల్లల పెంపకాన్ని బ్యాలెన్స్ చేయొచ్చని చాలామంది అంటుంటారు. కానీ అది చాలా కష్టమైన పని. కొత్తగా తల్లయిన వారు తిరిగి పనికి వచ్చినప్పుడు వారికి అందరూ సపోర్ట్ చేయాలి'' అని దీపికా పదుకోన్ అన్నారు. సినిమా ఇండస్ట్రీలో మహిళలకు 8 గంటలు మాత్రమే పని చేసే వెసులుబాటును కల్పించాలని దీపిక కొంత కాలంగా పలు సందర్భాల్లో మాట్లాడిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మరోమారు ఈ అంశంపై ఆమె మాట్లాడుతూ– ''రోజుకి 8 గంటల పని మానవ శరీరానికి, మనసుకు సరిపోతుంది. మనం ఆరోగ్యంగా ఉండి, పని చేసినప్పుడే అవుట్‌పుట్ బాగా వస్తుంది. ఒత్తిడితో పని చేస్తే సరైన ఫలితం రాకపోవచ్చు. మా ఆఫీసులో సోమవారం నుంచి శుక్రవారం వరకు మేం 8 గంటలే పని చేస్తాం. వినేవారికి బోరింగ్‌గా ఉండొచ్చు. టైమ్ అనేది మన చేతుల్లో ఉన్న ధనంతో సమానం. దీన్ని ఎవరితో, ఎప్పుడు, ఎలా స్పెండ్ చేయాలని నిర్ణయించుకునే స్వేచ్ఛ నాకు ఉండాలి. నా దృష్టిలో సక్సెస్ అంటే ఇదే. 8 గంటలు మాత్రమే పని చేయాలనే నా నిర్ణయం కరెక్టే'' అని చెప్పుకొచ్చారు దీపికా పదుకోన్.

ఆడియన్స్ ఎంజాయ్ చేసే చిత్రం ఇది

– రాజ్ తరుణ్

● రాశీ సింగ్, రాజ్ తరుణ్

రాజ్ తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో రూపొందిన సినిమా 'పాంచ్ మినార్'. రాశీ సింగ్ హీరోయిన్‌గా నటించారు. గోవింద రాజు సమర్పణలో మాధవి, ఎమ్ ఎస్‌ఎమ్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి అతిథిగా హాజరైన దర్శక–నిర్మాత సాయిరాజేశ్ ట్రైలర్‌ని లాంచ్ చేసిన అనంతరం మాట్లాడుతూ – ''రాజ్ తరుణ్‌గారి 'కుమారి 21ఎఫ్' సినిమా నాకు చాలా ఇష్టం. 'పాంచ్ మినార్'తో హిట్ కొట్టి, మళ్ళీ ఒక లవ్‌స్టోరీతో రాజ్ తరుణ్ గ్రేట్ పొజిషన్‌లోకి రావాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు. రాజ్ తరుణ్ మాట్లాడుతూ– ''పాంచ్ మినార్' ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ మంచి క్రైమ్ కామెడీ మూవీ. ఈ సినిమా ప్రీమియర్స్‌ను ప్రదర్శించగా, చూసినవాళ్లు బాగుందని చెబుతున్నారు'' అన్నారు. ''ఇది ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని చెప్పుకునే క్రైమ్ కామెడీ సినిమా'' అని చెప్పారు దర్శకుడు రామ్. ''బయ్యర్స్ చాలామంది వచ్చినప్పటికీ సినిమాపై నమ్మకంతో సొంతంగా రిలీజ్ చేస్తున్నారు'' అని చెప్పారు నిర్మాత వివేక్ కూచిభొట్ల. ''స్క్రీన్‌ప్లే నచ్చే ఈ సినిమా చేశాం. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం'' అని పేర్కొన్నారు గోవిందరాజు, మాధవి.

కథే హీరో

● స్వాతి, శ్రీరామ్

శ్రీరామ్, స్వాతి జోడీగా నటించిన చిత్రం 'మా రాముడు అందరివాడు'. యద్దనపూడి మైఖేల్ దర్శకత్వంలో అనుముల లక్ష్మణరావు, పల్లకొండ శ్రీరాములు నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్, ఆడియో లాంచ్ వేడుకలో బాబు మోహన్ మాట్లాడుతూ– ''ఈ చిత్రానికి ప్రేక్షకాదరణ లభించాలి'' అన్నారు. ''మా సినిమాలో కథే హీరో'' అని చెప్పారు శ్రీరామ్. ''ఈ సినిమాలోని 4 పాటలను నేనే రాశాను'' అని చెప్పారు మైఖేల్. ''మా సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి'' అని కోరారు లక్ష్మణరావు.

ఒక రోజు ముందుగానే...

● రామ్

అనుకున్న సమయానికన్నా ఒక రోజు ముందుగానే థియేటర్స్‌లోకి రానుంది 'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమా. రామ్, భాగ్యశ్రీ బోర్సే హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం ఇది. ఉపేంద్ర, రావు రమేశ్, మురళీ శర్మ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు. పి. మహేశ్‌బాబు దర్శకత్వంలో గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టీ–సిరీస్ ఫిల్మ్స్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. తొలుత ఈ సినిమాను ఈ నెల 28న విడుదల చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. తాజాగా ఈ సినిమాను ఒక రోజు ముందుగానే... అంటే నవంబరు 27నే రిలీజ్ చేయనున్నట్లుగా తెలిపారు. ''ఒక స్టార్ హీరో అభిమాని జీవితం ఆధారంగా తీసిన బయోపిక్ ఇది. ప్రేక్షకుల జీవితాలను ప్రతిబింబించేలా, ఓ సరికొత్త అనుభూతి ఇచ్చేలా ఈ సినిమా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

'అఖండ 2'ని త్రీడీలోనూ రిలీజ్ చేస్తున్నాం

– దర్శకుడు బోయపాటి శ్రీను

● రామ్, బోయపాటి శ్రీను, గోపి

హీరో బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందిన తాజా చిత్రం 'అఖండ 2: తాండవం'. ఈ చిత్రంలో సంయుక్త, ఆది పినిశెట్టి, హర్షాలీ మల్హోత్రా ముఖ్య పాత్రలు చేశారు. ఎం. తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 5న విడుదల కానుంది. 2డీ ఫార్మాట్‌తో పాటు 3డీ ఫార్మాట్‌లోనూ రిలీజ్ చేయనున్నట్లుగా యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో బోయపాటి శ్రీను మాట్లాడుతూ– ''భగవద్గీత, రామాయణం, భారతం... ఇవి మన దేశం ఆత్మ. ఈ మూడింటి ఆత్మే 'అఖండ 2'. చిన్నపిల్లల నుంచి అమ్మానాన్నల వరకు థియేటర్స్‌లో చూసేలా 'అఖండ 2' చిత్రం ఉంటుంది. బాలకృష్ణగారి అభిమానులు, ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని ఇవ్వాలన్న ఉద్దేశంతోనే ఈ మూవీని 3డీ ఫార్మాట్‌లోనూ విడుదల చేయనున్నాం'' అని చెప్పారు. ''ఈ సినిమా కథ, కాన్వాస్, లొకేషన్‌కి త్రీడీలో చేస్తే బాగుంటుందని అనుకున్నాం. అలాగే మాకు సమయం కూడా దొరికింది. 3డీ వెర్షన్ అద్భుతంగా వచ్చింది'' అని తెలిపారు గోపీ ఆచంట.

పల్లెటూరి ప్రేమ

● వివేక్ ఆత్రేయ, తిరువీర్

'మసూద, ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' చిత్రాల ఫేమ్ తిరువీర్ హీరోగా నటించనున్న కొత్త చిత్రం ప్రారంభోత్సవం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. పల్లెటూరి నేపథ్యంలో సాగే ఈ చిత్రాన్ని మహేందర్ కుదుదుల దర్శకత్వంలో పరుచూరి వెంకటేశ్వర రావు నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత దామోదర ప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు వివేక్ ఆత్రేయ క్లాప్ ఇచ్చారు. దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకుడు స్వరూప్ మేకర్స్‌కు స్క్రిప్ట్ అందించారు. ''పల్లెటూరు నేపథ్యంలో సరదాగా, సందడిగా సాగే ప్రేమకథా చిత్రంలా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

ఏమైపోతుందో...



● కేశవ, చంద్రబోస్, వైకుంఠ్ బోను

మాస్టర్ మహేంద్రన్ హీరోగా అంబికా వాణి హీరోయిన్‌గా వైకుంఠ్ బోను తెరకెక్కించిన చిత్రం 'వసుదేవసుతం'. బేబీ చైత్రశ్రీ బాదర్ల, మాస్టర్ యువాంశ్ కృష్ణ బాదర్ల సమర్పణలో ధనలక్ష్మి బాదర్ల నిర్మించారు. ఈ చిత్రం నుంచి 'ఏమైపోతుందో...' అంటూ సాగే మెలోడీ సాంగ్‌ని చంద్రబోస్ విడుదల చేసి, ''మణిశర్మ ఈ పాటకు మంచి ట్యూన్ ఇచ్చారు. సాహిత్యం చాలా బాగుంది'' అని చెప్పారు. ఈ పాటకు శ్రీ హర్ష ఈమని సాహిత్యం అందించగా పవన్, శ్రుతికా సముద్రాల పాడారు. ''త్వరలో మా మూవీని రిలీజ్ చేస్తాం'' అన్నారు నిర్మాత.

డిసెంబరులో ఘంటసాల



● ఆదిత్య హాసన్, సీహెచ్ రామారావు, కృష్ణ చైతన్య

దివంగత సంగీత దర్శకులు ఘంటసాల వెంకటేశ్వరరావు బయోపిక్‌గా 'ఘంటసాల ది గ్రేట్' మూవీ రూపొందిన సంగతి తెలిసిందే. ఘంటసాలగా కృష్ణ చైతన్య, ఘంటసాల సావిత్రమ్మగా మృదుల, చిన్న ఘంటసాలగా అతులిత నటించగా, సుమన్ ముఖ్య పాత్ర పోషించారు. సీహెచ్ రామారావు రచన, దర్శకత్వంలో అన్యుక్త్ రామ్ పిక్చర్స్ సమర్పణలో సీహెచ్ ఫణి తెరకెక్కించారు. ఈ చిత్రం డిసెంబరు 12న విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ఆదిత్య హాసన్ అతిథిగా హాజరై ట్రైలర్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''ఘంటసాల' స్క్రిప్ట్ భావోద్వేగంగా ఉంటుంది'' అన్నారు. ''ఘంటసాలగారి పాటలు వింటూ పెరిగిన నేను ఇలా ఆయన జీవిత చరిత్రను చెప్పే సినిమాలో భాగమైనందుకు సంతోషంగా ఉంది'' అని కృష్ణ చైతన్య తెలిపారు. ''ఘంటసాలగారి వ్యక్తిత్వం గురించి అందరికీ తెలియాలని ఈ సినిమా తీశాను'' అని చెప్పారు సీహెచ్ రామారావు.

ఓటీటీ

ఇది చూడొచ్చు

ఓ చలాకీ 420

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం ఏక్ చతుర్ నార్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

మోసం... ఎప్పుడు, ఎవరికి, ఎలా జరుగుతుందో తెలియనిదే మోసం. మాయ మాటలతో మంచిగా మోసం చేసేవాళ్ళు కొందరైతే... తమ అందంతో మైమరపించి, ఏమార్చి మోసం చేసేవాళ్ళు మరికొందరు. అందులోనూ మోసం చేసే అమ్మాయిలు అస్సలు బయటపడరు. ఆ లైన్‌తో అల్లుకున్న కథే 'ఏక్ చతుర్ నార్' సినిమా. హిమాన్షి త్రిపాఠి రాసిన ఈ కథకు ఉమేష్ శుక్లా దర్శకత్వం వహించారు. నిజానికి ఈ కథ గమ్మత్తుగా ఉంటుంది. చూసే ప్రేక్షకులకు ప్రతి క్షణం థ్రిల్లింగ్‌గా అనిపిస్తుంది. అంతలా ఏముందీ కథలో ఓసారి చూద్దాం. నది ఒడ్డున నివసించేవాళ్ళు కొందరైతే, నాలా మీద నివసించే వాళ్ళు మరికొందరు అని దర్శకుడు పేద, ధనిక వర్గాల వర్గీకరణతో కథను ప్రారంభించారు. ఇది నాలా మీద మురికివాడలో నివసించే మమత కథ. మమత తన అత్త, చిన్న కొడుకుతో అప్పుల వాళ్ళ బారి నుండి తప్పించుకోవడానికి మురికివాడలోని తన ఇంటికి తాళం వేసి ఇంటి లోపలే బిక్కు బిక్కుమని బాధపడుతుంటుంది. అయితే ఇక్కడే ఉంది ట్విస్టు. మమత చూడడానికి చాలా బాధలో ఉన్నట్టు కనిపించినా తనలో కనపడని ఇంకో కోణం ఉంది. అదే ఆమె గడుసుతనం. మెట్రో ట్రైన్ స్టేషన్‌లో పార్ట్ టైం ఉద్యోగం చేస్తున్న మమత తన సహచరుడితో కలిసి నగరంలో పేరున్న వ్యాపారవేత్త అభిషేక్ వర్మ ఫోన్ కొట్టేస్తుంది. ఆ ఫోన్‌లో ఉన్న రహస్య సమాచారంతో అభిషేక్ వర్మను బ్లాక్ మెయిల్ చేస్తుంది. అభిషేక్ వర్మకు కేంద్రంలో ఉన్న ప్రముఖ వ్యక్తులతో మంచి సంబంధాలు ఉంటాయి. అంతేకాదు... వాళ్ళతో అభిషేక్ వర్మ వ్యాపార లావాదేవీలు కూడా మెయిన్‌టైన్ చేస్తుంటాడు. ఈ సమయంలో అభిషేక్ తన ఫోన్ కోసం ఓ పోలీసు ఉన్నతాధికారిని ఆశ్రయిస్తాడు. ఆ పోలీసు మమతే దొంగ అని తెలుసుకుని వాళ్ళ అత్తను అరెస్ట్ చేస్తాడు. ఇంతలో అభిషేక్ పైన ఉన్న రాజకీయ వేత్తలు కూడా తమ బలగంతో మమతను పట్టుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. మరి... మమత దొరికి, ఫోన్ తిరిగి ఇచ్చేస్తుందా? లేదా అన్నది మాత్రం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న 'ఏక్ చతుర్ నార్'లో చూడాల్సిందే. సినిమా మొత్తం సరదాగా గమ్మత్తుగా సాగినా క్లైమాక్స్ మాత్రం కాస్త పేలవంగా ముగిసినట్టు అనిపిస్తుంది. కాకపోతే ఆఖర్లో వచ్చే ట్విస్టులు ప్రేక్షకుల మతి పోగొడతాయి. సినిమాలో ముఖ్య భూమిక పోషించిన మమత పాత్రధారి అయిన దివ్య ఖోస్లా చలాకీ 420 పాత్రలో ఒదిగిపోయారని చెప్పాలి. వీక్షకులకు ఓ మంచి ఛాయిస్ ఈ 'ఏక్ చతుర్ నార్'.

– హరికృష్ణ ఇంటూరు

పాకిస్తాన్ ‘ఎ’ చేతిలో భారత్ ‘ఎ’ పరాజయం

దోహా: ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టి20 టోర్నమెంట్‌లో పాకిస్తాన్ చేతిలో భారత్‌కు ఓటమి ఎదురైంది. గ్రూప్ ‘బి’లో భాగంగా ఆదివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్ ‘ఎ’ 8 వికెట్ల తేడాతో భారత్ ‘ఎ’పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 19 ఓవర్లలో 136 పరుగులకే ఆలౌటైంది. వైభవ్ సూర్యవంశీ (28 బంతుల్లో 45; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), నమన్ ధీర్ (20 బంతుల్లో 35; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించగా ఇతర బ్యాటర్లంతా విఫలమయ్యారు. షాహిద్ అజీజ్ 3 వికెట్లు పడగొట్టగా... మాజ్ సదాఖత్, సాద్ మసూద్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం పాక్ 13.2 ఓవర్లలో 2 వికెట్లకు 137 పరుగులు సాధించింది. మాజ్ సదాఖత్ (47 బంతుల్లో 79 నాటౌట్; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) దూకుడుగా ఆడి అజేయ అర్ధ సెంచరీతో జట్టును గెలిపించాడు. యశ్ ఠాకూర్, సుయాశ్ శర్మ చెరో వికెట్ తీశారు. ఇటీవల జరిగిన సీనియర్ టీమ్ ఆసియా కప్ తరహాలోనే భారత్, పాక్ ‘ఎ’ జట్ల సభ్యుల మధ్య ఎలాంటి ‘షేక్ హ్యాండ్’లు చోటు చేసుకోలేదు. భారత్ తమ తర్వాతి మ్యాచ్‌లో రేపు ఒమాన్‌తో తలపడుతుంది.

సొంతగడ్డపై ఘోర పరాభవం

- తొలి టెస్టులో భారత్ చిత్తు
- 30 పరుగులతో నెగ్గిన దక్షిణాఫ్రికా
- 124 పరుగుల ఛేదనలో టీమిండియా 93 ఆలౌట్
- సఫారీలను గెలిపించిన స్పిన్నర్లు

విజయానికి 124 పరుగులు కావాలి... గతంలో సొంతగడ్డపై ఇంత తక్కువ లక్ష్యాన్ని ఛేదించడంలో భారత్ ఎప్పుడూ విఫలం కాలేదు...గిల్ లేకపోయినా బ్యాటింగ్ చేయగల సమర్థులు ఏడుగురు ఉన్నారు... పిచ్ ఎలాంటిదైనా కాస్త పట్టుదల కనబరిస్తే సునాయాసంగా ఛేదించగల స్కోరే... కానీ టీమిండియా ఒక్కసారిగా కుప్పకూలింది...రెండో ఇన్నింగ్స్ ఆరంభంలో పేస్‌కు, ఆ తర్వాత ప్రత్యర్థి స్పిన్ ముందు బ్యాటర్లు తలవంచారు. మనకు అనుకూలిస్తుందనుకున్న స్పిన్ పిచ్ సఫారీలకు అందివచ్చింది. సరిగ్గా ఏడాది క్రితం న్యూజిలాండ్ చేతిలో చిత్తయిన తీరును గుర్తుకు చేస్తూ భారత్ స్వదేశంలో మరో పరాభవాన్ని మూటగట్టుకోగా, వరల్డ్ టెస్టు చాంపియన్ దక్షిణాఫ్రికా పదిహేనేళ్ల తర్వాత భారత గడ్డపై టెస్టు గెలిచి సంబరాలు చేసుకుంది. పదేళ్ల క్రితం అనామకుడిగా ఇక్కడ అడుగు పెట్టి భారత బ్యాటర్ల చేతిలో చావు దెబ్బ తిన్న ఆఫ్‌స్పిన్నర్ సైమన్ హార్మర్ దశాబ్దం తర్వాత ఒక అరుదైన విజయాన్ని రచించడం విశేషం.

చివరి వికెట్ సాధించాక దక్షిణాఫ్రికా ఆటగాళ్ల సంబరం

కోల్‌కతా: భారత టెస్టు జట్టుకు స్వదేశంలో అనూహ్య షాక్...ఈడెన్ గార్డెన్‌లో స్పిన్ పిచ్ కోరుకొని నలుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగిన జట్టు చివరకు ప్రత్యర్థి స్పిన్ దెబ్బకే తలవంచింది. ఆదివారం మూడో రోజే ముగిసిన తొలి టెస్టులో దక్షిణాఫ్రికా 30 పరుగుల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. 124 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 35 ఓవర్లలో 93 పరుగులకే ఆలౌటైంది. వాషింగ్టన్ సుందర్ (92 బంతుల్లో 31; 2 ఫోర్లు)దే అత్యధిక స్కోరు. సఫారీ బౌలర్లలో సైమన్ హార్మర్ 4, కేశవ్ మహరాజ్, మార్కో యాన్సెన్ చెరో 2 వికెట్లు తీశారు. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 93/7తో ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా తమ రెండో ఇన్నింగ్స్‌లో 54 ఓవర్లలో 153 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ తెంబా బవుమా (136 బంతుల్లో 55 నాటౌట్; 4 ఫోర్లు) కీలక అర్ధ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. జడేజాకు 4 వికెట్లు దక్కాయి. మ్యాచ్‌లో మొత్తం 8 వికెట్లు పడగొట్టిన హార్మర్ ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’గా నిలిచాడు. రెండు మ్యాచ్‌లో సిరీస్‌లో దక్షిణాఫ్రికా 1–0తో ముందంజ వేయగా, నవంబర్ 22 నుంచి గువహటిలో రెండో టెస్టు జరుగుతుంది. రెండో రోజు మెడకు గాయం కావడంతో ఆట నుంచి తప్పుకొని ఆస్పత్రిలో చేరిన భారత కెప్టెన్ శుబ్‌మన్ గిల్ ఆదివారం వైద్యుల పర్యవేక్షణలో ఉండటంతో రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు రాలేకపోయాడు. కోలుకున్న గిల్ ఆదివారం సాయంత్రం ఆస్పత్రినుంచి డిశ్చార్జ్ అయ్యాడు.

ఆదుకున్న బవుమా...

ఆదివారం మైదానంలోకి వచ్చే సమయానికి భారత్ విజయంపై ధీమాగా ఉంది. మిగిలిన 3 వికెట్లు తీసేందుకు ఎక్కువ సమయం పట్టదనిపించింది. అయితే మన స్పిన్నర్లు ప్రభావం చూపలేకపోగా, పదునైన డిఫెన్స్‌తో పట్టుదలగా నిలిచిన బవుమా సింగిల్స్‌తో పరుగులు జోడిస్తూ పోయాడు. కొద్దిసేపు దూకుడుగా ఆడిన కార్బిన్ బాష్ (37 బంతుల్లో 25; 2 ఫోర్లు, 1 సిక్స్), బవుమా కలిసి ఎనిమిదో వికెట్‌కు 44 పరుగులు జోడించారు. చివరకు బాష్‌ను బుమ్రా బౌల్డ్ చేయగా...సిరాజ్ ఒకే ఓవర్లో చివరి రెండు వికెట్లు పడగొట్టాడు.

సుందర్ మినహా...

ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే జైస్వాల్ (0)ను అవుట్ చేసిన యాన్సెన్, తన రెండో ఓవర్లో రాహుల్ (1)ను పెవిలియన్‌కు పంపి దెబ్బ కొట్టాడు. ఈ దశలో 32 పరుగులు జత చేసి సుందర్, జురేల్ (13) జట్టును ముందుకు నడిపించారు. అయితే జురేల్, పంత్ (2) చెత్త షాట్‌లతో వెనుదిరిగారు. ఇలాంటి స్థితిలోనూ సుందర్, రవీంద్ర జడేజా (18) భాగస్వామ్యంతో జట్టు గెలుపుపై ఆశలు చిగురించాయి. కానీ సఫారీ స్పిన్నర్లు మళ్లీ పైచేయి సాధించారు. వీరిద్దరు 8 పరుగుల తేడాతో అవుట్ కాగా, కుల్దీప్ (1) వారిని అనుసరించాడు. గెలుపునకు మరో 47 పరుగులు చేయాల్సిన స్థితిలో అక్షర్ పటేల్ (17 బంతుల్లో 26; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కాస్త సాహసం ప్రదర్శించాడు. **మహరాజ్ ఓవర్లో తొలి నాలుగు బంతుల్లో ఒక ఫోర్, 2 సిక్స్‌లు బాది 16 పరుగులు రాబట్టాడు. చివరకు** మహరాజ్‌దే పైచేయి అయింది. ఐదో బంతికి మరో భారీ షాట్‌కు ప్రయత్నించి అక్షర్ వెనుదిరగ్గా, తర్వాతి బంతికే సిరాజ్ (0) అవుట్ కావడంలో దక్షిణాఫ్రికా శిబిరంలో సంబరాలు మొదలయ్యాయి.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 159; భారత్ తొలి ఇన్నింగ్స్ 189; దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 153; భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 0; రాహుల్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 1; సుందర్ (సి) హార్మర్ (బి) మార్క్‌రమ్ 31; జురేల్ (సి) బాష్ (బి) హార్మర్ 13; పంత్ (సి) అండ్ (బి) హార్మర్ 2; జడేజా (ఎల్బీ) (బి) హార్మర్ 18; అక్షర్ (సి) బవుమా (బి) మహరాజ్ 26; కుల్దీప్ (ఎల్బీ) (బి) హార్మర్ 1; బుమ్రా (నాటౌట్) 0; సిరాజ్ (సి) మార్క్‌రమ్ (బి) మహరాజ్ 0; గిల్ (ఆబ్సెంట్ హర్ట్); ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (35 ఓవర్లలో ఆలౌట్) 93.** **వికెట్ల పతనం:** 1–0, 2–1, 3–33, 4–38, 5–64, 6–72, 7–77, 8–93, 9–93. **బౌలింగ్:** యాన్సెన్ 7–3–15–2, హార్మర్ 14–4–21–4, మహరాజ్ 9–1–37–2, బాష్ 2–0–14–0, మార్క్‌రమ్ 3–0–5–1.

“బ్యాటింగ్ చేయలేనంత ఇబ్బందికరంగా పిచ్ ఏమీ లేదు. మేం సరిగ్గా ఇలాంటి పిచ్‌నే కోరుకున్నాం. తొలి రోజు నుంచే స్పిన్నర్లకు అనుకూలిస్తే టాస్ ప్రభావం తగ్గించవచ్చని భావించాం. క్యురేటర్ కూడా అదే ఇచ్చారు. మేం మ్యాచ్ గెలిచి ఉంటే పిచ్‌పై ఇంత చర్చ జరిగేది కాదు. మంచి డిఫెన్స్ ఉంటే పరుగులు సాధించవచ్చు. మీరు మానసికంగా ఎంత దృఢంగా ఉన్నారో ఇక్కడ తెలుస్తుంది. బవుమా, అక్షర్, సుందర్ పరుగులు రాబట్టారు కదా’

–గౌతమ్ గంభీర్, భారత కోచ్

1 భారత్‌లో జరిగిన ఒక టెస్టులో నాలుగు ఇన్నింగ్స్‌లలోనూ 200కంటే తక్కువ స్కోర్లు నమోదు కావడం ఇదే తొలిసారి.

2 భారత్ ఛేదించలేకపోయిన రెండో అతి చిన్న లక్ష్యమిది. 1997 బ్రిడ్జ్‌టౌన్‌లో వెస్టిండీస్‌పై 120 పరుగులను ఛేదించే లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 81 పరుగులకే ఆలౌటైంది.

15 భారత్ గడ్డపై దక్షిణాఫ్రికా 15 ఏళ్ల తర్వాత (2010లో) టెస్టు గెలిచింది. ఈ మధ్య కాలంలో ఇక్కడ 8 టెస్టులు ఆడిన టీమ్ 7 ఓడగా ఒకటి డ్రా అయింది (వర్షం కారణంగా).

హరికృష్ణ నిష్క్రమణ

పనాజీ (గోవా): ‘ఫిడే’ ప్రపంచ కప్ చెస్ టోర్నమెంట్‌లో భారత ఆటగాడు పెంటేల హరికృష్ణ ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగాడు. రొమేనియాకు చెందిన మార్టినెజ్ అల్కంటారా చేతిలో హరికృష్ణ పరాజయం పాలయ్యాడు. ఇద్దరి మధ్య జరిగిన రెండు గేమ్‌లు ‘డ్రా’గా ముగియడంతో ఆదివారం ‘టైబ్రేక్’ నిర్వహించారు. 15 నిమిషాల వ్యవధి ఉన్న తొలి రెండు ర్యాపిడ్ గేమ్‌లు ‘డ్రా’ కావడంతో 10 నిమిషాల మరో రెండు ర్యాపిడ్ గేమ్‌లు నిర్వహించారు. ఇందులో తొలి గేమ్‌లో హరికృష్ణ ఒక దశలో మెరుగైన స్థితిలోనే ఉన్నా...తెల్ల పావులతో ఆడిన మార్టినెజ్ చివరకు 59 ఎత్తుల్లో విజయం సాధించాడు. తప్పనిసరిగా గెలవాల్సిన రెండో గేమ్‌లో నల్ల పావులతో ఆడిన హరికృష్ణ 30 ఎత్తుల తర్వాత ‘డ్రా’ మాత్రమే చేయగలిగాడు. దాంతో అతను వరల్డ్ కప్‌నుంచి నిష్క్రమించాడు. క్వార్టర్ ఫైనల్లో జవోకిర్ సిందరోవ్‌ను మార్టినెజ్ ఎదుర్కొంటాడు. ఇప్పుడు భారత్ ఆశలన్నీ అర్జున్ ఇరిగేశిపైనే ఉన్నాయి. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్ పోరులో వె యి (చైనా)తో అర్జున్ తలపడతాడు. ఇతర గేమ్‌లలో డానిల్ దుబోవ్‌ను ఓడించి స్యామ్ శంక్‌లాండ్, అలెక్సీ గ్రెబ్‌నోవ్‌పై గెలిచి ఆండ్రీ ఎసిపెంకో, లీ క్వాంగ్ లీమ్‌పై విజయం సాధించి అలెగ్జాండర్ డోన్‌చెంకో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.

డెఫ్ ఒలింపిక్స్ షూటింగ్‌లో తెలంగాణ షూటర్ ధనుశ్ శ్రీకాంత్‌కు స్వర్ణం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఎస్‌ఐఆర్ చట్టవిరుద్ధం

- రాజ్యాంగ వ్యతిరేక చర్యను అడ్డుకోవాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్
- విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులపై చంద్రబాబు వ్యాఖ్యలను ఖండించిన సమావేశం

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సాకే శైలజనాథ్

సాక్షి, అమరావతి: సమగ్ర ఓటర్ల సవరణ(ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని రాష్ట్రంలో నిలిపివేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఎటువంటి నోటిఫికేషన్ జారీ చేయకుండానే పోలింగ్ బూత్ స్థాయి వరకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేపట్టడం చట్టవిరుద్ధమైందని స్పష్టం చేశారు. సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలో అమలు చేయడానికి పూనుకోవడాన్ని తప్పుబట్టారు. దీనిపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ అమలు చేయడానికి వ్యతిరేకిస్తూ సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రం(ఎంబీవీకే)లో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలని అన్ని పార్టీలు ఎన్నికల సంఘాన్ని కలిసి వినతిపత్రం అందించాలని తీర్మానించింది. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ మాట్లాడుతూ ఎస్ఐఆర్‌పై ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పెద్దల డైరెక్షన్‌లోనే ఎలక్షన్ కమిషన్ పనిచేస్తోందని విమర్శించారు. ఎస్ఐఆర్ అమలుపై టీడీపీ, జనసేన వైఖరి స్పష్టం చేయాలని శైలజనాథ్ డిమాండ్ చేశారు.

అఖిలపక్షం ఎందుకు నిర్వహించడం లేదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్ఐఆర్ రెండో దశ జాబితాలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఆంధ్రప్రదేశ్ పేరును ప్రకటించలేదని, అయినా రాష్ట్రంలో ఎస్ఐఆర్ అమలుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సన్నాహాలు చేస్తుండడం చట్ట విరుద్ధమన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ మాట్లాడుతూ దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని, ఓట్ల శాతాన్ని బట్టి సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

స్టీల్ ప్లాంట్ కార్మికులపై బాబు వ్యాఖ్యలు తగవు

ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు నియంతృత్వం పోకడలకు అద్దం పడుతున్నాయన్నారు. ఏపీలోనూ 2024 ఎన్నికల్లో 40శాతం ఓట్లు వచ్చిన వైఎస్సార్‌సీపీకి 11 సీట్లు వచ్చాయని, ఓట్లు ఎక్కువ వచ్చినా సీట్లు తగ్గాయని, ఈ విధానంలో మార్పు రావాలన్నారు. ఇంకా ఈ సమావేశంలో జై భీమ్‌రావ్ భారత్ పార్టీ అధ్యక్షులు జడ శ్రావణ్ కుమార్, సిపిఐ ఎంఎల్(లిబరేషన్) నాయకులు బంగార్రాజు, ఆర్ఎస్‌పి నాయకులు జానకిరాములు, వీసీకే పార్టీ నాయకులు విద్యాసాగర్, ఆప్ నేత నేతి మహేశ్వరరావు, ఎస్‌యూసీఐ నాయకులు సుధీర్, సీపీఐఎంఎల్(న్యూడెమోక్రసీ) నాయకులు రామకృష్ణ, ఎంసీపీఐయూ నాయకులు ఖాదర్ బాషా, రెడ్‌ఫ్లాగ్ నాయకులు ప్రసాద్, ఐలూ రాష్ట్ర నాయకులు సుధాకర్, భారత్ బచావో నాయకులు భాస్కరరావు మాట్లాడారు. అనంతరం విశాఖస్టీల్ ప్లాంట్ ఉద్యోగులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ సమావేశం తీర్మానించింది.

స్టీల్ ప్లాంట్ కార్మికులపై చంద్రబాబు ‘సమ్మిట్ ఫ్లాప్’ కోపం

- వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ధ్వజం
- స్టీల్ ప్లాంట్ కార్మికులకు అండగా పార్టీ ఉంటుందని స్పష్టీకరణ

సాక్షి, విశాఖపట్నం: విశాఖ పెట్టుబడుల సదస్సు అట్టర్ ఫ్లాప్ కావడంతో సీఎం చంద్రబాబు ఆ కోపాన్ని, అసహనాన్ని స్టీల్ ప్లాంట్ కార్మికులపై ప్రదర్శిస్తున్నారని వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఖరీదైన భూములను ఇప్పటికే తమ వారికి పప్పుబెల్లాల్లా కట్టబెట్టిన చంద్రబాబు కన్ను ఇప్పుడు రూ.లక్షల కోట్ల ఖరీదైన స్టీల్ ప్లాంట్ భూములపై పడిందన్నారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా.. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా వైఎస్సార్ సీపీ పోరాడుతుందని, కార్మికులకు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే, ‘కుమారుడు లోకేశ్ రాజకీయ భవిష్యత్ కోసం ప్లాంట్ ప్రైవేటీకరణకు చంద్రబాబు కేంద్రానికి సహకరిస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కానివ్వనని గతంలో హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు ఉత్తరాంధ్ర ప్రజలకు, ప్లాంట్ ఉద్యోగులకు వెన్నుపోటు పొడుస్తున్నారు. మూడు నెలలుగా సీఐఐ సమ్మిట్ పేరిట దేశ, విదేశాల్లో సైతం పర్యటించినా సమ్మిట్ అట్టర్ ఫ్లాప్ అయింది. ప్రభుత్వ హడావుడి తప్ప నిర్దేశించుకున్న లక్ష్యంలో కనీసం 50 శాతం పెట్టుబడులు కూడా రాలేదనే విమర్శలున్నాయి. దానికి నిన్న చంద్రబాబు సమ్మిట్‌లో విశాఖ ఉక్కు గురించి అసహనంతో మాట్లాడిన మాటలే నిదర్శనం. స్టీల్ ప్లాంట్‌ను తెల్ల ఏనుగుతో పోల్చుతూ... ప్లాంట్ కార్మికులే నష్టాలకు కారణమనడం దారుణం. ఆయన మాటలు వింటుంటే అసలు స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడమే కాకుండా, విశాఖలో స్టీల్ ప్లాంట్ ఉంచుతారా? లేదా? అన్న అంశంపైసైతం సందేహం కలుగుతోంది. చంద్రబాబు తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని కార్మికులకు క్షమాపణ చెప్పాలి’ అని పేర్కొన్నారు. సమావేశంలో సమన్వయ కర్తలు మొల్లి అప్పారావు, తిప్పల శ్రీనివాస్ దేవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌పై మేధావులతో కలిసి ఉద్యమం

- సీఎం చంద్రబాబు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం
- పరిశ్రమల శాఖ రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ ఏవీ పటేల్

సాక్షి, అమరావతి: ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కార్మికులపై ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను పరిశ్రమల శాఖ రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ ఏవీ పటేల్ తీవ్రంగా ఖండించారు. ‘ఇది ఉద్యోగుల సమస్య కాదు. ఎంతోమంది త్యాగాల ఫలితంగా విశాఖ స్టీల్ ప్లాంట్ వచ్చింది. ఎన్నికల ముందు ఒకలా మాట్లాడిన చంద్రబాబు... అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విధంగా మాట్లాడాన్ని ఖండిస్తున్నాం. చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్రంలోని పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, మేధావులతో కలిసి ఐక్యకార్యచరణ ఉద్యమాన్ని చేపడతాం’ అని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సతీష్‌కుమార్‌ది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

- పరకామణి చోరీ కేసులో విచారణ పేరుతో సిట్ వేధింపులు
- ఆ వేధింపులు భరించలేక సతీష్ కుమిలిపోయారు
- వైఎస్సార్‌సీపీ నేతల పేర్లు చెప్పాలని ఆయనపై ఒత్తిడి
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

సాక్షి, అమరావతి: టీటీడీ మాజీ ఏవీఎస్‌వో, ప్రస్తుత రైల్వే సీఐ సతీష్‌కుమార్‌ది ముమ్మాటికీ ప్రభుత్వం చేసిన హత్యేనని ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. పరకామణి కేసులో వైఎస్సార్‌సీపీ నాయకుల పేర్లు చెప్పాలని ఆయనను మానసికంగా వేధించి చనిపోయేలా ప్రేరేపించారని స్పష్టం చేశారు. ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. సతీష్‌కుమార్ కేవలం ప్రభుత్వ వేధింపులతోనే మరణిస్తే, దాన్ని హత్యగా ప్రచారం చేస్తూ వైఎస్సార్‌సీపీ నేతలను నిందిస్తున్నారని ఆక్షేపించారు. ‘సతీష్‌కుమార్ మరణం వెనుక ఎన్నో సందేహాలు, ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. గురువారం రాత్రి 7 గంటలకు ఇంటినుంచి బయల్దేరిన ఆయన అర్ధరాత్రి 12 గంటలకు రైల్వే స్టేషన్ చేరుకున్నారు. మధ్యలో 5 గంటల్లో ఏం జరిగింది? అర్ధరాత్రి దాదాపు 12.30 గంటలకు రాయలసీమ ఎక్స్‌ప్రెస్ ఎక్కిన ఆయన గంట తర్వాత తాడిపత్రికి సమీపంలో శవమై కనిపించారు. ఈ గంటపాటు ఏం జరిగిందో విచారణ చేయలేదు. అయినా వీపుపై గొడ్డలితో నరికినట్టు వైద్యులు ధ్రువీకరించారంటూ ఎల్లో మీడియా, టీడీపీ సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఏసీ బోగీలో ఉన్న వ్యక్తిని గొడ్డలితో నరికి చంపుతుంటే టీసీ కానీ, తోటి ప్రయాణికులు కానీ అడ్డుకోలేదా? కనీసం చూడలేదా?. ఎక్కడ ఆయన మరణం ప్రభుత్వానికి చుట్టుకుంటుందోనన్న భయంతోనే హత్య పేరుతో కట్టుకథను ప్రచారంలోకి తెచ్చారు. హడావిడిగా పోస్టుమార్టం చేశారు. ఆయన భార్య ఫోన్ తీసుకున్నారు. ఆమెతో ఎవరూ మాట్లాడకుండా కట్టడి చేస్తున్నారు. ఇదంతా ఎందుకు?. ఈ నెల 6న విచారణకు హాజరైన సతీష్‌కుమార్ పక్కన ఒక రౌడీషీటర్‌ను కూర్చోబెట్టి మరీ ఎందుకు విచారించాల్సి వచ్చింది. ఎంతోమంది ఉన్నత స్థానాల్లో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను వేధించి పోస్టింగ్‌లు ఇవ్వకుండా ఏడాదిన్నరగా ఈ ప్రభుత్వం ఇబ్బంది పెడుతోంది. అలాంటి పరిస్థితుల నేపథ్యంలోనే సీఐ స్థాయిలో ఉన్న సతీష్‌కుమార్ ఈ వేధింపులను, సిట్ చేస్తున్న ఒత్తిడిని తట్టుకోలేకపోయారు. ఈ నెల 14న మరోసారి విచారణకు హాజరుకావాల్సి ఉండగా రైల్లో వెళ్తుండగా అనుమానాస్పద స్థితిలో చనిపోతే, ఆయన్ను హత్య చేశారని దుష్ప్రచారం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులను పరకామణి కేసులో ఇరికించాలన్న కుట్ర విఫలం కావడంతో ఈ కొత్త కట్టుకథను రచించి ఎల్లో మీడియా, సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు’ అని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

అబద్ధాలను నిజం చేసే ప్రయత్నంలో భాగంగానే..

‘రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అబద్ధాన్ని నిజం చేసే ప్రయత్నంలో నిజాయితీతో పనిచేసిన ఎంతోమంది అధికారుల జీవితాలతో ఈ ప్రభుత్వం చెలగాటం ఆడుకుంటోంది. జత్వానీ కేసులో పీఎస్ఆర్ ఆంజనేయులను 50 రోజులపాటు జైల్లో అక్రమంగా నిర్బంధించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన జేఎస్‌డబ్ల్యూ కంపెనీ యజమానిని హనీట్రాప్ చేసి వేధించాలని చూసిన జత్వానీ బారినుంచి కాపాడటం ఆయన చేసిన నేరమా? మార్గదర్శి చిట్‌ఫండ్ స్కామ్‌ని వెలికితీసినందుకు అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ 80 రోజులకుపైగా జైల్లో ఉన్నారు. రఘురామకృష్ణంరాజు కేసులో దర్యాప్తు అధికారిగా ఉన్న విజయపాల్‌ను 78 రోజులు అక్రమంగా జైల్లో నిర్బంధించారు. డబుల్ ఇంజిన్ సర్కార్ నడుపుతున్నామని చెప్పుకుంటూ ట్రబుల్ ఇంజిన్ సర్కార్‌ని నడిపిస్తున్నారు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీపై నిలువెల్లా ద్వేషంతో కక్ష రాజకీయాలు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీతో పెట్టుకుంటే ప్రభుత్వాన్ని ఊదేస్తుందన్న మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు మాటలని చంద్రబాబు ఎప్పుడో గుర్తించారు. అందుకే నోరెత్తితే మా పార్టీ నాయకుల మీద అక్రమ కేసులు పెడుతున్నారు’ అని చంద్రశేఖర్ చెప్పారు. చంద్రబాబు ప్రోత్సాహంతో టీడీపీ గూండాలు రెచ్చిపోతున్నారని, హిందూపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై దాడిచేసి విధ్వంసం సృష్టించారని ఆయన మండిపడ్డారు. ఎవరెంత రెచ్చిపోయినా వైఎస్సార్‌సీపీ నాయకుల ఆత్మస్థైర్యాన్ని అణచలేరని స్పష్టం చేశారు.

బాబు పాలనలో రాయలసీమకు నష్టమే

- అన్యాయం జరిగితే ఇక సహించేది లేదు
- ప్రభుత్వానికి మాజీ మంత్రి సాకే శైలజానాథ్ హెచ్చరిక

సాక్షి, అమరావతి: చంద్రబాబు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా రాయలసీమకు నష్టమేనని, ఇకపై అన్యాయం జరిగితే సహించేది లేదని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ హెచ్చరించారు. చంద్రబాబుకు నిజంగా రాయలసీమపై చిత్తశుద్ధి ఉంటే శ్రీబాగ్ ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శైలజానాథ్ మీడియాతో మాట్లాడారు. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం.. రాయలసీమకు హక్కుగా దక్కాల్సిన హైకోర్టు, ఎయిమ్స్‌ను అమరావతికి తరలించిన చంద్రబాబు రాయలసీమకి చెడ్డ బిడ్డగా మిగిలిపోయారని ధ్వజమెత్తారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్ రాయలసీమ స్థితిగతులను పూర్తిగా అర్థం చేసుకుని సాగునీటి ప్రాజెక్టులపై దృష్టిసారించారని సాకే వివరించారు. హంద్రీనీవా ప్రాజెక్టును ఐదు టీఎంసీలకే పరిమితం చేసి చంద్రబాబు కేవలం తాగునీటి పథకంగా మారిస్తే, ఆ తర్వాత సీఎంలుగా చేసిన వైఎస్సార్, వైఎస్ జగన్ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 50 టీఎంసీలకు పెంచి రాయలసీమ సాగునీటి అవసరాలను చాలా వరకు తీర్చారని సాకే కొనియాడారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. ‘‘రాయలసీమకు చంద్రబాబు తొలి నుంచీ అన్యాయమే చేస్తున్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ శ్రీబాగ్ ఒప్పందంలో ముఖ్యమైన అంశం. వైఎస్ జగన్ మూడు రాజధానుల అంశంపై అసెంబ్లీలో మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం అవసరాన్ని స్పష్టంగా వివరించారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేసి న్యాయ రాజధానిగా చేయాలని తలంచారు. అమరావతిలో శాసన రాజధాని, విశాఖలో కార్యనిర్వాహక రాజధాని ఏర్పాటు చేసి అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేయాలని బలంగా ఆకాంక్షించారు. వైఎస్సార్ తర్వాత రాయలసీమ అభివృద్ధికి గట్టిగా నిలబడిన వ్యక్తి వైఎస్ జగన్. సీమలో సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధిపై దృష్టి సారించిన నేతలు వైఎస్సార్, జగనే.’’ శైలజానాథ్ స్పష్టం చేశారు.

పోలవరం ఎత్తు తగ్గించి అన్యాయం

చంద్రబాబు సీఎం అయ్యాక పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి రాయలసీమ వాసులకు తీవ్ర ద్రోహం చేస్తున్నారు. ఆల్మట్టి బుక్కపట్నం లింక్ కెనాల్ గురించి ఎందుకు ఆలోచించడం లేదో సీఎం చెప్పాలి. రాయలసీమ సాగు నీటి ప్రాజెక్టులపై దృష్టిపెట్టాలి.’’ అని శైలజానాథ్ డిమాండ్ చేశారు.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
84	31
84,563	25,910

విదేశీ సూచీలు

నాస్‌డాక్	22,885	▲	15
డోజోన్స్	47,128	▼	329
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,698	▼	109
డాక్స్	23,876	▼	165
షాంఘై	3,990	▼	39
నికాయ్	50,377	▼	905

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.30	89.32
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.39	118.35
€	యూరో	ఎస్‌బీఐ	102.03	104.81
¥	జపాన్ యెన్ (100)	థామస్‌కుక్	46.00	59.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	55.41	59.25
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.88	69.57
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.78	24.28
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.27	24.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.62	13.45

బంగారానికి డబ్బులు కాస్తాయ్!

భారీగా పెరిగిన పసిడి ధరలు

పుత్తడిని నిరుపయోగం కానీయొద్దు • వినియోగించకపోతే ప్రత్యామ్నాయాలు

గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్‌కు వెళ్లొచ్చు • లీజుకు ఇస్తే అదనపు ఆదాయం

కాదంటే డిజిటల్ రూపంలోకి మార్చుకోవచ్చు

ధర ఎంతున్నా.. తమ తాహతు మేరకు పసిడి కొనుగోలు అన్నది భారతీయ కుటుంబాల్లో సాధారణంగా కనిపించే ధోరణి. మోర్గాన్ స్టాన్లీ సంస్థ 2025 అక్టోబర్ నివేదిక ప్రకారం.. భారతీయుల ఇళ్లల్లో 34,600 టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయి. వీటి విలువ 3.8 ట్రిలియన్ డాలర్లు (సుమారు రూ.334 లక్షల కోట్లు). దేశ జీడీపీలో 88.8 శాతానికి సమానం. పసిడి ధరలు రికార్డు గరిష్టాల్లో ట్రేడవుతున్నాయి. ఇంతటి విలువైన పసిడిని బీరువాల్లోనో.. లేదంటే బ్యాంక్ లాకర్లలో పెట్టే వారి ముందు మెరుగైన ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. వాడకంలో లేని పసిడిని ఉత్పాదకతకు వినియోగించుకోవచ్చు. అదనపు రాబడి మార్గాలను ప్రయత్నించొచ్చు. బంగారం రుణాలు, గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్, పసిడి ఆధారిత పెట్టుబడుల పథకాలు ఇలా ఎన్నో సాధనాలున్నాయి. వాటి గురించి తెలియజేసే కథనమే ఇది.

- సాక్షి, బిజినెస్ డెస్క్

గోల్డ్ మానిటైజేషన్ పథకం

కేంద్ర సర్కారు 2015లో గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్ (జీఎంఎస్/పసిడి నగదీకరణ పథకం)ను తీసుకొచ్చింది. భౌతిక రూపంలో ఉన్న బంగారాన్ని ఉత్పాదకత వైపు తీసుకువచ్చే లక్ష్యంతో ఈ పథకాన్ని రూపొందించింది. ఈ పథకం కింద వ్యక్తులతోపాటు సంస్థలు భౌతిక బంగారాన్ని ఎంపిక చేసిన బ్యాంకుల్లో డిపాజిట్ చేయొచ్చు. జమ చేసిన మేర బంగారం విలువపై ఏటా 2.25–2.5 శాతం మేర వడ్డీని పొందొచ్చు. దీనివల్ల సదరు బంగారాన్ని ఎక్కడ భద్రంగా నిల్వ చేసుకోవాలన్న ఆందోళన ఉండదు. బంగారం ఆభరణాలు, కాయిన్లు, కడ్డీలను అధీకృత కేంద్రానికి తరలించి అక్కడ స్వచ్ఛత పరీక్షిస్తారు. ఈ పథకం కింద కనీసం 10 గ్రాముల బంగారం నుంచి ఎంత వరకు అయినా డిపాజిట్ చేయొచ్చు. గరిష్ట పరిమితి లేదు. జమ చేసిన మేర బంగారానికి (స్వచ్ఛత అనంతరం) బ్యాంకులు డిపాజిట్ రసీదును జారీ చేస్తాయి. సదరు బంగారాన్ని కరిగించి వినియోగంలోకి తెచ్చుకుంటాయి. గడువు ముగిసిన తర్వాత జమ చేసినంత బంగారాన్ని తిరిగి పొందొచ్చు. లేదంటే అప్పటి విలువ మేరకు నగదు రూపంలోనూ తీసుకోవచ్చు. 2025 మార్చి నుంచి మధ్య, దీర్ఘకాల గోల్డ్ మానిటైజేషన్ డిపాజిట్లను ప్రభుత్వం నిలిపివేసింది. ఏడాది, మూడేళ్ల కాలానికే ప్రస్తుతం ఈ పథకం కింద బంగారం డిపాజిట్‌కు అనుమతి ఉంది. దీర్ఘకాలం కోసం డిపాజిట్ చేయాలనుకునే ఇన్వెస్టర్లు మూడేళ్ల మెచ్యూరిటీ తర్వాత రెన్యువల్ చేసుకోవచ్చు. మంచి విలువైన పథకం అయినప్పటికీ దీనిలో పాల్గొనే వారు చాలా తక్కువగా ఉంటున్నట్టు ఆనంద్‌రాఠీ వెల్త్ మ్యూచువల్ ఫండ్స్ విభాగం హెడ్ స్వేత రజని తెలిపారు. బంగారం ఆభరణాలతో ఉన్న దీర్ఘకాల అనుబంధం, సెంటిమెంట్‌ను ఇందుకు కారణాలుగా పేర్కొన్నారు. కనీసం దెబ్బతిన్న ఆభరణాలు, వినియోగించని వాటి విషయంలో అయినా గోల్డ్ మానిటైజేషన్ పథకం ఎంతో అనుకూలం. రిస్క్ లేని రాబడులను అందుకోవచ్చు. ఆభరణాలతో భావోద్వేగమైన బంధం ఉన్న వారికి ఇది అనుకూలం కాదు. ఎందుకంటే మానిటైజేషన్ కింద డిపాజిట్ చేస్తే వాటిని పూర్వపు రూపంలో తిరిగి పొందలేరని రజని తెలిపారు.

- ఇది ప్రభుత్వ హామీ కలిగిన పథకం. ఇందులో డిపాజిట్ చేసిన బంగారంపై వార్షిక వడ్డీ రాబడి 2.25–2.5%. వడ్డీని ఏటా చెల్లిస్తారు.
- ఆభరణాలు, కాయిన్లను డిపాజిట్ చేయొచ్చు. గడువు తీరిన తర్వాత తిరిగి బంగారం లేదంటే నగదు రూపంలో తీసుకోవచ్చు.
- కేవలం 1–3 ఏళ్ల కాలానికే అందుబాటులో ఉంటుంది. వేగంగా నగదు మార్చుకోవడానికి ఇందులో అవకాశం లేదు. గడువు ముగిసే వరకు ఆగాల్సిందే.
- 10 గ్రాముల్లోపు బంగారం డిపాజిట్‌కు అవకాశం లేదు.

బంగారం లీజుకు..

బంగారాన్ని లీజుకు ఇవ్వడం ద్వారా కొంత రాబడి పొందొచ్చు. నగల వ్యాపారులకు (జ్యుయెలర్) మూలధన అవసరాలు ఎక్కువగా ఉంటాయి. అంటే వారు దుకాణాల్లో ఆభరణాల నిల్వ కోసం ఎక్కువ మొత్తంలో పెట్టుబడి అవసరం పడుతుంది. కనుక నగల వ్యాపారులు ఆభరణాలను లీజుకు తీసుకుని ఈ అవసరాలను గట్టెక్కుతుంటారు. దీనిపై కొంత రాబడి చెల్లిస్తుంటారు. దీని వల్ల బంగారాన్ని బీరువా లేదా బ్యాంకు లాకర్లకు పరిమితం కాకుండా, ఆదాయాన్ని తెచ్చిపెట్టే సాధనంగా మార్చుకోవచ్చు. సేఫ్‌గోల్డ్ అనే ప్లాట్‌ఫామ్ ఇందుకు వీలు కల్పిస్తోంది. ఈ సంస్థను సంప్రదించినట్టయితే అనుమతి తీసుకుని, లీజుకు ఇచ్చిన బంగారాన్ని కరిగించి అందులోని స్వచ్ఛతను నిర్ధారిస్తుంది. అనంతరం 24 క్యారెట్ బంగారం కిందకు మారుస్తారు. అనంతరం సంబంధిత వ్యక్తి పేరుపై డిజిటల్ గోల్డ్ ఖాతా తెరిచి బంగారం విలువ మేరకు జమ చూపిస్తారు. అనంతరం సేఫ్‌గోల్డ్ ప్లాట్‌ఫామ్‌పై లిస్ట్ అయిన నగల వ్యాపారులకు మీ బంగారాన్ని లీజుకు ఇవ్వొచ్చు. ఏటా 2–5 శాతం మధ్య రాబడి లభిస్తుంది. రాబడిని రూపాయిల్లో కాకుండా తిరిగి బంగారం రూపంలోనే జమ చేస్తారు. దీనివల్ల దీర్ఘకాలంలో తాము లీజుకు ఇచ్చిన బంగారానికి అదనంగా మరికొంత పసిడిని పోగుచేసుకోవచ్చు. పెరుగుతున్న బంగారం ధరలకు అనుగుణంగా, దీర్ఘకాలంలో అదనపు రాబడిని ఈ మార్గంలో సంపాదించుకోవచ్చు.

- ఈ విధానంలో ఆభరణాలు, కాయిన్లను కరిగించి, వాటి విలువపై 2–5 శాతం మధ్య రాబడి చెల్లిస్తారు.
- కోరుకున్నప్పుడు తిరిగి పాత ఆభరణాలను పొందడం సాధ్యపడదు. ఒకవేళ భౌతిక బంగారం రూపంలోనే వెనక్కి తీసుకునేట్టు అయితే డెలివరీ చార్జీలు చెల్లించుకోవాలి.

ఫండ్స్‌లోకి మార్చుకోవడం

భౌతిక బంగారాన్ని గోల్డ్ ఈటీఎఫ్‌లు, గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్‌లోకి మార్చుకోవడం మరో మార్గం. దీనివల్ల భద్రతపరమైన రిస్క్ ఉండదు. అవసరమైనప్పుడు వేగంగా నగదుగా మార్చుకోవచ్చు. ఇందులో లాభ, నష్టాలు రెండూ ఉన్నాయి. నాణ్యత, నిల్వ, భద్రతాపరమైన రిస్కులను తొలగించుకోవడం సానుకూలతలు. పెద్ద మొత్తంలో బంగారం కలిగిన వారికి, దాన్ని కాపాడుకోవడం, ఒక చోట నుంచి మరో చోటకు తీసుకెళ్లడం పెద్ద సవాలే. ఇలాంటి వారు మొత్తం కాకపోయినా సగం బంగారాన్ని అయినా డిజిటల్ రూపంలోకి మార్చుకోవడం మంచి ఆలోచన అవుతుంది. ఏడాది నిండిన తర్వాత డిజిటల్ గోల్డ్‌ను విక్రయించిన సందర్భంలో వచ్చిన లాభంపై 12.5 శాతం పన్ను చెల్లిస్తే సరిపోతుంది.

- భౌతిక బంగారాన్ని విక్రయించి, డిజిటల్‌గా మారిపోవడం వల్ల పారదర్శకత, భద్రత, పన్ను ప్రయోజనాలు లభిస్తాయి. కానీ, డిజిటల్ రూపంలో (ఈటీఎఫ్‌లు) ఉంటే స్వల్ప స్థాయిలో ఎక్స్‌పెన్స్ రేషియో చెల్లించాల్సి వస్తుంది.
- భౌతిక బంగారాన్ని విక్రయించినప్పుడు మూలధన లాభాల పన్ను చెల్లించాల్సి ఉంటుంది. భౌతిక బంగారాన్ని కొనుగోలు చేసిన రెండేళ్లలోపు విక్రయిస్తే వచ్చిన లాభాన్ని తమ వార్షిక ఆదాయానికి కలిపి చూపించాలి. రెండేళ్ల తర్వాత విక్రయిస్తే వచ్చిన లాభంపై 12.5 శాతం పన్ను చెల్లించాలి.

నగలపై రుణం..

వినియోగించకుండా ఉన్న ఆభరణాలను, వాటితో ఉన్న అనుబంధం దృష్ట్యా గోల్డ్ మానిటైజేషన్‌కు మనసొప్పని వారు.. వాటిని రుణాల కోసం వినియోగించుకోవచ్చు. తక్కువ వడ్డీ రేటుపై రుణాన్ని వేగంగా పొందొచ్చు. బంగారం తాకట్టు విలువపై 75 శాతం వరకు రుణం కింద బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఇస్తుంటాయి. రూ.5 లక్షల్లోపు రుణాలకు 85 శాతం విలువ వరకు కూడా (ఎల్‌టీవీ) ఇస్తాయి. ప్రతి నెలా వడ్డీ చెల్లించి, గడువు ముగిసిన తర్వాత అసలు చెల్లించొచ్చు. కొన్ని బ్యాంకులు గడువు చివర్లో వడ్డీ, అసలు చెల్లింపులకు అనుమతిస్తున్నాయి. కాకపోతే వడ్డీని ప్రతి నెలా చార్జ్ చేస్తుంటాయి. దీంతో ఏ నెలకు ఆ నెల వడ్డీ కట్టకపోతే, దానిపై రెండో నెలలో వడ్డీ భారీగా పెరిగిపోతుంది. రుణాన్ని సమాన నెలసరి వాయిదాల్లో (ఈఎంఐ) చెల్లించే ఆప్షన్ కూడా ఉంటుంది. బంగారం తాకట్టుపై ఓవర్‌డ్రాఫ్ట్ రుణాన్ని కూడా పొందొచ్చు. అనుమతించిన రుణాన్ని అవసరానికి అనుగుణంగా ఎప్పుడైనా డ్రా చేసుకోవచ్చు. తిరిగి ఎప్పుడైనా చెల్లించొచ్చు. ఎలాంటి ఆదాయపత్రాలు, క్రెడిట్ స్కోర్ ఈ రుణాలకు అవసరం లేదు. వ్యక్తిగత రుణాలపై వడ్డీ రేటు 12–15 శాతం వరకు ఉంటోంది. అదే బంగారంపై రుణాలు 8 శాతం రేటు నుంచి లభిస్తున్నాయి. గోల్డ్ అప్రైజర్, ప్రాసెసింగ్ చార్జీల పేరుతో కొంత చార్జీ భరించాల్సి ఉంటుంది. ముందుగా రుణాన్ని చెల్లించేస్తే ఎలాంటి చార్జీ పడదు. కొన్ని సంస్థలు ముందస్తు చెల్లింపులపై కొంత చార్జీ వసూలు చేస్తున్నాయి. రుణ గడువు ముగిసిన తర్వాత చెల్లింపుల్లో విఫలమైతే 30–60 రోజుల వ్యవధి అనంతరం, బ్యాంకులు/ఎన్‌బీఎఫ్‌సీలు వేలం వేస్తుంటాయి.

- ఆభరణాల విలువపై 85 శాతం వరకు రుణంగా పొందొచ్చు.
- వ్యక్తిగత రుణాలు తీసుకుని అధిక వడ్డీ భారం మోస్తున్న వారు.. తమ వద్ద నిరుపయోగంగా ఉన్న బంగారం ఆభరణాలు, కాయిన్లపై రుణంతో భారాన్ని తగ్గించుకోవచ్చు.
- గడువులోపు రుణాన్ని తీర్చివేయడంలో విఫలమైతే బంగారాన్ని వేలం వేస్తారు.
- రుణం తీసుకున్న తర్వాత బంగారం ధరలు గణనీయంగా పడిపోతే, కొంత మొత్తాన్ని మధ్యంతరంగా చెల్లించాల్సి రావడం ప్రతికూలత.

కొత్త ఆభరణాలకు అప్‌గ్రేడ్...

కొందరు ఇంట్లో వినియోగంలో లేని బంగారాన్ని అలాగే ఉంచేసి, కొత్త ఆభరణాలు కొనుగోలు చేస్తుంటారు. దీనికి బదులు పాత బంగారాన్ని కొత్త ఆభరణాల కిందకు అప్‌గ్రేడ్ చేసుకోవడం మంచి నిర్ణయం అవుతుంది. కొత్త ఆభరణాల కిందకు మార్చుకోవడం వల్ల నిరుపయోగంగా ఉన్న పసిడి వినియోగంలోకి వస్తుంది. దీంతో కొత్తవాటి కొనుగోలుకు అదనపు పెట్టుబడి అవసరం రాదు. కొత్త డిజైన్లకు, తయారీ కోసం చార్జీల వరకు చెల్లిస్తే చాలు. సున్నా తరుగు లేదా అతి తక్కువ తరుగు చార్జీల ఆఫర్లను వినియోగించుకోవడం ద్వారా చార్జీల భారాన్ని తగ్గించుకోవచ్చు. ట్రెండ్‌కు అనుగుణంగా కొత్త ఆభరణాలను ధరించామన్న సంతృప్తి దక్కుతుంది.

- గతంలో ఎప్పుడో కొన్న ఆభరణాల్లో స్వచ్ఛత పాళ్లు తక్కువ. ఇప్పుడు వాటిని హాల్‌మార్క్ ఆభరణాల కిందకు మార్చుకోవచ్చు.
- వినియోగంలో లేని ఆభరణాలనే కొత్త ఆభరణాల అప్‌గ్రేడ్ కోసం పరిశీలించొచ్చు.
- బంగారం విలువలో 10–15 శాతం చార్జీలను భరించాల్సి రావచ్చు. జీఎస్‌టీ కూడా పడుతుంది.

స్టాక్ స్కోప్

లీలా ప్యాలసెస్ | **బ్రోకరేజ్:** జేఎమ్ ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 430 **టార్గెట్:** రూ. 605

ఎందుకంటే: లీలా బ్రాండ్ పేరున అత్యున్నత ఆర్కిటెక్చర్, లగ్జరీ సౌకర్యాలతో విలాసవంత హోటళ్లను నిర్వహించే ష్లాస్ బెంగళూరు (లీలా ప్యాలసెస్ హోటల్స్) పటిష్ట పనితీరు చూపుతోంది. ఆతిథ్య రంగంలోని ఇతర సంస్థలతో పోలిస్తే అత్యధిక సగటు గదుల అద్దె(ఏఆర్‌ఆర్)ను సాధిస్తోంది. దేశీయంగా ఆతిథ్య రంగంలో విలాసవంత హోటళ్ల డిమాండ్, సరఫరా ఔట్‌లుక్ సానుకూలంగా కనిపిస్తోంది. 2024–28 మధ్య కాలంలో లగ్జరీ రూములకు వార్షిక ప్రాతిపదికన 10.6 శాతం చొప్పున డిమాండ్ పుంజుకోనున్నట్లు అంచనా. అయితే ఇదే కాలంలో విలాసవంత గదుల సరఫరా 5.9 శాతం మాత్రమే పెరిగే అవకాశముంది. సుమారు నాలుగు దశాబ్దాలక్రితమే నిర్మితమైన లీలా బ్రాండ్ విలాసవంత సౌకర్యాలతో ప్రత్యేక గుర్తింపును సాధించింది. కొద్ది నెలలుగా కంపెనీ భారీ విస్తరణ బాటలో సాగుతోంది. దీంతో 2030కల్లా సొంత హోటళ్లలో గదుల సంఖ్యను ప్రస్తుతం 1,224 నుంచి 1,978కు పెంచుకోనుంది. వెరసి 2025–28 కాలంలో కంపెనీ వార్షిక గతిన ఆదాయంలో 17 శాతం, నిర్వహణ లాభాల్లో(ఇబిటా) 18 శాతం చొప్పున వృద్ధిని అందుకోనున్నట్లు భావిస్తున్నాం. గదులకు క్రమానుగతంగా పుంజుకోనున్న డిమాండ్ నేపథ్యంలో ఏఆర్‌ఆర్‌లో 10 శాతం పురోగతి నమోదయ్యే అవకాశముంది. ఇది ఆదాయం, ఇబిటాకు మద్దతివ్వనుంది. ఫలితంగా 2026 –30 మధ్యకాలంలో మొత్తం రూ. 1,800 కోట్ల ఫ్రీ క్యాష్‌ఫ్లో టు ఈక్విటీ(ఎఫ్‌సీఎఫ్‌ఈ) సాధించవచ్చని అంచనా. తద్వారా బీకేసీ విస్తరణలో రూ. 2,000 కోట్ల లీలా వాటాకు నిధులు లభించే వీలుంది.

ఆధార్ హౌసింగ్ | **బ్రోకరేజ్:** సిటీగ్రూప్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 494 **టార్గెట్:** రూ. 650

ఎందుకంటే: గృహ రుణ రంగ కంపెనీ ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ ఎండీ, సీఈవో, సీఎఫ్‌వోలతో హాంకాంగ్‌లో ఇటీవల ఇన్వెస్టర్ సమావేశాలను నిర్వహించాం. వీటి ప్రకారం కంపెనీ వ్యూహాత్మకంగా తక్కువ ఆదాయ విభాగం(రూ. 15 లక్షలలోపు ఏటీఎస్)లో హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీగా నిలుస్తోంది. పట్టణ, వర్ధమాన మార్కెట్లపై దృష్టి పెట్టి రుణ విడుదలను చేపడుతోంది. తద్వారా ఉత్తమ క్రెడిట్‌తో నిర్వహణలోని ఆస్తుల(రుణాలు)(ఏయూఎం)లో వృద్ధికి చర్యలు చేపడుతోంది. బీ అండ్ సీ రుణాలలో రిస్క్ సర్దుబాట్ల ద్వారా నికర లాభాలకు దన్నునిచ్చే వ్యూహాలు అమలు చేస్తోంది. మధ్యకాలానికి రుణ పంపిణీలో 17–18 శాతం పురోగతి ద్వారా ఏయూఎంలో 20–22 శాతం వృద్ధిని ఆశిస్తోంది. నిధుల సమీకరణ వ్యయాల లబ్ధిని బదిలీ చేయడం ద్వారా నిలకడగా 5.5 శాతం మధ్య స్థాయి వడ్డీ రేట్లు(స్ప్రెడ్స్) సాధించే లక్ష్యంతో ఉంది. నిలకడైన బౌన్స్ రేటు కారణంగా తక్కువ నిధుల సమీకరణ వ్యయాలను కొనసాగించడం, మోనోలైన్ ఎగుమతి ఆధారిత కస్టమర్లతో అప్రమత్తంగా వ్యవహరించడం వంటి వ్యూహాలను అమలు చేస్తోంది. అయితే రాష్ట్రాలవారీగా ఎదురవుతున్న విభిన్న సవాళ్ల నేపథ్యంలో ఐదు రాష్ట్రాల(పశ్చిమ బెంగాల్, కేరళ, ఒడిషా, బిహార్, జార్ఖండ్)లో ఓ మాదిరి(సింగిల్ డిజిట్) వృద్ధికే పరిమితమవుతోంది. మరోపక్క ఫ్రెషర్స్‌తో చేపట్టిన అప్రెంటిస్ కార్యక్రమంతో క్షేత్రస్థాయిలో ఉద్యోగ వలస(అట్రిషన్)కు చెక్ పెడుతోంది. అంతేకాకుండా 4.7 శాతం ఉద్యోగ స్టాక్ కేటాయింపు పథకం(ఇసాప్) సైతం ఇందుకు మద్దతిస్తోంది. ఆస్తులపై రుణ విభాగం(ఎల్‌ఏపీ)లో ఒత్తిళ్లు, తదితరాలు కీలక రిస్కులుగా భావించవచ్చు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

జీవిత లక్ష్యాలకు ఎంత కేటాయించాలి?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



నేను ఇండెక్స్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేద్దామని అనుకుంటున్నాను. మంచి ఇండెక్స్ ఫండ్ ఎంపిక విషయంలో ఏ అంశాలను చూడాలి? – కృష్ణ శర్మ

ఇండెక్స్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలనుకోవడం మంచి ఆలోచన అవుతుంది. ఇవి తక్కువ వ్యయాలకే మెరుగైన రాబడుల అవకాశాలను కల్పిస్తాయి. వీటి ఎంపిక విషయంలో ముఖ్యంగా చూడాల్సింది ఎక్స్‌పెన్స్ రేషియో. ఇండెక్స్ ఫండ్ ఏ సూచీలో అయితే పెట్టుబడులు పెడుతుందో గమనించి, ఆ ఇండెక్స్‌తో పోలిస్తే రాబడుల తీరు ఎలా ఉందన్నది చూడాలి. ఇండెక్స్‌తో పోలిస్తే పథకం పనితీరు ఎలా ఉందన్న సమాచారాన్ని ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చు. ఇండెక్స్‌కు, ఆ ఇండెక్స్ అనుసరించే ఫండ్స్‌కు రాబడుల్లో అతి స్వల్ప వ్యత్యాసం ఉండే అవకాశం లేకపోలేదు. అంటే ఇండెక్స్ 2 శాతం పెరిగితే.. ఫండ్ పెట్టుబడుల విలువ వృద్ధి అదే కాలంలో 2.01 శాతం, 1.99 శాతంగా ఉండొచ్చు. ముఖ్యంగా ఎక్స్‌పెన్స్ రేషియో ఎంతో కీలకమైన అంశం అవుతుంది. రెండు ఇండెక్స్ పథకాల్లో ఒకటి 10 బేసిస్ పాయింట్లు చార్జ్ చేస్తుంటే, మరో పథకం 25 బేసిస్ పాయింట్లు చార్జ్ తీసుకుంటుంటే.. అప్పుడు 10 బేసిస్ పాయింట్ల పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవడం సరైన నిర్ణయం అవుతుంది. ఇండెక్స్ ఫండ్స్ సూచీలను అనుసరించే పెట్టుబడులు పెడుతుంటాయి. కనుక ఎక్స్‌పెన్స్ రేషియో ఒక్కటే ఇక్కడ ప్రామాణికం అవుతుంది.

నెలవారీ సంపాదన నుంచి రిటైర్మెంట్, ఇతర జీవిత లక్ష్యాల కోసం ఏ మేరకు కేటాయించుకోవాలి. – విశేష్

మీకు నెలవారీగా వస్తున్న ఆదాయం, జీవిత లక్ష్యాలు, వాటికి ఎంత కాలవ్యవధి ఉంది? తదితర అంశాల ఆధారంగా పొదుపు, పెట్టుబడులను నిర్ణయించుకోవాలి. ఒకరు తమ ఆదాయంలో కనీసం 20 శాతాన్ని అయినా పొదుపు చేసి, ఇన్వెస్ట్ చేయాలన్నది సాధారణ సూత్రం. ఈ పొదుపు మొత్తాన్ని వివిధ లక్ష్యాలకు ఎంత చొప్పున విభజించాలనే దానికి ఇదమిత్థమైన సూత్రం లేదు. ఎంత ఇన్వెస్ట్ చేయగలరు, ఎంత కాలంపాటు, ఎంత రాబడి కోరుకుంటున్నారనే దాని ఆధారంగా ఈ కేటాయింపులు ఆధారపడి ఉంటాయి. ముందు కాలవ్యవధికి అనుగుణంగా లక్ష్యాలను స్వల్పకాలం, మధ్యకాలం, దీర్ఘకాలం అంటూ వేరు చేయండి. దీర్ఘకాలం అంటే కనీసం ఏడేళ్ల అంతకుమించిన లక్ష్యాల కోసం ఈక్విటీ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఎందుకంటే ఇవి మెరుగైన రాబడులతోపాటు, కాంపౌండింగ్ ప్రయోజనాన్నిస్తాయి. 5–7 ఏళ్ల మధ్య కాల లక్ష్యాల కోసం ఈక్విటీ, డెట్ ఫండ్స్‌లో లేదా బ్యాలన్స్‌డ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. వీటిల్లో వృద్ధి, స్థిరత్వం ఉంటుంది. 3 నుంచి 5 ఏళ్ల స్వల్ప కాల లక్ష్యాల కోసం బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు, లిక్విడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇన్వెస్ట్ చేసిన అనంతరం ఆరు నెలలు లేదా ఏడాదికోసారి అయినా పెట్టుబడులు మీ లక్ష్యాలకు అనుగుణంగానే పనిచేస్తున్నాయా? అన్నది సమీక్షించుకోవాలి. లక్ష్యాలకు చేరువ అవుతున్న సమయంలో ఈక్విటీ పెట్టుబడులను కొద్ది కొద్దిగా వెనక్కి తీసుకుని, డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీనివల్ల ఈక్విటీ మార్కెట్లలో పతనాల రిస్క్‌ను అధిగమించొచ్చు.

'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో ..

వాణిజ్య చర్చలపై దృష్టి

రిస్క్ ఎక్కువే... రాబడీ ఎక్కువే!
క్వాంట్ మిడ్‌క్యాప్ ఫండ్

ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపులో గందరగోళం

విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్ 2025–26 మూడో విడత సీట్ల కేటాయింపులో తీవ్ర గందరగోళం నెలకొందని, సీట్ల కేటాయింపులో నిబంధనలను పాటించడం లేదంటూ 'ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ' రాష్ట్ర అధ్యక్షుడు శిఖరం నరహరి, కార్యదర్శి ఈశ్వరయ్య ఆదివారంఒక ప్రకటనలో మండిపడ్డారు. ఈ వ్యవహారాన్ని తక్షణమే సమీక్షించాలని హెల్త్ వర్సిటీని డిమాండ్ చేశారు.

'స్ట్రే' వెకెన్సీ రౌండ్ సీట్ల కేటాయింపు

ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా స్ట్రే వేకెన్సీ రౌండ్ కౌన్సెలింగ్‌లో భాగంగా ఆదివారం ఆరోగ్య విశ్వవిద్యాలయం సీట్లు కేటాయించింది. విద్యార్థులు సోమవారం ఉ.11 గంటల నుంచి అలాట్‌మెంట్ లెటర్లు డౌన్‌లోడ్ చేసుకోవడానికి వీలు కల్పించింది. అలాగే, మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల్లోపు కళాశాలల్లో రిపోర్ట్ చేయడానికి గడువు విధించింది. తుది దశ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన ఎనిమిది మంది ఆయా కళాశాలల్లో రిపోర్ట్ చేయలేదు. దీంతో ఆ సీట్లను ఈ స్ట్రే వెకెన్సీ రౌండ్‌లో భర్తీచేశారు.

పాడేరు మెడికల్ కళాశాల మా ఘనతే

మంత్రి సత్యకుమార్ యాదవ్

సాక్షి, పాడేరు: రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం వచ్చాక పాడేరులో మెడికల్ కళాశాలను పూర్తి చేశామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం పాడేరులోని భగవాన్ బిర్సా ముండా జయంతిలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాడేరు మెడికల్ కళాశాలను మంజూరు చేశారన్నారు. గిరిజన విద్యార్థులు చదువుకోవడానికి, గిరిజన విద్యార్థులు డాక్టర్లు కావడానికి అవకాశం లేకుండా చేసిందన్నారు. ఇదిలా ఉండగా గత వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలోనే అటు పులివెందుల, ఇటు పాడేరు మెడికల్ కళాశాలల నిర్మాణం పూర్తయింది. అయితే ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలన్న చంద్రబాబు కుట్రలో భాగంగా పులివెందుల కళాశాలకు మంజూరైన ఎంబీబీఎస్ సీట్లను వద్దని చెబుతూ ఏకంగా కేంద్రానికి లేఖ రాయడం తెలిసిందే. ఇదే సమయంలో తప్పని పరిస్థితిలో పాడేరు కళాశాలను ప్రారంభించాల్సి వచ్చింది. ఈ వాస్తవాలను విస్మరిస్తూ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి నిస్సిగ్గుగా ఈ క్రెడిట్‌ను చంద్రబాబు ప్రభుత్వానికి ఇవ్వడం విస్తుగొలుపుతోంది.

కేంద్ర ఇంటెలిజెన్స్ అదుపులో ఇద్దరు అనుమానితులు!

అనకాపల్లి/వెంకటగిరి రూరల్: ఉగ్రవాద లింకులు ఉన్నట్లు అనుమానిస్తున్న బంగ్లాదేశ్ యువతిని, ఉత్తరప్రదేశ్ యువకుడిని శనివారం రాత్రి అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో కేంద్ర ఇంటెలిజెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వివరాలు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ యువకుడు ప్రస్తుతం కాకినాడలో నివసిస్తుండగా.. బంగ్లాదేశ్ యువతి కూడా ఇటీవల కాకినాడకు వచ్చినట్లు సమాచారం. ఇద్దరూ శనివారం సామర్లకోట రైల్వేస్టేషన్‌లో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. వీరి గురించి జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) ఇచ్చిన సమాచారంతో కేంద్ర ఇంటెలిజెన్స్ అధికారులు రంగంలోకి దిగినట్లు తెలిసింది. అనకాపల్లి పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్, స్థానిక పోలీసులతో కలిసి ఇంటెలిజెన్స్ అధికారులు శనివారం రాత్రి యలమంచిలిలో జన్మభూమి రైలు ఎక్కి.. అనుమానితులను అదుపులోకి తీసుకొన్నట్లు సమాచారం. వారిని అనకాపల్లి స్టేషన్‌లో దించి.. పోలీస్ గెస్ట్‌హౌస్‌కు తరలించి విచారిస్తున్నట్లు తెలిసింది.

పోలీసుల అదుపులో కశ్మీర్ వ్యక్తులు.. రైల్వే కూలీలుగా గుర్తింపు

తిరుపతి జిల్లా, వెంకటగిరి పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద కశ్మీర్‌కు చెందిన 35 మంది అనుమానాస్పదంగా కనిపించడంతో స్థానిక పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న ఆధార్ కార్డు, ధ్రువపత్రాలను పరిశీలించగా జమ్మూకశ్మీర్‌లోని రాజౌరి జిల్లా వాసులుగా గుర్తించారు. రైల్వే కాంట్రాక్టర్లు సంబంధిత ధ్రువపత్రాలను పోలీసులకు చూపించడంతో వారిని విడిచి పెట్టారు.

సర్కారు వైద్య వ్యవస్థ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో దారుణం

సీతారామపురం: సర్కారు వైద్య వ్యవస్థ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలయ్యింది. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక సర్కారు వైద్య వ్యవస్థలో ఏర్పడిన తీవ్ర నిర్లక్ష్యానికి ఈ ఘటన ఉదాహరణగా నిలుస్తోంది. వివరాల్లోకి వెళితే శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మండల కేంద్రం సీతారామపురంలోని బెస్త కాలనీకి చెందిన మారుబోయిన వెంకటరమణ (55) ఆదివారం ఉదయం 10.30 గంటల సమయంలో గుండెపోటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆగమేఘాల మీద ఆయనను 24/7 పీహెచ్‌సీకు తరలించారు. అయితే అక్కడ ఒక మేల్, ఒక ఫిమేల్ డాక్టర్లు ఇద్దరు ఉన్నప్పటికీ వారిరువురూ విధులకు హాజరు కాలేదు. ఇక్కడ ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండాల్సి ఉండగా, ఇద్దరు బదిలీపై వెళ్లిపోవడంతో ఒక్క నర్స్ మాత్రమే విధులు నిర్వర్తిస్తోంది. ఆమె కూడా నైట్ షిఫ్ట్ చేసి ఇంటికి వెళ్లిపోయింది. దీంతో ఆయనకు ప్రాథమిక వైద్యం అందించే పరిస్థితి లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా ఉదయగిరికి తరలించేందుకు 108 వాహనాన్ని సంప్రదించగా అది కూడా అందుబాటులో లేదు. పచ్చ రంగులు వేయించేందుకు ఈ వాహనాన్ని విజయవాడకు తరలించారు. ప్రత్యామ్నాయంగా మరో వాహనాన్ని ఉంచకపోవడంతో గత్యంతరం లేక ప్రైవేట్ వాహనం రప్పించి ఉదయగిరికి తరలిస్తుండగా మార్గమధ్యంలో వెంకటరమణ మృతి చెందాడు. వైద్య సిబ్బంది పీహెచ్‌సీలో అందుబాటులో ఉండి సకాలంలో ప్రాథమిక చికిత్సను అందించి ఉంటే వెంకటరమణ బతికుండేవాడని కుటుంబీకులు కన్నీరు మున్నీరయ్యారు. 108 అయినా అందుబాటులో ఉంటే సకాలంలో ఉదయగిరికి తరలించి వైద్యం చేయించేవారమని విలపించారు.

108 లేకపోవడంతో ప్రైవేట్ వాహనంలో బాధితుడుని తరలిస్తున్న కుటుంబీకులు

విదేశీ విద్య పేరిట మోసం

సాయికౌశిక్

తిరుపతి కల్చరల్: విదేశాల్లో ఎంబీబీఎస్ చదివిస్తామని రూ.కోట్లు వసూలు చేసి మోసగించి చేసి తమ పిల్లల భవిష్యత్ నాశనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం కర్నూలుకు చెందిన విద్యార్థి సాయికౌశిక్, మదనపల్లెకు చెందిన మరో విద్యార్థిని లక్ష్మీతాయారమ్మ తదితరులు తమకు జరిగిన మోసాన్ని తిరుపతిలో ఆదివారం మీడియాకు వెల్లడించారు. హైదరాబాద్ ఈడీ ప్లస్ కన్సల్టెన్సీ అధినేత మారెడ్డి వెంకటరెడ్డి సెంట్రల్ అమెరికాలోని కొలంబస్ సెంట్రల్ వర్సిటీ మెడికల్ కళాశాలలో తమ పిల్లలకు ఎంబీబీఎస్ చదువుకునే అవకాశం కల్పిస్తామని నమ్మించి, ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.35 లక్షలు ఫీజు వసూలు చేసి తమ పిల్లలను ఆ వర్సిటీలో చేర్చాడని వారు తెలిపారు. తీరా అక్కడ కళాశాలలో సబ్జెక్టు అధ్యాపకులు లేరని, అంతేగాక విద్యార్థులను రేకుల షెడ్‌లో ఉంచడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ విషయాన్ని అడిగితే మీరు చదవకపోయినా మీకు సర్టిఫికెట్లు ఇప్పిస్తానని చెప్పి సుమారు 8 నెలల పాటు అక్కడే ఉంచారని చెప్పారు. మొదటి ఏడాది గడిచిన తర్వాత భారత్‌కు పంపించే ముందు ద్వితీయ ఏడాదికి ఫీజు కడితేనే పాస్‌పోర్టు ఇస్తానని బెదిరించి ఫీజులు కట్టించుకుని విద్యార్థుల్ని భారత్‌కు పంపించాడని తెలిపారు. తాము చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరితే తమపై దౌర్జన్యం చేస్తూ మీకు దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ బెదిరించారని వాపోయారు. ఈ విధంగా సుమారు 30 మంది విద్యార్థులు మోసపోయారని వివరించారు. అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు. మీడియాతో మాట్లాడిన వారిలో బాధితుల తల్లిదండ్రులు రంగారావు, శ్రీనివాసులు, ఉమామహేశ్వరి కూడా ఉన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

జనానికి జ్వరమొచ్చినా.. ప్రమాదం జరిగినా వెంటనే ఆసుపత్రికి పరిగెడతారు. పెంపుడు జంతువులకు సైతం పశు వైద్య శాలలు అందుబాటులో ఉన్నాయి. మరి అడవిలో స్వేచ్ఛగా సంచరించే వన్య ప్రాణులకు అనుకోని ప్రమాదం జరిగితే... అనారోగ్య సమస్యలు తలెత్తితే పరిస్థితి ఏమిటి? అరుదైన జంతుజాలాన్ని ఎలా కాపాడుకోవాలనే ప్రశ్నల్లో నుంచి ఏర్పాటైనదే వైల్డ్ లైఫ్ డిస్పెన్సరీ. దాదాపు ఐదేళ్లుగా నల్లమలలోని బైర్లూటీ వెల్డ్ లైఫ్ డిస్పెన్సరీ వన్యప్రాణులకు విస్తృత సేవలందిస్తోంది.

పులికి కట్టు కట్టి..
జింక నాడి పట్టి!

నల్లమలలో వన్యప్రాణులకో ఆసుపత్రి / ఎన్ఎస్‌టీఆర్‌లో విస్తృత సేవలందిస్తున్న బైర్లూటీ వెల్డ్ లైఫ్ డిస్పెన్సరీ

గాయపడిన వన్యప్రాణులకు సత్వర చికిత్స

పాంగోలిన్(అలుగు)కు చికిత్స చేస్తున్న వైద్యుడు

ఆత్మకూరురూరల్: నాగార్జునసాగర్ – శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం (ఎన్ఎస్‌టీఆర్)లో ముఖ్య సంరక్షిత జంతువు పెద్ద పులి. దానికి అనారోగ్య సమస్యలు తలెత్తితే కనీసం పరీక్షించేందుకు మత్తు ఇవ్వాలన్నా హైదరాబాద్, తిరుపతి జంతు ప్రదర్శనశాలల నుంచి వైద్యులు రావాల్సి ఉండేది. ఇదంతా నాలుగేళ్ల క్రితం వరకే. నంద్యాల జిల్లా ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని బైర్లూటీలో 2021లో వైల్డ్ లైఫ్ డిస్పెన్సరీని ఏర్పాటు చేసిన తర్వాత పరిస్థితి మారిపోయింది. డిస్పెన్సరీ వైద్యులు, సిబ్బంది అరుదైన వన్యప్రాణులను కాపాడుతూ వస్తున్నారు. ఇందులో ప్రత్యేక శిక్షణ పొందిన ఇద్దరు వైల్డ్ లైఫ్ నాలెడ్జ్ ఉన్న వైద్యులను నియమించారు. వారికి ఒక వెటర్నరీ సహాయకుడిని, ఒక న్యాచురలాజిస్ట్ (వన్యప్రాణి ప్రవర్తనను అంచనా వేసేందుకు), మరో ఐదుగురు ప్రొటెక్షన్ వాచర్లను కూడా అందుబాటులో ఉంచారు. అలాగే అన్ని సౌకర్యాలు కలిగిన ఒక యానిమల్ ట్రాన్స్‌పోర్ట్ వాహనం కూడా ప్రతి అటవీ డివిజన్‌లో అందుబాటులో ఉంచారు. ప్రత్యేకంగా తయారు చేసిన యానిమల్ రెస్క్యూ వ్యాన్ కూడా ఉంది. ఓ వైపు అనుభవం ఉన్న వైద్యులు, మరో వైపు సాంకేతిక పరిజ్ఞానంతో అరుదైన వన్యప్రాణులకు రక్షణగా నిలుస్తున్నారు. సహజంగా అడవిలో ఏదో కారణంగా గాయపడిన వన్యప్రాణిని చేరుకోవడానికి ప్రత్యేక ప్రోటోకాల్ ఉంటుంది. నల్లమల అడవుల్లో విస్తారంగా ఏర్పాటు చేసిన ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలలో వన్యప్రాణుల నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. ఏదైన జంతువు గాయ పడిన విషయం సాధారణంగా కెమోరాల ద్వారానే తెలుస్తుంది. సాంకేతిక పరిజ్ఞానంతో ఆ జంతువు సంచరించే ప్రాంతాన్ని గుర్తించి, దానిని పట్టుకుని వైద్యం అందించేందుకు ప్రత్యేక రెస్క్యూ ఆపరేషన్ చేస్తారు.



వైల్డ్ లైఫ్ డిస్పెన్సరీ, వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ అండ్ రెస్క్యూ పార్టీ విధులు ఇలా

- వన్యప్రాణులను రక్షించి తిరిగి అడవిలోకి వదలడం
- ప్రమాదవశాత్తూ మరణించిన వన్యప్రాణుల పోస్ట్‌మార్టం, దహనం
- పులి దాడిలో మరణించిన పెంపుడు జంతువుల పోస్ట్ మార్టం (లైవ్‌స్టాక్ డిప్రిడేషన్)
- అడవుల్లో అంటువ్యాధుల నిరోధం, పర్యవేక్షణ
- అటవీ సమీప గ్రామాల్లో పెంపుడు జంతువుల వాక్సినేషన్‌పై పర్యవేక్షణ
- వేటగాళ్ల దగ్గర లభించే మాంసాన్ని పరిశీలించి వన్యప్రాణి మాంసంగా నిర్ధారించడం
- అటవీశాఖ స్నిఫర్ డాగ్ స్క్వాడ్ మానిటరింగ్
- ట్రైనీ ఐపీఎస్, ఐఏఎస్, ఐఎఫ్ఎస్‌లకు శిక్షణా కార్యక్రమాలు

డిస్పెన్సరీ వైద్యుల విజయాలు

- నల్లమలలో అడవి పందులకు ఆఫ్రికన్ స్వైన్ ఫీవర్ సోకినట్లు గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం.
- రాష్ట్రం నలుమూలల చిరుతలు, ఎలుగుబంట్లు గ్రామాల సమీపంలోకి వచ్చినపుడు వాటిని పట్టి తిరిగి అడవిలోకి వదలడం.
- అడవి దున్న (గౌర్)ను తిరిగి నల్లమలకు తెప్పించే ప్రాజెక్ట్‌లో సాంకేతిక సహాయకులుగా ఉండటం.
- డిస్పెన్సరీ వైద్యులు రక్షించిన వన్య ప్రాణుల్లో చిరుత, పెద్దపులులు, ఎలుగు బంటి వంటి జంతువులే కాకుండా పాంగోలిన్ (అలుగు), అడవిపంది, పునుగు పిల్లి, మొసలితో పాటు రకాల పక్షులు ఉన్నాయి.
- నల్లమలలో నాలుగు పెద్దపులి కూనలు తల్లికి దూరమై ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని గుమ్మడాపురం గ్రామ శివార్లకు చేరుకోగా బైర్లూటీ వైల్డ్‌లైఫ్ డిస్పెన్సరీ వైద్యులు వాటిని క్షేమంగా తిరుపతి జంతు ప్రదర్శన శాలకు తరలించారు. కాని అప్పటికే అవి మానవ స్పర్శకు అలవాటు కావడంతో వాటి వన్యజీవన విధానానికి దూరమయ్యాయి. అవి ఇప్పుడు తిరుపతి జూలోనే ఉన్నాయి.

క్షేమంగా 60 జింకల తరలింపు..

వన్యప్రాణులను ఒకచోట నుంచి మరో చోటికి తరలించడం అంటే అది ఒక పెద్ద టాస్క్. ఇలాంటి తరలింపుల్లో గమ్యం చేరేది 50 శాతం మాత్రమే. అయితే దేశంలోనే మొట్ట మొదటి సారి నూరుశాతం సక్సస్ రేట్‌తో పుట్టపర్తిలోని 60కి పైగా కృష్ణజింకలు, పొడదుప్పులను బైర్లూటీ డిస్పెన్సరీ వైద్యుల పర్యవేక్షణలో నల్లకాల్వ సెక్షన్‌కు తరలించారు. జింకలు తరలించే సమయంలో అవి తీవ్రమైన భయాందోళనకు గురవుతాయి. అకారణంగా వాటి శరీర ఉష్ణోగ్రత అమాంతం పెరిగి అవి షాక్‌కు గురై రవాణాలో ఎక్కువ శాతం మరణిస్తాయి. అయితే బైర్లూటీ వైల్డ్ లైఫ్ డిస్పెన్సరీ వైద్యులు డాక్టర్ జుబేర్, డాక్టర్ అరోన్ వెస్లీల పర్యవేక్షణలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. రవాణా వాహనంలో చల్లటి నీటిని వెదజల్లే స్ప్రింక్లర్‌లు ఉంచడం, కుదుపుల్లో వాహనం అంచులకు తగిలి గాయపడకుండా కుషన్ ఏర్పాటు చేయడం, నల్లమలలో ఒక ఎన్‌క్లోజర్‌లో 10 రోజులు ఉంచి, ఈ వాతావరణానికి అలవాటు పడిన తర్వాత వాటిని అడవిలో వదిలారు.

డ్రోన్‌తో గుర్తించి.. ఉచ్చు తొలగించి..

వేటగాడు జింకల కోసం పన్నిన ఉచ్చు పెద్దపులి మెడకు బిగుసుకోవడంతో గాయపడింది. బైర్లూటి రేంజ్‌లోని ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలు ఆ పులిని చిత్రీకరించడంతో విషయం తెలుసుకున్న బైర్లూటీ వైల్డ్‌లైఫ్ డిస్పెన్సరీ వైద్యులు రంగంలోకి దిగారు. గాయపడిన పులి ఆవాస ప్రాంతం సమీపంలో ఫ్లాష్ కెమెరాలను ఉంచారు. పులి వాటి సమీపంలో వెళుతున్నప్పుడు ఆటో మేటిగ్గా ఫ్లాష్ వెలిగి పులి రాకపై సమాచారం అందడంతో అక్కడ మాటు వేసి దాని జాడను కనిపెట్టారు. వంద అడుగుల దూరం నుంచి ఓ వైద్యుడు ట్రాంక్విలైజర్ గన్‌తో మత్తు ఇచ్చాడు. ఆ తర్వాత డ్రోన్‌తో దానిని అనుసరించారు. అది మత్తులోకి జారుకున్న తర్వాత బోనులోకి చేర్చి ప్రత్యేక వాహనంలో బైర్లూటీ వైల్డ్‌లైఫ్ డిస్పెన్సరీకి తరలించారు. పులి మెడకు వున్న ఉచ్చును తొలగించారు. ఆహార నాళానికి గాయం తీవ్రంగా ఉండడంతో వైద్యం అందించి తిరుపతిలోని జంతుప్రదర్శన శాలకు తరలించారు. అక్కడ వెటర్నరీ సర్జన్ల చేత ఆపరేషన్ చేసి గాయానికి కుట్లు వేశారు. వారం రోజులు పరిశీలనలో ఉంచారు. దురదృష్టవశాత్తు ఆ పులి కోలుకోలేక మరణించింది.

అంబాజీపేటలో రైతుల కళ్లేల వద్ద కొబ్బరి రాశులు

కురిడీ కొబ్బరి రాశులు

జోరుకు బ్రేక్

- కొబ్బరి ధర నేల చూపు
- మార్కెట్లో పచ్చి కొబ్బరి ధర పతనం
- వారం రోజుల్లో రూ.ఆరు వేల తగ్గుదల
- ఉత్తరాదిలో ముగిసిన పండగల సీజన్
- తమిళనాడు, కేరళ నుంచి పెరిగిన కొబ్బరి ఎగుమతులు
- ఆందోళనలో కొబ్బరి రైతులు

సాక్షి, అమలాపురం/ అంబాజీపేట: గడిచిన ఆరు నెలలుగా రికార్డుల మీద రికార్డులు బ్రేక్ చేస్తూ ఆకాశంలో దూసుకుపోయిన కొబ్బరి ధర.. వారం రోజుల వ్యవధిలో అంతే వేగంగా కిందకు దిగొస్తోంది. రైతులు, వ్యాపారుల అంచనాలకు అందకుండా ధర తలకిందులైంది. కోనసీమ కొబ్బరి మార్కెట్‌లో పచ్చి కొబ్బరి వెయ్యి కాయల ధర వారం రోజుల్లో రూ.ఐదు వేల నుంచి రూ.ఆరు వేల వరకు పడిపోయింది. అయినా కొనుగోలుదారులు ముందుకు రాకపోవడంతో కొబ్బరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో కొబ్బరి దిగుమతులు జోరందుకోవడం, వారి తక్కువ రేటుకు అమ్మకాలు జరుపుతూండడంతో మరింత కంగారు పడుతున్నారు.

గణనీయంగా..

కోనసీమ జిల్లాలోని అంబాజీపేట కొబ్బరి మార్కెట్లో పచ్చి కొబ్బరి ధర గణనీయంగా తగ్గింది. గత వారం వెయ్యి పచ్చికాయ, ముక్కుడు (నిల్వ) కొబ్బరి కాయల ధర రూ.23 వేల నుంచి రూ.24 వేల వరకు ఉండేది. అటువంటిది శుక్రవారం రూ.18 వేల నుంచి రూ.19 వేలకు పడిపోయింది. పాత ముక్కుడు కాయ రూ.20 వేల నుంచి రూ.21 వేల వరకు ఉండగా, కొత్త పచ్చికాయ రూ.19 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంది. కొబ్బరిలో చిన్న కాయ (బోరాలు) గతంలో రూ.23 వేల వరకు ఉండగా, ఇప్పుడు రూ.17 వేల వరకు తగ్గిపోయింది. రేటు తగ్గినా కొనేవారు లేకుండా పోయారు. ఈ ప్రభావం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కొబ్బరి మార్కెట్‌పై పడింది. ఈ రెండు జిల్లాలలో సుమారు 1.80 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతున్న విషయం తెలిసిందే.

కురిడీలా

కురిడీ కొబ్బరి ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. పాత కాయలో గండేరా (పెద్ద కాయ) రకం రూ.30 వేలు యథాతథంగా ఉండగా, గటగట (చిన్నకాయ) ధర రూ.28 వేల నుంచి రూ.26 వేలకు తగ్గిపోయింది. ఇక కొత్త కాయలో గండేరా రూ.29 వేల నుంచి రూ.28 వేల వరకు, గటగట రూ.27 వేల నుంచి రూ.25 వేలకు తగ్గింది. వీటికి కూడా ఉత్తరాది రాష్ట్రాల నుంచి కురిడీకి సైతం డిమాండ్ లేకుండా పోయింది. దీనితో దర తగ్గుముఖం పట్టింది.

కారణాలు ఇవే

- కొబ్బరి కాయ ధర గణనీయంగా పడిపోయినా ఉత్తరాది వ్యాపారులు కొనేందుకు ముందుకు రావడం లేదు. దీనితో మార్కెట్లో సబ్దత ఏర్పడింది. ఉత్తరాది రాష్ట్రాల్లో పండగల సీజన్ దాదాపు ముగిసింది. బిహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలలో జరిగే ఛత్‌పూజ సీజన్ ముగిసింది. దీనికి తోడు బిహార్లో ఎన్నికల సీజన్ కావడం కూడా కొబ్బరి వినియోగం గణనీయంగా తగ్గింది. ఈ కారణంగా స్థానిక కొబ్బరి డిమాండ్ తగ్గింది.
- వరస పండగల నేపథ్యంలో ఉత్తరాది వ్యాపారులు కొబ్బరిని గత ఆగస్టు నుంచి అధికంగా నిల్వ చేశారు. ఆ సమయంలో తమిళనాడు, కేరళ, కర్ణాటక నుంచి కొబ్బరి పెద్దగా అందుబాటులో లేకపోవడంతో ఆంధ్ర కొబ్బరిని అధిక ధర పెట్టి కొనుగోలు చేసి మరి నిల్వలు చేశారు. నిల్వ ఉంచిన కొబ్బరి పూర్తిస్థాయిలో అమ్మకాలు జరగకపోవడంతో ఉత్తరాది వ్యాపారులు కొనుగోలు తగ్గించారు.
- ప్రస్తుతం తమిళనాడు, కేరళ, కర్ణాటక నుంచి కొబ్బరి పెద్ద ఎత్తున ఎగుమతి అవుతోంది. అక్కడ దిగుబడులు పెరగడం వల్ల ఆ రాష్ట్రాల రైతులు కొబ్బరికాయ రేటు తగ్గించి అమ్మకాలు చేస్తున్నారు. ప్రస్తుత తమిళనాడు నుంచి కొబ్బరి వెయ్యికాయలు రూ.24 వేల వరకు ఉంది. అయితే స్థానికంగా ఉత్పత్తి అయిన కొబ్బరి కన్నా దీని సైజు 40 శాతం ఎక్కువ కావడంతో ఆ కాయకు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ నుంచి ఉత్తరాదికి ఎగుమతులు సగానికి పైగా తగ్గిపోయాయి. ఈ సీజన్‌లో రోజుకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి 70 నుంచి 90 లారీల వరకు కొబ్బరి ఎగుమతి కాగా ఇప్పుడు అది 35 నుంచి 40 లారీలకు మించి వెళ్లడం లేదని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయాయి. శనివారం అర్ధరాత్రి వరకు 73,852 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 31,277 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.16 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకోవడానికి 18 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారు 3 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఉదయం లక్ష కుంకుమార్చన సేవ వైభవంగా జరిగింది. ఆలయంలోని శ్రీకృష్ణ ముఖ మండపంలో శ్రీపద్మావతి అమ్మవారిని ఆశీనులు చేసి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అర్చకులు శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు లక్ష్మి అష్టోత్తరం, లక్ష్మి సహస్రనామాలను వల్లిస్తూ అమ్మవారిని కుంకుమతో అర్చన చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఈ సేవలో పాల్గొన్నారు.

కరుణించు మంగమ్మ తల్లి

బుట్టాయగూడెం: ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలంలోని కామవరం అటవీ ప్రాంతంలో ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచి మంగమ్మతల్లి గుడికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోనే వంటలు చేసుకుని సహపంక్తి భోజనాలు చేస్తూ సందడి చేశారు. ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ, తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్న అనంతరం సందడిగా గడిపారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి పుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకున్నారు. పాలపొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద స్వామివారి మూర్తులను ప్రతిష్ఠించేందుకు అర్చకులతో పూజలు చేయించి ప్రతిష్ఠ తంతు నిర్వహించారు. నాగబంధాల వద్ద, గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద ఏర్పాట్లు చేశారు.

చంద్రబాబు వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గం

సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ



సాక్షి, అమరావతి: విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులపై సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గంగా ఉన్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ మండిపడ్డారు. చంద్రబాబు చేసిన వ్యాఖ్యలతో ఆయన ఒరిజినల్ మైండ్ మరోసారి బయటపడిందన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో రామకృష్ణ ఆదివారం మీడియాతో మాట్లాడారు. దేశంలోనే టాటా స్టీల్ కంటే విశాఖ స్టీల్‌కే క్రేజ్ ఉందని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కార్మికులు పనిచేయకుండానే జీతాలు తీసుకుంటారని వ్యాఖ్యానించడం, ఎన్నిసార్లు మీకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులివ్వాలని అడగడం.. పబ్లిక్‌రంగంపై చంద్రబాబుకు ఉన్న వ్యతిరేకతకు అద్దంపడుతోందని వ్యాఖ్యానించారు. రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు క్యాపిటల్ మైన్స్ కేటాయించాలని కోరితే.. దాని గురించి మాట్లాడని టీడీపీ ఎంపీలు సిగ్గులేకుండా కేంద్ర మంత్రిని కలిసి మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించాలని కోరతారా? అని రామకృష్ణ ప్రశ్నించారు. చంద్రబాబు తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

వీధి కుక్కల బెడద నివారించడానికి కార్యాచరణ

మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో వీధి కుక్కల బెడదను నివారించడానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ తెలిపారు. జంతు జనన నియంత్రణ, యాంటీ–రేబిస్ వ్యాక్సినేషన్‌పై దృష్టి పెట్టినట్లు వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మున్సిపాలిటీల్లో చేపట్టాల్సిన చర్యలపై ఆదివారం సీడీఎంఏ పి.సంపత్‌కుమార్‌తో కలిసి మార్గదర్శకాలు జారీ చేశారు. రేబిస్ సోకిన, వీధుల్లో దూకుడుగా ఉండే కుక్కలను గుర్తించి.. ప్రత్యేక షెల్టర్లలో వాటిని ఉంచాలని సూచించారు. అంగన్‌వాడీలు, పాఠశాలల పిల్లల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రోడ్లపై, వీధుల్లో, బహిరంగ ప్రదేశాల్లో జంతువులకు ఆహారం ఇవ్వడాన్ని నిషేధించాలని ఆదేశించారు. వీటి అమలులో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

పగడపు దీవులకు.. పడవ ప్రయాణం!

అరేబియా సముద్రంలో దాగిన రత్నం.. భారతదేశపు బ్లూ లగూన్.. అండర్ వాటర్ అడ్వెంచర్లకు కేరాఫ్.. ఇలా చెప్పుకుంటూ పోతే.. పర్యాటకులకు అదొక స్వర్గం. మోదీ అక్కడ అడుగుపెట్టాక క్రేజ్ రేంజ్‌లో పెరిగింది. మీరు ఊహించింది కరెక్టే. బీచ్ ప్రేమికులకు లక్షదీవులు ఇప్పుడు హాటెస్ట్ డెస్టినేషన్. సోషల్ మీడియాలో ఫుల్ ట్రెండింగ్‌లో ఉన్న ఈ ప్లేస్ మా బకెట్ లిస్ట్‌లోకి చేరింది. ఫ్రెండ్స్‌తో కలిసి ట్రిప్ ప్లాన్ చేశాం. అయితే, విమానంలో వెళ్లడం రొటీన్ అనిపించి.. కొలంబస్‌లా సముద్రంపై సాహసయాత్ర చేస్తే పోలా అనే ఐడియా వచ్చింది? కట్ చేస్తే.. మా గుండెజారి అరేబియా సీలో గల్లంతయ్యింది. దేశంలో తొలి లగ్జరీ క్రూయిజ్‌లైనర్ 'కార్డీలియా క్రూయిజెస్'లో టూర్ ప్యాకేజీ బుక్ చేసుకున్నాం. మరి అంతపెద్ద 'ఎంప్రెస్' క్రూయిజ్‌లో సీ జర్నీ ఎలా ఉంటుంది? అందులో వింతలు విశేషాలేంటి? ఆ అద్భుతమైన కోరల్ ఐల్యాండ్స్‌ను షిప్‌లో చుట్టేసి రావాలంటే ఎంత ఖర్చవుతుంది? నేచర్ లవర్స్‌ను రా రమ్మని ఊరిస్తున్న లక్షదీవుల కథేంటో తెలుసుకోవాలనుందా? అబ్బురపరిచే పగడపు దీవుల్లో అలా ఈజీగా చుట్టొద్దాం పదండి. లెట్స్ క్రూయిజ్!!

కార్డీలియా క్రూయిజ్‌లో స్టార్‌లైట్ రెస్టారెంట్



సెంట్రల్ కోర్ట్ (ఏట్రియం)

కార్డీలియా క్రూయిజ్ పూల్ డెక్‌లో స్విమ్మింగ్‌పూల్

కొలంబస్ కొలంబస్ ఇచ్చారు సెలవూ.. ఆనందంగా గడపడానికి కావాలొక దీవి! అంటూ ముంబై రెడీకెళ్తాం. మా లక్షదీవుల నౌకా యాత్ర నాలుగు రాత్రులు.. ఐదు రోజులు. 11 అంతస్తుల కదిలే లగ్జరీ హోటల్ లాంటి క్రూయిజ్‌లో ఎంజాయ్ చేస్తూ.. అరేబియా సముద్రంలో 1200 కిలోమీటర్ల సాహసయానం చేసి, అద్భుతమైన పగడపు దీవులను చేరుకుంటామని ఊహించుకుంటేనే రాత్రంతా నిద్రపట్టలేదు. ఎట్టకేలకు ముంబైపోర్టులో అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్‌లో అడుగుపెట్టాం. క్రూయిజ్ బోర్డింగ్ ఎయిర్‌పోర్టులాగే ఉంటుంది. బోర్డింగ్ పాస్, ఆధార్ వెరిఫికేషన్, బ్యాగేజీ సెక్యూరిటీ చెకప్ పూర్తయ్యాక టెర్మినల్ నుండి 'ఎంప్రెస్' క్రూయిజ్ ఉన్న బెర్త్‌పైకి అడుగుపెట్టాం. రాజహంసలా సేదతీరుతున్న అంతపెద్ద షిప్‌ను చూసేసరికి ఫోటోలు, సెల్ఫీలతో సందడే సందడి.

అది అరబిక్ కడలందం...

షిప్‌లో అడుగుపెట్టగానే ప్రతిఒక్కరూ కళ్లప్పగించి చూసే సెంట్రల్ కోర్ట్ (ఏట్రియం) నిజంగా హైలైట్. గాజు పైకప్పుతో, అద్దాల లిఫ్టులు, మిరుమిట్లుగొలిపే లైట్లతో మయసభను తలపిస్తుంది. ఎట్టకేలకు సాయంత్రం ఆరు గంటలకు ముంబైకి గుడ్‌బై చెబుతూ 'ఎంప్రెస్'గంభీరంగా కదిలింది. క్రూయిజ్ టాప్ డెక్ (11వ అంతస్తు) నుంచి ఒకపక్క సముద్రం, మరోపక్క మిలమిల మెరిసే ముంబై స్కైలైన్‌ను చూస్తే.. ఎవరైనా సరే 'అది అరబిక్ కడలందం' అనాల్సిందే! క్రూయిజ్ జర్నీ స్టార్ట్ అవ్వగానే స్విమ్మింగ్‌పూల్ పక్కన 'తేరే కాలా చష్మా'అంటూ సెయిల్ ఎవే పార్టీ డ్యాన్సులతో ఫ్లోర్ మొత్తం ఊగిపోతోంది. సరదాగా మేం కూడా రెండు స్టెప్పులేసి చిల్అవుతూ డీజే పార్టీని ఎంజాయ్ చేశాం. స్టార్‌లైట్ రెస్టారెంట్లో డిన్నర్ ముగించుకుని టెర్రస్‌పైకి అడుగుపెట్టగానే ఒక్క క్షణం ఇది కలా నిజమా అనిపించింది. చిమ్మచీకట్లో చందమామ కనువిందు చేస్తూ.. సముద్రంతో దోబూచులాడుతున్న వేళ... వెన్నెల్లో షిప్ కదులుతుంటే... చూసేందుకు రెండు కళ్లూ చాలవు!!

ఫన్.. అన్‌లిమిటెడ్!

క్రూయిజ్ ప్రత్యేకతల్లో మార్క్యూ థియేటర్ అద్భుతం. రెండంతస్తుల్లో 900 మంది కూర్చోవచ్చు. అరే, రోజు అప్పుడే గడిచిపోయిందా అనిపించేలా క్రూయిజ్‌లో అన్‌లిమిటెడ్ వినోదం ఆనందంలో ముంచెత్తుతుంది. ప్రత్యేక డ్యాన్స్, మ్యూజిక్‌షోలతో పాటు లైవ్ బ్యాండ్స్, డీజే సైతం సంగీత ప్రియులను మైమరపిస్తాయి. షిప్ మొత్తం ఎక్కడికెళ్లినా మాంచి మ్యూజిక్‌తో ఏదో తెలియన్ వైబ్ మనల్ని ఉరకలేయిస్తుంది. 24 గంటలూ జనాల కోలాహలంతో క్రూయిజ్‌లో ఉన్నంతసేపూ ఏదో తిరనాళ్లలో ఉన్నామన్న ఫీలింగ్ కలిగింది. మెగా హౌసీ, ట్రెజర్‌హంట్.. మ్యాజిక్‌షో.. వీడియో గేమ్స్.. లైబ్రరీ.. కిడ్స్ అకాడమీ.. ఫోటో షూట్స్.. టేబుల్‌టెన్నిస్.. స్నూకర్.. జిమ్.. స్పా.. స్విమ్మింగ్ పూల్.. రాక్‌వాల్ క్లయింబింగ్.. ఇలా ఒకటేంటి చిన్నాపెద్దా అందరికీ అంతులేని ఆటవిడుపే!! ఇక జూద ప్రియులను 'కేసినో రాయల్' రారమ్మంటుంది.

సన్‌రైజ్, సన్‌సెట్.. వావ్!!

క్రూయిజ్ జర్నీలో ఎట్టి పరిస్థితుల్లోనూ మిస్ అవ్వకూడనివి సన్‌రైజ్, సన్‌సెట్. వేకువజామున లేలేత సూర్యకిరణాలు సాగరంపై పడుతూ.. పసిడి వర్ణంలో ధగధగమంటూ కనువిందు చేసే దృశ్యాన్ని చూస్తే మనసు ఆకాశంలో అలా తేలిపోతుంది! ఎర్రని బంతిలా భానుడు అస్తమించే సన్‌సెట్ దృశ్యాన్ని వర్ణించడానికి మాటలు చాలవు!! చుట్టూ సముద్రం.. మధ్యలో క్రూయిజ్ తప్ప ఇంకేమీ కనబడని చోట సూర్యోదయం, సూర్యాస్తమయాలను చూస్తే.. నేచర్ లవర్స్ గుండెజారి అరేబియా సముద్రంలో గల్లంతవ్వాల్సిందే!!

తిన్నోళ్లకు తిన్నంత..!

కార్డీలియా 'ఎంప్రెస్'లో ఫుడ్.. భోజనప్రియులకు పండగే! ఉదయం బ్రేక్‌ఫాస్ట్ నుంచి లంచ్, స్నాక్స్, డిన్నర్ వరకూ అన్నీ ఫ్రీ. తిన్నోళ్లకు తిన్నంత అనేలా రకరకాల వెరైటీలతో చూస్తేనే కడుపునిండిపోయేలా మెనూ ఉంటుంది. వెజ్, నాన్‌వెజ్ వంటకాలు.. నోరూరించే డెసర్ట్స్, ఫ్రూట్స్ ఉన్నాయి. అన్‌లిమిటెడ్ స్టాండర్డ్ బెవరేజెస్ ప్యాకేజీ (హాట్ అండ్ సాఫ్ట్ డ్రింక్స్, కాక్‌టెయిల్స్, మాక్‌టెయిల్స్, పళ్ల రసాలు) కూడా అన్ని ప్యాకేజీల్లో భాగం.

• • •

దాదాపు 36 గంటల పాటు (రెండు రాత్రులు) క్రూయిజ్ జర్నీ చేశాక గేట్ వే ఆఫ్ లక్షద్వీప్‌గా పిలిచే అగట్టి ఐల్యాండ్‌కు చేరుకున్నాం. ఇక్కడ సముద్ర జలాల కిందంతా కోరల్ రీఫ్స్ పరుచుకుని ఉండటం వల్ల తీరంలో భారీ షిప్‌లు నిలిపేందుకు వీలుపడదు. ఎంప్రెస్‌కు సముద్రంలో అల్లంత దూరాన లంగరు వేసి.. టూరిస్టులను టెండర్‌బోట్లలో తీరంలోని జెట్టీ వద్దకు చేర్చారు. ఏపుగా ఎదిగిన కొబ్బరి చెట్ల మధ్య నుండి మూడు నిమిషాల్లోనే అవతలి ఒడ్డుకు క్యాబ్‌లో చేరుకున్నాం. అక్కడ పర్యాటకులకు స్వాగతం పలుకుతూ లక్షదీవుల సంప్రదాయ జానపద నృత్య ప్రదర్శన 'పరిచకలి' ఏర్పాటు చేశారు. మేము కూడా కత్తి, డాలు పుచ్చుకుని వారితో కలిసి స్టెప్పులేసి బీచ్ ఒడ్డుకు చేరుకున్నాం. అంతే, నోట మాటలేదు. రెప్ప వేయకుండా అలాగే చూస్తుండిపోయాం. అడుగేస్తే మాసిపోతుందా అనేంత తెల్లగా మెరిసిపోతున్న ఇసుక తిన్నెలను స్వచ్ఛమైన సముద్రపు కెరటాలు తాకుతుంటే దాన్ని వర్ణించడానికి నిజంగా మాటలు చాలవు! క్రిస్టల్ క్లియర్‌గా ఉన్న నీలి సంద్రాన్ని చూసి ఆనందంతో గంతులేశాం. ఆర్టిస్ట్ కుంచె నుండి జాలువారిన వాటర్ కలర్ పెయింటింగ్‌లా ఉంది ఆ దృశ్యం. లేలేత నుండి ముదురు వర్ణం వరకు రకరకాల నీలి రంగు షేడ్‌లలో ఉన్న అలాంటి సముద్రాన్ని మారిషస్, మాల్దీవుల్లాంటి చోట షూట్ చేసే సినిమా పాటల్లో, వీడియోల్లో చూడటమే తప్ప.. ప్రత్యక్షంగా చూసింది లేదు. ఒక్కసారిగా అలాంటి ప్రకృతి పెయింటింగ్‌ను చూసేసరికి నోరెళ్లబెట్టాం. లక్షదీవుల సముద్రం కింద పగడపు దిబ్బలు (కోరల్స్ రీఫ్స్) 4,500 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో పరుచుకుని ఉండటం వల్ల సముద్రపు నీరు అత్యంత స్వచ్ఛంగా మైమరపించే నీలి, ఆకుపచ్చ వర్ణంలో పారవశ్యంలో ముంచెత్తుతుంది. ఎటు చూసినా బ్లూ లగూన్స్ కనువిందు చేస్తాయి.

పేరులో లక్ష ఉన్నా...

పేరులో లక్షణంగా లక్ష ఉన్నా మొత్తం దీవులు 36 మాత్రమే. అందులోనూ 10 దీవుల్లోనే ప్రజలు నివశిస్తున్నారు. కేరళ తీరానికి 220–480 కిలోమీటర్ల దూరంలో ముత్యాల్లా పరుచుకున్న దీవుల సమూహమిది. పోర్చుగీసు నావికుడు వాస్కోడిగామా భారత తీరాన్ని చేరింది కూడా వీటి మీదుగానే! హిడెన్ జెమ్ ఆఫ్ అరేబియా సీగా పిలిచే ఈ కేంద్ర పాలిత ప్రాంతం మొత్తం విస్తీర్ణం 32 చదరపు కిలోమీటర్లు. ప్రస్తుత జనాభా కేవలం 70,000. లక్షదీవుల్లో అడుగుపెట్టాలంటే స్థానిక అధికార యంత్రాంగం జారీ చేసే ఎంట్రీ పర్మిట్ తప్పనిసరి. ప్యాకేజీ బుక్ చేసుకుంటే వారే అరేంజ్ చేస్తారు. ఇక్కడంతా ముస్లింలే. ఎక్కువగా మాట్లాడే భాష మలయాళం, ఆ తర్వాత తమిళం, ఇంగ్లీష్ కూడా నడుస్తుంది. అయితే, జెసెరి అనే ప్రత్యేకమైన స్థానిక భాష వీరికి ఉంది. ఇదీ మలయాళంలాగే అనిపించినా ద్రావిడ భాషలన్నీ కలగలిపి ఉంటుంది. లక్షదీవుల్లో అక్టోబర్ నుంచి ఏప్రిల్ మధ్య వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. టూర్‌కు సరైన సమయమిది.

అగట్టి అంతా కాలినడకనే..

లక్షదీవుల్లో మేము అగట్టి ఐల్యాండ్‌ను పూర్తిగా చుట్టేశాం. మొత్తం దీవుల్లో పొడవైనది (7.6 కి.మీ) ఇదే కావడంతో ఇక్కడ మాత్రమే ఎయిర్ పోర్టు కట్టారు. దీని వెడల్పు కిలోమీటరే. ఐల్యాండ్ అంతా నడుచుకుంటూ తిరిగేయొచ్చు. పైనంతా నీలాకాశం.. తెల్లగా మెరిసిపోయే ఇసుక తిన్నెలు.. ఎటుచూసినా పచ్చని కొబ్బరి చెట్ల తోరణం.. కనువిందు చేసే స్వచ్ఛమైన నీలి సముద్రం, దట్టంగా అల్లుకున్న సుగంధ ద్రవ్యాల వృక్షాలతో ప్రకృతి ప్రేమికులకు ఇదో స్వర్గం. సముద్రపు కెరటాల చిరు సవ్వడి తప్ప మరే చప్పుడు వినిపించదు. రంగు రంగుల కోరల్ ఫిష్ ఇక్కడ పుష్కలంగా దొరుకుతాయి. లక్షదీవుల్లో దొరికే ట్యూనా చేపలు ప్రపంచ ప్రసిద్ధి చెందాయి. ఫిషింగ్ తర్వాత కొబ్బరి పరిశ్రమ ఇక్కడ ప్రధానమైనది. రిసార్టులు, హోటళ్లతో టూరిజం అభివృద్ధి చెందుతోంది. మరో విచిత్రమేంటంటే, ఎక్కడా పక్షులు కనిపించలేదు. సముద్రపు పక్షులు కొన్ని జనావాసం లేని దీవుల్లో (పిట్టి) ఉంటాయట. అందుకే దీన్ని బర్డ్ శాంక్చురీగా ప్రకటించారని గైడ్ చెప్పారు.

నీలిసంద్రంలో కోరల్స్ లోకం..

స్నార్కెలింగ్, స్కూబా డైవింగ్.. బనానా బోట్ రైడ్.. గ్లాస్ బోటమ్ బోట్.. కయాకింగ్.. వాటర్ స్కీయింగ్.. విండ్ సర్ఫింగ్.. ఇలా అడ్వెంచర్ వాటర్ స్పోర్ట్స్ బొలెడున్నాయి. బీచ్‌లో కాసేపు ఆడుకున్నాక ముందుగా మేము బనానా బోట్ రైడ్ చేశాం. గాలితో నింపిన ట్యూబ్‌పై లైఫ్ జాకెట్లు వేసుకుని కూర్చోవాలి. దీన్ని మరో స్పీడ్ బోటు తాళ్లతో సముద్రంలోకి లాక్కెళ్తుంది. పావు గంట రైడ్ తర్వాత, వేగంగా వెనక్కి తీసుకొచ్చి ఫ్లిప్ చేస్తారు. సముద్రంలో పడిపోవడం భలే థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్. దీని తర్వాత కోరల్స్ లోకంలోకి డైవ్ చేశాం. రెండు కిలోమీటర్ల దూరంలో సముద్రం మధ్యనున్న ఫ్లోటింగ్ జెట్టీ వరకు బోట్‌లో వెళ్లాలి. అక్కడ లైఫ్ జాకెట్, ఫేస్ మాస్క్ తొడుక్కుని సముద్రంలోకి దూకేయడమే. నీటిపైన తేలుతూ ముఖాన్ని సముద్రంలో ముంచి కిందికి చూడమని డైవర్ చెప్పాడు. అంతే, ఒక్కసారిగా మైండ్ బ్లాంక్. కళ్లముందు అద్భుత సాగర లోకం ప్రత్యక్షమైంది. క్రిస్టల్ క్లియర్ వాటర్‌లో రంగురంగుల కోరల్ ఫిష్ గుంపులు గుంపులుగా తిరుగుతుంటే... సముద్రం అడుగున నెమ్మదిగా పొదల్లా ఊగే కలర్‌ఫుల్ కోరల్ రీఫ్స్... అది మరో ప్రపంచం. బ్లూ లగూన్స్‌లో దాగిన పగడపు లోకాన్ని తొలిసారి చూసేసరికి నన్ను నేనే నమ్మలేకపోయా. అక్కడ లోతు 5 మీటర్లే. కోరల్స్ మధ్యలో సముద్రం అడుగున పెద్ద తలతో ఉన్న కోరల్ ఫిష్ ఇసుకలో పొర్లుతోంది. ఆకుపచ్చ, నీలం రంగు ప్యారట్ ఫిష్ ఒకటి నా మాస్క్‌ను ముద్దాడటం మధురానుభూతి. ఇక స్కూబా డైవింగ్ వేరే లెవెల్. ఒళ్లంతా కప్పేసే వాటర్ ప్రూఫ్ జాకెట్లు, కాళ్లకు ఫ్లాప్స్ ధరించి, ఆక్సిజన్ మాస్క్ తగిలించుకుని, కళ్లకు స్విమ్మింగ్ గాగుల్స్ పెట్టుకుని, జలచరాల్లా చక్కర్లు కొడుతూ కోరల్స్ ప్రపంచంలో ఈదులాడుతుంటే దాన్ని మాటల్లో వర్ణించలేం!!



బొండం రూ.80.. లిక్కర్ బ్యాన్

యాక్టివిటీలన్నీ అయ్యాక లంచ్‌లో పూర్తిగా స్థానిక వంటకాలను రుచి చూశాం. ప్యారట్ ఫిష్, బటర్ ఫ్లై ఫిష్‌తో పాటు పీతలు కూడా ఇక్కడ సీఫుడ్‌లో ఫేమస్. రెండు అరచేతులంత ప్యారట్ ఫిష్ (గ్రిల్)ను లొట్టలేసుకుంటూ లాగించేశాం. వంటకాలన్నీ కేరళ స్టయిల్‌లోనే ఉన్నాయి. దీవులన్నీ కొబ్బరి చెట్లతో నిండి ఉన్నా.. బొండం రేటు రూ.80 అనడంతో అవాక్కయ్యాం. స్థానికంగా ఏదీ పండించరు. ఉప్పు, పప్పు నుంచి సర్వం మెయిన్ ల్యాండ్ కేరళ నుంచే వస్తాయి. అందుకే రేటు ఘాటుగానే ఉంటుంది. పంచదార కిలో రూ.80 అంట! వారానికోసారి కొచ్చి నుంచి కార్గో షిప్‌లో అన్నీ దిగుమతి అవుతాయి. ఇక్కడ లిక్కర్ పూర్తిగా బ్యాన్. అయితే, అగట్టీకి దగ్గరలోని బంగారం ఐల్యాండ్, రాజధాని కవరట్టిలో మాత్రమే రిసార్టుల్లో టూరిస్టులు, ప్రభుత్వాధికారులకు విక్రయిస్తారు. బహిరంగంగా తాగడం, బయటి నుంచి తీసుకురావడం కూడా నేరమే. రోజంతా రకరకాల జలక్రీడల్లో మునిగితేలి రాత్రి 10 గంటలకు తిరిగి క్రూయిజ్‌లోకి చేరిపోయాం. అరగంటలో తిరుగు ప్రయాణం మొదలైంది. మర్నాడు మళ్లీ రోజంతా క్రూయిజ్‌లో ఎంటర్‌టైన్‌మెంట్ షోలు, స్విమ్మింగ్, రాక్‌క్లయింబింగ్ వంటి యాక్టివిటీలతో గడిచిపోయింది.

• • •

ఇలా టన్నులకొద్దీ మధుర స్మృతులను నింపుకుని, అరేబియా సముద్రమంత లోతైన జ్ఞాపకాలను మూటగట్టుకొని ముంబైలో క్రూయిజ్ దిగుతుంటే.. ఐదు రోజుల టూరు ఐదు నిమిషాల్లో అయిపోయినట్టు అనిపించింది. ఎలాంటి రణగొణ ధ్వనులు.. కిక్కిరిసిన పర్యాటకులు.. బార్లు.. పబ్‌ల వంటివేవీ అక్కడ లేవు. స్వచ్ఛమైన ప్రకృతి ఒడిలో సేదతీరుతూ.. అంతే స్వచ్ఛమైన నీలి సంద్రాన్ని.. అందులో దాగున్న అబ్బురపరిచే కోరల్ ప్రపంచాన్ని.. రంగురంగుల జలచరాలను చూసి మైమరచిపోవాలనుకునే నేచర్ లవర్స్‌కు లక్షదీవులు లక్షలాది మధురానుభూతులను అందిస్తాయి! ఇండియాలో ఏకైక బ్లూ లగూన్‌లో రకరకాల జల క్రీడల్లో మునిగి తేలాలంటే ఈ పగడపు దీవులకు లగేజీ సర్దేయాల్సిందే. నడిసంద్రంలో సకల సౌకర్యాలున్న కదిలే దీవి లాంటి క్రూయిజ్‌లో అలా చక్కర్లు కొడుతూ నేచర్‌ను ఆస్వాదించడం కూడా జీవితకాల జ్ఞాపకంగా నిలిచిపోతుంది! అంటే ఒకే ట్రిప్‌లో రెండు డెస్టినేషన్లన్నమాట!! **మరింకెందుకు ఆలస్యం గెట్ సెట్ క్రూయిజ్!!**

– శివరామకృష్ణ మిర్తిపాటి

ప్యాకేజీల సంగతిదీ..

మధ్యతరగతి నుండి సంపన్నుల దాకా లగ్జరీ క్రూయిజ్ జర్నీ చేసేలా రకరకాల రూమ్‌లు, డిస్కౌంట్లు, గ్రూప్ ప్యాకేజీలను కార్డీలియా అందిస్తోంది. స్టేట్‌రూమ్‌లకు విండో ఉండదు. ముంబై – లక్షదీవుల రౌండ్ ట్రిప్.. ఇద్దరు పెద్దవాళ్లకు 4 నైట్స్, 5 డేస్‌ప్యాకేజీ ధరలు చూస్తే (జీఎస్‌టీ కాకుండా)...

ఇంటీరియర్ స్టేట్‌రూమ్ స్టాండర్డ్: రూ. 1,14,098
ఇంటీరియర్ స్టేట్‌రూమ్ ప్రీమియర్: రూ. 1,32,610
ఓషన్‌వ్యూ స్టాండర్డ్: రూ. 1,46.850
ఓషన్ వ్యూ ప్రీమియర్: రూ. 1,65,362
మినీ సూట్: రూ.1,90,994
సూట్: రూ.3,05,626
చైర్మన్ సూట్: రూ.4,82,202

అంటే ఇంటీరియర్ స్టాండర్డ్ స్టేట్ రూమ్‌కు ఒక్కో వ్యక్తికి రూ.67,317 చార్జీ (ఫుడ్, ఎంటర్‌టైన్‌మెంట్, అన్ లిమిటెడ్ బెవరేజెస్ ప్యాకేజీ, జీఎస్‌టీతో కలిపి) పడుతుంది. ఫైవ్‌స్టార్ లగ్జరీ సముద్ర ప్రయాణ అనుభూతితో పాటు లక్షదీవుల్లో ఎంజాయ్ చేసి రావచ్చు. నేరుగా కార్డీలియా వెబ్‌సైట్ (www.cordeliacruises.com) లేదా అథరైజ్డ్ ట్రావెల్ ఏజెంట్ల ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చు. ప్రయాణికుల సంఖ్య, జర్నీ ఎప్పుడు అనే దాన్ని బట్టి డిస్కౌంట్ ఆఫర్లు లభిస్తాయి. కొచ్చి, గోవా నుంచి 3 నైట్స్, 4 డేస్ ప్యాకేజీలు (ఇంటీరియర్ స్టాండర్డ్ స్టేట్ రూమ్ ఒక్కో వ్యక్తికి రూ.52,000) కూడా ఉన్నాయి. నలుగురు కలిసి ఒక రూమ్ బుక్ చేసుకుంటే రేటు ఇంకా తగ్గుతుంది. 12 ఏళ్ల లోపు చిన్నారులకు ఉచిత జర్నీ (బేస్ ఫేర్ మినహాయిస్తారు, సర్ ఛార్జీ, పన్నులు చెల్లించాలి), గ్రూప్ బుకింగ్స్‌లో ప్రత్యేక డిస్కౌంట్ లభిస్తుంది. గమ్యస్థానాల్లో షోర్ ఎక్స్‌కర్సన్ (గ్రూప్ టూర్ ప్యాకేజీ)లకు అదనంగా చెల్లించాల్సి వస్తుంది. లేదంటే మనం సొంతంగా కూడా రోజంతా తిరిగి మళ్లీ రాత్రికి క్రూయిజ్‌లోకి చేరుకునే ఆప్షన్ కూడా ఉంటుంది.

లక్ష్యం ఎక్కువ డబ్బు సంపాదించడం కాదు..
మనకు ఇష్టమైన జీవితాన్ని గడపడం
- క్రిస్ బ్రోగన్, అమెరికన్ రచయిత, జర్నలిస్ట్

బిజినెస్ రీల్

వెల్త్ కంపెనీ హైబ్రిడ్ మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్

వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియోతో మెరుగైన రాబడులు అందించేలా హైబ్రిడ్ మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్‌ను ది వెల్త్ కంపెనీ ఏఎంసీ ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ నవంబర్ 19న ప్రారంభమై డిసెంబర్ 3న ముగుస్తుంది. ఇది ప్రధానంగా ఈక్విటీ, డెట్, కమోడిటీల్లో (వెండి, పసిడి) ఇన్వెస్ట్ చేస్తుంది. అనిశ్చితి నెలకొన్నప్పుడు, ద్రవ్యోల్బణం నుంచి హెడ్జింగ్ కోసం 50 శాతం వరకు కమోడిటీల్లో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం ఉంటుంది. ఆదాయ పన్ను చట్టంపరంగా హైబ్రిడ్ ట్యాక్సేషన్ ప్రయోజనాలు ఉంటాయి.

‘ఈ-జాగృతి’ ప్లాట్‌ఫామ్‌కు ఆదరణ

- 10 నెలల్లో 2.75 లక్షల యూజర్లు
- 1.3 లక్షల ఫిర్యాదులు దాఖలు

jagriti

న్యూఢిల్లీ: వినియోగదారులు ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు దాఖలు చేసేందుకు తీసుకొచ్చిన ఈ-జాగృతి ప్లాట్‌ఫామ్‌కు మంచి ఆదరణ లభిస్తోంది. జనవరి 1న దీన్ని ప్రారంభించగా, ఇప్పటి వరకు 2.75 లక్షల మంది ఈ ప్లాట్‌ఫామ్‌పై తమ పేర్లను నమోదు (రిజిస్టర్డ్ యూజర్లు) చేసుకున్నారు. ఇందులో 1,388 మంది ఎన్‌ఆర్‌ఐలు కూడా ఉన్నారు. ఫిర్యాదుల కోసం ఓసీఎంఎస్, ఈ-దాఖిల్, ఎన్‌సీడీఆర్‌సీ సీఎంఎస్, కాన్ఫోనెట్ పోర్టళ్లు అందుబాటులో ఉండగా, వీటన్నింటినీ ఏకీకృతం చేస్తూ ఇ-జాగృతి ప్లాట్‌ఫామ్‌ను కేంద్ర వినియోగ వ్యవహారాల శాఖ తీసుకురావడం గమనార్హం. దేశవ్యాప్తంగా వినియోగదారులు ఫిర్యాదులు దాఖలు చేసేందుకు, అత్యాధునిక టెక్నాలజీతో ఈ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేశారు. నవంబర్ 13 నాటికి 1,30,550 ఫిర్యాదులు దాఖలైనట్టు.. ఇందులో 1,27,058 ఫిర్యాదులకు పరిష్కారం చూపించినట్టు వినియోగ వ్యవహారాల శాఖ ప్రకటించింది. ఎన్‌ఆర్‌ఐలు విదేశాల నుంచే తమ వినియోగ హక్కులను ఈ ప్లాట్‌పామ్ ద్వారా కాపాడుకోవచ్చని పేర్కొంది. ఈ ప్లాట్‌ఫామ్‌తో భౌగోళిక పరమైన అవరోధాలు వారికి తొలగినట్టయిందని తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-11-2025	
విశాఖ	610-00
చిత్తూరు	663-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	625-00
విజయవాడ	635-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	615-00
వరంగల్	617-00
రిటైల్ ధర	6.75

వాణిజ్య చర్చలపై దృష్టి

- ఫెడ్ మినిట్స్‌కు ప్రాధాన్యం
- ఆటుపోట్లున్నా ముందుకే!
- ఈ వారం మార్కెట్ ట్రెండ్‌పై నిపుణుల అంచనా

దేశ, విదేశీ గణాంకాలు కీలకం

ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లను దేశ, విదేశీ గణాంకాలతోపాటు పలు ఇతర అంశాలు ప్రభావితం చేయనున్నాయి. ప్రధానంగా యూఎస్‌తో వాణిజ్య టారిఫ్‌లపై చర్చల పురోగతిపై ఇన్వెస్టర్లు దృష్టి పెట్టనున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. అత్యధికకాలం కొనసాగిన యూఎస్ ప్రభుత్వ షట్‌డౌన్‌కు గత వారాంతాన ముగింపు పలకడం ప్రోత్సాహకర అంశమని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) రెండో త్రైమాసిక(జులై-సెప్టెంబర్) ఫలితాలు ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో వ్యవస్థాగత సానుకూలతలు, పటిష్ట ఫండమెంటల్స్ కలిగిన రంగాలవైపు ఇన్వెస్టర్లు దృష్టి పెట్టనున్నట్లు జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్ తెలియజేశారు. దీంతో ఈ ఏడాది ద్వితీయార్థం(అక్టోబర్ 2025-మార్చి2026)లో అప్‌గ్రేడ్‌కు వీలున్న రంగాలవైపు పోర్ట్‌ఫోలియోల సవరణకు వీలున్నట్లు అభిప్రాయపడ్డారు. క్యాపిటల్ మార్కెట్ సంబంధిత స్టాక్స్ వెలుగులో నిలవనున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా అంచనా వేశారు. ఇందుకు రిటైల్ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు, సిప్ పెట్టుబడులు, ఐపీవోల హవా దోహదపడనున్నట్లు వివరించారు.

> దేశీయంగా ఆర్థిక గణాంకాలు, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ గత సమీక్షా సంబంధ వివరాలు(మినిట్స్) ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లకు కీలకంగా నిలవనున్నాయి. వీటికితోడు యూఎస్‌తో వాణిజ్య టారిఫ్‌లపై చర్చల పురోగతి సెంటిమెంటుకు కీలకంకానున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్లు ఆటుపోట్ల మధ్య మరింత బలపడవచ్చని భావిస్తున్నారు. వివరాలు చూద్దాం..
> - సాక్షి, బిజినెస్ డెస్క్

బీహార్ ఎఫెక్ట్

దేశీయంగా స్థూల ఆర్థిక పరిస్థితులు పటిష్టంగా ఉండటానికితోడు.. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డీఏ విస్పష్ట మెజారిటీ సాధించడం సానుకూల అంశాలుగా నిపుణులు పేర్కొన్నారు. క్యూ2లో ఎఫ్‌ఎంసీజీ, బ్యాంకింగ్‌సహా పలు రంగాల దిగ్గజాలు ఆశావహ ఫలితాలు సాధించడం సెంటిమెంటుకు బలాన్నివ్వనున్నట్లు అభిప్రాయపడ్డారు. పండుగులు, పెళ్ళిళ్ల సీజన్ నేపథ్యంలో డిమాండ్‌కు వీలున్న రంగాలు పెట్టుబడులను ఆకట్టుకోవచ్చని ఖేమ్కా ప్రస్తావించారు. ఈ ఏడాది ద్వితీయార్థంలో పెట్టుబడులు పుంజుకునే వీలున్నట్లు అంచనా వేశారు. టెక్నాలజీ, మెటల్ రంగాలు పుంజుకోవచ్చని నిపుణులు పేర్కొన్నారు.

వాణిజ్య గణాంకాలు

వారాంతాన దేశీయంగా అక్టోబర్ నెల ఎగుమతి, దిగుమతి గణాంకాలు విడుదలకానున్నాయి. 2025 సెప్టెంబర్‌లో ఎగుమతులకంటే దిగుమతులు పెరగడంతో వాణిజ్య లోటు 32.15 బిలియన్ డాలర్లకు చేరింది. ఇవికాకుండా తయారీ, సర్వీసెస్ తదితర పీఎంఐ ఇండెక్సులు విడుదలకానున్నాయి. ఇప్పటికే రిటైల్ ధరలు, టోకు ధరల ద్రవ్యోల్బణం భారీగా వెనకడుగు వేయడంతో ఆర్‌బీఐ చేపట్టనున్న డిసెంబర్ పాలసీ సమీక్షపై సానుకూల అంచనాలకు వీలున్నట్లు ఆర్థికవేత్తలు పేర్కొన్నారు. జీఎస్‌టీ రేట్ల కోతసహా.. ధరలు దిగిరావడం సెంటిమెంటుకు బలాన్నిచ్చినట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా తెలియజేశారు.

గత వారమిలా

పలు ఆటుపోట్ల మధ్య గత వారం(10-14) దేశీ స్టాక్ మార్కెట్లు బలపడ్డాయి. వెరసి రెండు వారాల నష్టాలకు చెక్ పెట్టాయి. బీఎస్ఈ సెన్సెక్స్ నికరంగా 1,347 పాయింట్లు(1.6 శాతం) పుంజుకుని 84,563 వద్ద నిలిచింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 418 పాయింట్లు(1.6 శాతం) లాభపడి 25,910 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 0.9 శాతం జంప్‌చేయగా.. స్మాల్‌క్యాప్ 0.15 శాతమే బలపడింది.

విదేశీ అంశాలు

గత పాలసీ సమీక్షా వివరాల(మినిట్స్)ను యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ఈ వారం వెల్లడించనుంది. అంతేకాకుండా ఫెడ్ చైర్మన్ జెరోమీ పావెల్ పరపతి విధానాలపై ప్రసంగించనున్నారు. గత నెలలో నిర్వహించిన పరపతి సమావేశంలో ఫెడ్ కమిటీ వడ్డీ రేట్లను 0.25 శాతం తగ్గించిన విషయం విదితమే. దీంతో ఫెడ్ ఫండ్స్ రేట్లు 3.75-4 శాతానికి దిగివచ్చాయి. మరోవైపు చైనా ఎఫ్‌డీఐలు, వడ్డీ రేట్ల వివరాలు, యూఎస్ తయారీ, హౌసింగ్ తదితర గణాంకాలు సైతం ఈ వారం వెల్లడికానున్నాయి. కాగా.. అక్టోబర్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) దేశీ స్టాక్స్‌లో పెట్టుబడులు చేపట్టినప్పటికీ తిరిగి ఈ నెలలో అమ్మకాలకు పాల్పడుతున్న సంగతి తెలిసిందే. దీంతో ఈ అంశాలన్నిటికీ ప్రాధాన్యత ఉన్నట్లు నాయిర్ తెలియజేశారు. ముడిచమురు ధరలు, డాలరుతో రూపాయి మారకం తదితర అంశాలు సైతం కీలకమేనని విశ్లేషకులు ప్రస్తావించారు.

సాంకేతికంగా..

గత వారం నికరంగా మార్కెట్లు పుంజుకున్నాయి. ఈ బాటలో మరింత బలపడేందుకు వీలున్నట్లు సాంకేతిక నిపుణులు భావిస్తున్నారు. ఈ అంచనాల ప్రకారం ఎన్ఎస్ఈ నిఫ్టీ బలహీనపడితే తొలుత 25,750 వద్ద, తదుపరి 25,500 వద్ద మద్దతు లభించవచ్చు. ఆపై 26,300-26,800వరకూ పురోగమించే వీలుంది. ఇక బీఎస్ఈ సెన్సెక్స్ తొలుత 84,000 వద్ద, ఆపై 83,600 వద్ద మద్దతు కూడగట్టుకోవచ్చు. తదుపరి బలపడితే 85,500-85,600 వద్ద రెసిస్టెన్స్ ఎదురు కావచ్చు.

టర్మ్ బీమాతో యువతకు సాధికారత

ఏబీఎస్ఎల్ఐ ఎండీ కమలేష్ రావు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇప్పుడిప్పుడే కెరియర్లో పురోగమిస్తూ, కుటుంబాలను ఏర్పరుచుకునే దశలో ఉన్న యువతకు సాధికారత కల్పించేందుకు టర్మ్ ఇన్సూరెన్స్ తోడ్పడుతుందని ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఇన్సూరెన్స్ (ఏబీఎస్ఎల్ఐ) ఎండీ కమలేష్ రావు తెలిపారు. వాస్తవానికి 26-35 ఏళ్ల వయస్సు గ్రూప్‌లోని వారు దీర్ఘకాలికంగా ఆర్థిక భరోసాను కల్పించే టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకోవడంలో కొంత వెనుకబడుతున్నారని తమ సర్వేలో వెల్లడైందని చెప్పారు. ఈ సర్వే ప్రకారం 2025 మార్చి ఆఖరు నాటికి ప్రతి నలుగురు టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీహోల్డర్లలో ఈ వయస్సు గ్రూప్‌లోని వారు ఒకరే ఉంటున్నారని (మొత్తం పాలసీదారుల్లో 25.24 శాతం) వెల్లడైనట్లు పేర్కొన్నారు. ఇది చెప్పుకోతగిన స్థాయే అయినప్పటికీ 36-45 ఏళ్ల గ్రూప్ వారి వాటా అత్యధికంగా 41.68 శాతంగా , 46-55 ఏళ్ల గ్రూప్ వారి వాటా 23.96 శాతంగా ఉందని తెలిపారు. ఈఎంఐలు, ఇతరత్రా ఖర్చులు, పొదుపు లక్ష్యాలు మొదలైన వాటి కారణంగా అప్పుడప్పుడే కాస్త అధికంగా ఆర్జించడం మొదలుపెట్టిన వారు కీలకమైన కవరేజీని పెద్దగా పట్టించుకోవడం లేదని దీని ద్వారా తెలుస్తోందని పేర్కొన్నారు. సాధారణంగా బీమాకు సంబంధించి చిన్న వయస్సులో ప్రీమియంలు, ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయి. అదే వయస్సు పెరిగి అదే నలభైలు, యాభైల్లోకి వచ్చినప్పుడు ప్రీమియంలు పెరిగిపోతాయి. ఈ విషయాలను యువతకు సమర్థవంతంగా తెలియజేయడంతో పాటు బీమా కేవలం రక్షణ కవచంగానే కాకుండా ఆకాంక్షలను నెరవేర్చుకునే సాధనంగా కూడా ఉపయోగపడుతుందనే విషయాన్ని బీమా సంస్థలు సైతం వివరించాల్సి ఉంటుందని కమలేష్ రావు చెప్పారు. ఇందుకోసం వెల్‌నెస్ బెనిఫిట్స్, పొదుపునకు ఉపయోగపడే రైడర్లు, జీవితంలోని దశలను బట్టి కాలవ్యవధులను మార్చుకునే ఆప్షన్లు మొదలైనవి ఆఫర్ చేయాల్సి ఉంటుందన్నారు.

గ్లెన్‌మార్క్ ఫార్మా లాభం జూమ్

క్యూ2లో రూ. 610 కోట్లు

న్యూఢిల్లీ: ఔషధ రంగ కంపెనీ గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 72 శాతం జంప్‌చేసి రూ. 610 కోట్లను అధిగమించింది. యాబ్‌వీతో లైసెన్సింగ్ డీల్ ఇందుకు సహకరించింది. ఐఎస్‌బీ 2001 ఇన్వెస్టిగేషనల్ అసెట్‌కు సంబంధించి యాబ్‌వీతో భాగస్వామ్యం కుదుర్చుకోవడం లాభాలకు దోహదపడినట్లు కంపెనీ పేర్కొంది. గతేడాది(2024-25) ఇదే కాలంలో కేవలం రూ. 354 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 3,434 కోట్ల నుంచి రూ. 6,047 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 3,001 కోట్ల నుంచి రూ. 3,895 కోట్లకు పెరిగాయి.

లైసెన్సింగ్ దన్ను

యాబ్‌వీతో కుదిరిన 192 కోట్ల డాలర్ల విలువైన ఒప్పందంలో భాగంగా తాజా సమీక్షా కాలంలో 52.5 కోట్ల డాలర్ల ఆదాయం అందుకున్నట్లు గ్లెన్‌మార్క్ ఫార్మా వెల్లడించింది. కేన్సర్, ఆటోఇమ్యూన్ వ్యాధుల చికిత్స కోసం రూపొందిస్తోన్న ఐఎస్‌బీ 2001 కమర్షియలైజేషన్‌కు ఈ ఏడాది జూలైలో రెండు కంపెనీలు డీల్ కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. దేశీయంగా ఫార్ములేషన్ల బిజినెస్ 87 శాతం పైగా పడిపోయి రూ. 165 కోట్లకు పరిమితంకాగా.. ఉత్తర అమెరికా ఆదాయం రూ. 741 కోట్ల నుంచి రూ. 4,466 కోట్లకు దూసుకెళ్లింది. ఇక యూరప్‌లో అమ్మకాలు 9 శాతం వృద్ధితో రూ. 746 కోట్లను తాకాయి. గత క్యూ2లో ఇవి రూ. 687 కోట్లుగా నమోదయ్యాయి.

హిందుస్థాన్ జింక్‌కు టంగ్‌స్టన్ అన్వేషణ లైసెన్స్

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో టంగ్‌స్టన్ బ్లాక్‌ను అన్వేషించేందుకు, తవ్వకాలు చేపట్టేందుకు ఏపీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందినట్లు హిందుస్థాన్ జింక్ తెలిపింది. ఆధునిక తయారీ పరికరాల్లో వినియోగించే విలువైన ఖనిజాల వెలికితీత వ్యాపారాల్లోకి ప్రవేశించాలని భావిస్తున్న వేదాంత గ్రూప్‌నకు ఇదొక కీలక మైలురాయి. ‘‘ఆంధ్రప్రదేశ్‌లో టంగ్‌స్టన్, సంబంధిత ఖనిజ బ్లాక్‌ను టెండర్‌లో దక్కించుకున్నాము. ఇందుకు సంబంధించి ఏపీ ప్రభుత్వం నుంచి కాంపోజిట్(అన్వేషణ, తవ్వకాలు) లైసెన్స్ పొందాము’’ అని కంపెనీ ఒక ప్రకటన ద్వారా తెలిపింది. క్రిటికల్, వ్యూహాత్మక ఖనిజాల్లో దేశం స్వయం ప్రతిపత్తిని సాధించడంతో తమ వంతు పాత్ర పోషిస్తామని కంపెనీ సీఈవో అరుణ్ మిశ్రా తెలిపారు. హిందుస్థాన్ జింక్‌లోనే అతిపెద్ద జింక్ ఉత్పత్తిదారు. వెండి ఉత్పత్తి చేసే తొలి అయిదు సిల్వర్ ఉత్పత్తిదారుల్లో స్థానం దక్కించుకుంది. దాదాపు 40కి పైగా దేశాలకు వెండిని సరఫరా చేస్తుంది. దేశీయ జింక్ మార్కెట్‌లో 77 శాతానికి పైగా మార్కెట్ వాటా కలిగి ఉంది.

వ్యవసాయ ఆదాయం అంటే..?

కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

గతవారం వ్యవసాయ భూముల అమ్మకం, క్యాపిటల్ గెయిన్ గూర్చి తెలుసుకున్నాము. కొందరు పాఠకులు అసలు ‘వ్యవసాయ ఆదాయం’ ఏమిటని అడుగుతున్నారు. ఆదాయపన్ను చట్టంలో వ్యవసాయ ఆదాయానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఎందుకంటే ఈ ఆదాయం మీద పన్ను భారం లేదు. పూర్తిగా మినహాయింపే! అయితే ఇది కేవలం రైతులకు మాత్రమే కాదు రైతులుగా వ్యవసాయం చేసే వారికి కూడా ఈ మినహాయింపులు ఇస్తారు. అంటే భూమికి ఓనరే కావల్సిన అవసరం లేదు. కొన్ని షరతులు ఉన్నాయి. తెలుసుకోండి.

- వ్యవసాయ భూమి దేశంలోనే ఉండాలి. ఇందుకు సంబంధించి కాగితాలు ఉండాలి. అవి న్యాయబద్ధంగా ఉండాలి. సర్వే నెంబర్లు... పోరంబోకు భూములు, అడవులు, మెట్టభూములు, ఇసుక మెట్టలు, బంక మట్టివి మొదలగునవి చెప్పి మోసం చేయకండి. వ్యవసాయానికి అనువైన భూమిగా ఉండాలి. పట్టా పుస్తకాలు, పాస్ బుక్‌లు, అమ్మకం పత్రాలు, మ్యూటేషన్ వివరాలు ఉండాలి. వీటి ద్వారా హక్కులు, పరిమాణం, సరిహద్దులు, కొలతలు, యాజమాన్య స్థితి, ల్యాండ్ రికార్డు తదితర రికార్డులుండాలి.
- ఆ నిర్దేశిత వ్యవసాయ భూమి ద్వారా ఆదాయం ఏర్పడాలి. అది అద్దె కావచ్చు. పాడి పంటలు అమ్మగా నికరంగా మిగిలింది కావచ్చు. ఫామ్ హౌస్ మీద ఆదాయం కావచ్చు. అయితే ఆదాయం చేతికొచ్చినట్లు ఆధారాలుండాలి. రశీదులు, అగ్రిమెంట్లు, వ్యవసాయ కమిటీలు, పంపినట్లు రశీదు క్రయవిక్రయాలకు కాగితాలు మొదలైనవి. ఎంత పంట పండింది? పరిమాణం ఎంత? ఎక్కడ దాచారు? ఎంత దాచారు? సొంత వాడకం ఎంత? మార్కెట్ యార్డులకు ఎలా తరలించారు? ఎంత ధరకు అమ్మారు? ఎవరికి అమ్మారు? నగదు ఎలా వచ్చింది? బ్యాంకులో జమ ఎంత? తదితర వివరణలు ఉండాలి. అలాగే ఖర్చులు వివరాలు... అంటే సాగుబడికెంత? లేబర్‌కి ఎంత? విత్తనానికి ఎంత? పురుగు మందులకు ఎంత? ఎరువులకు ఎంత? యంత్రాల పనిపట్లపై ఎంత ఖర్చు చేశారు? కరెంటు ఎంత? బట్వాడా ఎంతిచ్చారు ? ట్రాక్టరు బాడుగ, నీటి పారుదల, గోదాములు ఖర్చు తదితరాలపై సరైన కాగితాలుండాలి.
- పంటల అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయమై ఉండాలి.
- కౌలు ద్వారా వచ్చినది వ్యవసాయ ఆదాయమే.. అయితే అగ్రిమెంట్లు ఉండాలి.

ఒకటి గుర్తుంచుకోండి. నిజానికి రైతుకి నెలసరి ఆదాయం 2021-22లో సగటున రూ.12,698గా ఉంది. ఖర్చు కూడా అదే స్థాయిలో ఉంది. ఇక మిగిలింది ఎంత ? గొర్రె తోకంత. కానీ ఆదాయపు పన్ను శాఖ వారి రికార్డుల ప్రకారం ఏడాదికి కోటి రూపాయల వ్యవసాయ ఆదాయం ప్రకటించిన వారి సంఖ్య సుమారు 3,000 మంది. అందుకని వారి డేగ కన్ను కచ్చితంగా ఉంటుంది గుర్తుపెట్టుకొండి.

కింద వివరాలు, ఉదాహరణలు గమనించండి

విత్తనాల అమ్మకాలు, మొక్కలు, పూలు, పాదులు, ల్యాండ్ మీద అద్దె, వ్యవసాయం చేసే భాగస్వామ్య సంస్థలో భాగస్వామికిచ్చే వడ్డీ, పంట అమ్మకం పంట నష్టం అయితే ఇన్సూరెన్సు వారిచ్చే పరిహారం, అడవులలో చెట్లు ఇవన్నీ వ్యవసాయం మీద ఆదాయం కిందకు వస్తాయి.

ఈ కిందివి వ్యవసాయం ద్వారా వచ్చిన ఆదాయాలు కావు

- భూమి బదిలీ చేసిన తరువాత వచ్చిన ఎన్యూటీ
- బకాయి అద్దెల మీద వడ్డీ
- కౌలు తీసుకున్న వారు డబ్బులు చెల్లించకపోతే బదులుగా ప్రామిసరీ నోటు ఇచ్చి.., వాటి మీద వచ్చే వడ్డీ
- అటవీ సంపద అమ్మకం అంటే చెట్లు, పండ్లు, పూలు, అడవి గట్టి వంటివి అడవి నుంచి దొంగిలించినవి అమ్మివేయగా వచ్చేవి.
- పొలాల్లో సముద్రపు నీరు రావడం వలన ఏర్పడ్డ ఉప్పు అమ్మకం ద్వారా ఆదాయం
- వడ్డీ కమీషన్
- చేపల అమ్మకం
- ఫైనాన్సింగ్‌లోని రాయితీ
- వెన్న, చీజ్ అమ్మకం
- పౌల్ట్రీ ఆదాయం
- డెయిరీ మీద ఆదాయం
- తేనెటీగల పెంపకం
- చెట్లు నరకడం ద్వారా వచ్చిన ఆదాయం
- ఫామ్ హౌజ్‌ని టీవీ, సీరియల్స్ షూటింగ్‌లకు అద్దెకిస్తే వచ్చిన ఆదాయం
- విదేశాల నుంచి వచ్చిన వ్యవసాయ ఆదాయం
- వ్యవసాయ కంపెనీ ఇచ్చే డివిడెండ్లు
- టీ పంటలో ఆదాయం 40%, మిగతా 60% వ్యవసాయం మీద ఆదాయం
- కాఫీలో 25%, (పండించి అమ్మితే)
- రబ్బర్ 95%
- కాఫీ... చికోరితో/లేదా చికోరి లేకుండా 40%

చివరిగా, వ్యవసాయ ఆదాయం రూ.5,000కు మినహాయింపు అందరికీ ఉంటుంది. దీనితో పాటు వ్యవసాయేతర ఆదాయం ఉన్నవారికి రెండింటిని కలిపి పన్ను భారం లెక్కిస్తారు. దీని వల్ల కొంత పన్ను భారం పెరుగుతుంది. కేవలం వ్యవసాయం మీద ఆదాయం ఇతరత్రా టాక్సబుల్ ఇన్‌కమ్ లేకపోతే పన్నుభారం లేదు.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

రిస్క్ ఎక్కువే.. రాబడీ ఎక్కువే!

క్వాంట్ మిడ్‌క్యాప్ ఫండ్

మధ్య కాలం నుంచి దీర్ఘకాలానికి పెట్టుబడులపై మెరుగైన రాబడి కోరుకునే ఇన్వెస్టర్ల ముందున్న ఎంపికల్లో మిడ్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్స్ కూడా ఒకటి. వీటిల్లో రిస్క్ అధికం. రాబడి కూడా అధికంగానే ఉంటుంది. లార్జ్‌క్యాప్ కంటే దీర్ఘకాలంలో అదనపు రాబడి మిడ్‌క్యాప్ ఫండ్స్‌తో సాధ్యపడుతుందని గత గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఈ విభాగంలో క్వాంట్ మిడ్‌క్యాప్ ఫండ్ మంచి పనితీరు చూపిస్తోంది. పదేళ్లు అంతకుమించిన దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్టర్లు ఈ పథకంలో పెట్టుబడులను పరిశీలించొచ్చు.

రాబడులు

స్వల్పకాలం నుంచి దీర్ఘకాలంలోనూ ఈ పథకంలో పనితీరు మెరుగ్గా ఉండడం కనిపిస్తుంది. ముఖ్యంగా గత ఏడాది కాలంలో ఈ పథకం ఎలాంటి రాబడిని ఇవ్వలేదు. అదే సమయంలో నష్టాలను మిగల్చలేదు. గడిచిన ఏడాది కాలంలో ఈక్విటీలు దిద్దుబాటు దశలో ఉండడం తెలిసిందే ఇది మినహా మిగిలిన అన్ని కాలాల్లోనూ రాబడులు పటిష్టంగా ఉన్నాయి. మూడేళ్లలో చూస్తే ఏటా 18 శాతం చొప్పున డైరెక్ట్ ప్లాన్‌లో రాబడి నమోదైంది. ఐదేళ్లలోనూ ఏటా 28 శాతం చొప్పున ప్రతిఫలాన్ని అందించింది. ఇక ఏడేళ్ల కాలంలో 23 శాతం, పదేళ్లలోనూ 18.34 శాతం చొప్పున రాబడి తెచ్చిపెట్టింది. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ టీఆర్ఐ సూచీతో పోల్చి చూస్తే ఐదేళ్లు, ఏడేళ్లలో అదనపు రాబడి ఇచ్చింది. పదేళ్ల కాలంలోనూ సూచీతో సమాన రాబడిని అందించింది. ముఖ్యంగా గడిచిన ఐదేళ్ల కాలంలో ఏ ఏడాది కూడా ఈ పథకం నికరంగా నష్టాలను ఇవ్వలేదు.

పెట్టుబడుల విధానం

ఇది యాక్టివ్ ఫండ్. అంటే ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులు చేస్తుంటుంది. మార్కెట్, రంగాల వారీ పరిస్థితులు, పెట్టుబడుల అవకాశాలకు అనుగుణంగా పోర్ట్‌ఫోలియోలో కొత్త స్టాక్స్‌ను చేర్చుకోవడం, ప్రస్తుత స్టాక్స్‌లో ఎక్స్‌పోజర్ తగ్గించుకోవడం, పూర్తిగా వైదొలగడం వంటి బాధ్యలను ఫండ్ పరిశోధక బృందం ఎప్పటికప్పుడు చేస్తుంటుంది. ముఖ్యంగా ఏదో ఒక విధానానికి పరిమితం కాబోదు. మూమెంటమ్, వ్యాల్యూ, గ్రోత్ ఇలా అన్ని రకాల విధానాల్లోనూ పెట్టుబడుల అవకాశాలను ఈ పథకం పరిశీలిస్తుంటుంది. అవకాశాలకు అనుగుణంగా పెట్టుబడులపై నిర్ణయాలు తీసుకుంటూ ఉంటుంది.

పోర్ట్‌ఫోలియో

ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం రూ.8,525 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 90.52 శాతం పెట్టుబడులను ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసింది. డెట్ సెక్యూరిటీల్లో 2.8 శాతం పెట్టుబడులు పెట్టింది. 6.68 శాతం నగదు నిల్వలు ఉన్నాయి. ముఖ్యంగా ఈక్విటీ పోర్ట్‌ఫోలియోని గమనించినట్టయితే మొత్తం 29 స్టాక్స్ ఉన్నాయి. టాప్-10 స్టాక్స్‌లోనే 58 శాతం పెట్టుబడులు ఉన్నాయి. ఈక్విటీ పెట్టుబడులను గమనిస్తే.. మిడ్‌క్యాప్ కంపెనీల్లో 59 శాతం ఇన్వెస్ట్ చేసింది. అదే సమయంలో 29 శాతం మేర లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది. లార్జ్‌క్యాప్ పెట్టుబడులు రిస్క్‌ను తగ్గిస్తాయి. మిడ్‌క్యాప్ పెట్టుబడులు మెరుగైన రాబడులకు అవకాశం కల్పిస్తాయని అర్థం చేసుకోవచ్చు. ఇంధన రంగ కంపెనీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ 18 శాతం పెట్టుబడులను ఈ రంగాల కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది. ఆ తర్వాత ఇండస్ట్రియల్స్ కంపెనీలకు 16.71 శాతం, హెల్త్ కేర్ కంపెనీలకు 15.30 శాతం, టెక్నాలజీ కంపెనీలకు 11.22 శాతం చొప్పున కేటాయింపులు చేసింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
టాటా కమ్యూనికేషన్స్	8.72
అరబిందో ఫార్మా	7.97
ప్రీమియర్ ఎనర్జీస్	7.11
ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా	6.71
లయడ్స్ మెటల్స్	5.62
రిలయన్స్ ఇండస్ట్రీస్	5.38
జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్	5
లిండే ఇండియా	3.38
హిందుస్తాన్ పెట్రో	3.22
ఐటీసీ	2.47

ధనుశ్ శ్రీకాంత్‌కు స్వర్ణం

- డెఫ్ ఒలింపిక్స్‌లో సత్తా చాటిన తెలంగాణ షూటర్
- ముర్తజాకు రజతం

ధనుశ్
ముర్తజా

న్యూఢిల్లీ: భారత బధిర షూటర్, తెలంగాణకు చెందిన ధనుశ్ శ్రీకాంత్ డెఫ్ ఒలింపిక్స్‌లో ప్రపంచ రికార్డుతో పసిడి పతకం నిలబెట్టుకున్నాడు. టోక్యోలో ఆదివారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో 23 ఏళ్ల ధనుశ్ శ్రీకాంత్ 252.2 ప్రపంచ రికార్డు స్కోరుతో అగ్ర స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో గతంలో అతనే నెలకొల్పిన 251.7 స్కోరును తాజా బధిరుల ఒలింపిక్స్‌లో అధిగమించాడు. ఇదే ఈవెంట్‌లో పోటీపడిన భారత సహచరుడు మొహమ్మద్ ముర్తజా వానియా 250.1 స్కోరుతో రెండో స్థానంలో నిలిచాడు. దీంతో ముర్తజా రజత పతకంతో సరిపెట్టుకోగా... దక్షిణ కొరియా బధిర షూటర్ బెక్ సెంగ్‌హక్ (223.6) కాంస్యం నెగ్గాడు. హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్ ఒలింపిక్ పతక విజేత గగన్ నారంగ్‌కు చెందిన 'గన్ ఫర్ గ్లోరీ' అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. ముందుగా 630.6 స్కోరుతో శ్రీకాంత్ ఫైనల్స్‌కు అర్హత సాధించగా, ముర్తజా (626.3) కూడా మెరుగైన స్కోరుతో తుది పోరుకు చేరుకున్నాడు. 2022లో కాక్సియస్ డొ సుల్ (బ్రెజిల్)లో జరిగిన డెఫ్ ఒలింపిక్స్‌లో ధనుశ్ శ్రీకాంత్ వ్యక్తిగత, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లలో బంగారు పతకాలు సాధించాడు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో మహిత్ సంధు బంగారు పతకం గెలుచుకుంది. ఆమె 250.5 స్కోరుతో రజతం గెలుచుకోగా, సహచర షూటర్ కోమల్ వాఘ్‌మారె (228.3) కాంస్యంతో సరిపెట్టుకుంది.

రూ.1.20 కోట్ల నజరానా...

డెఫ్ ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలుచుకున్న రాష్ట్ర షూటర్‌కు తెలంగాణ ప్రభుత్వం భారీ నజరానాను ప్రకటించింది. శ్రీకాంత్‌కు రూ. 1 కోటి 20 లక్షల నగదు బహుమతిని అందజేయనున్నట్లు క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడించారు. హన్మకొండ జిల్లా కేంద్రంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌ను మంత్రి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ ఘనత గురించి సమాచారం తెలుసుకున్న శ్రీహరి ఈ ప్రకటన చేశారు.

వన్డే సిరీస్ భారత్ 'ఎ' సొంతం

- రెండో అనధికారిక వన్డేలో భారత్ విజయం
- 9 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా చిత్తు
- రాణించిన రుతురాజ్, నిశాంత్‌కు 4 వికెట్లు

రుతురాజ్



నిశాంత్

రాజ్‌కోట్: దక్షిణాఫ్రికా 'ఎ'పై వరుస విజయాలతో భారత్ 'ఎ' అనధికారిక వన్డే సిరీస్‌ను సొంతం చేసుకుంది. భారత బౌలర్ల సత్తాతో ఆదివారం ఇక్కడ జరిగిన రెండో మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా 'ఎ'ను చిత్తు చేసింది. తద్వారా మరో మ్యాచ్ మిగిలుండగానే భారత్ 'ఎ' జట్టు 2–0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. 19న ఇదే వేదికపై ఆఖరి మ్యాచ్ జరుగుతుంది. రెండో అనధికారిక వన్డేలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నిశాంత్ సింధు (4/16), హర్షిత్ రాణా (3/21), ప్రసిధ్ కృష్ణ (2/21) సమష్టిగా దక్షిణాఫ్రికాను కట్టడి చేశారు. దీంతో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సఫారీ 'ఎ' జట్టు 30.3 ఓవర్లలోనే 132 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ రివాల్డో మూన్సామి (34 బంతుల్లో 33; 7 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా, ప్రిటోరియస్ (21; ఫోర్లు), డియాన్ ఫారెస్టర్ (22; 3 ఫోర్లు), డెలానో పాట్జియేటర్ (23; 1 ఫోర్) ఫర్వాలేదనిపించారు. మిగతా ఆరుగురు బ్యాటర్లయితే సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. కెప్టెన్ తిలక్ వర్మకు ఒక వికెట్ దక్కింది.

రుతురాజ్ గైక్వాడ్ అర్ధ సెంచరీ...

సులువైన లక్ష్యఛేదనకు దిగిన భారత 'ఎ' జట్టు 27.5 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 135 పరుగులు చేసి గెలిచింది. తొలి వన్డేలో విరోచిత సెంచరీతో భారత్‌ను గెలిపించిన ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ (83 బంతుల్లో 68 నాటౌట్; 9 ఫోర్లు) ఈ మ్యాచ్‌లోనూ రాణించాడు. అజేయ అర్ధ సెంచరీతో ఆఖరిదాకా క్రీజులో నిలిచాడు. ముందుగా అభిషేక్ శర్మ (22 బంతుల్లో 32; 6 ఫోర్లు)తో కలిసి తొలి వికెట్‌కు 8.1 ఓవర్లలో 53 పరుగులతో శుభారంభం ఇచ్చాడు. తర్వాత కెప్టెన్ ఠాకూర్ తిలక్ వర్మ (62 బంతుల్లో 29 నాటౌట్; 2 ఫోర్లు)తో కలిసి అబేధ్యమైన రెండో వికెట్‌కు 82 పరుగులు జతచేశాడు. సఫారీ బౌలర్లలో లూథో సిపామ్లాకు ఒక వికెట్ దక్కింది.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా 'ఎ' ఇన్నింగ్స్: ప్రిటోరియస్ (సి) ప్రసిద్‌కృష్ణ (బి) హర్షిత్ 21; రివాల్డో (సి) బదోని (బి) నిశాంత్ 33; జోర్డాన్ (సి) బదోని (బి) హర్షిత్ 4; అకెర్మన్ (సి) ఇషాన్ కిషన్ (బి) హర్షిత్ 7; సినెతెంబా (సి) అండ్ (బి) నిశాంత్ 3; ఫారెస్టర్ (సి) విప్రాజ్ (బి) తిలక్ వర్మ 22; పాట్జియేటర్ (సి) ఇషాన్ కిషన్ (బి) ప్రసిధ్ కృష్ణ 23; సుబ్రయెన్ (బి) ప్రసిధ్ కృష్ణ 15; పీటర్ (సి) నితీశ్ రెడ్డి (బి) నిశాంత్ 0; సిపామ్లా (సి) అర్‌్షదీప్ (బి) నిశాంత్ 0; బార్ట్‌మన్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (30.3 ఓవర్లలో ఆలౌట్) 132.**

వికెట్ల పతనం: 1–39, 2–59, 3–66, 4–71, 5–73, 6–107, 7–127, 8–128, 9–128, 10–132.

బౌలింగ్: అర్‌్షదీప్ 4–0–33–0, ప్రసిధ్ కృష్ణ 4.3–0–21–2, నిశాంత్ సింధు 7–1–16–4, హర్షిత్ 5–1–21–3, తిలక్‌వర్మ 4–0–12–1, ఆయుశ్ బదోని 4–0–15–0, విప్రాజ్ నిగమ్ 2–0–10–0.

భారత్ 'ఎ' ఇన్నింగ్స్: రుతురాజ్ నాటౌట్ 68; అభిషేక్ (సి) ప్రిటోరియస్ (బి) సిపామ్లా 32; తిలక్ నాటౌట్ 29; ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (27.5 ఓవర్లలో వికెట్ నష్టానికి) 135.

వికెట్ల పతనం: 1–53.

బౌలింగ్: సిపామ్లా 5–0–33–1, సుబ్రయెన్ 4.5–0–35–0, బార్ట్‌మన్ 4–0–15–0, పీటర్ 9–0–35–0, ఫారెస్టర్ 5–1–13–0.

మిచెల్ శతకం

విండీస్‌పై తొలి వన్డేలో 7 పరుగులతో కివీస్ గెలుపు

క్రైస్ట్‌చర్చ్: డారిల్ మిచెల్ (118 బంతుల్లో 119; 12 ఫోర్లు, 2 సిక్సలు) సెంచరీ, కైల్ జేమీసన్ (3/52) పేస్ ప్రతాపంతో వెస్టిండీస్‌తో మొదలైన వన్డే సిరీస్‌లో న్యూజిలాండ్ శుభారంభం చేసింది. ఆదివారం ఇక్కడ జరిగిన తొలి వన్డేలో కివీస్ 7 పరుగుల తేడాతో విండీస్‌ను ఓడించింది. టాస్ నెగ్గిన కరీబియన్ జట్టు ఫీల్డింగ్‌కు మొగ్గు చూపగా, ముందుగా బ్యాటింగ్ చేపట్టిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. టాపార్డర్ బ్యాటర్లలో డెవాన్ కాన్వే (58 బంతుల్లో 49; 7 ఫోర్లు, 1 సిక్స్) ఒక్కడే రాణించాడు. రచిన్ రవీంద్ర (4), విల్ యంగ్ (0)లను ఫోర్డ్ వరుస బంతుల్లో అవుట్ చేశాడు. ఈ దశలో మిచెల్, కాన్వే కివీస్‌ను నడిపించారు. మిగతా సహచరుల్లో బ్రేస్‌వెల్ (35; 1 ఫోర్, 1 సిక్స్), జాక్ ఫాక్స్ (22 నాటౌట్; 3 ఫోర్లు) మెరుగ్గా ఆడారు. మాథ్యూ ఫోర్డ్ 2, జేడెన్ సీలెస్ 3 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన వెస్టిండీస్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 262 పరుగులే చేయగలిగింది. షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ (61 బంతుల్లో 55; 3 ఫోర్లు, 3 సిక్సలు), గ్రీవ్స్ (24 బంతుల్లో 38 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ షై హోప్ (37; 2 ఫోర్లు, 1 సిక్స్), కీసీ కార్టి (32; 2 ఫోర్లు), అతానెజ్ (29; 2 ఫోర్లు, 1 సిక్స్), రొమారియో షెఫర్డ్ (26 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) సమష్టిగా రాణించడంతో గెలిచే స్థితిలో నిలిచింది. కానీ ఆఖరి 12 బంతుల్లో 32 పరుగుల సమీకరణాన్ని సాధించలేకపోయింది. జేమీసన్ కీలక వికెట్లు పడగొట్టగా, హెన్రీ, ఫాక్స్, సాన్‌ట్నర్ తలా ఒక వికెట్ తీశారు.

భారత్‌కు మరో పరాజయం

- 3-0తో నెదర్లాండ్స్ గెలుపు
- బిల్లీ జీన్ కింగ్ కప్ టెన్నిస్ టోర్నీ

శ్రీవల్లి

బెంగళూరు: బిల్లీ జీన్ కింగ్ కప్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత మహిళల టెన్నిస్ జట్టు కథ క్లీన్‌స్వీప్‌తో ముగిసింది. పటిష్టమైన నెదర్లాండ్స్ 3–0తో భారత్‌ను చిత్తు చేసింది. ఆదివారం గ్రూప్ 'జి'లో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత అమ్మాయిలు ఒక్క మ్యాచ్ కాదు కదా... ఒక్క సెట్‌లో కూడా గెలుపొందలేకపోయారు. తొలి సింగిల్స్‌లో భమిడిపాటి శ్రీవల్లి 2–6, 4–6తో అనౌక్ కొవెర్మన్స్ చేతిలో కంగుతినగా, రెండో మ్యాచ్‌లో సహజ యామలపల్లి 2–6, 3–6తో ప్రపంచ 87వ ర్యాంకర్ సుజన్ లామెన్స్ చేతిలో ఓడిపోయింది. వరుస ఫలితాలతోనే భారత్ షో ముగిసినప్పటికీ చివరగా జరిగిన డబుల్స్‌లో బరిలోకి దిగిన అంకిత రైనా–ప్రార్థన తొంబరే జోడీ 1–6, 1–6 లేమెస్–డెమి షుర్స్ జంట చేతిలో పరాజయం చవిచూసింది. భారత్, నెదర్లాండ్స్ జట్లు స్లోవేనియా చేతిలో ఓడిపోవడంతో వచ్చే ఏడాది తిరిగి రీజినల్ 'టై' పోటీల్లో తలపడాల్సి వుంటుంది. ఈ ఏడాది ప్లే ఆఫ్స్‌లో వరుస విజయాలతో ముందంజ వేసిన స్లోవేనియా వచ్చే ఏడాది జరిగే క్వాలిఫయర్స్‌కు అర్హత సంపాదించింది.

హైదరాబాద్ 88/6

జమ్మూ కశ్మీర్ తొలి ఇన్నింగ్స్‌లో 170 ఆలౌట్
మరో 82 పరుగులు వెనుకంజలో హైదరాబాద్

జమ్మూ: హైదరాబాద్ బౌలర్లు సమష్టిగా రాణించి జమ్మూ కశ్మీర్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. అయితే ఆ తర్వాత బ్యాటర్ల వైఫల్యంతో అదే బాటలో సాగిన హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యాన్ని కోల్పోయే స్థితిలో ఉంది. రంజీ ట్రోఫీ గ్రూప్ 'డి'లో భాగంగా ఆదివారం మొదలైన మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కశ్మీర్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 47.1 ఓవర్లలో 170 పరుగులకే ఆలౌటైంది. టాప్–4 బ్యాటర్లు ఇక్బాల్ (5), శుభమ్ (4), వివ్రాంత్ శర్మ (0), కెప్టెన్ పారస్ డోగ్రా (5)లను హైదరాబాదీ బౌలర్లు కార్తికేయ కక్, పున్నయ్య, రక్షణ్ రెడ్డిలు మూకుమ్మడిగా దెబ్బ తీశారు. ఆరో స్థానంలో దిగిన కన్హయ్య (0)ను సైతం ఖాతా తెరువనీయలేదు. దీంతో జమ్మూ కశ్మీర్ 17 ఓవర్లలో 32 పరుగులకే 5 వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. మిగతా లోయర్ ఆర్డర్, టెయిలెండర్లతో కనీసం 100 చేయడమే గగనమనుకున్న పరిస్థితి ఏర్పడింది. ఈ దశలో అబిద్ ముస్తాక్ (57; 9 ఫోర్లు), అబ్దుల్ సమద్ (34; 5 ఫోర్లు, 1 సిక్స్), సాహిల్ లోత్రా (36; 4 ఫోర్లు, 1 సిక్స్) జట్టు స్కోరుకు ఊహించని విధంగా ముందుకు తీసుకెళ్లారు. కార్తికేయ, తనయ్ త్యాగరాజన్ చెరో 3 వికెట్లు తీయగా, రక్షణ్ 2, పున్నయ్య, అనికేత్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆడిన హైదరాబాద్ ఆట నిలిచే సమయానికి 28 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 88 పరుగులు చేసి కష్టాల్లో పడింది. ఓపెనర్లు తన్మయ్ (0), అభిరథ్ (5) సహా నితీశ్ రెడ్డి (3)లను ఆఖిబ్ నబీ (3/30) అవుట్ చేశాడు. క్రీజులో పాతుకుపోయిన కెప్టెన్ రాహుల్ సింగ్ (48; 6 ఫోర్లు), రాహుల్ రాదేశ్ (7)లను సునీల్ కుమార్ (2/15) పెవిలియన్ చేర్చడంతో హైదరాబాద్ ఇక కోలుకోలేదు. తనయ్ త్యాగరాజన్ (13 బ్యాటింగ్), అనికేత్ (2 బ్యాటింగ్) క్రీజులో ఉండగా... హైదరాబాద్ ఇంకా 82 పరుగులు వెనుకబడే ఉంది.

ఆఖిబ్ నబీ

పాకిస్తాన్ క్లీన్‌స్వీప్

చివరి వన్డేలో 6 వికెట్లతో శ్రీలంకపై విజయం

రావల్పిండి: సొంతగడ్డపై శ్రీలంకతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను పాకిస్తాన్ 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం జరిగిన చివరి మ్యాచ్‌లో పాక్ 6 వికెట్ల తేడాతో లంకను చిత్తు చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 45.2 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌటైంది. సదీరా సమరవిక్రమ (65 బంతుల్లో 48; 2 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలవగా... కెప్టెన్ కుశాల్ మెండిస్ (34), పవన్ రత్నాయకే (32), కామిల్ మిశారా (29), పతుమ్ నిసాంక (24) ఫర్వాలేదనిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మొహమ్మద్ వసీమ్ (3/47) లంకను దెబ్బ తీయగా...హారిస్ రవూఫ్, ఫైసల్ అక్రమ్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం పాకిస్తాన్ 44.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 215 పరుగులు చేసింది. మొహమ్మద్ రిజ్వాన్ (92 బంతుల్లో 61 నాటౌట్; 4 ఫోర్లు), ఫఖర్ జమాన్ (45 బంతుల్లో 55; 8 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించగా...హుస్సేన్ తలత్ (42 నాటౌట్), బాబర్ ఆజమ్ (34) రాణించారు. జెఫ్రీ వాండర్సే 3 వికెట్లు పడగొట్టాడు. 3 మ్యాచ్‌లలో కలిపి 9 వికెట్లు పడగొట్టిన హారిస్ రవూఫ్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. రేపటి నుంచి రావల్పిండితో ముక్కోణపు టోర్నీ జరుగుతుంది. ఈ టోర్నీలో పాక్, శ్రీలంకతో పాటు జింబాబ్వే బరిలో నిలిచింది.

జార్ఖండ్ 259/6

ఆంధ్రతో రంజీ మ్యాచ్

శశికాంత్

జంషెడ్‌పూర్: ఆంధ్ర బౌలర్లు శశికాంత్ (3/50), సౌరభ్ కుమార్ (2/63) శ్రమించి జార్ఖండ్ ఇన్నింగ్స్‌ను కట్టడిచేశారు. రంజీ ట్రోఫీ గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో టాస్ నెగ్గిన జార్ఖండ్ మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. ఆదివారం మొదటి రోజు ఆటనిలిచే సమయానికి 87 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 259 పరుగులు చేసింది. ఓపెనర్ శరణ్‌దీప్ సింగ్ (209 బంతుల్లో 115; 16 ఫోర్లు) శతక్కొట్టాడు. ఆట ఆరంభమైన కాసేపటికే శశికాంత్... ఓపెనర్ శిఖర్ మోహన్ (16) వికెట్‌ను పడగొట్టాడు. కానీ శరణ్‌దీప్, కుశాగ్ర (17)తో కలిసి రెండో వికెట్‌కు 45, కెప్టెన్ విరాట్ సింగ్ (41; 6 ఫోర్లు) జతగా మూడో వికెట్‌కు 78 పరుగులు జోడించడంతో ఇన్నింగ్స్ సాఫీగా సాగిపోయింది. ఈ క్రమంలో శరణ్‌దీప్ సెంచరీ పూర్తిచేసుకున్నాడు. జట్టు స్కోరు 200 పైచిలుకు చేరాక అతను నాలుగో వికెట్‌గా నిష్క్రమించగా ఆఖరి సెషన్‌లో ఆదిత్య సింగ్ (29; 2 ఫోర్లు, 2 సిక్సలు), రాబిన్ మింజ్ (19; 2 ఫోర్లు, 1 సిక్స్) వరుస ఓవర్లలో పెవిలియన్ చేరారు. ఆట ముగిసే సమయానికి అనుకూల్ రాయ్ (5 బ్యాటింగ్), సాహిల్ రాజ్ (7 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఆంధ్రబౌలర్లలో శశికాంత్, సౌరభ్‌లతో పాటు సాయితేజకు ఒక వికెట్ దక్కింది.

సెమీస్‌లో మీనాక్షి, ప్రీతి

నోయిడా: ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో భారత బాక్సర్లు మీనాక్షి, ప్రీతి, అంకుశ్, నరేందర్ తొలిరోజే పతకాల్ని ఖాయం చేసుకున్నారు. ఈ నలుగురు తొలిరౌండ్ విజయాలతోనే సెమీస్‌కు చేరారు. తద్వారా కనీసం కాంస్య పతకాలైన లభిస్తాయి. ప్రతీ ఈవెంట్‌లోనూ ప్రపంచ మేటి ఎనిమిది బాక్సర్లు మాత్రమే ఈ ఫైనల్స్ టోర్నీ బరిలో ఉండటంతో ఒక్క మ్యాచ్ విజయంతోనే పతకం ఖాయమవుతోంది. ప్రపంచ చాంపియన్ మీనాక్షి మహిళల 48 కేజీల తొలిరౌండ్‌లో కజకిస్తాన్‌కు చెందిన బొలత్ అక్బొతాపై గెలుపొందగా, 54 కేజీల కేటగిరీలో ప్రీతి... ఉజ్బెకిస్తాన్‌కు చెందిన మాజీ యూత్ ప్రపంచ చాంపియన్ నిగినా ఉక్తమొవపై నెగ్గింది. పురుషుల 80 కేజీల విభాగంలో అంకుశ్... జపాన్ బాక్సర్ వాకయాపై గెలిచాడు. 90 ప్లస్ కేజీల కేటగిరీలో నరేందర్ బెర్వాల్... ఉక్రెయిన్‌కు చెందిన అండ్రి ఖలెత్స్కీపై విజయం సాధించాడు.

మెక్సికోలోని లియోన్‌లో జరిగిన అంతర్జాతీయ ఉత్సవంలో ఆకాశంలో విహరిస్తున్న బెలూన్లు

వాటికన్‌లోని పాల్-6 హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విందులో పోప్ లియో-14

వారణాసిలో గంగా నదిలో బోటులో విహరిస్తూ సైబరియన్ గుల్స్‌కు ఆహారం వేస్తున్న ఓ పర్యాటకుడు

స్వామియే శరణం అయ్యప్ప!

- తెరుచుకున్న శబరిమల ఆలయం
- నేటి నుంచి మండల పూజలు ప్రారంభం

పత్తనంతిట్ట: కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయం వార్షిక మండల–మకరవిలక్కు పూజల కోసం ఆదివారం సాయంత్రం తెరుచుకుంది. రెండు నెలలకు పైగా సాగే పూజలు మలయాళ మాసం వృశ్చికం మొదటి రోజలైన సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అయితే, ఆలయ సముదాయం సన్నిధానంతోపాటు, ట్రెక్కింగ్ మార్గం, బేస్ క్యాంపులు ఆదివారమే భక్తులతో నిండిపోయాయి. ఆలయం తెరిచిన వెంటనే పూజలు చేయాలన్న తపనతో వేలాదిమంది భక్తులు కొండపైన కొలువు తీరిన అయ్యప్పదర్శనం కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. స్వామియే శరణం అయ్యప్ప అనే నినాదాలతో కొండలు ప్రతిధ్వనిస్తున్నాయి. ముఖ్య పూజారి మహేశ్ మోహనరు, ట్రావెన్‌కోర్ దేవస్వోమ్ బోర్డ్(టీడీబీ) అధికారుల సమక్షంలో ప్రధాన పూజారి అరుణ్‌కుమార్ నంబూద్రి ఆలయ గర్భగుడి తలుపులను తెరిచారు. భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు రోజుకు వర్చువల్‌గా 70వేల మందిని, స్పాట్ బుకింగ్ ద్వారా 20 వేల మందిని అనుమతించాలని అధికారులు నిర్ణయించారు. ఈ సీజన్‌లో ఆలయ తలుపులు రోజూ వేకువజామున 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు తెరిచి ఉంచుతారు. భక్తుల కోసం దారి పొడవునా తాగునీరు, కూర్చునేందుకు బెంచీలు,, టాయిలెట్లను ఏర్పాటు చేశారు. పరిసరాలను, ఆలయాన్ని శుభ్రంగా ఉంచేందుకు రోజంతా పారిశుద్ధ్య సిబ్బంది అందుబాటులో ఉంచారు. నడవలేని వారి కోసం డోలీ సేవలను అందుబాటులోకి తెచ్చారు.

ఒక జర్మన్ బందీ ఆశల వంటకం!

చరిత్రలో కొన్ని ఆహార పదార్థాలు రుచిని మాత్రమే అందించవు.. అవి అనేక భావోద్వేగాలు, మహా విపత్తుల నుండి విజయవంతంగా గట్టెక్కిన అద్భుత ధైర్యసాహస గాథల్ని కూడా తమతో మోసుకొస్తాయి. అలాంటిదే జర్మనీలో పుట్టిన 'బౌమ్‌కూచెన్' అనే ఈ ప్రత్యేకమైన కేక్! ట్రీ కేక్ అని పిలిచే ఈ స్వీట్, వలయాలతో కూడిన చెట్టు కాండాన్ని పోలి ఉండడం వల్ల.. జపాన్‌లో దీర్ఘాయుష్షుకు, శ్రేయస్సుకు చిహ్నంగా మారింది. ఈ రుచికరమైన కేక్ ప్రయాణానికి.. మధురమే కాదు, కష్టాల కడలిని ఈదిన చారిత్రక నేపథ్యం ఉంది. దీని మూలాలు.. తొలి ప్రపంచ యుద్ధ సమయంలో, జపాన్‌లోని ఓ చిన్న ద్వీపమైన నినోషిమాలో బందీగా ఉన్న ఒక జర్మన్ మిఠాయి తయారీదారుతో ముడిపడి ఉన్నాయి.

నినోషిమాలో బౌమ్‌కూచెన్ తయారీలో నిమగ్నమైన సిబ్బంది

బౌమ్‌కూచెన్ కేక్ ముక్కలు

యుద్ధ శిబిరంలో మొలకెత్తిన శాంతియుత ఆలోచన

నినోషిమా.. ఒకప్పుడు సైనిక క్వారంటైన్ కేంద్రంగా, తొలి ప్రపంచ యుద్ధ సమయంలో జర్మన్ యుద్ధ ఖైదీల శిబిరంగా ఉండేది. 1915లో చైనాలోని క్వింగ్దావోలో పట్టుబడిన జర్మన్ మిఠాయి తయారీదారు కార్ల్ జుఖైమ్ 1917లో ఇక్కడికి వచ్చాడు. నినోషిమాలోని జర్మన్ బందీలకు కొంతమేర స్వేచ్ఛ ప్రసాదించారు. దాంతో వారు వంట చేసుకోవడానికి అనుమతి పొందారు. అప్పుడే జుఖైమ్ తన బౌమ్‌కూచెన్ వంటకాన్ని ఇక్కడే పరీక్షించాడని భావిస్తున్నారు. ఇప్పటికీ, నినోషిమాలో సందర్శకులు వెదురు కర్రపై పిండిని పోసి, బొగ్గుల నిప్పుపై వేడి చేస్తూ, పొరలు పొరలుగా బౌమ్‌కూచెన్ వంటకం తయారీ నేర్చుకుంటారు. కేక్ పొరలు బ్రౌన్ రంగులోకి మారిన ప్రతిసారీ, కొత్త పొర పోస్తారు. ఇది చెట్టు కాండంపై వలయాల మాదిరిగా మారుతుంది. ఈ పద్ధతిని జుఖైమ్ నూరేళ్ల క్రితం ఆ యుద్ధ శిబిరంలోనే ప్రారంభించారు.

భూకంపాలు, బాంబు దాడులను తట్టుకుని..

యుద్ధం ముగిసిన తర్వాత కూడా జుఖైమ్ జపాన్‌లోనే ఉండిపోయాడు. మార్చి 1919లో హిరోషిమా ప్రిఫెక్చరల్ ప్రొడక్ట్స్ ఎగ్జిబిషన్‌లో ఆయన చేతితో చేసిన బౌమ్‌కూచెన్ వాణిజ్యపరంగా ప్రారంభమైంది. అది అద్భుతమైన ప్రజాదరణ పొందింది. 1922లో యోకోహామాలో ఒక పేస్ట్రీ షాప్‌ను కూడా తెరిచాడు. కానీ, 1923లో వచ్చిన గ్రేట్ కాంటో భూకంపం ఆ వ్యాపారాన్ని నాశనం చేసింది. ఆ తర్వాత కోబ్‌కు మకాం మార్చి కాఫీ షాప్ తెరిచాడు. కానీ రెండో ప్రపంచ యుద్ధం ముగియడానికి కేవలం రెండు నెలల ముందు, కోబ్‌పై అమెరికా జరిపిన బాంబు దాడుల్లో ఆ స్టోర్ కూడా నేలమట్టమైంది. అయినా, జుఖైమ్ ఏ మాత్రం వెనుకడుగు వేయలేదు. తన భార్య ఎలిస్, అంకిత భావం గల జపనీస్ సిబ్బంది సహాయంతో కోబ్‌లోనే వ్యాపారాన్ని తిరిగి వృద్ధి చేసుకున్నాడు. జపాన్ లొంగిపోయేందుకు ఒక రోజు ముందు, ఆగస్టు 14, 1945న జుఖైమ్ అనారోగ్యంతో మరణించినప్పటికీ, ఆయన స్థాపించిన జుఖైమ్ కో లిమిటెడ్ నేటికీ జపాన్ అగ్రశ్రేణి కాన్ఫెక్షనరీ సంస్థలలో ఒకటిగా కొనసాగుతుండటం విశేషం.

బౌమ్‌కూచెన్.. శాంతికి, సౌభాగ్యానికి ప్రతీక!

ఈ 'వృక్ష కేక్' మూలాలు విపత్తులు, యుద్ధాలతో ముడిపడి ఉన్నప్పటికీ.. ప్రస్తుతం జపాన్ సంస్కృతిలో ఇది విడదీయరాని భాగమైంది. దీని వలయాల నిర్మాణం నిరంతరాయమైన జీవితానికి, వృద్ధికి ప్రతీకగా భావిస్తారు. పెళ్లిళ్లు, పుట్టినరోజుల వంటి శుభకార్యాలకు అత్యంత ప్రజాదరణ పొందిన బహుమతిగా మారింది. మచ్చా, చిలగడదుంపల వంటి స్థానిక వంటకాలతో కలిపి జపనీస్ శైలిలో మార్పులు చెందింది. నినోషిమా వెల్‌కమ్ సెంటర్ అధిపతి కజుకి ఒటాని చెప్పినట్లు.. 'జుఖైమ్ వంట.. శాంతి కోసం చేసిన వ్యక్తీకరణ'. మరణం, విధ్వంసం చుట్టుముట్టిన చోట ఊపిరి పోసుకున్న బౌమ్‌కూచెన్ అనే ఈ తీపి వంటకం.. కష్టాల నుంచి బయటపడిన మానవ ఆశలు, మనుగడకు ఒక నిశ్శబ్ద సాక్ష్యంగా నిలిచింది. ఇది కేవలం ఒక కేక్ కాదు. యుద్ధాలనూ, విపత్తులనూ జయించిన ఒక అద్భుతమైన కథ!

– సాక్షి, నేషనల్ డెస్క్

ఆర్‌ఎల్‌డీ చీఫ్‌గా జయంత్ చౌదరి

లక్నో: రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి జయంత్ చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని మథురలో ఆదివారం ఆ పార్టీ జాతీయ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. అనంతరం జయంత్ చౌదరి ఎక్స్‌లో..ఎన్డీయే ప్రభుత్వానికి తమ మద్దతు కొనసాగుతుందన్నారు. మాజీ ప్రధాని, తన తాత స్వర్గీయ చౌదరి చరణ్ సింగ్ ఆశయ సాధనకు పాటుపడాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ఈ సందర్భాన్ని పురస్కరించుకుని 1.25 కోట్ల మొక్కలను నాటుతామన్నారు. 'వాళ్లకు నేతలు లేరు విధానాలు లేవు. అందుకే విఫలమవుతున్నాయి'అంటూ ఆయన ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. అధికార ఎన్డీయే భాగస్వామ్య పక్షాల్లో ఆర్‌ఎల్‌డీ కూడా ఉంది. ఈ పార్టీకి లోక్‌సభలో ఇద్దరు, రాజ్యసభలో ఒక సభ్యుడు ఉన్నారు. యూపీ అసెంబ్లీలో ఆర్‌ఎల్‌డీకి 9 మంది సభ్యుల బలముంది.

ఖతార్ అమిర్‌తో జై శంకర్ చర్చలు

దోహా: భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఆదివారం ఖతార్ రాజధాని దోహాలో ఆ దేశ నాయకత్వంతో చర్చలు జరిపారు. వాణిజ్యం, ఇంధనం తదితర రంగాల్లో వ్యూహాత్మక ద్వైపాక్షిక సంబంధాలతోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ స్థాయి అంశాలపై చర్చించారు. ఖతార్ ప్రధానమంత్రి, ఆర్థిక మంత్రి కూడా అయిన మహ్మద్ బిన్ అబ్దుల్‌రహ్మాన్ బిన్ జస్సిమ్ అల్ తానీతోపాటు అమిర్ తమిమ్ బిన్ హమద్ అల్ తానీతోనూ ఆయన సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసుకునేందుకు గల అవకాశాలపైనా ఈ నేతలతో మాట్లాడినట్లు జై శంకర్ అనంతరం ఎక్స్‌లో తెలిపారు. భారత్–ఖతార్ ద్వైపాక్షిక వాణిజ్యం 2023–24లో రూ.1.24 లక్షల కోట్లుగా ఉందని విదేశాంగ శాఖ తెలిపింది.

యూపీలో కూలిన క్వారీ

ఒకరు మృతి, లోపల చిక్కుకున్న డజను మంది

సోన్‌భద్ర: ఉత్తరప్రదేశ్‌లోని సోన్‌భద్ర జిల్లాలో శనివారం సాయంత్రం రాతి క్వారీ కుప్పకూలిన ఘటనలో ఒక కూలీ చనిపోగా, డజను మంది వరకు లోపలే చిక్కుకుపోయారు. బిల్లి మర్కుండి ప్రాంతంలోని ఆ క్వారీ నుంచి ఆదివారం ఉదయం కూలీ మృతదేహాన్ని వెలికి తీశారు. లోపలున్న వారిని కాపాడేందుకు చర్యలు చేపట్టారు. లోపల మట్టి, రాళ్ల శిథిలాల కింద కనీసం డజను మంది ఉండి ఉంటారని స్థానిక ఎమ్మెల్యే సంజీవ్ కుమార్ గోండ్ చెప్పారు.అడ్డుగా భారీ బండరాళ్లు ఉన్నందున శిథిలాల తొలగింపు ఆలస్యం కావచ్చని వారణాసి అదనపు డీజీపీ పీయూష్ మోర్డియా చెప్పారు. క్వారీ లోపల తన ఇద్దరు సోదరులు చిక్కుబడిపోయారంటూ ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓబ్రా పోలీస్‌స్టేషన్‌లో క్వారీ నిర్వాహకులపై కేసు నమోదైంది.

పాక్‌లోని బాణసంచా కర్మాగారంలో పేలుడు

ఏడుగురు మృతి

కరాచీ: పాకిస్తాన్‌లోని హైదరాబాద్ నగరంలోని తాత్కాలిక బాణసంచా తయారీ కర్మాగారంలో పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. అనేకమంది గాయపడ్డారు. గాయపడిన వారిలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారి పరిస్థితి విషమంగా ఉంది. భవనంలో ఒక భాగం కూలిపోయింది. శిథిలాల నుంచి ఏడు మృతదేహాలను బయటకు తీశారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని బయటికి తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. వారిలో పిల్లలు కూడా ఉన్నట్లు అనుమానిస్తున్నారు. పేలుడు తరువాత నివాస ప్రాంతంలో బాణాసంచా ఫ్యాక్టరీ కార్యకలాపాలపై సింద్ ముఖ్యమంత్రి మురాద్‌అలి షా విచారణకు ఆదేశించారు. ఈ ఏడాది ఆగస్టులో కరాచీలోని మరో అక్రమ బాణసంచా తయారీ కర్మాగారంలో ఇలాంటి పేలుడే సంభవించింది. ఈ ఘటనలో ఇద్దరు మరణించగా, 33 మంది గాయపడ్డారు.

ప్రాదేశిక సైన్యంలో మహిళలకు సైతం ప్రవేశం!

న్యూఢిల్లీ: ప్రాదేశిక సైనిక దళాల్లో మహిళలను సైతం చేర్చుకోవాలని భారత సైన్యం భావిస్తోంది. తొలుత పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించబోతున్నారు. కొన్ని బెటాలియన్లలో వారికి ప్రవేశం కల్పించబోతున్నట్లు అధికారులు ఆదివారం వెల్లడించారు. సైన్యంలో నారీ శక్తిని మరింత పెంచాలన్న నిర్ణయంలో భాగంగానే టెరిటోరియల్ ఆర్మీ బెటాలియన్లలో వారికి అవకాశం కల్పిస్తున్నారు. భారత సైన్యంలో మహిళల పాత్ర స్వల్పంగానే ఉన్న సంగతి తెలిసిందే. పైలట్ ప్రాజెక్టుతో సత్ఫలితాలు వస్తే మిగతా బెటాలియన్లలోనూ మహిళలకు సముచిత భాగస్వామ్యం కల్పిస్తారు. 1948 ఆగస్టు 18న తీసుకొచ్చిన టెరిటోరియల్ ఆర్మీ చట్టం ద్వారా ప్రాదేశీయ సైన్యం ఏర్పాటయ్యింది. 1949 అక్టోబర్ 9 నుంచి అమల్లోకి వచ్చింది.

ప్రజాధనం దుర్వినియోగం

ప్రపంచ బ్యాంకు నిధులను దారి మళ్లించారు

- రూ.14 వేల కోట్లను ఎన్నికల కోసం ఖర్చుపెట్టారు
- బిహార్‌లో నితీశ్ ప్రభుత్వంపై ప్రశాంత్ కిశోర్ సంచలన ఆరోపణలు

పట్నా: ప్రపంచ బ్యాంకు నుంచి రుణంగా తీసుకువచ్చిన రూ.14 వేల కోట్లను బిహార్‌లో అభివృద్ధి కార్యక్రమాల కోసం ఖర్చుపెట్టడానికి బదులుగా సీఎం నితీశ్ ప్రభుత్వం దారి మళ్లించిందని జన్ సురాజ్ పార్టీ చీఫ్ ప్రశాంత్ కిశోర్ ఆరోపించారు. ఆ డబ్బును అసెంబ్లీ ఎన్నికల వేళ మహిళల ఖాతాల్లో రూ.10వేల చొప్పున జమ చేసి, వారిని మచ్చిక చేసుకునేందుకు వాడుకుందని విమర్శించారు. ఇది కచ్చితంగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనన్నారు. ఎన్నికల ప్రక్రియను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు పాల్పడిన అనైతిక చర్యగా ఆయన అభివర్ణించారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని ప్రశాంత్ కిశోర్ డిమాండ్ చేశారు. బిహార్ అసెంబ్లీకి తాజాగా జరిగిన ఎన్నికల్లో ఎన్డీయే ఘన విజయం సాధించడం తెల్సిందే. ఈ ఫలితాలను ప్రభావితం చేసిన అంశాల్లో రాష్ట్రంలోని 1.25 కోట్ల మంది మహిళల ఖాతాల్లో రూ.10 వేల చొప్పున జమ చేయడం కీలకంగా ఉందని విశ్లేషకులు అంటున్నారు. 'ఎన్నికల ఫలితాలను కొనుగోలు చేశారు. జూన్ 21వ తేదీ నుంచి పోలింగ్ జరిగే వరకు అధికారపక్షం ఏకంగా రూ.40 వేల కోట్లను ఖర్చుపెట్టింది. ప్రజాధనాన్ని ప్రజల ఓట్లను కొనేందుకు వాడుకుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడానికి కేవలం గంట ముందుగా మహిళల బ్యాంకు అకౌంట్లకు డబ్బును బదిలీ చేసింది. ఇందుకు ప్రపంచబ్యాంకు నిధులను వాడినట్లు మాకు తెల్సింది'అని జన్‌సురాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ సింగ్ తెలిపారు. ఖజానా ఉన్న డబ్బంతా ఎన్నికల్లో గెలవడానికే నితీశ్ ప్రభుత్వం ఖర్చు చేసింది. అధికారంలోకి వచ్చాక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టేందుకు మిగిలింది ఖాళీ ఖజానాయేనని ఆ పార్టీ ప్రతినిధి పవన్ వర్మ తెలిపారు. రాష్ట్రం మొత్తం అప్పు రూ.4.06 లక్షల కోట్లకు చేరుకోగా రోజుకు రూ.63 కోట్ల చొప్పున వడ్డీ రూపంలో ప్రభుత్వం చెల్లిస్తోందని వెల్లడించారు.

దక్షిణా చైనా సముద్రంపై చైనా బాంబర్ పెట్రోలింగ్

బీజింగ్: వివాదాస్పద దక్షిణ చైనా సముద్రంపై చైనా సైన్యం ఆదివారం తొలిసారిగా బాంబర్ పెట్రోలింగ్ నిర్వహించింది. ఇందుకోసం ఏకంగా యుద్ధ విమానాలను రంగంలోకి దించింది. ఫైటర్ జెట్లు సముద్రంపై గగనతలంలో చక్కర్లు కొట్టాయి. ఫిలిప్పైన్స్‌కు హెచ్చరికగానే బాంబర్ పెట్రోలింగ్ నిర్వహించినట్లు తెలుస్తోంది. ఫిలిప్పైన్స్ నావికాదళం ఇటీవల అమెరికా, జపాన్ సైన్యంతో కలిసి దక్షిణ చైనా సముద్రంలో ఉమ్మడిగా సైనిక విన్యాసాలు నిర్వహించింది. ఈ పరిణామం చైనాకు రుచించడం లేదు. దక్షిణా చైనా సముద్రం మొత్తం తమదేనని చైనా ప్రభుత్వం వాదిస్తోంది. దీనిపై ఫిలిప్పైన్స్, వి యత్నాం, మలేషియా, బ్రూనై, తైవాన్ దేశాలు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. చైనా ఆధిపత్య ధోరణిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

యునిసెఫ్ ఇండియా సెలబ్రిటీ ప్రచారకర్తగా కీర్తి సురేష్

న్యూఢిల్లీ: నటి కీర్తి సురేష్ యునిసెఫ్ ఇండియాకు సెలబ్రిటీ ప్రచారకర్తగా నియమితులయ్యారు. పిల్లల మానసిక ఆరోగ్యం, హక్కుల గురించి ఆమె పనిచేయనున్నారని యునిసెఫ్ ఇండియా ప్రతినిధి సింథియా మెక్‌కాఫ్రీ ఆదివారం ప్రకటించారు. అమితాబ్ బచ్చన్, సచిన్ టెండూల్కర్ వంటి ప్రముఖులతో కలిసి ఆమె ఈ కార్యక్రమంలో భాగం పంచుకోనున్నారు. తన కొత్త బాధ్యతల పట్ల కీర్తి సురేష్ హర్షం వ్యక్తం చేశారు. ఇది తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు ఆమె తెలిపారు. 'పిల్లలు శ్రేయస్సు మన బాధ్యత. మన పెంపకం , ప్రేమపూర్వక సంరక్షణ వారి నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి పునాది వేస్తుంది. మరింత ఆరోగ్యకరమైన జీవితాలను గడపడానికి తోడ్పడుతుంది. వారి నేపథ్యం, సామర్థ్యంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరి అభివృద్ధికి సమాజంలో అవగాహనకు యునిసెఫ్ ఇండియాతో చేతులు కలపడం నాకు గౌరవంగా ఉంది'అని ఆమె ప్రకటించారు.

మెక్సికో సిటీలో పోలీసులతో తలపడుతున్న ఆందోళనకారులు

నేరాలు, అవినీతిపై ఆగ్రహ జ్వాలలు

- మెక్సికోలో జన్ జెడ్ నిరసనలు తీవ్రరూపం
- 100 మంది పోలీసులు సహా 120 మందికి గాయాలు

మెక్సికో సిటీ: పెరుగుతున్న నేరాలు, అవినీతికి వ్యతిరేకంగా మెక్సికో రాజధాని మెక్సికో సిటీలో చేపట్టిన ర్యాలీకి వేలాదిగా జనం తరలివచ్చారు. జన్ జెడ్ గ్రూప్ సారథ్యం వహించిన ఈ ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు ప్రశాంతంగా జరిగినా కొన్ని చోట్ల యువత పోలీసులతో ఘర్షణ పడ్డారు. ఈ సందర్భంగా గాయపడిన 120 మందిలో 100 మంది పోలీసులేనని అధికారి ఒకరు తెలిపారు. ఇరవై మంది నిరసనకారులను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇతర నగరాల్లో కూడా జరిగిన ప్రదర్శనల్లో ప్రతిపక్ష పార్టీల నేతలు కూడా పాల్గొన్నారు. నిరసన కారులు ఈ సందర్భంగా ఉరువపన్ నగర మేయర్ కార్లోస్ మంజో హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. డ్రగ్స్ ముఠాలపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. మాకు మరింత భద్రత కావాలంటూ ఆండేస్‌మస్సా అనే వ్యక్తి పుర్రె బొమ్మ కలిగిన జెండాను ప్రదర్శించారు. అధ్యక్ష భవనం నేషనల్ ప్యాలెస్ వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బారియర్లను నిరసన కారులు ధ్వంసం చేశారు. పోలీసులపై రాళ్లు రువ్వారు. వారిపై మండే పదార్థాలను విసిరేశారు. పోలీసుల వద్ద ఉండే షీల్డులను, ఇతర వస్తువులను లాగేసుకున్నారు. భవనం ప్రాంగణంలోకి ప్రవేశించేందుకు యత్నించిన నిరసనకారులను పోలీసులు టియర్‌గ్యాస్ ప్రయోగించి, అడ్డుకున్నారు. నవంబర్ ఒకటో తేదీన జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మంజో గుర్తు తెలియని వ్యక్తి కాల్పుల్లో చనిపోయారు. డ్రగ్స్ ముఠాలు, డ్రగ్స్ రవాణాపై ఆయన తీవ్రంగా విమర్శలు చేయడమే ఇందుకు కారణమన్న అనుమానాలున్నాయి. అధ్యక్షురాలు షీన్‌బామ్‌ను 70 శాతం ప్రజలు అభిమానిస్తున్నారు. మత్తు మందు ఫెంటానిల్ అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. అయితే, సాయుధ ముఠాలను నియంత్రించడంలో విఫలమైనట్లు ఆమెపై ఆరోపణలున్నాయి. ఇదే అంశంపై చుట్టుపక్కల దేశాలు కూడా మెక్సికోతో విభేదిస్తున్నాయి. పెరూ ఇటీవలే మెక్సికోతో సంబంధాలను తెగదెంపులు చేసుకుంది.

రామ్మోహన్ రాయ్ బ్రిటిష్ ఏజెంట్

మధ్యప్రదేశ్ మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు

షాజపూర్: సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్ రాయ్ బ్రిటిష్ ఏజెంట్, మతమార్పిడులనే విష విలయాన్ని ప్రారంభించింది ఆయనే అంటూ మధ్యప్రదేశ్ మంత్రి, బీజేపీ నేత ఇందర్ సింగ్ పర్మార్ వ్యాఖ్యానించారు. బ్రిటిషర్లు మతమార్పిడులను ప్రోత్సహించిన వారికి మాత్రమే అండగా ఉంటూ, ఇతరులను నకిలీ సంఘ సంస్కర్తలుగా తూలనాడేవారని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపాయి. ఇటీవల బెంగాల్‌కు చెందిన రవీంద్రనాథ్ ఠాకూర్, బంకించంద్ర ఛటర్జీల గురించి బీజేపీ, టీఎంసీ మధ్య మాటల యుద్ధంకొనసాగుతున్న వేళ చోటుచేసుకున్న ఈ పరిణామం చోటుచేసుకుంది. దీనిపై బెంగాల్ మంత్రి శశి పాంజా తీవ్రంగా స్పందించారు. 'బెంగాల్ ప్రముఖులను తక్కువగా చూపేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందనేందుకు ఇది తాజా ఉదాహరణ. సతీ సహగమన దురాచారాన్ని అరికట్టింది రామ్మోహన్ రాయ్ అన్న విషయం అందరికీ తెల్సిందే. బీజేపీ తన కాలిని తానే నరుక్కుంటే ఎలాంటి అభ్యంతరం లేదు. అయితే, బెంగాల్‌ను మాత్రం చులకన చేయవద్దు'అని ఆయన హెచ్చరించారు. పర్మార్ వ్యాఖ్యలు సిగ్గుచేటని ఎన్‌ఎస్‌యూఐ జాతీయ ప్రతినిధి విరాజ్ యాదవ్ పేర్కొన్నారు. ఈ విమర్శలతో పర్మార్ వెనక్కి తగ్గారు. 'రాజా రామ్మోహన్ రాయ్ గొప్ప సంఘ సంస్కర్త. మనమంతా ఆయన్ను గౌరవించాలి. తెలియక పొరపాటున అలా మాట్లాడాను. క్షమాపణ కోరుతున్నా'అని చెప్పారు.

తన గొర్రెలతో న్యూరెంబర్గ్ గుండా వెళ్తున్న టిమ్ గాక్‌స్టట్టర్(ఎడమ వ్యక్తి)

నగరం మధ్యలో గొర్రెల మంద

బెర్లిన్: జర్మనీలోని న్యూరెంబర్గ్‌లో ఆదివారం ఓ అరుదైన దృశ్యం స్థానికులకు కనువిందు చేసింది. ఒకటీ రెండూ కాదు..ఏకంగా 600కు పైగా గొర్రెలు నగరం మధ్యభాగం నుంచి శీతాకాలపు పచ్చిక బయళ్ల వైపు నడక సాగించాయి. ఈ దృశ్యం చూసి అబ్బురపడిన పాదచారులు తమ సెల్‌ఫోన్లలో గుంపులుగా సాగిపోతున్న గొర్రెల మంద ఫొటోలను తీసుకున్నారు. థామస్ గాక్‌స్టట్టర్ అనే వ్యక్తికి చెందిన గొర్రెలివి. ఏటా శీతాకాల సమీపిస్తున్న వేళ ఇలా నగరం నడిబొడ్డు మీదుగా శీతాకాలపు మేతకు ఇలా వెళుతుంటాయి. ఈ గొర్రెలను వేసవి కాలంలో నగరంలోని వివిధ పచ్చిక బయళ్లలో గడ్డిని చక్కగా, సమానంగా ఉంచటానికి ఉపయోగిస్తారు. ఇప్పుడు ఇవి నగరం మధ్యగుండా న్యూరెంబర్గ్ పశ్చిమాన ఉన్న శీతాకాలపు మేత ప్రాంతాలకు తరలి వెళ్తున్నాయి.

10 కిలోమీటర్ల ప్రయాణం

ఇవి దాదాపు పది కిలోమీటర్ల దూరం ఇలా నడక సాగిస్తాయి. ఈ ప్రయాణంలో భాగంగానే నగరం మధ్యనున్న ప్రధాన మార్కెట్ గుండా వెళ్తున్నాయని డీపీఏ వార్తా సంస్థ తెలిపింది. జర్మనీలోని ఇతర నగరాల మాదిరిగా కాకుండా నగరం మధ్య కూడలిని గొర్రెలు దాటే ఏకైక ప్రాంతం న్యూరెంబర్గ్ మాత్రమేనని పేర్కొంది. ఈ నగర జనాభా సుమారు 5.40 లక్షలు. గొర్రెలు నగరం గుండా సాగే వేళ అధికారులు ప్రజలకు అనేక సూచనలు చేశాయి. వాటికి దారి ఇవ్వాలని, కుక్కలను వాటికి దూరంగా ఉంచాలని కోరారు. అదేవిధంగా, ముందు జాగ్రత్తగా డ్రోన్ల సంచారాన్ని నిషేధించారు.

గొర్రెలే లాన్ మూవర్లు!

జర్మనీలోని న్యూరెంబర్గ్, పోట్స్‌డామ్, ఆగ్స్‌బర్గ్, బెర్లిన్, ఉల్మ్ తదితర నగరాల్లో గొర్రెలను సహజ లాన్‌మూవర్లు (గడ్డిని కోసే యంత్రాలు)గా వినియోగించుకుంటున్నారు. ఎందుకంటే.. గొర్రెలు నెమ్మదిగా గడ్డి మేయడం వల్ల కీటకాలకు హాని జరగదు. గడ్డి సహజంగా పెరుగుతుంది. ఈ విధంగా జీవవైవిధ్యాన్ని కాపాడుకుంటున్నారు. అంతే కాదు, గడ్డి కోసేందుకు అయ్యే ఖర్చులు కూడా ఆదా అవుతాయి. ఖాళీ బహిరంగ స్థలాలు కొరతగా మారుతున్న ఈ రోజుల్లో గొర్రెల కాపర్లకు ఇదో చక్కని ఏర్పాటుగా చెబుతున్నారు.

24న యాంటీ-సబ్‌మెరైన్ యుద్ధనౌక జలప్రవేశం

ముంబై: స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన తొలి మాహె–క్లాస్ యాంటీ–సబ్‌మెరైన్ యుద్ధనౌక ఈ నెల 24న జలప్రవేశం చేయనుంది. ముంబైలో ఈ కార్యక్రమం జరుగుతుందని నావికాదళం ఆదివారం ప్రకటించింది. ఈ నౌకను కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ నిర్మించింది. దీంతో నావికాదళం సామర్థ్యం మరింత పెరుగుతుందని అధికార వర్గాలు తెలియజేశాయి.

ఆయుధాలు-నార్కో నెట్‌వర్క్ గుట్టురట్టు

ఛండీగఢ్: పాకిస్తాన్‌తో సంబంధం ఉన్న ఆయుధాలు, మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌ను పంజాబ్ పోలీసులు ఛేదించారు. కిలోకుపైగా హెరాయిన్, ఆరు అధునాతన పిస్టళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వ్యక్తులు సోషల్ మీడియా, డ్రోన్‌ల ద్వారా పాకిస్తాన్‌కు చెందిన హ్యాండ్లర్లతో సంప్రదింపులు జరుపుతున్నారని దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. ఈ మేరకు డీజీపీ గౌరవ్ యాదవ్ ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. ఛెహర్తా, అమృత్‌సర్ కంటోన్మెంట్ పోలీస్‌స్టేషన్లలో ఆయుధ చట్టం, నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ చట్టం కింద ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. హ్యాండ్లర్లను గుర్తించడానికి, మొత్తం నెట్‌వర్క్‌ను విచ్ఛిన్నం చేయడానికి దర్యాప్తు జరుగుతోందని డీజీపీ తెలిపారు.

భారత భూభాగం - భారత యూనియన్

భారతదేశం.. రాష్ట్రాల యూనియన్

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

రాష్ట్రాల ఏర్పాటు-పునర్ వ్యవస్థీకరణ

భారత దేశంలో సమాఖ్య వ్యవస్థ ఉంది. కేంద్ర, రాష్ట్రాలు రాజ్యాంగ పరంగా అధికార విభజన సూత్రం ఆధారంగా పనిచేస్తాయి. సమాఖ్య, రాష్ట్రాల ఏర్పాటు, పునర్ వ్యవస్థీకరణ తదితర అంశాలను ఒకటో భాగంలో ప్రకరణలు 1 నుంచి 4 వరకు ప్రస్తావించారు.

భారత భూభాగం

ప్రకరణ-1

ఈ ప్రకరణ ప్రకారం, భారత భూభాగం అంటే రాష్ట్రాల సరిహద్దులు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర ప్రభుత్వం సముపార్జించిన ఇతర భూభాగాలు ఉంటాయి.

భారత భూభాగం అనే భావన విస్తృతమైంది. భారత సార్వభౌమాధికారం ఏ విధంగా విస్తరించి ఉంటుందో తెలుపుతుంది. భారత సార్వభౌమాధికారం భౌగోళిక ప్రాంతాలకే పరిమితం కాదు. భారత సముద్ర ప్రాదేశిక జలాలు 12 నాటికల్ మైళ్ల వరకు, విశిష్ట ఆర్థిక మండళ్లు 200 నాటికల్ మైళ్ల వరకు, అలాగే భారత అంతరిక్ష సరిహద్దులకూ సార్వభౌమాధికారం వర్తిస్తుంది.

భారత యూనియన్

ఇందులో రాష్ట్రాలు మాత్రమే ఉంటాయి. రాష్ట్రాలు సమాఖ్యలో అంతర్భాగంగా ఉంటూ నిర్ణీత అధికారాలను కలిగి ఉంటాయి. ఈ పదం కేంద్ర రాష్ట్ర సంబంధాలను సూచిస్తుంది.

రాష్ట్రాల సమ్మేళనం

భారత రాజ్యాంగం, ఒకటో ప్రకరణలో భారతదేశాన్ని రాష్ట్రాల యూనియన్‌గా పేర్కొంది. సమాఖ్య అనే పదాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు. కెనడా సమాఖ్యను స్ఫూర్తిగా తీసుకుని యూనియన్ అనే పదాన్ని రాజ్యాంగంలో చేర్చారు.

భారత సమాఖ్య అమెరికాలా రాష్ట్రాల మధ్య ఒప్పందం ద్వారా ఏర్పడలేదు. అలాగే కెనడా మాదిరిగా ఏకకేంద్ర రాజ్యం సమాఖ్యగా విభజితమవలేదు. భారత సమాఖ్య ఒక ప్రత్యేక పద్ధతిలో ఏర్పడింది.

కేంద్ర రాష్ట్రాల మధ్య ఒప్పందం లేదు. కాబట్టి యూనియన్ నుంచి రాష్ట్రాలు విడిపోలేదు. అమెరికా సమాఖ్యలో ప్రారంభంలో రాష్ట్రాలకు కేంద్రం నుంచి విడిపోయే హక్కు ఉండేది. అయితే ఆ హక్కును తర్వాత రద్దు చేశారు.

కాబట్టి భారత సమాఖ్యను విచ్ఛిన్నం కాగల రాష్ట్రాల, అవిచ్ఛిన్న యూనియన్ (ఇన్ డెస్ట్రక్టిబుల్ యూనియన్ ఆఫ్ డెస్ట్రక్టిబుల్ స్టేట్స్)గా పేర్కొంటారు. అమెరికాను ఇన్‌డెస్ట్రక్టిబుల్ యూనియన్ ఆఫ్ ఇన్‌డెస్ట్రక్టిబుల్ స్టేట్స్‌గా పేర్కొంటారు.

ప్రకరణ-2

ఈ ప్రకరణ ప్రకారం పార్లమెంటు ఒక చట్టం ద్వారా కొత్త ప్రాంతాలను చేర్చుకోవచ్చు, ఇతర దేశాలకు బదిలీ చేయవచ్చు. ఈ అధికారం భారత భూభాగంలో లేని అంశాలకు వర్తిస్తుంది. ఈ అధికారం పార్లమెంటుకు సంబంధించినదైనా అంతర్జాతీయ ఒప్పందాలకు లోబడి ఉంటుంది.

వివరణ..

విదేశీ భూభాగాలను భారతదేశంలో చేర్చుకున్నప్పుడు పార్లమెంటు ప్రత్యేక మెజారిటీతో రాజ్యాంగ సవరణ చేయాలి.

ఉదాహరణ: 1961లో గోవాను భారత్‌లో కలిపినప్పుడు 12వ రాజ్యాంగ సవరణ చేశారు. అలాగే పాండిచ్చేరికి సంబంధించి 1962లో 14వ రాజ్యాంగ సవరణ చేశారు. 1975లో 36వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింను భారత రాష్ట్రంగా చేర్చుకున్నారు.

ప్రకరణ-3

ఇందులో కింది అంశాలు ఉన్నాయి.

- కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడం.
- రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలను కలిపి నూతన రాష్ట్రం ఏర్పాటు.(ఆంధ్ర రాష్ట్రం, హైదరాబాద్ కలయికతో 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు). అలాగే రాష్ట్రాన్ని విడగొట్టి కొత్త రాష్ట్రం ఏర్పాటు చేయడం. (2014 జూన్‌లో ఏర్పడిన తెలంగాణ)
- రాష్ట్ర విస్తీర్ణాన్ని పెంచవచ్చు.
- రాష్ట్ర విస్తీర్ణాన్ని తగ్గించవచ్చు.
- రాష్ట్ర సరిహద్దులను సవరించవచ్చు.
- రాష్ట్రాల పేర్లను మార్చవచ్చు.

రాష్ట్రాల ఏర్పాటు - ప్రక్రియ- పద్ధతి

ప్రకరణ 3లో పేర్కొన్న అన్ని అంశాలకు ఒకే ప్రక్రియ ఉంటుంది.

- పై అంశాలకు సంబంధించిన బిల్లును పార్లమెంటులోని ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు.

వివరణ..

రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ బిల్లులో ఆర్థిక వనరుల పంపకాలు ఉంటే అది స్పెషల్ కేటగిరీ బిల్లు అవుతుంది. అలాంటి సందర్భాల్లో బిల్లును లోక్‌సభలోనే ప్రతిపాదించాలి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో ఈ వివాదాన్ని గమనించవచ్చు.

- పై బిల్లులను రాష్ట్రపతి పూర్వ అనుమతితోనే ప్రవేశపెట్టాలి.
- ఈ షరతును 1955లో అయిదో రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.
- సంబంధిత బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి ముందే ప్రభావితమవుతున్న రాష్ట్ర శాసనసభల అభిప్రాయాన్ని రాష్ట్రపతి కోరతారు.
- సంబంధిత రాష్ట్ర శాసనసభ రాష్ట్రపతి సూచించిన నిర్ణీత సమయంలోనే తమ అభిప్రాయాన్ని తెలపాలి.
- రాష్ట్ర శాసనసభలు వ్యక్తీకరించిన అభిప్రాయాలను పార్లమెంటు పరిగణలోకి తీసుకోవచ్చు లేదా తీసుకోకపోవచ్చు.

వివరణ..

1966లో పంజాబ్ నుంచి హర్యానా రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినప్పుడు పంజాబ్‌లో రాష్ట్రపతి పాలన, విధానసభ సుప్తచేతనావస్థలో ఉండటం వల్ల పునర్‌వ్యవస్థీకరణ బిల్లును రాష్ట్ర శాసనసభ అభిప్రాయానికి నివేదించలేదు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లును శాసనసభ తిరస్కరించింది.

- పార్లమెంటు ఉభయసభలు సంబంధిత బిల్లును సాధారణ మెజారిటీతో వేర్వేరుగా ఆమోదించాలి. ఉభయసభల మధ్య ప్రతిష్టంభన ఏర్పడితే, సంయుక్త సమావేశానికి ఆస్కారం లేదు. బిల్లు వీగిపోతుంది.
- బిల్లును రాష్ట్రపతి తప్పని సరిగా ఆమోదించాలి. పునఃపరిశీలనకు అవకాశం లేదు.
- రాష్ట్రపతి ఆమోదం తెలిపితే బిల్లు చట్టంగా మారుతుంది. దీంతో ప్రక్రియ పూర్తి అవుతుంది.
- కొత్త రాష్ట్రం ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందనేది కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుంది. దీన్ని అపాయింటెడ్ డేట్ అంటారు.

ప్రకరణ-4

ఈ ప్రకరణ సంబంధిత తదుపరి పరిణామాలను వివరిస్తుంది. ప్రకరణ 2, 3 ప్రకారం ఏదైనా సవరణ చేసినప్పుడు 1, 4 షెడ్యూల్‌లో పేర్కొన్న అంశాలను కూడా తదనుగుణంగా మార్చాలి. దీనికోసం పార్లమెంటు ప్రత్యేక చట్టం చేయాల్సిన అవసరం లేదు. ప్రకరణ 2, 3 ప్రకారం ఏ సవరణ చేసినా, తదనుగుణంగా 1, 4 షెడ్యూల్‌లోని అంశాలు కూడా మార్పునకు గురవుతాయి.

వివరణ

ప్రకరణ 2, 3 ప్రకారం ఏ సవరణ చేసినా దాన్ని రాజ్యాంగ సవరణగా పరిగణించరు. ఈ అంశాన్ని ప్రకరణ 4(2)లో స్పష్టంగా పేర్కొన్నారు. రాష్ట్రాల ఏర్పాటు, పునర్‌వ్యవస్థీకరణ, ఇతర అంశాలకు రాజ్యాంగ సవరణ తప్పనిసరి కాదు.

వివాదాలు- సుప్రీంకోర్టు తీర్పులు

బెరుబారి యూనియన్ వివాదం-1960

ప్రకరణ 3 ప్రకారం, రాష్ట్రాల సరిహద్దును కుదించే అధికారం పార్లమెంటుకు ఉంది. అయితే ఒక రాష్ట్ర భూభాగాన్ని ఇతర దేశాలకు బదిలీ చేసే అధికారం ఉందా? అనే వివాదం తలెత్తింది. దీనికి

సంబంధించి రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహాను కోరారు. ఈ వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు చెబుతూ, రాష్ట్ర భూభాగాన్ని ఇతర దేశాలకు బదిలీ చేయాలంటే ప్రకరణ 368 ప్రకారం పార్లమెంటు ప్రత్యేక మెజారిటీతో రాజ్యాంగ సవరణ చేయాలని పేర్కొంది. అయితే, అంతర్గతంగా బదిలీ చేసేందుకు సాధారణ మెజారిటీ సరిపోతుంది.

గమనిక: బెరుబారి అనేది పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఒక ప్రాంతం. 9 చదరపు మైళ్ల విస్తీర్ణంతో ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఒక ఒప్పందం ద్వారా పాకిస్తాన్‌కు కొంత భాగాన్ని బదిలీ చేసింది.

బాబూలాల్ మారాండి వర్సెస్ ముంబై స్టేట్ కేస్ (1960)

రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ బిల్లును ఒక్క పర్యాయం మాత్రమే సంబంధిత రాష్ట్ర శాసనసభల అభిప్రాయానికి నివేదిస్తారు. ఒక వేళ ఆ బిల్లులో తర్వాత చేసిన మార్పులకు సంబంధించి మరోసారి రాష్ట్ర పరిశీలనకు పంపాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. **ఉదాహరణ:** తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లాలోని పోలవరం కింది 7 ముంపు మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు బదలాయించడం.

స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1982)

భారత రాజ్యాంగం నిర్ణీతమైన సమాఖ్య వ్యవస్థను ఏర్పరచలేదు. నిర్మాణపరంగా సమాఖ్య అయినప్పటికీ ఇది సమాఖ్య, ఏక కేంద్ర ప్రభుత్వాల మిశ్రమంగా పేర్కొంది.

ముళ్ల పెరియార్ పర్యావరణ వివాదం (2006)

నదీజలాల పంపిణీ విషయంపై చట్టాలను చేసే అధికారం రాష్ట్ర శాసనసభకు ఉండదు. ఈ అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉంటుందని సుప్రీంకోర్టు ఈ కేసులో తీర్పు చెప్పింది.

భాషా ప్రయుక్త రాష్ట్రాలు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి రెండు రకాల రాజకీయ భాగాలు ఉండేవి.

1. నేరుగా బ్రిటిష్ ప్రభుత్వ నియంత్రణలో ఉన్న భాగాలు.
2. బ్రిటిష్ సార్వభౌమాధికారం కింద పనిచేసే సంస్థానాలు (స్వదేశీ సంస్థనాలు).

ఆనాడు దేశంలో 552 స్వదేశీ సంస్థానాలు ఉండేవి. బ్రిటిషువారు ప్రకటించిన విలీన ఒప్పందం ప్రకారం 549 స్వదేశీ సంస్థానాలు భారత యూనియన్‌లో విలీనం అయ్యాయి కానీ హైదరాబాద్, జునాగఢ్, కశ్మీర్ సంస్థానాలు విలీనాన్ని వ్యతిరేకించాయి. కశ్మీర్ భారత్‌లో విలీన ఒప్పందం ద్వారా అంతర్భాగం అయింది. ప్రజాభిప్రాయం ద్వారా జునాగఢ్ భారత్‌లో కలిసిపోయింది. ప్రజాభిప్రాయం ద్వారా కలిసిన మొదటి, చివరి సంస్థానం ఇదే. హైదరాబాద్ సంస్థానాన్ని 1948 సెప్టెంబర్ 17న ఆపరేషన్ పోలో అనే పోలీసు చర్య (సైనిక చర్య) ద్వారా విలీనం చేశారు.

1950 నాటికి రాజ్యాంగం ప్రకారం నాలుగు రకాల రాష్ట్రాలు అమలులో ఉండేవి. వీటిని పార్ట్-ఎ, బి, సి, డిగా వర్గీకరించారు. పార్ట్-ఎలో బ్రిటిష్ పాలిత గవర్నర్ ప్రావిన్స్‌లు 9 ఉండేవి. పార్ట్-బిలో శాసనసభ కలిగిన స్వదేశీ సంస్థానాలు 9, పార్ట్-సిలో చీఫ్ కమిషనర్ ప్రాంతాలు 10, పార్ట్-డిలో అండమాన్ నికోబార్ దీవులు ఉండేవి.

నేపథ్యం..

భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే ఉండేది. ఈ డిమాండు మొట్టమొదటి సారి తెరపైకి తెచ్చింది తెలుగువారే.

గమనిక: స్వాతంత్ర్యం రాక ముందు భాషా ప్రాతిపదికన ఏర్పడిన మొదటి రాష్ట్రం ఒడిశా.

- 1913లో బాపట్లలో జరిగిన ఆంధ్రమహాసభ ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటుకు డిమాండ్ చేసింది.
- 1927లో కాంగ్రెస్ సమావేశం భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును సమర్థిస్తూ తీర్మానం చేసింది.
- 1931లో జరిగిన రెండో రౌండ్ టేబుల్ సమావేశానికి గాంధీ హాజరైన సందర్భంలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర డిమాండుపై చర్చించాలని భోగరాజు పట్టాభి సీతారామయ్య ప్రతిపాదించారు.

1937లో రాయలసీమ, ఆంధ్ర నాయకుల మధ్య కాశీనాథుని నాగేశ్వరరావు నివాసంలో ఒక ఒప్పందం కుదిరింది. కాశీనాథుని నివాసం పేరు శ్రీభాగ్ కాబట్టి దీన్ని శ్రీభాగ్ ఒప్పందం అంటారు. స్వాతంత్ర్యానంతరం రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఏర్పాటు చేసే సందర్భంలో మద్రాసు, ఆంధ్ర నాయకుల మధ్య తలెత్తిన వివాదాలు ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటుకు బలమైన కారణాలుగా చెప్పొచ్చు.

థార్ కమిషన్ -1948

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుపై పరిశీలనకు రాజ్యాంగ పరిషత్తు 1948లో ఉత్తరప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి ఎస్.కె.థార్ నాయకత్వంలో ఇద్దరు సభ్యులతో (పన్నాలాల్, జగత్ నారాయణ్ లాల్) ఒక కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ కేవలం భాషా ప్రాతిపదిక పైన రాష్ట్రాలు ఏర్పాటు చేయడాన్ని తిరస్కరించింది. పరిపాలనా సౌలభ్య ప్రాతిపదికపైనే రాష్ట్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది.

జె.వి.పి. కమిటీ

థార్ కమిషన్ నివేదికకు వ్యతిరేకంగా చెలరేగిన ఆందోళనను విరమింపజేయడానికి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ 1948 డిసెంబర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభ్‌భాయ్ పటేల్, పట్టాభి సీతారామయ్య సభ్యులుగా ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ కూడా దేశం మొత్తం మీద రాష్ట్రాల పునర్‌నిర్మాణాన్ని వాయిదా వేయాలని, ఆంధ్ర రాష్ట్రాన్ని మాత్రం దానికి మినహాయింపుగా భావించాలని నివేదించింది.

1952 ఆగస్టు 15 నుంచి 35 రోజుల పాటు గొల్లపూడి సీతారామయ్య శాస్త్రి ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. 35 రోజుల తర్వాత ఆచార్య వినోబా భావే అతడి నిరాహారదీక్షను విరమింపజేశారు.

1952 అక్టోబర్ 19 నుంచి మద్రాసులో బులుసు సాంబమూర్తి ఇంట్లో పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారు. దీక్ష 50వ రోజుకు చేరుకున్న సందర్భంగా మద్రాసును సందర్శించిన జవహర్‌లాల్ నెహ్రూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు హామీ ఇచ్చారు.

కానీ పొట్టి శ్రీరాములు తన దీక్షను కొనసాగించారు. 58వ రోజున డిసెంబర్ 15న ఆయన అమరుడయ్యారు. పొట్టి శ్రీరాములు మృతితో హింసాత్మక సంఘటనలు చెలరేగాయి. దీంతో 1952 డిసెంబర్ 19న పార్లమెంటులో నెహ్రూ ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును ప్రకటించారు.

విద్య, ఉద్యోగ సమాచారం

బ్రిక్-ఎన్ఐఐ, న్యూఢిల్లీలో సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులు

న్యూఢిల్లీలోని బ్రిక్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునాలజీ(ఎన్ఐఐ) ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 40 ఏళ్ల ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.42,000.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఈమెయిల్:** sahaj.coordinator@nii.ac.in
- **దరఖాస్తులకు చివరితేది:** 27.11.2025.
- **వెబ్‌సైట్:** https://www.nii.res.in

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో జేఆర్ఎఫ్‌లు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్ తాత్కాలిక ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలోలు(జేఆర్ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఎమ్మెస్సీ(ఓషన్ అండ్ అట్మాస్ఫియరిక్ సైన్సెస్/ మెటీరియాలజీ /ఫిజికల్ ఓషనోగ్రఫీ) లేదా ఎంటెక్(అట్మాస్ఫియరిక్/ఓషన్ సైన్సెస్) లేదా ఎమ్మెస్సీ(జియాలజీ) లేదా ఎంఎస్సీ (అప్లైడ్ జియాలజీ) ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 32 ఏళ్ల ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.37,000.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఈమెయిల్:** sreenivas83@uohyd.ac.in
- **దరఖాస్తులకు చివరితేది:** 27.11.2025.
- **వెబ్‌సైట్:** https://uohyd.ac.in

మోతాదుకు మించితే విషతుల్యం!

ఔషధాల వాడకానికి సంబంధించి 'సొంత వైద్యం' చాలా ప్రమాదకరమైంది. తప్పనిసరిగా వైద్యుడి సిఫారసు మేరకే మందులు వాడాలి. అంతేకాకుండా వైద్యుడు సూచించిన మోతాదు కంటే అధిక పరిమాణంలో ఔషధాలను వాడితే అవి విషతుల్యమయ్యే ప్రమాదం ఉంటుంది. 'సైడ్ ఎఫెక్ట్'లు కనిష్ట స్థాయిలో ఉండేవిధంగా ఔషధాలను రూపొందిస్తారు.



ఔషధాలు (డ్రగ్స్)

మానవులు, జంతువుల్లో జీవక్రియలను ప్రభావితం చేసి, వ్యాధులను నయం చేయడానికి ఉపయోగించే రసాయన కారకాలనే ఔషధాలు అంటారు. సాధారణ పరిభాషలో వీటిని మందులుగానూ వ్యవహరిస్తారు. వ్యాధులను గుర్తించడానికి, నయం చేయడానికే కాకుండా నిరోధించడానికి ఉపయోగించేవాటిని కూడా ఔషధాలుగా పేర్కొంటారు. వ్యాధులు లేదా రోగాల చికిత్సకు రసాయన పదార్థాలను ఉపయోగించే ప్రక్రియను 'కెమోథెరపీ (Chemotherapy)' అంటారు.

జీవిలోకి ప్రవేశించిన ఔషధాలు జీవాణువులైన కార్బోహైడ్రేట్లు, లిపిడ్‌లు, ప్రోటీన్లు, న్యూక్లియిక్ ఆమ్లాల లాంటి వాటితో చర్య జరుపుతాయి. ఈ జీవాణువులనే లక్ష్య అణువులు (Target Molecules) అంటారు. ఔషధాలు వరణాత్మకంగా (Selective).. అంటే కేవలం ఆశించిన లక్ష్య అణువులతో మాత్రమే చర్యలో పాల్గొంటాయి. ఇతర లక్ష్య అణువులను ప్రభావితం చేయవు. ఇవి ఆశించిన ప్రదేశంలోనే పనిచేస్తాయి.

వివిధ రకాల ఔషధాలు

బాధా నివారిణులు (Analgesics): ఏ విధమైన ఇతర రకాల నరాల వ్యవస్థకు సంబంధించిన రుగ్మతలను కలిగించకుండా నొప్పిని లేదా బాధను మాత్రమే తగ్గించే ఔషధాలను ఎనాల్జెసిక్‌లు అంటారు. ఇవి రెండు రకాలు.

అవి:

1. **నాన్-నార్కోటిక్ ఎనాల్జెసిక్‌లు:** దురలవాట్లకు (Addiction) లోను చేయని ఎనాల్జెసిక్‌లు. వీటినే నాన్-నార్కోటిక్ ఎనాల్జెసిక్‌లు అంటారు.

ఉదా: ఐబూప్రోఫెన్, ఆస్పిరిన్, పారాసెటమాల్.

- ఎనాల్జెసిక్‌లకు జ్వర తీవ్రతను తగ్గించే గుణం ఉండటం వల్ల యాంటీ పైరెటిక్‌లుగా కూడా పనిచేస్తాయి.
- ఆస్పిరిన్ (ఎసిటైల్ సాలిసిలికామ్లం) ప్రోస్టాగ్లాండిన్‌లు (కణజాలాల్లో వచ్చే మంటలు, తద్వారా వచ్చే నొప్పులకు కారణమైనవి) అనే రసాయన పదార్థాల ఉత్పత్తి వేగాన్ని తగ్గించి బాధా నివారిణిగా పనిచేస్తుంది. దీనికి రక్తాన్ని పలచన చేసే గుణం (Blood thinner) కూడా ఉంది. అందువల్ల ఆస్పిరిన్ రక్తం గడ్డకట్టకుండా చూసి, గుండెపోటు నివారణకు దోహదపడుతుంది.

2. **నార్కోటిక్ ఎనాల్జెసిక్‌లు:** ఓపియమ్ పాపీ (నల్లమందు) నుంచి గ్రహించే మార్ఫిన్ రకానికి చెందిన రసాయనాలు దురలవాట్లకు గురి చేసేవి (Addictive)గా ఉంటాయి. సాధారణంగా వీటిని శస్త్ర చికిత్సల అనంతరం కలిగే బాధలు, గుండెకు సంబంధించిన నొప్పి, కేన్సర్‌తో అవసాన దశలో ఉండే రోగికి కలిగే బాధలు, ప్రసవ సమయంలో నొప్పిని తగ్గించడానికి ఉపయోగిస్తారు. వీటిని ఔషధ మోతాదులో సేవిస్తే బాధను తగ్గించి, నిద్రను ప్రోత్సహిస్తాయి.అధిక మొత్తంలో సేవిస్తే మైకం, అపస్మారక స్థితి, మూర్ఛకు దారితీసి చివరికి మరణం కూడా సంభవించే ప్రమాదం ఉంటుంది.

యాంటీ బయాటిక్‌లు: సూక్ష్మజీవుల పెరుగుదలను నిరోధించేవి లేదా వాటిని నాశనం చేసే వాటిని యాంటీబయాటిక్‌లు అంటారు.

ఎరిత్రోమైసిన్, టెట్రాసైక్లిన్, క్లోరాంఫెనికాల్ లాంటివి సూక్ష్మజీవుల పెరుగుదలను నిరోధిస్తాయి. పెన్సిలిన్, ఆఫ్లోక్సాసిన్ మొదలైనవి సూక్ష్మజీవులను నాశనం చేస్తాయి.

ఆమ్ల విరోధులు (Antacids): హైడ్రోక్లోరికామ్లం ఉదరంలో ఆహారం జీర్ణమవడానికి తోడ్పడుతుంది. ఒక వేళ జీర్ణకోశంలో ఈ ఆమ్లం అధికంగా ఉత్పత్తి చెందితే అది ప్రకోపానికి (Irritation) లేదా నొప్పికి దారితీస్తుంది. ఇంకా తీవ్రస్థాయిలో జరిగితే జీర్ణకోశంలో పుండ్లు (అల్సర్లు) ఏర్పడతాయి. రానిటిడిన్, ఒమిప్రజోల్, పెంటాప్రజోల్ లాంటివి ఈ ఆమ్ల ఉత్పత్తిని నియంత్రిస్తాయి. ఉత్పత్తి అయిన ఆమ్లాన్ని తటస్థీకరించేవి - సోడియం బై కార్బోనేట్ (బేకింగ్ సోడా), మెగ్నీషియం హైడ్రాక్సైడ్, అల్యూమినియం హైడ్రాక్సైడ్ మొదలైనవి.

యాంటీ సెప్టిక్‌లు (చీము నిరోధులు): గాయాలు, కోతలు, అల్సర్‌లు అయినప్పుడు జీవ కణాలకు పూతగా పూసే పదార్థాలే యాంటీ సెప్టిక్‌లు. యాంటీ బయాటిక్‌ల మాదిరిగా వీటిని నోటితో మింగకూడదు.

ఉదా: అయోడిన్ టింక్చర్, స్పిరిట్ (ఇథైల్ ఆల్కహాల్), ఫినాల్ ద్రావణం, డెట్టాల్ (క్లోరోక్జైలినాల్, టెర్పినియోల్‌ల మిశ్రమం), బిథియోనాల్, క్లోరిన్ జలద్రావణం, అయొడోఫాం.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో నాడీ సంబంధమైన వ్యాధి కానిది?
   1) స్పృహ కోల్పోవడం
   2) మానసిక ఆందోళన
   3) పక్షవాతం
   4) జీర్ణకోశంలో పుండ్లు (అల్సర్లు)
2. జీర్ణకోశంలో పెప్సిన్, హైడ్రోక్లోరికామ్లాల ఉత్పత్తిని ప్రేరేపించే రసాయనం?
   1) హిస్టమీన్ 2) రెనిటిడీన్
   3) ఎడ్రినలిన్ 4) మార్ఫిన్
3. అధిక ఆమ్ల వ్యాధి (Acidity) చికిత్సకు ఉపయోగించే ఔషధం?
   1) సిమెటిడిన్ 2) రెనిటిడిన్
   3) ఓమిప్రజోల్ 4) పైవన్నీ
4. కిందివాటిలో ఆమ్ల విరోధిగా పనిచేసేది ఏది?
   1) సోడియం బైకార్బొనేట్
   2) అల్యూమినియం హైడ్రాక్సైడ్
   3) మెగ్నీషియం హైడ్రాక్సైడ్
   4) పైవన్నీ
5. చిన్న పిల్లలకు ఆమ్ల విరోధిగా ఉపయోగించే మిల్క్ ఆఫ్ మెగ్నీషియా అనేది?
   1) మెగ్నీషియం హైడ్రాక్సైడ్
   2) అల్యూమినియం హైడ్రాక్సైడ్
   3) రానిటిడీన్ 4) ఓమీప్రజోల్
6. కిందివాటిలో యాంటీ హిస్టమీన్ ఏది?
   1) వేలియం 2) పారాసిటమాల్
   3) బ్రోమ్‌ఫెనిరమీన్ 4) ఆస్పిరిన్
7. నిద్ర తెప్పించే (హిప్నాటిక్) ఔషధం?
   1) సెరటోనిన్ 2) వేలియం
   3) క్లోరోడయజీపాక్సైడ్ 4) పైవన్నీ
8. కిందివాటిలో నార్కోటిక్ నొప్పి నివారిణి ఏది?
   1) మార్ఫిన్ 2) ఆస్పిరిన్
   3) పారాసెటమాల్ 4) పైవన్నీ
9. కిందివాటిలో ఎనాల్జెసిక్ ఏది?
   1) పారాసెటమాల్ 2) ఆస్పిరిన్
   3) ఐబూప్రోఫెన్ 4) పైవన్నీ
10. రక్తాన్ని పలచన చేసే గుణం ఉన్న ఔషధం (Blood thinner) ఏది?
    1) పారాసెటమాల్ 2) ఆస్పిరిన్
    3) మార్ఫిన్ 4) కొడీన్
11. కెమోథెరపీ అంటే?
    1) కీళ్లు వాచేలా కొట్టడం
    2) ఔషధాలను ఉపయోగించి వ్యాధులు నయం చేయడం
    3) ఫిజియోథెరపీ
    4) యోగా ద్వారా వ్యాధులు నయం చేయడం
12. ఎసిటైల్ సాలిసిలికామ్లం అని దేన్నంటారు?
    1) ఆస్పిరిన్ 2) పారాసెటమాల్
    3) క్లోరోక్విన్ 4) పెన్సిలిన్
13. సింకోనా చెట్టు బెరడు నుంచి సంగ్రహించే ఔషధం?
    1) క్వినైన్ 2) మార్ఫిన్
    3) నికోటిన్ 4) కెఫీన్
14. కిందివాటిలో సరైన వాక్యం ఏది?
    1) పారాసెటమాల్ అధిక మోతాదులో వాడితే కాలేయం దెబ్బతింటుంది
    2) ఆస్పిరిన్ అధికంగా వాడితే అల్సర్‌లు ఏర్పడతాయి
    3) మిథైల్ సాలిసిలేట్ మూత్రవర్ధకంగా పని చేస్తుంది
    4) పైవన్నీ సరైనవే
15. కిందివాటిలో బాధా నివారిణిగా పనిచేస్తూ జ్వరాన్ని తగ్గించే గుణం ఉన్న ఔషధం కానిది?
    1) పారాసెటమాల్ 2) ఆస్పిరిన్
    3) కెఫీన్ 4) మార్ఫిన్
16. ఎలర్జీని తగ్గించే గుణం ఉన్న ఔషధాలను ఏమంటారు?
    1) ఎనాల్జెసిక్‌లు 2) ట్రాంక్విలైజర్‌లు
    3) యాంటీ హిస్టమీన్‌లు
    4) యాంటీ బయాటిక్‌లు
17. హెరాయిన్ అనే మత్తుమందును దేన్ని ఎసిటైలేషన్ చేసి రూపొందిస్తారు?
    1) మార్ఫిన్ 2) కెఫీన్
    3) నికోటిన్ 4) సాలిసిలికామ్లం
18. కిందివాటిలో ఆల్కలాయిడ్ కుటుంబానికి చెందని డ్రగ్ ఏది?
    1) మార్ఫిన్ 2) ఆస్పిరిన్
    3) నికోటిన్ 4) కెఫీన్
19. కిందివాటిలో సరికాని జత?
    1) టీ – కెఫీన్
    2) పొగాకు – నికోటిన్
    3) సింకోనా – క్వినైన్
    4) పెన్సిలియం బూజు – క్లోరాంఫెనికాల్
20. కిందివాటిలో సరికాని జత?
    1) పెన్సిలిన్: యాంటీ బయాటిక్
    2) డెట్టాల్: యాంటీ సెప్టిక్
    3) వేలియం: ట్రాంక్విలైజర్
    4) క్లోరోక్విన్: ఎనాల్జెసిక్
21. క్షయ వ్యాధి నివారణకు ఉపయోగించే ఔషధం ?
    1) టెట్రాసైక్లిన్ 2) పెన్సిలిన్
    3) క్లోరోక్విన్ 4) స్ట్రెప్టోమైసిన్
22. మలేరియా నివారణకు వాడే ఔషధం?
    1) క్లోరోక్విన్ 2) పెన్సిలిన్
    3) ఆస్పిరిన్ 4) వేలియం
23. మత్తు మందులకు అలవాటు పడిన వారు అవి దొరకకపోతే సేవించేది ఏది?
    1) డెట్టాల్ 2) పురుగులమందు
    3) దగ్గు మందు 4) ఎండ్రిన్
24. కిందివాటిలో గర్భ నిరోధక ఔషధం (యాంటీ ఫెర్టిలిటీ డ్రగ్) ఏది?
    ఎ. నారిథిండ్రోన్
    బి. ఇథైనైల్ ఈస్ట్రాడయోల్
    సి. క్లోరామ్‌ఫెనికాల్
    1) ఎ, బి 2) బి, సి
    3) ఎ, సి 4) ఎ, బి, సి
25. కిందివాటిలో దోమల నియంత్రణకారి?
    1) డెట్టాల్ 2) పైరిథ్రిన్
    3) ఈథర్ 4) ఆలిటేమ్
26. కిందివాటిలో సరికాని జత ఏది?
    1) కనుపాప విస్ఫారణం: అట్రోపిన్
    2) స్థానిక మత్తు మందు: ఈథర్
    3) గుండె జబ్బు: నైట్రో గ్లిజరిన్
    4) మలేరియా: నికోటిన్
27. పెన్సిలిన్‌ను కనుగొన్న శాస్త్రవేత్త?
    1) అలెగ్జాండర్ ఫ్లెమింగ్
    2) ఖొరానా 3) సాల్వర్‌సన్
    4) సి.వి. రామన్

సమాధానాలు

1) 4; 2) 1; 3) 4; 4) 4; 5) 1; 6) 3; 7) 4; 8) 1; 9) 4; 10) 2; 11) 2; 12) 1; 13) 1; 14) 4; 15) 3; 16) 3; 17) 1; 18) 2; 19) 4; 20) 4; 21) 1; 22) 1; 23) 3; 24) 1; 25) 2; 26) 4; 27) 1.

మొదటి రిపబ్లిక్ డే ఏ రోజు అవుతుంది?

క్యాలెండర్

క్యాలెండర్ చాప్టర్ నుంచి ప్రతి పోటీ పరీక్షలో 2 – 5 వరకు ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.

గమనిక: *ఈ చాప్టర్‌లోని ప్రశ్నలు సాధించాలంటే బేసి రోజులను గుర్తించడం తెలిస్తే చాలు.*

బేసి దినాలు గుర్తించడం

క్యాలెండర్‌లో రెండు రకాల సంవత్సరాలుంటాయి.

- సాధారణ సంవత్సరంలో 365 రోజులు అంటే 52 వారాలు + 1 రోజు. ఆ మిగిలిన ఒక రోజునే 'బేసిదినం' అంటాం.

గమనిక: *ఆదివారం నుంచి శనివారం వరకు ఏడు రోజులు ఉంటాయి. కాబట్టి ఇచ్చిన రోజులను 7తో భాగిస్తే వచ్చిన శేషాన్ని 'బేసి దినాలు'గా గుర్తించాలి.*

- లీపు సంవత్సరంలో 366 రోజులు అంటే 52 వారాలు + 2 బేసి దినాలు ఉంటాయి.

గమనిక: *లీపు సంవత్సరంలో ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి.*

లీపు సంవత్సరాన్ని గుర్తించడం

- ఇచ్చిన ఏడాదిలోని చివరి రెండు అంకెల(అంటే ఒకట్లు, పదుల స్థానం)ను 4 నిశ్శేషంగా భాగిస్తే అది లీపు సంవత్సరం. లేకపోతే సాధారణ సంవత్సరం.

శతాబ్దంలోని లీపు సంవత్సరం గుర్తించడం

- శతాబ్దాలన్నీ లీపు సంవత్సరాలు కావు. ఏదైనా ఒక శతాబ్దాన్ని 400 నిశ్శేషంగా భాగిస్తే అది లీపు సంవత్సరం.
  ఉదా: 400, 800, 1200, 1600, 2000 లీపు సంవత్సరాలు. కానీ 500, 600, 1100, 1500, 1700, 1800, 1900 లీపు సంవత్సరాలు కావు.

శతాబ్దం చివరి రోజు వచ్చే వారాలను కనుక్కోవడం

- వంద సంవత్సరాల్లో ఐదు బేసిదినాలు ఉంటాయి. అంటే 76 సాధారణ సంవత్సరాలు + 24 లీపు సంవత్సరాలు ఉంటాయి.
  76×1 బేసిదినం + 24×2 బేసిదినాలు
  = 76+48 = 124 రోజులు.
  124 రోజులను 7తో భాగిస్తే 5 శేషం వస్తుంది. కాబట్టి 100 ఏళ్లలో ఐదు బేసి దినాలు ఉంటాయి. అంటే ఆ రోజు శుక్రవారం.
  200 ఏళ్లలో 5×2 = 10ని 7తో భాగిస్తే 3 బేసి దినాలు అంటే బుధవారం.
  300 సంవత్సరాల్లో 5×3=15ను 7తో భాగిస్తే 1 బేసిదినం అంటే సోమవారం. 400 సంవత్సరాల్లో 0 బేసిదినాలు అంటే ఆదివారం.
  శతాబ్దం చివరి రోజున శుక్రవారం, బుధవారం, సోమవారం, ఆదివారం వస్తాయి.
  లీపు సంవత్సరంలో జనవరి, జూలై..

సాధారణ సంవత్సరంలో జనవరి అక్టోబర్ నెలలకు ఒకే విధమైన క్యాలెండర్ ఉంటుంది.



క్యాలెండర్ చాప్టర్ నుంచి ముఖ్యంగా అడిగే ప్రశ్నలు

- ఒక సంవత్సరం ఇచ్చినప్పుడు దానికి సమానమైన సంవత్సరం మళ్లీ ఎప్పుడు పునరావృతమవుతుంది.
- తేదీని ఇస్తే వారాన్ని, వారాన్ని ఇస్తే తేదీని కనుక్కోవడం.
- ఒక లీపు సంవత్సరం ఇచ్చినప్పుడు అలాంటి లీపు సంవత్సరం మళ్లీ ఎప్పుడొస్తుందో గుర్తించడం.
- ఒక సంవత్సరం, తేదీ, వారం ఇచ్చినప్పుడు, మరో ఏడాదిలో అదే తేదీ లేదా వారం ఎప్పుడొస్తుందో కనుక్కోవడం.

కింద ఇచ్చిన కోడ్స్ సహాయంతో క్యాలెండర్ సమస్యలకు సులభంగా సమాధానాలు గుర్తించవచ్చు.

గమనిక: బేసి దినాలను కోడ్స్‌గా రాశాం.

వీటిని జ్ఞాపకం ఉంచుకోవడానికి టిప్స్

- శతాబ్దపు కోడ్‌లను గమనిస్తే 6, 4, 2, 0 పునరావృతం అవుతున్నాయి.
- నెలకోడ్‌లను 12 అంకెల మొబైల్ నెంబర్‌గా గుర్తుపెట్టుకోవాలి.
  అది 033 614, 625 035

ఒక తేదీ ఇచ్చి అది ఏ వారమో గుర్తించడానికి కోడ్

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

మెంటల్ ఎబిలిటీ

తేది + నెలకోడ్ + సంవత్సరం + లీపు సంవత్సరం + శతాబ్దం కోడ్

ఉదా: 22–04–1984 ఏ వారం అవుతుంది?

సాధన: పైన ఇచ్చిన కోడ్ ప్రకారం అన్నింటిని కూడాలి.
22 + 6 + 84 + 21 + 0 = 133
133ను 7తో భాగిస్తే శేషం సున్నా.
అంటే కోడ్ ప్రకారం ఆదివారం అవుతుంది.
తేది = 22, ఏప్రిల్ నెలకోడ్ = 6,
సంవత్సరం = 84,
లీపు సంవత్సరాలు 84/4 = 21
శతాబ్దం కోడ్ = 0
అన్నింటిని కూడితే 133 వస్తుంది.

పై విధంగా ప్రాక్టీస్ చేస్తే తక్కువ సమయంలో కచ్చితత్వంతో సమాధానాన్ని గుర్తించగలం.

సమానమైన క్యాలెండర్‌ను గుర్తించడం

ఉదా:

1. **2003 లాంటి క్యాలెండర్ మళ్లీ ఏ సంవత్సరంలో పునరావృతం అవుతుంది?** (ఎస్ఐ–2012)
   ఎ) 2006 బి) 2013 సి) 2012 డి) 2014
   జవాబు (డి)

సాధన: ఇచ్చిన సంవత్సరం నుంచి బేసి దినాలను లెక్కిస్తూ పోతే ఎక్కడైతే బేసి దినాల మొత్తం 7

శతాబ్దం - కోడ్

1600–1699→6	2000–2099→6
1700–1799→4	2100–2199→4
1800–1899→2	2200–2299→2
1900–1999→0	2300–2399→0

నెల - కోడ్

జనవరి – 0	జూలై – 6
ఫిబ్రవరి – 3	ఆగస్టు – 2
మార్చి – 3	సెప్టెంబర్ – 5
ఏప్రిల్ – 6	అక్టోబర్ – 0
మే – 1	నవంబర్ – 3
జూన్ – 4	డిసెంబర్ – 5

వారం - కోడ్

ఆదివారం – 0	గురువారం – 4
సోమవారం – 1	శుక్రవారం – 5
మంగళవారం – 2	శనివారం – 6
బుధవారం – 3	

అవుతుందో అది సమానమైన క్యాలెండర్ అవుతుంది. ఒకవేళ బేసిదినాల మొత్తం 7 కాకపోతే 14 వరకు లెక్కించాలి.
2003–1, 2004–2 (లీపు సంవత్సరం)
2005–1, 2006–1
2007–1, 2008–2 (లీపు సంవత్సరం)
2007 వరకు బేసిదినాల మొత్తం = 6
2008 వరకు = 8
కాబట్టి 14 వచ్చే వరకు చూద్దాం.
2009–1 2010–1 2011–1
2012–2 2013–1
2013 వరకు బేసి దినాల మొత్తం = 14
కాబట్టి 2014 జవాబు అవుతుంది.
అంటే 2003 లాంటి క్యాలెండర్ 2014లో వస్తుంది.

తేలిక పద్ధతి:

కోడ్: 6 11 11

స్టెప్1: ముందుగా ఇచ్చిన సంవత్సరానికి ముందు, వెనుక లీపు సంవత్సరాలను గుర్తించాలి.

2000 2001 2002 2003 *2004*
\+ + +
6 11 11
....
2014
....

స్టెప్ 2: వాటికి మధ్య ఉన్న సంవత్సరాలకు 6, 11, 11లను కలిపితే వాటికి సమాన క్యాలెండర్ వస్తుంది.

స్టెప్ 3: మన ప్రశ్నలోని 2003కు 11ను కలిపితే 2014 సమాధానం వచ్చింది.

గమనిక: *అడిగిన ప్రశ్నలోని సంవత్సరం లీపు సంవత్సరం అయితే + 28తో కూడాలి.*

ఉదా: 2000 లాంటి లీపు సంవత్సరం 2028లో వస్తుంది.

మాదిరి ప్రశ్నలు

1. **12 ఫిబ్రవరి, 1991 ఏ వారం అవుతుంది?**
   ఎ) సోమవారం బి) మంగళవారం
   సి) బుధవారం డి) గురువారం

సాధన: తేది + నెలకోడ్ + సం. + లీపు సం. + శతాబ్దం కోడ్‌ను ఉపయోగించాలి.
12 + 3 + 91 + 22 + 0 = 128
(91/4 = 22 లీపు సంవత్సరాలు)
128ను 7తో భాగిస్తే శేషం 2.
కాబట్టి మంగళవారం అవుతుంది.

2. **కిందివాటిలో లీపు సంవత్సరం ఏది?**
   ఎ) 1500 బి) 1700 సి) 1800 డి) 1600

సాధన: ఇచ్చినవన్నీ శతాబ్దాలు కాబట్టి శతాబ్దాన్ని 400తో భాగించాలి. అప్పుడు శేషం సున్నా వస్తే అది లీపు సంవత్సరం అవుతుంది.
400)1600(4
1600
0 శేషం సున్నా
కాబట్టి 1600 మాత్రమే లీపు సంవత్సరం.

3. **1992లో మొదటిరోజు ఏ వారం?**
   ఎ) మంగళవారం బి) బుధవారం
   సి) గురువారం డి) నిర్ణయించలేం

సాధన:
1992లో మొదటిరోజు అంటే జనవరి 1
కోడ్ ప్రకారం
1 + 0 + 92 + 23 + 0 =116
116ను 7 తో భాగిస్తే శేషం 4.
అంటే గురువారం అవుతుంది.

4. **మొదటి శతాబ్దంలోని జనవరి 1 ఏ రోజు అవుతుంది?**
   ఎ) మంగళవారం బి) సోమవారం
   సి) బుధవారం డి) గురువారం
   సాధన: క్యాలెండర్‌లోని మొత్తం సమస్యలు, కోడ్‌లు వీటన్నింటినీ 1 – జనవరి – 01 సంవత్సరం సోమవారం నుంచి మొదలైనట్లుగానే తీసుకున్నారు.
   గమనిక: క్యాలెండర్‌లో మొదటి ఆదివారం 7వ తేది అవుతుంది.
   కాబట్టి 1 – జనవరి – 01న సోమవారం అవుతుంది.
   కోడ్ ప్రకారం *తేదీ + నెలకోడ్ + సంవత్సరం + లీపు సంవత్సరం + శతాబ్దం కోడ్*
   1 + 0 + 1 + 0 + 6 = 8
   8ను 7తో భాగిస్తే శేషం 1.
   అంటే సోమవారం అవుతుంది.
5. **ఒక సంవత్సరంలో ఎన్ని నెలలు సమాన క్యాలెండర్ కలిగి ఉంటాయి?**
   ఎ) జనవరి, జూన్ బి) జనవరి, ఏప్రిల్
   సి) జనవరి, మార్చి డి) నిర్ణయించలేం
   సాధన: జవాబు నిర్ణయించలేం (డి)
   ఎందుకంటే ఒక సంవత్సరం అని అడిగారు. కానీ అది సాధారణ సంవత్సరమా లీపు సంవత్సరమా ఇవ్వలేదు.
6. **11 – జనవరి – 1996 రోజు ఏ వారం అవుతుంది?**
   ఎ) బుధవారం బి) గురువారం
   సి) శుక్రవారం డి) శనివారం
   సాధన: కోడ్ ప్రకారం
   11 + 0 + 96 + 24 + 0 = 131
   131ను 7తో భాగిస్తే శేషం 5 అంటే శుక్రవారం.
   కానీ ఇచ్చిన ప్రశ్నలో 1996 లీపు సంవత్సరం. 1996లో జనవరి నెలలోని తేది అడిగారు. ఇది మార్చి నెలకు ముందు కాబట్టి 131–1 = 130ను 7తో భాగించాలి.
   అప్పుడు శేషం = 4 అంటే గురువారం అవుతుంది.
   శుక్రవారం అనేది తప్పు జవాబు.
   గమనిక: ఇచ్చిన ప్రశ్న లీపు సంవత్సరంలోని జనవరి లేదా ఫిబ్రవరిలో ఉంటే బేసిదినాల నుంచి 1ని తీసివేసి మిగిలిన దినాలను 7తో భాగించాలి.
7. **1 మార్చి 1996 రోజు ఏ వారం?**
   సాధన:
   1 + 3 + 96 + 24 + 0 = 124
   124ను 7తో భాగిస్తే 5 శేషం అంటే శుక్రవారం 1996 లీపు సంవత్సరం అయినప్పటికీ బేసి దినాల నుంచి '1' తీసివేయలేదు. ఎందుకంటే కనుక్కోవాల్సింది మార్చి నెలలోని తేది.
   ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి. కాబట్టి జనవరి, ఫిబ్రవరిలో అడిగిన ప్రశ్నకు బేసి దినాల నుంచి '1' తీసివేయాలి.
8. **2001 జనవరి 1 సోమవారం అయితే ఈ సంవత్సరంలో చివరిరోజు ఏ వారం?**
   ఎ) సోమవారం బి) మంగళవారం
   సి) బుధవారం డి) గురువారం
   సాధన: 2001 సాధారణ సంవత్సరం = 52 వారాలు + 1 బేసి దినం కాబట్టి సోమవారమే అవుతుంది.
9. **మన మొదటి రిపబ్లిక్ డే ఏ రోజు అవుతుంది?**
   ఎ) శుక్రవారం బి) శనివారం
   సి) గురువారం డి) మంగళవారం

సాధన:
మన మొదటి రిపబ్లిక్ డే 26 జనవరి 1950
కోడ్ ప్రకారం 26 + 0 + 50 + 12 + 0 = 88
88ను 7తో భాగిస్తే శేషం 4 వస్తుంది.
అంటే గురువారం అవుతుంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. **ఒకవేళ జనవరి 1, 2007 సోమవారం అయితే జనవరి 1, 2008 ఏ రోజు అవుతుంది? (గ్రూప్–2, 2008)**
   ఎ) ఆదివారం బి) సోమవారం
   సి) బుధవారం డి) మంగళవారం

సమాధానం: డి

2. **భారత స్వాతంత్ర్య దినోత్సవం 1996లో శుక్రవారం అయితే 2000 సంవత్సరంలో ఏ వారం అవుతుంది? (వీఆర్‌వో–2012)**
   ఎ) బుధవారం బి) గురువారం
   సి) శుక్రవారం డి) శనివారం

సమాధానం: ఎ

ఎల్లో ఎంజైమ్ అని ఏ విటమిన్‌ను పిలుస్తారు?

మానవ శరీరానికి 13 విటమిన్లు అవసరం. వీటిని ప్రధానంగా రెండు రకాలుగా వర్గీకరించారు. అవి నీటిలో కరిగేవి, కొవ్వుల్లో కరిగేవి. ఎ, డి, ఇ, కె విటమిన్లు కొవ్వుల్లో కరుగుతాయి. ఇవి కొవ్వు కణాల్లో నిల్వ ఉంటాయి. విటమిన్ బి, సిలు నీటిలో కరుగుతాయి. వీటిని శరీరం ఎక్కువ మొత్తంలో నిల్వ ఉంచుకోలేదు. కాబట్టి ఇవి లభించే ఆహారం ఎక్కువగా తీసుకోవాలి.

బయాలజీ - విటమిన్లు

- మనిషి ఆహారంలో స్వల్ప మోతాదులో మాత్రమే అవసరమయ్యే కర్బన పోషకాలు విటమిన్లు.
- విటమిన్లు శక్తి వనరులు కాదు.
- ఒక విటమిన్ లేదా విటమిన్‌లోని ఒక భాగం లేదా విటమిన్ నుంచి ఏర్పడిన ఉత్పాదకం సహ ఎంజైమ్‌గా వ్యవహరిస్తూ రసాయనిక చర్యల్లో పాల్గొనే ఎంజైమ్‌లకు సహాయపడతాయి.
- విటమిన్ అనే పదాన్ని కాసిమర్ ఫంక్ ప్రతిపాదించాడు. విటమిన్లను ఆంగ్ల అక్షరాల క్రమంలో నామకరణం చేసే పద్ధతిని ప్రతిపాదించింది జె.సి. డ్రుమాన్.
- విటమిన్లు ప్రధానంగా 2 రకాలు
  - **కొవ్వుల్లో కరిగేవి:** ఎ, డి, ఇ, కె.
  - **నీటిలో కరిగేవి:** బి–కాంప్లెక్స్, సి

విటమిన్ - ఎ

విటమిన్–ఎ రసాయన నామం రెటినాల్. సాధారణ నామం జీరాఫ్తాల్మియా నిరోధక విటమిన్. ఆరోగ్యకరమైన దృష్టికి, సాధారణ ఆరోగ్యానికి ఇది అవసరం. ఈ విటమిన్ లోపిస్తే కంటిలోని కార్నియా దెబ్బతిని జీరాఫ్తాల్మియా సంభవిస్తుంది.

లభ్యత: క్యారెట్, పసుపు రంగులోని ఫలాలు, నారింజ, సొరచేప కాలేయం నూనె, ఆకుకూరలు, జంతువుల కాలేయంలో ఎక్కువగా లభిస్తుంది. శాకాహారంలో ఇది బీటా కెరోటిన్ రూపంలో లభిస్తుంది. పేగులోని సూక్ష్మజీవులు దీన్ని రెటినాల్‌గా మారుస్తాయి.

విటమిన్ - డి

దీని రసాయన నామం కాల్సిఫెరాల్. దీన్నే రికెట్స్ నిరోధక విటమిన్, సన్‌షైన్ విటమిన్ అని కూడా పిలుస్తారు. బలమైన ఎముకలు, దంతాలకు ఇది అవసరం. శరీరంలోని కాల్షియం, ఫాస్ఫరస్, జీవక్రియలను నియంత్రిస్తుంది. ఈ విటమిన్ లోపిస్తే చిన్నారుల్లో రికెట్స్ వ్యాధి సంభవిస్తుంది. ఎముకలు బలహీనపడి, వంకరలు తిరిగడం ఈ వ్యాధి లక్షణం. పెద్దల్లో ఈ విటమిన్ లోపం వల్ల ఎముకలు బలహీనపడి ఆస్టియోమలేసియా వ్యాధి సంభవిస్తుంది.

లభ్యత: శాకాహారంలో ఇది లభించదు. పాలు, గుడ్లు, కాడ్ చేప కాలేయం నూనె, జంతువుల కాలేయం, పుట్టగొడుగుల్లో సమృద్ధిగా లభిస్తుంది.

విటమిన్ - ఇ

దీని రసాయన నామం టోకోఫెరాల్. దీన్ని బ్యూటీ విటమిన్ లేదా వంధ్యత్వ నిరోధక విటమిన్ అంటారు. స్త్రీ, పురుషుల్లో ప్రత్యుత్పత్తి వ్యవస్థకు ఇది అవసరం. కాంతివంతమైన చర్మాన్ని ఇస్తుంది. దీని లోపం అరుదుగా సంభవిస్తుంది. ఇది లోపిస్తే పురుషుల్లో వంధ్యత్వం వస్తుంది, మహిళల్లో గర్భస్రావం జరుగుతుంది.

లభ్యత: ఫలాలు,కూరగాయలు, విత్తనాలు (బాదం, పిస్తా), చేపలు, మాంసం, చేప నూనె, కాలేయంలో లభిస్తుంది.

విటమిన్ - కె

దీని రసాయన నామం ఫిలోక్వినోన్ లేదా మెనాక్వినోన్. దీన్ని రక్తస్రావ నిరోధక విటమిన్ అని కూడా అంటారు. రక్త స్కంధన ప్రక్రియలో అనుబంధ రక్తస్కంధన కారకంగా ఇది వ్యవహరిస్తుంది. ఈ విటమిన్ లోపిస్తే గాయాలైనప్పుడు రక్తం ఆలస్యంగా గడ్డ కడుతుంది.

లభ్యత: పేగులోని సూక్ష్మజీవులు దీన్ని తయారుచేస్తాయి. కాలిఫ్లవర్, క్యాబేజీ, ఆకుకూరలు, కాలేయం, మూత్రపిండాల్లో లభిస్తుంది.

విటమిన్ - సి (ఆస్కార్బిక్ ఆమ్లం)

ఇది స్కర్వి నిరోధక విటమిన్. బలమైన చిగుళ్లకు, నోటి ఆరోగ్యానికి ఇది అవసరం. ఇది లోపిస్తే స్కర్వి వ్యాధి సంభవిస్తుంది.

లక్షణాలు: చిగుళ్ల నుంచి రక్తం కారడం, దంతాలు ఊడిపోవడం, నాలుకపై పుండ్లు ఏర్పడటం ఈ వ్యాధి లక్షణాలు.

లభ్యత: నారింజ, బత్తాయి, నిమ్మ లాంటి సిట్రస్ ఫలాలు, ఉసిరి, మాంసం, కాలేయంలో లభిస్తుంది.

విటమిన్ - బి1

దీని రసాయన నామం థయమిన్. బెరిబెరి నిరోధక విటమిన్ అని అంటారు. శక్తి విడుదల,

పోటీ పరీక్షల ప్రత్యేకం

బయాలజీ

నాడీవ్యవస్థ, రక్తప్రసరణ అభివృద్ధి వ్యవస్థకు అవసరం. దీనిలోపం ద్వారా బెరిబెరి వ్యాధి వస్తుంది. చిన్నారుల్లో తడి బెరి బెరి (ఛాతీలో నీరు నిండటం), పెద్దల్లో పొడి బెరిబెరి (చర్మం పొడిబారటం) సంభవిస్తుంది. పాలీన్యూరిటిస్ అనే నాడీ క్షీణత వ్యాధి సంభవిస్తుంది.

లభ్యత: పొట్టు తీయని అన్ని రకాల ధాన్యాలు, మాంసంలో లభిస్తుంది.

విటమిన్ - బి2

దీన్నే విటమిన్–జి లేదా ఎల్లో ఎంజైమ్ అని కూడా అంటారు. కొవ్వులు, పిండి పదార్థాల జీవక్రియలో పాల్గొంటుంది. ఈ విటమిన్ లోపిస్తే అరిబోఫ్లేవినోసిస్ అనే వ్యాధి వస్తుంది. నోటి అంచున పగుళ్లు ఏర్పడటం(ఖీలోసిస్/ యాంగ్యులర్ స్టొమాటిస్), నాలుక వాపు (గ్లోసైటిస్) ఈ వ్యాధి లక్షణాలు.

లభ్యత: పాలు, పాల ఉత్పత్తుల్లో ఎక్కువగా ఉంటుంది. కాబట్టి దీన్ని లాక్టోఫ్లేవిన్ అని, గుడ్ల పచ్చసొనలోనూ అధికంగా లభించడం వల్ల ఓవోఫ్లేవిన్ అని అంటారు. కాలేయంలోనూ ఉంటుంది కాబట్టి హెపటోఫ్లేవిన్ అని కూడా అంటారు. ఎండు ఫలాలు, కూరగాయలు, మాంసంలో లభిస్తుంది.

విటమిన్ - బి3

దీని రసాయన నామం నియాసిన్. నికోటినిక్ యాసిడ్ లేదా నికోటినమైడ్‌గానూ పిలుస్తారు. ఇది పెల్లగ్రా నిరోధక విటమిన్. ఆరోగ్యకరమైన నాడీవ్యవస్థ, చర్మం, జీర్ణక్రియకు ఇది అవసరం. ఈ విటమిన్ లోపిస్తే పెల్లగ్రా వ్యాధి సంభవిస్తుంది. చర్మం ఎర్రగా కందడం(డెర్మటైటిస్), నీళ్ల విరేచనాలు(డయేరియా), మతిమరుపు (డెమెన్షియా) ఈ వ్యాధి లక్షణాలు. తీవ్రలోపం తలెత్తితే మరణించే ప్రమాదం ఉంది. అందుకే దీన్ని 4డి/3డి సిండ్రోమ్ అంటారు.

లభ్యత: మాంసం, కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాల్లో ఎక్కువగా లభిస్తుంది.

విటమిన్ - బి5

దీన్నే పాంటోథెనిక్ యాసిడ్ అని పిలుస్తారు. కో ఎంజైమ్–ఎ గానూ వ్యవహరిస్తారు. కొలెస్ట్రాల్, న్యూరోట్రాన్స్‌మీటర్ల ఉత్పాదన, శక్తి విడుదలకు విటమిన్–బి5 అవసరం. దీనిలోపం వల్ల అరికాళ్లలో మంటలు కలిగే బర్నింగ్ ఫీట్ సిండ్రోమ్ వస్తుంది.

లభ్యత: మాంసం, గుడ్లు, బ్రెడ్‌లో లభిస్తుంది.

విటమిన్ - బి6

దీన్నే పైరిడాక్సిన్ లేదా పైర్డాక్సల్ ఫాస్ఫేట్ అంటారు. ప్రొటీన్ల జీవక్రియకు ఇది అవసరం. ఈ విటమిన్ లోపిస్తే చర్మం పొడిబారుతుంది. విపరీతమైన బలహీనత వస్తుంది. మార్నింగ్ డిసీజ్ అనే వ్యాధి సంభవిస్తుంది.

లభ్యత: మాంసం, గోధుమ, మొక్కజొన్న, సోయాబీన్, వేరుశనగ, బాదంలో ఎక్కువ మోతాదులో లభిస్తుంది.

విటమిన్ - బి7

దీన్నే విటమిన్ –హెచ్, బయోటిన్ అని కూడా పిలుస్తారు. శక్తి విడుదల, అమైనో ఆమ్లాలు, గ్లైకోజన్ ఉత్పత్తికి అవసరం. పేగులోని సూక్ష్మజీవులు దీన్ని అందిస్తాయి. ఈ విటమిన్ చాలా అరుదుగా లోపిస్తుంది. ఉడికించని గుడ్డు తెల్లసొనలో ఎవిడిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది బయోటిన్ వినియోగాన్ని అడ్డుకుంటుంది.

విటమిన్ - బి9

దీన్నే ఫోలిక్ యాసిడ్ అంటారు. ఎర్రరక్తకణాల పరిపక్వత, హీమోగ్లోబిన్ తయారీకి ఇది అవసరం. పిండం అభివృద్ధి, మానసిక వికాసానికి తోడ్పడుతుంది. ఈ విటమిన్ లోపిస్తే మెగాలోబ్లాస్టిక్ లేదా మ్యాక్రోస్టిక్ అనీమియా వ్యాధి వస్తుంది. గర్భిణుల్లో ఇది తీవ్రంగా లోపిస్తే పుట్టబోయే పిల్లల్లో స్పైనా బిఫిడా అనే మానసిక వైకల్యం సంభవిస్తుంది

లభ్యత: స్ట్రాబెర్రీ, టమాట, కాలిఫ్లవర్, అరటి, క్యాబేజి, పాలకూర, నారింజల్లో లభిస్తుంది.

విటమిన్ - బి12

దీన్నే సైనోకోబాలమిన్ అంటారు. ఎర్ర రక్తకణాల పరిపక్వత, హీమోగ్లోబిన్ తయారీకి అవసరం. ఈ విటమిన్ లోపిస్తే పెర్నిసియస్ అనీమియా సంభవిస్తుంది.

లభ్యత: మాంసాహారం, గుడ్లు, పాల లాంటి జంతు ఉత్పత్తుల్లో మాత్రమే లభిస్తుంది. మొక్కల్లో లభించదు.

విటమిన్ - బి17

దీన్నే యాంటి కేన్సర్ విటమిన్ అని అంటారు. వాస్తవానికి ఇది విటమిన్ కాదు. మొక్కల్లో కేన్సర్ నిరోధక లక్షణాలున్న రసాయనాలన్నింటినీ కలిపి బి17 అంటారు.

మాదిరి ప్రశ్నలు

1. **కిందివాటిలో బి15 అని పిలిచే విటమిన్?**
   ఎ) పాంటోథెనిక్ ఆమ్లం
   బి) పంగామిక్ ఆమ్లం
   సి) నియాసిన్ డి) ఫోలిక్ ఆమ్లం
2. **ఒక గ్రాము కొవ్వు నుంచి ఎన్ని కేలరీల శక్తి విడుదలవుతుంది?**
   ఎ) 4.1 బి) 4.3 సి) 9.3 డి) 8.0
3. **కింది వాటిలో ఆవశ్యక అమైనోఆమ్లం?**
   ఎ) అలనిన్ బి) ప్రోలిన్
   సి) సిస్టీన్ డి) ఆర్జినిన్
4. **చర్మం, రోమాలు, గోళ్లు తదితరాల్లో ఉండే ప్రత్యేకమైన ప్రొటీను?**
   ఎ) కెరోటిన్ బి) కెరాటిన్
   సి) అల్బుమిన్ డి) కాండ్రిన్
5. **తల్లిపాలలో ఉండే ప్రొటీన్ల శాతం?**
   ఎ) 2.4 బి) 3.1 సి) 6.2 డి) 0.3
6. **మేక పాలలో ఉండే లాక్టోజ్ శాతం?**
   ఎ) 3.6 బి) 4.6 సి) 4.2 డి) 0.7
7. **అధిక నీటి శాతం ఉన్న పాలు?**
   ఎ) ఆవు పాలు బి) గేదె పాలు
   సి) మేక పాలు డి) గాడిద పాలు
8. **విటమిన్ బి12 లోపం ద్వారా వచ్చే రక్తహీనతను ఏమంటారు?**
   ఎ) పెర్నిసియస్ రక్తహీనత
   బి) న్యూట్రిషినల్ రక్తహీనత
   సి) మెగలోబ్లాస్టిక్ రక్తహీనత
   డి) మ్యాక్రోస్టిక్ రక్తహీనత
9. **మానవుడి సాధారణ జీవక్రియ రేటు(బీఎంఆర్)కు ఎన్ని కేలరీ శక్తి అవసరం?**
   ఎ) 1200–1500 బి) 1500–1700
   సి) 500–700 డి) 2000–3000
10. **విటమిన్–ఎ లోపం ద్వారా కంటి కార్నియా పొడిబారడాన్ని ఏమంటారు?**
    ఎ) నిక్టలోపియా బి) జీరాఫ్తాల్మియా
    సి) కెరటోమలేసియా డి) ఏదీకాదు
11. **పెద్దల్లో విటమిన్ డి లోపం ద్వారా ఎముకలు క్షీణించి బలహీన పడటాన్ని ఏమంటారు?**
    ఎ) ఆస్టియో పోరోసిస్
    బి) ఆస్టియో మలేషియా
    సి) ఆస్టియో ఆర్థ్రటిస్
    డి) ఆస్టీటిస్ ఫైబ్రోజా
12. **సాధారణ గుండె లయను నియంత్రించే విటమిన్?**
    ఎ) ఆస్కార్బిక్ ఆమ్లం బి) థయమిన్
    సి) నియాసిన్ డి) పెరిడాక్సిన్
13. **ఎల్లో ఎంజైమ్ అని ఏ విటమిన్‌ను పిలుస్తారు?**
    ఎ) బి2 బి) బి5
    సి) బి6 డి) బి7
14. **కండరాల్లో అధిక మోతాదులో ఉండే ప్రొటీన్?**
    ఎ) గ్లుటెన్ బి) కొల్లాజెన్
    సి) కెసిన్ డి) మయోసిన్
15. **కిందివాటిలో ఏ విటమిన్ లోపం వల్ల ఖీలోసిస్ సంభవిస్తుంది?**
    ఎ) పాంటోథెనిక్ ఆమ్లం బి) నియాసిన్
    సి) పెరిడాక్సిన్ డి) రిబోఫేవిన్
16. **పాల చక్కెర(లాక్టోజ్)లో ఉండే మోనోశాకరైడ్లు?**
    ఎ) గ్లూకోజ్, ఫ్రక్టోజ్
    బి) గ్లూకోజ్, గాలక్టోజ్
    సి) గ్లూకోజ్, గ్లూకోజ్ డి) ఏవీ కాదు
17. **సగటున మనిషికి రోజుకు ఎంత మోతాదులో విటమిన్ సి అవసరం?**
    ఎ) 2 మి.గ్రా. బి) 50 మి.గ్రా.
    సి) 75 మి.గ్రా. డి) 30 మి.గ్రా.
18. **కింద ఇచ్చిన ఏ అమైనో ఆమ్లంలో సల్ఫర్ ఉంటుంది?**
    ఎ) మిథియోనిన్ బి) హిస్టిడీన్
    సి) గ్లైసిన్ డి) ప్రోలిన్

సమాధానాలు

1) బి 2) సి 3) డి 4) బి 5) ఎ
6) సి 7) ఎ 8) ఎ 9) బి 10) బి
11) బి 12) ఎ 13) ఎ 14) డి 15) డి
16) బి 17) బి 18) ఎ.